

'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 243

గురువారం 24-11-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



జర్మనీకి జపాన్ షాక్

ఫుట్‌బాల్ ప్రపంచ కప్ మ్యాచ్‌లో జర్మనీపై జపాన్ 2–1తో విజయం
- 12లో



కొనసాగుతున్న కోతలు


గూగుల్‌లో 10,000 మంది ఉద్యోగుల... హెచ్‌పీలో 6,000 జాబ్స్ కట్
- 13లో



వీసా కోసం వెయ్యి రోజులు..

అమెరికా వీసాల కోసం వెయ్యి రోజులు ఎదురు చూడాల్సిన సమయం వచ్చినట్లు అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది.

వివరాలు 6లో



సుప్రీంకోర్టులో మరో 4 బెంచ్‌లు

క్రిమినల్, పన్నులు, భూసేకరణ, వాహన ప్రమాద క్లెయిమ్‌ల విచారణపై నాలుగు బెంచ్‌లను సుప్రీం కోర్టు ఏర్పాటు చేసింది.

వివరాలు 6లో



కుటుంబాన్ని కడతేర్చాడు

డ్రగ్స్‌కు బానిసైన ఓ యువకుడు..సోదరి, తల్లిదండ్రులు, నాన్నమ్మను పొడిచి చంపాడు. ఢిల్లీలో ఈ దారుణ ఘటన జరిగింది.

వివరాలు 6లో



అగ్రరాజ్యంలో కాల్పుల కలకలం

అమెరికాలోని వర్జీనియా వాల్‌మార్ట్ మాల్‌లో మేనేజర్ కాల్పులు జరపగా అక్కడికక్కడే ఆరుగురు మృతి చెందారు.

వివరాలు 6లో

న్యూస్‌రీల్

ఇంధన పెట్టుబడులకు స్వర్గధామం ఏపీ



దేశంలో పారిశ్రామికరంగంలో ఇంధన సామర్థ్య పెట్టుబడులకు ఏపీ స్వర్గధామంగా ఉందని, ఈ అంశంలో ప్రభుత్వ సహకారం బాగుందని పెట్టుబడుల బజార్ పేరిట విశాఖలో జరిగిన సదస్సులో బీఈఈ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అశోక్‌కుమార్ చెప్పారు.

వివరాలు 3లో ▸

ఏపీసీసీ అధ్యక్షుడిగా గిడుగు



ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పార్టీ సీనియర్ నేత గిడుగు రుద్రరాజును కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నియమించింది. వర్కింగ్ ప్రెసిడెంట్లుగా మస్తాన్ వలీ, జంగా గౌతమ్, పద్మశ్రీ సుంకర, పి.రాకేశ్‌రెడ్డిలను నియమించింది.

వివరాలు 14లో ▸

నెలాఖరులోగా మరో అల్పపీడనం!



నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలహీనపడి ప్రస్తుతం దక్షిణ కోస్తాంధ్రపై అల్పపీడనంగా కొనసాగుతోంది. ఇది గురువారం పూర్తిగా బలహీనపడనుంది. ఈ నెలాఖరులోగా ఉత్తర అండమాన్ సముద్రంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది.


వివరాలు 2లో ▸

20 మంది అదనపు ఎస్పీలకు ఎస్పీలుగా పదోన్నతి

మరో ఎస్పీ బదిలీ.. హోం శాఖ ఉత్తర్వుల జారీ

14లో

ఇదండీ సంగతి



అమ్మింది.. పథకాన్నే కానీ దేశాన్ని కాదుగా అంటున్నాడ్సార్!



నరసన్నపేట బహిరంగ సభకు హాజరైన జనసందోహంలోని ఓ భాగం

రీ సర్వేతో భూ సమస్యలకు చెక్

రైతులకు హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమంలో సీఎం జగన్

మహా యజ్ఞంలా వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు- భూ రక్ష పథకం

- తొలి దశలో 2 వేల గ్రామాల్లో 7,92,238 మంది రైతుల భూ రికార్డుల ప్రక్షాళన పూర్తి
- 15 రోజుల పాటు హక్కు పత్రాలు పంపిణీ
- అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో 2023 డిసెంబర్‌కు రీసర్వే పూర్తి
- 100 ఏళ్ల తర్వాత చేపట్టిన గొప్ప కార్యక్రమం ఇది.. రాష్ట్ర వ్యాప్తంగా భూ యజమానులకు శాశ్వత హక్కు పత్రాలు
- సర్వే పూర్తయితే డూప్లికేట్ రిజిస్ట్రేషన్లు, కబ్జాలకు తావుండదు
- ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు సమగ్ర రక్షణ
- సచివాలయాల్లోనే క్రయవిక్రయ రిజిస్ట్రేషన్లు

2లో



నరసన్నపేట బహిరంగ సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

> భూ రికార్డులు సరిగా లేకపోతే ఎన్ని ఇబ్బందులు వస్తాయో చూస్తున్నాం. 80-90 శాతం సివిల్ కేసులన్నీ కేవలం భూ వివాదాలవే. మనం కష్టపడి సంపాదించిన ఆస్తిని మన పిల్లలకు ఇవ్వాలనుకుంటాం. తీరా మన పిల్లలకు ఇచ్చే సమయానికి గద్దల్లా వేరెవరో తన్నుకెళ్తే.. ఆ బాధ ఎలా ఉంటుందో ఆలోచించడానికి కూడా కష్టంగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితులను పూర్తిగా మార్చేందుకే సమగ్ర భూ సర్వే దిశగా వేగంగా అడుగులు వేశాం. తద్వారా ఎలాంటి సివిల్ వివాదాలకు, లంచాలకు, కబ్జాలకు తావు లేకుండా చేస్తాం.
>
> - ముఖ్యమంత్రి వైఎస్ జగన్

దుష్ట చతుష్టయం.. రాక్షస మూక

- చంద్రబాబుకు మద్దతిస్తున్న రామోజీ, రాధాకృష్ణ, టీవీ 5, దత్తపుత్రుడ్ని ఇలా అనక ఇంకేమనాలి?
- కూతురునిచ్చిన మామ పార్టీని కబ్జా చేసే వాళ్లను చంద్రబాబు అంటారు
- ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేయడం ఈయన నైజం
- నరసన్నపేట సభలో నిప్పులు చెరిగిన సీఎం వైఎస్ జగన్

2లో

నాగన్‌పల్లి నుంచి రామోజీ ఫిల్మ్ సిటీకి పాదయాత్రగా వస్తున్న లబ్ధిదారులు, సీపీఎం నాయకులు



రామోజీపై దండయాత్ర!

- సీపీఎం ఆధ్వర్యంలో ఫిల్మ్ సిటీలోకి పాదయాత్ర
- తమ ఇళ్ల స్థలాలు అప్పగించాలని లబ్ధిదారుల డిమాండ్
- ప్రభుత్వం స్పందించకపోతే గుడిసెలు వేస్తామని హెచ్చరిక

- వివరాలు 10లో

అమూల్ పాలసేకరణ ధర పెంపు

- నేటినుంచి రాయలసీమ జిల్లాలకు వర్తింపు
- ఇప్పటికే కోస్తా, ఉత్తరాంధ్ర జిల్లాల్లో పెంచిన అమూల్
- లీటరు గేదెపాలకు రూ.2.47, ఆవుపాలకు రూ.1.63 చొప్పున పెంపు.. కిలో ఘనపదార్థాలకు రూ.7.9 నుంచి రూ.9.5కు పెంపు

3లో


'ఎస్ సర్'లే సీఈసీలా?

ప్రస్తుత నియామక వ్యవస్థ లోపాలమయం

- సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు
- విచారణ సాగుతుండగానే ఈసీ నియామకమా?
- గోయల్ నియామకం వెనక వేరే ఉద్దేశాలున్నాయా?
- నేటిలోగా ఫైలు సమర్పించండి.. పరిశీలిస్తాం.. కేంద్రం అభ్యంతరాలను తోసిపుచ్చిన ధర్మాసనం
- సీఈసీ ఎంపికలో సీజేఐ భాగస్వామి కావాలి

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ల (ఈసీ) నియామక ప్రక్రియపై సుప్రీంకోర్టు బుధవారం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. పలు కీలక సందేహాలు లేవనెత్తింది. ''కేంద్రంలో అధికారంలో ఉండే ప్రతి పార్టీ ఎలాగోలా దాన్ని శాశ్వతంగా నిలబెట్టుకోవాలని భావిస్తుంది. అందుకోసం అన్ని విషయాల్లోనూ తను చెప్పిన దానికి 'ఎస్ సర్'అనేవారినే సీఈసీగా నియమించుకునే ఆస్కారముంది''అని పేర్కొంది. ప్రస్తుత నియామక వ్యవస్థ అందుకు వీలు కల్పిస్తోందంటూ జస్టిస్ కేఎం జోసెఫ్ సారథ్యంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఆక్షేపించింది. ఓవైపు ఈ అంశంపై తమ విచారణ కొనసాగుతుండగానే ఎన్నికల కమిషనర్‌గా అరుణ్ గోయల్‌ను ఎలా నియమిస్తారని కేంద్రాన్ని ప్రశ్నించింది. దీని వెనక వేరే రహస్య ఉద్దేశాలేమీ లేవు కదా అంటూ నిలదీసింది. ''సీఈసీ, ఈసీల నియామక ప్రక్రియపై దాఖలైన పిటిషన్లపై గత గురువారం నుంచి మేం విచారణ

మిగతా 6వ పేజీలో ▶



సీఈసీ ఎంపికలో సీజేఐ భాగస్వామి కావాలి

> సీఈసీ, ఈసీలను పార్టీల ప్రభావం నుంచి దూరంగా ఉంచాలి. అప్పుడే వాళ్లు స్వతంత్రంగా పనిచేయగలరు. ఇది జరగాలంటే సీఈసీ ఎంపికలో భారత ప్రధాన న్యాయమూర్తిని కూడా భాగస్వామిని చేయాలి. అప్పుడే కేంద్ర ఎన్నికల సంఘం స్వతంత్ర ప్రతిపత్తిని నిలుపుతూ ఒత్తిళ్లకు అతీతంగా బాధ్యతలు నెరవేర్చగలుగుతుంది.
>
> - సుప్రీంకోర్టు ధర్మాసనం

ప్రధానిపై ఆరోపణలొస్తే.. సీఈసీ చర్యలు తీసుకోగలరా?

> ప్రధాని స్థాయి వ్యక్తితో సీఈసీ తలపడాల్సిన పరిస్థితి తలెత్తితే? అందుకాయన సిద్ధపడతారా, ససేమిరా అంటారా? మీకేమనిపిస్తోంది? ప్రధానిపై సీఈసీ చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితే వస్తే..ఆయన ఏ చర్యలూ తీసుకోలేదనుకుందాం.అప్పుడది వ్యవస్థ పూర్తిగా కుప్పకూలినట్లు కాదా? అందుకే సీఈసీకి రాజకీయ ప్రభావం నుంచి సంపూర్ణ రక్షణ తప్పనిసరి.
>
> - సుప్రీంకోర్టు ధర్మాసనం

వర్సిటీల్లో నిష్ణాతుల నియామకం

'ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్' హోదాలో నియామకాలు

- ఉన్నత విద్యాసంస్థల్లోనూ అవకాశం
- అన్ని యూనివర్సిటీలకు యూజీసీ సూచనలు.. అనుభవజ్ఞుల సేవల వినియోగంతో మంచి ఫలితాలు
- ఈ మేరకు వర్సిటీ నిబంధనలు మార్చాలని సూచన.. విదేశాల్లో మంచి ఫలితాలు ఇస్తున్న విధానం
- మంజూరైన పోస్టుల్లో 10 శాతానికి మించకూడదని నిబంధన

3లో



దుష్ట చతుష్టయం.. రాక్షస మూక

చంద్రబాబుకు మద్దతిస్తున్న రామోజీ, రాధాకృష్ణ, టీవీ 5, దత్తపుత్రుడ్ని ఇలా అనక ఇంకేమనాలి?

నరసన్నపేట సభలో నిప్పులు చెరిగిన సీఎం వైఎస్ జగన్

- సొంతంగా పార్టీ పెట్టి అధికారంలోకి వస్తే ఎంజీఆర్, ఎన్టీఆర్, జగన్ అంటారు
- కూతురునిచ్చిన మామ పార్టీని కబ్జా చేసే వాళ్లను చంద్రబాబు అంటారు
- ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేయడం ఈయన నైజం
- రావణుడిని సమర్థించే వాళ్లను రాక్షసులనే అంటాం
- దుర్యోధనుడికి కొమ్ముకాసిన వారిని దుష్టచతుష్టయం అంటాం



లబ్ధిదారు వెలమల శ్రీదేవికి జగనన్న భూహక్కు పత్రాన్ని అందజేస్తున్న సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: 'తనకు తాను పార్టీ పెట్టుకుని అధికారంలోకి వస్తే.. వాళ్లను ఒక ఎంజీఆర్, ఒక ఎన్టీఆర్, ఒక జగన్ అని అంటారు. కానీ సొంత కూతురును ఇచ్చిన మామకు, మామ పెట్టిన పార్టీకి, మామ పెట్టిన ట్రస్టుకు, చివరకు మామకు ప్రజలు ఇచ్చిన సీఎం కుర్చీకి.. వెన్నుపోటు పొడిచి కబ్జా చేసే వాళ్లను చంద్రబాబు అంటారు. రావణుడిని సమర్థించిన వాళ్లను మనమంతా రాక్షసులంటాం. దుర్యోధనుడికి కొమ్ము కాసిన వాళ్లను దుష్ట చతుష్టయం అని అంటున్నాం. మరి మామ కుర్చీని కబ్జా చేసి, మామ పార్టీని దండా చేసి, ఎన్నికలప్పుడు ప్రజలకు మాయమాటలు చెప్పి, ఆ తర్వాత ప్రజలను గాలికొదిలేసి మోసం చేసే చంద్రబాబును సమర్థిస్తున్న ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, దత్తపుత్రుడిని ఏమనాలి? దుష్ట చతుష్టయమని అనాలా? వద్దా? రాక్షస మూకలనాలా? వద్దా?.. అనేది ప్రజలు ఆలోచించాలి' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో బుధవారం ఆయన జగనన్న శాశ్వత భూహక్కు – భూ రక్ష కార్యక్రమం తొలి విడత లబ్ధిదారులకు భూ హక్కుల పత్రాల పంపిణీ, రెండో విడత సర్వే ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు అండ్ కోపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

> రాజకీయం అంటే ఒక జవాబుదారీతనం. ప్రజలకు.. ఇంటింటికీ మనం మంచి చేస్తే, ఆ మంచిని చూసి వారు ఓటు వేస్తేనే పాలకులు అధికారంలో ఉంటారనే ఆలోచన కలగాలి. లేదంటే అధికారం నుంచి పోవాలనే మెసేజ్ వెళ్లాలి. అదీ రాజకీయం.
> – సీఎం జగన్

చంద్రబాబు రాముడా.. రావణుడా?

- తన ఆస్తిని తాను అనుభవించే వాళ్లను హక్కుదారుడు అంటారు. అదే పరాయి వాడి ఆస్తిని ఆక్రమించే వారిని కబ్జాదారుడు అంటారు. తన భార్యతో సంసారం చేస్తే, ఆమె కోసం యుద్ధం చేస్తే.. ఆ మనిషిని శ్రీరాముడు అంటారు. అదే పరాయి స్త్రీ మీద కన్ను వేసి ఎత్తుకుపోతే.. అలాంటి వాళ్లను రావణుడు అంటారు. చంద్రబాబు రాముడా.. రావణుడా? రావణుడికి, దుర్యోధనుడికి, మోసం చేసిన వారికి, వెన్నుపోటు పొడిచే వారికి మరో చాన్స్ ఎవరైనా ఇస్తారా?
- తమను గెలిపించిన ప్రజలకు ఇచ్చిన మాటను నాయకులు నిలబెట్టుకోవాలి. అప్పుడే దాన్ని నిజమైన ప్రజాస్వామ్యం అంటారు. కానీ గెలిపించిన ప్రజలను ఒక్కసారి కాదు.. రెండు సార్లు కాదు.. అనేక సార్లు మోసం చేసి, మాట తప్పి, వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు నాయుడిని మరోసారి అసెంబ్లీకి పంపాలా? మీ సేవలు మాకొద్దని బైబై చెప్పి ఇంటికి పంపాలా? అనేది ప్రజలు ఆలోచించాలి.
- ఇవాళ రాష్ట్రంలో రాజకీయాలు ఎలా తయారయ్యాయంటే.. కేవలం నలుగురు తోడుగా ఉంటే చాలు ప్రజల గురించి ఆలోచించాల్సిన అవసరం లేదనే దుస్థితికి వచ్చాయి. ఒక ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5, దత్తపుత్రుడు.. నాకు వీళ్లంటే చాలు.. ఇక ప్రజలతో అవసరం లేదు, ప్రజలను మోసం చేసినా, వాళ్లకు ఎన్ని అబద్ధాలు చెప్పినా ఎవ్వరూ రాయరు. ఎవ్వరూ చూపరు. ఎవ్వరూ ప్రశ్నించరనుకునే రాజకీయ వ్యవస్థలో మార్పు రావాలి.
- నేను నమ్ముకున్నది దేవుడి దయను, ప్రజలను మాత్రమే. చంద్రబాబులా దుష్ట చతుష్టయాన్ని నమ్ముకోలేదు. మీ అందరితో నేను ఇదే చెబుతున్నాను. వీళ్లు చెప్పే అబద్ధాలను నమ్మొద్దండి. టీవీల్లో వీళ్లు చూపించే అబద్ధాలను చూడొద్దండి. మీ ఇంటిలో మంచి జరిగిందా.. లేదా.. అన్నదే కొలమానంగా పెట్టుకోండి. మంచి జరిగి ఉంటే.. మీ అన్న, మీ తమ్ముడు, మీ బిడ్డ జగన్‌కు తోడుగా నిలబడండి.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల కో-ఆర్డినేటర్‌గా చెవిరెడ్డి

సాక్షి, అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని పార్టీ అనుబంధ విభాగాల కో ఆర్డినేటర్‌గా నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ప్రకటించింది. పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్, ప్రధాన కార్యదర్శి వి.విజయసాయిరెడ్డికి సహాయకారిగా చెవిరెడ్డి వ్యవహరిస్తారని తెలిపింది.

నమ్మకాన్ని నిలబెట్టుకుంటా..



సీఎం వైఎస్ జగన్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. పార్టీలోని 23 అనుబంధ విభాగాల రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా అత్యంత కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి, ప్రతి అనుబంధ విభాగాన్ని మరింత పటిష్ట పరిచేందుకు రేయింబవళ్లు నిర్విరామంగా పని చేస్తానని చెప్పారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

క్లుప్తంగా

దాల్మియా భారత్ ఫౌండేషన్‌తో ఏపీఎస్ ఎస్‌డీసీ ఒప్పందం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి దాల్మియా భారత్ ఫౌండేషన్ ముందుకువచ్చింది. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగులో క్యాపిటల్ గూడ్స్, నిర్మాణ రంగం, ఐటీఈఎస్, హెల్త్‌కేర్ రంగాల్లో శిక్షణ ఇవ్వడం ద్వారా ఉపాధి కల్పించనుంది. ఈ మేరకు దాల్మియా భారత్ ఫౌండేషన్‌తో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. బుధవారం ఏపీఎస్ఎస్‌డీసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దాల్మియా భారత్ గ్రూప్ సీఎస్ఆర్ కంట్రీ హెడ్ డా.అరవింద్ మధుకర్ బోధన్‌కర్, ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ సీఈవో సత్యనారాయణ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.

'మెడిసిన్' అభ్యంతరాలకు నేడు ఆఖరు



సాక్షి, అమరావతి: ఎన్‌సీసీ విభాగంలో ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎంఎస్ ఇతర యూజీ వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రథమ ఎన్‌సీసీ ప్రాధాన్యత జాబితాను ఎన్‌సీసీ డైరెక్టరేట్‌కు సమర్పించినట్టు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ జాబితాపై ఏమైనా అభ్యంతరాలు, గ్రీవెన్స్‌లను ఎన్‌సీసీ డైరెక్టరేట్‌కు nccdteap03@gmail.com కు గురువారం సాయంత్రం నాలుగు గంటలలోగా పంపాల్సి ఉంటుందని పేర్కొంది. గడువు ముగిసిన తర్వాత పంపిన అభ్యంతరాలు, గ్రీవెన్స్‌లను పరిగణలోకి తీసుకోబోమని రిజిస్ట్రార్ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు.

మూడేళ్లకుపైన లీజుకు అనుమతి అవసరం

సాక్షి, అమరావతి: నగరపాలక సంస్థల్లోని ఆస్తులను లీజుకు ఇచ్చేందుకు నిర్ణీత కాల పరిమితి దాటితే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి చేస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు. మున్సిపాలిటీలకు చెందిన స్థలాలు, దుకాణాలు, భవనాల లీజును మున్సిపల్ కౌన్సిల్ ఆమోదంతో వేలం ద్వారా గరిష్టంగా మూడేళ్లకు కేటాయించేవారు. ఆ కాల పరిమితి దాటినవాటిని గరిష్టంగా 25 ఏళ్ల వరకు కేటాయించాలంటే ప్రభుత్వ అనుమతి తీసుకుని బహిరంగవేలం ద్వారా గరిష్ట మొత్తానికి కేటాయించేవారు. కార్పొరేషన్లలోని ఆస్తుల కేటాయింపు మూడేళ్లకు మించితే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి చేస్తూ మున్సిపల్ కార్పొరేషన్ చట్టాన్ని సవరించారు. చట్టంలోని 'మున్సిపాలిటీస్' అనే పదాన్ని 'మున్సిపల్ కార్పొరేషన్'గా మార్చారు.

కంప్యూటర్ డ్రాఫ్ట్స్‌మెన్ పోస్టులకు విద్యార్హతలివీ..

సాక్షి, అమరావతి: సర్వే ల్యాండ్ రికార్డ్స్‌లో కంప్యూటర్ డ్రాఫ్ట్స్‌మెన్ పోస్టుల భర్తీ అర్హతలకు సంబంధించి ఏపీపీఎస్సీ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్, లేదా తత్సమాన సెకండరీ స్కూల్ సర్టిఫికెట్ పరీక్షలో అభ్యర్థులు ఉత్తీర్ణులై ఉండాలి. అలాగే ప్రభుత్వంచే గుర్తింపు పొందిన ఏదైనా పారిశ్రామిక శిక్షణ సంస్థలో డ్రాఫ్ట్స్‌మెన్ (సివిల్) ట్రేడ్‌లో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఒకేషనల్ ట్రైనింగ్ సర్టిఫికెట్ (సర్వేయింగ్ ఒక సబ్జెక్ట్‌గా రెండేళ్ల కోర్సు) పొంది ఉండాలి. దీంతోపాటు జీవో-282 ప్రకారం ఏపీ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ లేదా సెంట్రల్ యాక్ట్, లేదా యూజీసీ గుర్తింపు ద్వారా ఏర్పాటైన ఏదైనా విశ్వవిద్యాలయం నుంచి సర్వేయింగ్ మొదలైన అంశాలలో సివిల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా/డిగ్రీ ఉన్న అభ్యర్థులు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సబార్డినేట్ సర్వీస్‌లో కంప్యూటర్ డ్రాఫ్ట్స్‌మెన్ గ్రేడ్‌ఐఐ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని వివరించింది.

నెలాఖరులోగా మరో అల్పపీడనం!



సాక్షి, విశాఖపట్నం: కొద్దిరోజుల కిందట నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలహీనపడి ప్రస్తుతం దక్షిణ కోస్తాంధ్రపై అల్పపీడనంగా కొనసాగుతోంది. ఇది గురువారం పూర్తిగా బలహీనపడనుంది. దీనికి అనుబంధంగా సగటు సముద్ర మట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం నైరుతి వైపు వంగి ఉంది. దీని ఫలితంగా రానున్న రెండురోజులు రాష్ట్రంలో ఒకటిరెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం బుధవారం రాత్రి నివేదికలో తెలిపింది. నెలాఖరులోగా ఉత్తర అండమాన్ సముద్రంలో మరో అల్పపీడనం ఏర్పడి, బలపడే అవకాశాలున్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. బుధవారం ఎస్పీఎస్ఆర్ నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు, వైఎస్సార్ జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి.

రీ సర్వేతో భూ సమస్యలకు చెక్

రైతులకు హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్





జగనన్న భూహక్కు పత్రంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి • సీఎంకు ముందస్తు పుట్టిన రోజు శుభాకాంక్షలు చెబుతున్న అభిమానులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: రైతుల భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అలుపెరగకుండా, ఖర్చుకు వెనకాడకుండా, అత్యంత సాంకేతికంగా, శాస్త్రీయ పద్ధతిలో భూముల రీసర్వే చేపట్టామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. తద్వారా ఎన్నో సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. భూముల రీ సర్వేను 2023 డిసెంబర్ కల్లా పూర్తి చేస్తామని, సర్వే పూర్తయితే తమ భూముల విషయంలో రైతులు ధైర్యంగా ఉండవచ్చని, అక్రమాలకు అవకాశమే ఉండదని స్పష్టం చేశారు. సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేస్తుందని, గత మూడున్నరేళ్ల కాలంలో విప్లవాత్మక మార్పులు ఎన్నో తీసుకొచ్చామని చెప్పారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష పథకం కింద ఆధునిక డిజిటల్ రెవెన్యూ రికార్డులు సిద్ధమైన గ్రామాల్లో రైతులకు హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఆయన శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో చేపట్టారు. అక్కడే రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రెండేళ్ల క్రితం భూముల సమగ్ర రీ సర్వే, భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం మొదలైందన్నారు. రాష్ట్రంలో 17,584 రెవెన్యూ గ్రామాలుంటే.. అందులో తొలి దశలో 2 వేల రెవెన్యూ గ్రామాల్లో సర్వే చేయడమే కాకుండా 7,92,238 మంది రైతుల భూ రికార్డులను పూర్తిగా ప్రక్షాళన చేసి, భూ హక్కు పత్రాలను అందజేసే భారీ కార్యక్రమానికి ఇక్కడ శ్రీకారం చుడుతున్నామని చెప్పారు. మరో 15 రోజుల్లో మొదటి దశలోని 2 వేల గ్రామాల రైతులందరికీ భూ హక్కు పత్రాలను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

దశల వారీగా భూ హక్కు పత్రాలు

- 2023 ఫిబ్రవరి నాటికి రెండో దశ పూర్తి చేస్తాం. అంటే మరో నాలుగు నెలల్లో ఇంకో నాలుగు వేల గ్రామాలకు సంబంధించిన రైతులందరికీ వాళ్ల భూ హక్కు పత్రాలు వాళ్ల చేతుల్లో పెడతాం. ఆ తర్వాత మరో నాలుగు నెలల్లో మూడో దశలో ఆరు వేల గ్రామాల్లో, పట్టణాల్లో సర్వే పూర్తి చేసి, భూ యజమానులకు 2023 మే నాటికి భూ హక్కు పత్రాలు అందజేస్తాం.
- 2023 ఆగస్టు నాటికి మరో 9 వేల గ్రామాలు, పట్టణాలకు సంబంధించి సర్వే పూర్తి చేస్తాం. ఐదో దశలో మిగతా గ్రామాలు, పట్టణాలతో కలిపి మొత్తంగా 17,584 రెవెన్యూ గ్రామాల్లో, పట్టణాల్లో భూములన్నింటినీ సమగ్ర సర్వే చేసి, రికార్డులను ప్రక్షాళన చేసి.. 2023 డిసెంబర్ నాటికి భూ హక్కు పత్రాలను అందజేస్తాం.

ప్రతి కమతానికి యూనిక్ నంబర్

- ఒకసారి రాష్ట్ర వ్యాప్తంగా భూములన్నింటినీ పూర్తిగా కొలతలు వేసి అది ఎక్కడుందో.. లాటిట్యూడ్ అండ్ లాంగిట్యూడ్ అంటే అక్షాంశాలు, రేఖాంశాలు ఆధారంగా మార్కింగ్ చేయడమే కాకుండా ప్రతి ఒక కమతానికి ఒక నిర్దిష్టమైన యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్‌ను ఈ సర్వే ద్వారా ఇస్తారు. ప్రతి కమతానికి డిజిటల్‌గా, ఫిజికల్‌గా దాన్ని నిర్ణయించి, క్యూఆర్ కోడ్‌తో ల్యాండ్ మ్యాపింగ్ చేస్తాం.
- ఆ భూమికి సరిహద్దు రాళ్లు కూడా పెడుతున్నాం. ఆ తర్వాత రైతుకు ప్రభుత్వ పరంగా సర్వ హక్కులతో కూడిన భూ హక్కు పత్రాలను ప్రక్షాళన చేసి వారి చేతికి ఇవ్వబోతున్నాం. దీంతో తమ భూములను ఎవరైనా ఆక్రమించుకుంటారనే భయం పూర్తిగా తొలగిపోతుంది. డూప్లికేట్ రిజిస్ట్రేషన్లు ఆగిపోతాయి. లంచాలకు అవకాశం లేకుండా పూర్తిగా ప్రక్షాళన జరుగుతుంది. ఇదంతా మహా యజ్ఞంలా సాగుతోంది.
- భూ కమతం ఒక సర్వే నంబర్ కింద ఉండి, కాలక్రమంలో విభజన జరిగినా.. మారినా కూడా సర్వే రికార్డులు అప్‌డేట్ కాకపోవడం వల్ల వస్తున్న వివాదాలన్నింటికి పూర్తిగా చెక్ పెట్టినట్లు అవుతుంది.

జానెడు భూమిలో కూడా తప్పు జరగకుండా..

- జానెడు భూమిలో కూడా తప్పు జరగకుండా సర్వే చేయిస్తున్నాం. 10,185 మంది గ్రామ సర్వేయర్లు (గ్రామ, వార్డు సచివాలయాల్లో కలిపి 13,849 మంది), 3,664 వార్డు ప్లానింగ్ సెక్రటరీలు, రూ.1000 కోట్ల వ్యయం, 4,500 సర్వే బృందాలు, ఎయిర్ క్రాఫ్టులు, హెలికాప్టర్లు, 80 డ్రోన్లు, 2 వేల గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్స్ అంటే జీఎన్ఎస్ఎస్ రోవర్లను వినియోగిస్తున్నాం. వీటితో పాటు ప్రత్యేకంగా 75 కంటిన్యూస్‌లీ ఆపరేటింగ్ రిఫరెన్స్ స్టేషన్ బేస్‌లు అంటే కోర్స్ బేస్‌లు ఏర్పాటు చేశాం.
- రాష్ట్ర వ్యాప్తంగా 17 వేలకు పైగా రెవెన్యూ గ్రామాల్లో 1.07 కోట్ల మంది రైతులు, 2.47 కోట్ల సర్వే నంబర్లకు సంబంధించి 2.26 కోట్ల ఎకరాల వ్యవసాయ భూముల్లో సర్వే జరుగుతుంది. మరో 13,371 గ్రామ కమతాల్లో 85 లక్షల ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు, 123 పట్టణ ప్రాంతాల్లో 40 లక్షల ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు సంబంధించి కూడా సర్వే జరుగుతుంది.
- సర్వే చేయడమే కాకుండా ఆ భూములకు సంబంధించిన సబ్ డివిజన్లు, మ్యుటేషన్లు, ఇతర సమస్యల పరిష్కారం, యాజమాన్య పత్రాల జారీ వంటి కార్యక్రమాలన్నీ గతంలో ఎన్నడూ, ఎక్కడా జరగని విధంగా ప్రస్తుతం మన రాష్ట్రంలో జరుగుతున్నాయి. క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు అన్నీ కూడా సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ సేవలు కూడా గ్రామ సచివాలయాల్లోనే జరిగేలా మార్పులు తీసుకొస్తున్నాం.
- ఇక మీదట సరిహద్దులు మార్కింగ్ చేసి, ఫీల్డ్ లైన్ దరఖాస్తులన్నీ 15 రోజుల టైమ్ ఇచ్చి కచ్చితంగా పూర్తి చేయాలి. పట్టా సబ్‌డివిజన్, మ్యుటేషన్ దరఖాస్తులన్నీ 30 రోజుల్లో పరిష్కారమయ్యేలా ఎల్‌ఓపీలు తీసుకొచ్చాం. దీనివల్ల ఎవరూ లంచాలడిగే పరిస్థితి ఉండదు. మ్యుటేషన్ సేవలను ఉచితంగా అందిస్తాం.

ఇప్పటిదాకా సర్వే జరిగిందిలా..

- 100 ఏళ్ల తర్వాత చేపట్టిన ఈ గొప్ప కార్యక్రమంలో 17వేలకు పై చిలుకు రెవెన్యూ గ్రామాలకు గాను ఇప్పటివరకు 6,819 గ్రామాల్లో 47,276 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఇప్పటికే డ్రోన్ ఫ్లయింగ్ పూర్తయ్యింది. ఈ రోజు (బుధవారం) వరకు 2 వేల గ్రామాల్లో సమగ్ర రీసర్వేతో పాటు భూ పట్టాల ప్రక్షాళన, మిగిలిన అన్ని కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ మేరకు రైతులకు 7,92,238 భూ హక్కు పత్రాలు కూడా సిద్ధంగా ఉన్నాయి. మరో 15 రోజుల పాటు ఈ 2 వేల గ్రామాల్లో వీటి పంపిణీ జరుగుతుంది.
- రీ సర్వే వల్ల ఈ 9 నెలల్లోనే 4 వేల గ్రామాల్లో 4.3 లక్షల సబ్ డివిజన్లు, 2 లక్షల మ్యుటేషన్లకు సంబంధించిన సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యాయి. గతంలో సంవత్సరానికి 35 వేల సబ్ డివిజన్ల దరఖాస్తులు మాత్రమే వచ్చేవి. కేవలం 21 వేలు మాత్రమే సబ్ డివిజన్ జరిగేవి. ఈ లెక్కన ఏటా 21 వేలు మాత్రమే సబ్ డివిజన్‌లు జరిగే పరిస్థితి నుంచి.. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా కేవలం 9 నెలల్లోనే 4.3 లక్షల సబ్ డివిజన్లు, 2 లక్షల మ్యుటేషన్లు పూర్తి చేసుకున్న మెరుగైన స్థితికి వచ్చాం. ఈ ప్రక్రియలో రూ.30 కోట్ల విలువైన సేవలను వారి చేతిలో ఉచితంగా పెట్టినట్టు అవుతోంది. ఈ మార్పులను ప్రజలు ఒక్కసారి గమనించాలి.



జగనన్న భూహక్కు పత్రం లబ్ధిదారులు, సచివాలయ ఉద్యోగులతో సీఎం వైఎస్ జగన్

మూడేళ్లలో ఎన్నో విప్లవాత్మక మార్పులు


- అధికారంలోకి వచ్చిన వెంటనే దాదాపు 15,004 గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేశాం. 1.3 లక్షల శాశ్వత ఉద్యోగాలు ఇచ్చాం. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ చొప్పున 2 లక్షల 60 వేల మందిని నియమించాం. వలంటీర్లు ప్రతి ఒక్కరినీ చేయి పట్టుకుని నడిపిస్తున్నారు.
- 13 నుంచి 26 జిల్లాలు చేశాం. కుప్పంతో సహా రాష్ట్ర వ్యాప్తంగా 25 కొత్త రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేశాం. రాష్ట్రంలో ఒకే ప్రాంతంలో రాజధాని ఉండటం వల్ల జరిగే మంచికన్నా.. మూడు ప్రాంతాలు కూడా బాగుపడే విధంగా మూడు రాజధానుల్ని ఏర్పాటు చేస్తున్నాం.
- రాష్ట్రంలో కేవలం 11 మెడికల్ కాలేజీలు మాత్రమే ఉన్నాయి. వీటికి అదనంగా మరో 17 మెడికల్ కాలేజీలను నిర్మిస్తున్నాం.
- గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, పాఠశాలల్లో, హాస్టళ్లలో నాడు-నేడు, ఇంగ్లిష్ మీడియం, డిజిటల్ లైబ్రరీలు, మహిళలకు భద్రత కల్పించేలా 'దిశ' యాప్, దిశ పోలీస్‌స్టేషన్లు ఇలా ఎన్నో అమలు చేస్తున్నాం.
- ఇచ్ఛాపురం, పలాస ప్రాంతాల్లో కిడ్నీ సమస్యలతో బాధపడే ప్రజలు మన కళ్లెదుటే కన్పించేవారు. పాలకులు, వారితో పాటు దత్తపుత్రుడి వేషంలో సినిమా యాక్టరూ వచ్చేవారు. ఐదేళ్లు పరిపాలన చేశారు. అయినా ఇచ్ఛాపురం, పలాసలో ఉన్న కిడ్నీ పేషెంట్లు వారికి గుర్తుకు రాలేదు. ఆ తర్వాత మీ బిడ్డ ముఖ్యమంత్రి కాగానే ఆ ప్రాంతాల్లో రూ.765 కోట్లతో సర్ఫేస్ వాటర్ తీసుకొచ్చి, కిడ్నీ సమస్యలకు పూర్తి పరిష్కారం చూపించేలా అడుగులు వేశాడు. దాదాపు 70 శాతం పనులు పూర్తయ్యాయి. రూ.50 కోట్లతో రీసెర్చ్ ఆస్పత్రిని కడుతున్నాం. దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయి. కిడ్నీ పేషెంట్లకు రూ.10 వేల వరకు పింఛన్ ఇస్తున్నాం.
- ఇంతకుముందు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కేవలం 295 మాత్రమే ఉండేవి. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా 11 వేలకు పైగా ఉన్న గ్రామ సచివాలయాలన్నింటినీ కూడా భూములు, ఆస్తుల అమ్మకాలు, కొనుగోళ్ల రిజిస్ట్రేషన్ కార్యాలయాలుగా మార్చే ప్రక్రియకు మన ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. రెవెన్యూ శాఖ పరంగా గ్రేడ్-3 విలేజ్ సర్వేయర్లను గ్రేడ్-2గా రీ డిజిగ్నేట్ చేయనున్నాం.
- ఈ కార్యక్రమంలో స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యనారాయణ, సీదిరి అప్పలరాజు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, జిల్లాలోని మిగతా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్‌పర్సన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ కుటుంబంతోనే సిక్కోలు ప్రగతి

శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి చేసింది వైఎస్ కుటుంబమే. అప్పట్లో వైఎస్ రాజశేఖరరెడ్డి, ఇప్పుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి.. వందేళ్ల నుంచి ఉన్న భూ సంబంధిత సమస్యలకు రీ సర్వేతో శాశ్వత పరిష్కారం లభిస్తుంది. గత ప్రభుత్వం జిల్లాకు ఏమీ చేయలేదు. రాష్ట్ర విభజన తర్వాత 23 కేంద్ర సంస్థలు వస్తే ఒక్కటి కూడా శ్రీకాకుళంలో పెట్టలేదు. సీఎం జగన్ వంశధార రిజర్వాయర్‌కు రూ.700 కోట్ల నిధులిచ్చి, ఉద్దానం ప్రాంతంలో తాగునీరు అందించే ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. కిడ్నీ రోగులను అన్ని విధాలా ఆదుకుంటున్నారు. వంశధార ప్రాజెక్టుకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి సీఎం వైఎస్ జగన్.. ఒడిశా వెళ్లి అక్కడి సీఎంను కలిశారు. గత 15 ఏళ్లలో ఈ పని ఎవరూ చేయలేదు. తెలంగాణలో వ్యాపారాలు చేస్తూ హైదరాబాద్‌లో ఉండే చంద్రబాబుకు విశాఖ పాలన రాజధాని కావడం ఏమాత్రం ఇష్టం లేదు. ఆయన ఇక్కడకు వచ్చి అదే మాట చెబితే ప్రజలే తగిన సమాధానమిస్తారు.

– ధర్మాన ప్రసాదరావు, రెవెన్యూ శాఖ మంత్రి

ఆనందంగా ఉంది



మా గ్రామంలో సమగ్ర భూ సర్వే పూర్తయ్యింది. ఎలాంటి ఇబ్బంది లేకుండా భూ హక్కు పత్రాలు వచ్చాయి. చాలా ఆనందంగా ఉంది. గతంలో ఎప్పుడూ మేం ఇలాంటివి చూడలేదు. ఈ సర్వేతో భూ సమస్యలన్నీ పరిష్కారమయ్యాయి.

– రౌతు పోలయ్య, సంతలక్ష్మీపురం, పోలాకి మండలం

నా చేతికి హక్కు పత్రం



నాకు కరగాం పంచాయతీలో 40 సెంట్ల భూమి ఉంది. నోషనల్ ఖాతాలో ఉండిపోవడంతో ఇన్నాళ్లూ పాస్ బుక్ రాలేదు. ఎలాంటి హక్కులు లేకపోవడంతో చాలా ఇబ్బంది పడ్డాను. ఇప్పుడు గ్రామంలో రీ సర్వే పూర్తయింది. నోషనల్ ఖాతాల్లో ఉన్న భూమిని నా పేరున మార్చి భూ హక్కు పత్రం ఇచ్చారు. ఇది ఈ రోజు సీఎం చేతుల మీదుగా తీసుకోవడం ఆనందంగా ఉంది.

– పాగోటి దమయంతి, కంబకాయ, నరసన్నపేట మండలం

వేగంగా రిజిస్ట్రేషన్

నా ఇంటి స్థలాన్ని కరగాం సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేయించాను. ఇతరుల వద్ద కొనుగోలు చేసిన ఈ స్థలం రిజిస్ట్రేషన్ నరసన్నపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చేయించేందుకు ప్రయత్నించాను. అయితే గ్రామ సచివాలయంలో కూడా చేస్తారని తెలియడంతో అక్కడికే వెళ్లి చేయించుకున్నాను. వివరాలన్నీ తెలుసుకుని శ్రమ లేకుండా, అదనపు ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ జరిగింది. ఈ పత్రాలు సీఎం చేతుల మీదుగా ఈ రోజు తీసుకున్నాను. ఆనందంగా ఉంది.

– వెలమల శ్రీదేవి, నారాయణవలస, నరసన్నపేట మండలం

ఆపద్బాంధవుడు ముఖ్యమంత్రి జగన్

- 40 కిలోల బరువున్న తలతో చిన్నారి ఉక్కిరిబిక్కిరి
- సమస్యను వివరించి.. సాయం కోరిన తల్లి
- ఎంత ఖర్చయినా సరే వైద్యం అందించాలని సీఎం ఆదేశం
- తక్షణ సాయంగా రూ.10 వేల పింఛన్ మంజూరు.. చిన్నారి వైద్యానికి ఏర్పాట్లు చేసిన జిల్లా కలెక్టర్



చిన్నారి ఇంద్రజ సమస్య వింటున్న సీఎం వైఎస్ జగన్

పోలాకి/శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆపదలో ఉన్న వారికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి నిరూపించారు. విజయనగరం జిల్లా రేగిడి మండలం సిర్లాం గ్రామానికి చెందిన మీసాల కృష్ణవేణి, అప్పలనాయుడుల కుమార్తె ఇంద్రజ (7) తల బరువు పెరిగిపోయి, వింత వ్యాధితో బాధ పడుతోంది. సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లేందుకు బుధవారం తల్లి ఓ సామాజిక కార్యకర్త సహాయంతో బిడ్డతో కలిసి నరసన్నపేటకు వచ్చింది. హెలిప్యాడ్ నుంచి సీఎం.. బహిరంగ సభాస్థలికి వెళ్లే మార్గంలో తల్లీబిడ్డలు దీనంగా నిలుచున్నారు. సీఎం కాన్వాయ్ వారి వద్దకు రాగానే ఆదుకోండంటూ చేతులుపైకెత్తి వేడుకున్నారు. వీరిని గమనించిన సీఎం.. సభా ప్రాంగణానికి రమ్మని బస్సులోంచి సైగ చేశారు. వారు వేదిక వద్దకు వెళ్లి సీఎం జగన్‌ను కలిశారు. తమ కుమార్తె తల బరువు 40 కిలోలు ఉందని, వైద్యానికి దాదాపు రూ.25 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెబుతున్నారని వివరించారు. చలించిపోయిన సీఎం.. వెంటనే కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను పిలిచి, తక్షణ సాయంగా రూ.పది వేలు పింఛన్ మంజూరు చేయాలని ఆదేశించారు. దేశంలోనే కాదు ప్రపంచంలో ఎక్కడ వైద్యం అందుబాటులో ఉన్నా ఆపరేషన్ చేయిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లతో పాటు, మొత్తం ఖర్చు ప్రభుత్వం భరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు చెప్పారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్.. బుధవారం సాయంత్రం ఇంద్రజ తల్లిదండ్రులతో మాట్లాడారు. రాగోలులోని జెమ్స్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స, ఇతర వైద్య సదుపాయాల కోసం ఇంద్రజను చేర్పించేలా చర్యలు తీసుకున్నారు. చిన్నారి తల్లిదండ్రులు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

25న అంగ ప్రదక్షిణం టోకెన్ల కోటా విడుదల

తిరుమల: డిసెంబర్ నెలకు సంబంధించి అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను ఈ నెల 25న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. తిరుమలలో 21 క్యూ కంపార్ట్‌మెంట్లు నిండి ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 69,589 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.4.35 కోట్లు సమర్పించారు. సర్వదర్శన టోకెన్లు లేనివారికి 24 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటలు పడుతోంది.

శ్రీవారి సేవలో త్రిపుర హైకోర్టు సీజే



ఆలయం వెలుపల జస్టిస్ అమర్నాథ్ గౌడ్

తిరుమల శ్రీవారిని త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అమర్నాథ్ గౌడ్ బుధవారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. టీటీడీ అధికారులు ఆలయ మహాద్వారం వద్ద ఆయనకు స్వాగతం పలికి దర్శనం చేయించారు. తీర్థప్రసాదాలను అందజేశారు.

27న ఆర్జీయూకేటీ తుది విడత కౌన్సెలింగ్

చాన్స్‌లర్ ఆచార్య కేసీ రెడ్డి వెల్లడి




నూజివీడు ట్రిపుల్ ఐటీలోని అకడమిక్ భవనం

నూజివీడు: ఏపీలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో పీయూసీ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 27న తుది విడత కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని వర్సిటీ చాన్స్‌లర్ ఆచార్య కేసీ రెడ్డి బుధవారం తెలిపారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో నిర్వహించనున్న ఈ కౌన్సెలింగ్‌కు సంబంధించి ఖాళీ సీట్లకు ఎంపికైన అభ్యర్థుల జాబితాతో పాటు వెయిటింగ్ జాబితాను కూడా వర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు చెప్పారు. ఎంపికైన అభ్యర్థులు, వెయిటింగ్ జాబితాలో ఉన్న అభ్యర్థులు వర్సిటీ వెబ్‌సైట్ నుంచి కాల్‌లెటర్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. వెయిటింగ్ జాబితాలో ఉన్న అభ్యర్థులకు సీట్లు వచ్చినట్లు కాదని, ఎంపికైన అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు గైర్హాజరైతే వెయిటింగ్ జాబితాలో ఉన్న వారికి సీటు వస్తుందని తెలిపారు.

జిల్లా కోర్టుల్లో పోస్టుల భర్తీ పరీక్షల షెడ్యూల్

డిసెంబర్ 16 నుంచి అందుబాటులోకి హాల్ టికెట్లు



సాక్షి, అమరావతి/గుంటూరు లీగల్: రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కోర్టుల్లో వివిధ కేటగిరీలకు సంబంధించి 3,432 పోస్టుల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసిన హైకోర్టు, తాజాగా ఆ పోస్టులకు సంబంధించిన పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసింది. స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 3, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులకు డిసెంబర్ 21, 22, 23, 29, జనవరి 2 (2023) తేదీల్లో ఉమ్మడిగా కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తారు. కాపీయిస్ట్, ఎగ్జామినర్, రికార్డ్ అసిస్టెంట్ పోస్టులకు డిసెంబర్ 26న కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఉంటుంది. డ్రైవర్, ప్రాసెస్ సర్వర్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు డిసెంబర్ 26, 27, 28, 29 తేదీల్లో పరీక్ష నిర్వహిస్తారు. డిసెంబర్ 16 నుంచి హైకోర్టు, జిల్లా కోర్టుల వెబ్‌సైట్లలో హాల్ టికెట్లు అందుబాటులో ఉంటాయి. పరీక్ష వేదిక, సమయం వంటి వివరాలను హాల్ టికెట్లలో పొందుపరుస్తారు. ఈ మేరకు రిజిస్ట్రార్ (రిక్రూట్‌మెంట్) ఎస్.కమలాకర్‌రెడ్డి బుధవారం ఓ నోటిఫికేషన్ జారీ చేశారు.

వర్సిటీల్లో నిష్ణాతుల నియామకం

'ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్' హోదాలో నియామకాలు



సాక్షి, అమరావతి: యూనివర్సిటీలు, కాలేజీలు, ఉన్నత విద్యా సంస్థల్లో అనుభవజ్ఞులైన నిపుణుల సేవలను వినియోగించుకోవాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) సూచించింది. ఇందు కోసం 'ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ (పీవోపీ)' హోదాను సృష్టించింది. ఈ విధానం కింద వివిధ రంగాల్లో అనుభవజ్ఞులైన వారిని, పారిశ్రామిక నిపుణుల సేవలను వినియోగించుకొని ప్రపంచస్థాయి అత్యున్నత ప్రమాణాలు సాధించవచ్చని పేర్కొంది. ప్రస్తుతం విశ్వవిద్యాలయాలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో పార్టు టైమ్, గెస్ట్, కాంట్రాక్టు ప్రాతిపదికన అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమిస్తున్నారు. వీరికన్నా వివిధ రంగాల్లో నిపుణులైన వారి సేవల వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుందని యూజీసీ అభిప్రాయపడుతోంది. ఇప్పటికే అభివృద్ధి చెందిన దేశాలు పీవోపీ విధానంతో మంచి ఫలితాలు సాధిస్తున్నాయని వివరించింది. విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు, ఉన్నత విద్యా కళాశాలల ప్రిన్సిపాళ్లు వారి సంస్థల్లో పీవోపీ నియామకాలకు నిబంధనల మార్పునకు చర్యలు తీసుకోవడంతోపాటు, ఆ చర్యల నివేదికను కూడా పంపాలని యూజీసీ అన్ని సంస్థలను కోరింది. పీవోపీల నియామకాలపై గత నెలలోనే నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనికి అధికారిక విద్యార్హతలు, ప్రచురణ తదితరాలు తప్పనిసరి కాదని స్పష్టం చేసింది.

ఎమ్ఐటీ వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో అమలు

ప్రాక్టీస్ ప్రొఫెసర్ విధానాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రతిష్టాత్మక విద్యా సంస్థలు అనుసరిస్తున్నాయి. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎమ్ఐటీ), హార్వర్డ్ విశ్వవిద్యాలయం, స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ (ఎస్ఓఏఎస్), యూనివర్సిటీ ఆఫ్ లండన్, కార్నెల్ విశ్వవిద్యాలయం, హెల్సింకి విశ్వవిద్యాలయం వంటి అనేక విశ్వవిద్యాలయాల్లో ఈ విధానంలో నిపుణుల నియామకం జరుగుతోంది. మన దేశంలోనూ ఢిల్లీ, మద్రాస్, గౌహతి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో (ఐఐటీలలో) పీవోపీలను నియమించారు.

పీవోపీల నియామకానికి యూజీసీ మార్గదర్శకాలు..

- ఈ నిపుణుల నియామకం విశ్వవిద్యాలయం, కళాశాలల మంజూరైన పోస్టుల పరిమితి మేరకు మాత్రమే ఉంటుంది.
- విద్యా సంస్థల్లో నియమించే పీవోపీల సంఖ్య మంజూరైన పోస్టుల్లో 10 శాతానికి మించకూడదు
- సంస్థలో మంజూరైన పోస్టుల సంఖ్యను లేదా రెగ్యులర్ ఫ్యాకల్టీ నియామకంపై ప్రభావం చూపకూడదు
- గౌరవ ప్రాతిపదికన ఈ నియామకాలు ఉండాలి
- పరిశ్రమల ద్వారా ఆయా సంస్థలకు వచ్చే నిధులు లేదా ఆయా ఉన్నత విద్యా సంస్థల్లోని సొంత నిధులతో నియామకాలు చేపట్టాలి
- పీవోపీల గరిష్ట పదవీ కాలం మూడేళ్లు. అవసరమైన సందర్భాల్లో ఒక సంవత్సరం పొడిగించవచ్చు
- ఇప్పటికే టీచింగ్ పొజిషన్‌లో ఉన్నవారికి లేదా పదవీ విరమణ చేసిన వారికి ఈ పథకం వర్తించదు.

అమూల్ పాలసేకరణ ధర పెంపు

- 50 కిలోల దాణాబస్తాపై రూ.10 ప్రోత్సాహకం
- హ్యాండ్లింగ్ చార్జీల చెల్లింపు



సాక్షి, అమరావతి: రాయలసీమ జిల్లాల్లో పాలసేకరణ ధరను అమూల్ పెంచింది. ఇటీవలే కోస్తా, ఉత్తరాంధ్ర జిల్లాల్లో పాలసేకరణ ధరను పెంచిన అమూల్ తాజాగా రాయలసీమ జిల్లాల్లో లీటరు గేదెపాలపై రూ.2.47, ఆవుపాలపై రూ.1.63 చొప్పున పెంచింది. ఈ పెంపు గురువారం నుంచి అమల్లోకి రానుంది. జగనన్న పాలవెల్లువ కింద అమూల్ తరఫున రాయలసీమ జిల్లాల్లో కైరా, కోస్తాంధ్రలో సబర్కాంత్, ఉత్తరాంధ్రలో బనస్కాంత్ యూనియన్లు పాలు సేకరిస్తున్నాయి. ఇటీవలే కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర జిల్లాల్లో నాలుగోసారి పాలసేకరణ ధర పెంచగా, రాయలసీమ జిల్లాల్లో నేటినుంచి అమలు చేస్తోంది. రాయలసీమ జిల్లాల్లో లీటరు ఆవుపాలకు (ఫ్యాట్ 3.5 శాతం, ఎస్ఎన్ఎఫ్ 8.5 శాతం) చెల్లిస్తున్న ధరను రూ.30.50 నుంచి రూ.32.13కు పెంచింది. లీటరు గేదెపాలకు (ఫ్యాట్ 6 శాతం, ఎస్ఎన్ఎఫ్ 9 శాతం) చెల్లిస్తున్న ధరను రూ.42.50 నుంచి రూ.44.97కు పెంచింది. కిలో ఘనపదార్థాలకు రూ.7.9 నుంచి రూ.9.5కు పెంచారు. హ్యాండ్లింగ్ చార్జీల కింద లీటరు ఆవు పాలకు (ఫ్యాట్ 4 శాతం ఎస్ఎన్ఎఫ్ 8.5 శాతం) రూ.1.24, గేదెపాలకు (ఫ్యాట్ 8 శాతం, ఎస్ఎన్ఎఫ్ 9.2 శాతం) రూ.1.64 చొప్పున సొసైటీలకు చెల్లించనున్నారు. అమూల్ దాణాపై 50 కిలోల బస్తాకు రూ.10 చొప్పున ఆయా సొసైటీ కార్యదర్శులకు ప్రోత్సాహకం ఇవ్వనున్నారు. ఫలితంగా వైఎస్సార్, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలోని 44 వేల మంది రైతులతోపాటు 3,768 మహిళా పాడిరైతు సంఘాలు లబ్ధిపొందనున్నాయి.

అమూల్ రాకతో అదనపు లబ్ధి

జగనన్న పాలవెల్లువ పథకాన్ని ఇటీవలే తిరుపతి జిల్లాకు విస్తరించారు. ప్రస్తుతం 17 జిల్లాల్లో 1,644 ఆర్బీకేల పరిధిలోని 2,856 గ్రామాల్లో జగనన్న పాలవెల్లువ అమలవుతోంది. 2,47,958 మంది మహిళా పాడిరైతుల నుంచి రోజూ 1.50 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నారు. గడిచిన 24 నెలల్లో 5.12 కోట్ల లీటర్ల పాలు సేకరించారు. పాలుపోసిన పదిరోజుల్లోనే డబ్బు చెల్లిస్తున్నారు. ఇప్పటివరకు రూ.219.57 కోట్లు చెల్లించారు. లీటరుపై రూ.4 అదనంగా లబ్ధిచేకూర్చేలా కృషిచేస్తామని పాదయాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆ హామీ కంటే మిన్నగా లీటరు గేదె పాలపై రూ.15 నుంచి రూ.20 వరకు, ఆవుపాలకు రూ.10 వరకు అదనంగా లబ్ధిచేకూర్చారు. ప్రైవేటు డెయిరీలు ఇస్తున్న రేట్లతో పోలిస్తే జగనన్న పాలవెల్లువ అమలవుతున్న గ్రామాల్లోని రైతులు రూ.25 కోట్ల వరకు అదనంగా లబ్ధిపొందారు. ప్రభుత్వ చర్యల ఫలితంగా ప్రైవేటు డెయిరీలు కూడా పోటీపడి ధరలను పెంచాల్సి వచ్చింది. మూడేళ్లలో వరుసగా నాలుగుసార్లు పెంచడంతో అమూల్‌తో పోటీని తట్టుకోలేక ప్రైవేటు డెయిరీలు సైతం లీటరుపై రూ.15 వరకు పెంచాల్సి వచ్చింది. ఫలితంగా జగనన్న పాలవెల్లువ పథకం కింద పాలుసేకరిస్తున్న గ్రామాల్లోనే కాదు.. ప్రైవేటు డెయిరీలకు పాలుపోస్తున్న రైతులకు కూడా గతంలో ఎన్నడూ లేని రీతిలో లబ్ధికలిగింది. ఆయా డెయిరీల పరిధిలోని రైతులు మూడేళ్లలో రూ.2,354.22 కోట్ల మేర లబ్ధిపొందగలిగారు. ఇప్పటికే అమూల్ తరఫున పాలు సేకరిస్తున్న సబర్కాంత్, బనస్కాంత్ యూనియన్లు పాలసేకరణ ధర పెంచగా, తాజాగా గురువారం నుంచి రాయలసీమ జిల్లాల్లో పాలుసేకరిస్తున్న కైరా యూనియన్ కూడా నాలుగోసారి పెంచింది. జగనన్న పాలవెల్లువ పథకాన్ని డిసెంబర్ కల్లా మిగిలిన జిల్లాలకు విస్తరించేదిశగా ముందుకెళుతున్నారు.

పూర్తి పరిహారం చెల్లించలేదని హైకోర్టులో పిటిషన్

మంత్రి విడదల రజిని తదితరులకు నోటీసులు

సాక్షి, అమరావతి: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కోసం ప్రభుత్వం తమ నుంచి తీసుకున్న భూమికి పూర్తిస్థాయి పరిహారం చెల్లించడం లేదంటూ దాఖలైన వ్యాజ్యంలో హైకోర్టు పలువురికి నోటీసులు జారీ చేసింది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే విడదల రజిని, ఆమె అనుచరులు మల్లెల రాజేష్ నాయుడు, గడిపూడి గోపీ, జంపని నాగమల్లేశ్వరరావు, గడిపూడి దశరథ రామయ్య, పత్తిపాటి శేషయ్య తదితరులకు వ్యక్తిగతంగా నోటీసులు అందచేసేందుకు పిటిషనర్‌కు అనుమతినిచ్చింది. పరిహారం చెల్లింపు విషయంలో పిటిషనర్ చేసిన ఫిర్యాదు, వినతిపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 25కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు.

తమ నుంచి ప్రభుత్వం ఎకరా రూ.35 లక్షలకు భూమి తీసుకుందని, అయితే పూర్తిస్థాయి పరిహారం మాత్రం ఇప్పటివరకు చెల్లించలేదని, పూర్తి పరిహారాన్ని చెల్లించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామానికి చెందిన ప్రత్తిపాటి నాగభూషణం, గట్టిపాటి వెంకటేశ్వర్లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పూర్తిస్థాయి పరిహారం చెల్లించాలంటే ముందు కొంత చెల్లించాలని, ఆ డబ్బు ఎమ్మెల్యేలకు వెళుతుందంటూ ఎమ్మెల్యే అనుచరులు తమ నుంచి డబ్బు వసూలు చేశారని పిటిషనర్లు పేర్కొన్నారు. తమ నుంచి ఖాళీ ప్రామిసరీ నోట్, చెక్కులు తీసుకుని రూ.31 లక్షలు మాత్రమే చెల్లించారని, మిగిలిన సొమ్ము కూడా చెల్లించేలా అధికారులను ఆదేశించాలని వారు కోర్టును కోరారు.

ఎఫ్‌జీడీ యూనిట్లతో కాలుష్య నియంత్రణ

- విద్యుత్ ప్లాంట్లలో వీటి ఏర్పాటు అవసరం
- 'సాక్షి'తో ఐసీఎస్‌సీ ఇంటర్నేషనల్ ప్రాజెక్టు మేనేజర్ లెస్లీ స్లాస్



సాక్షి, విశాఖపట్నం: విద్యుత్ ప్లాంట్లలో ఫ్లూ గ్యాస్ డీసల్ఫరైజేషన్(ఎఫ్‌జీడీ) యూనిట్ల ఏర్పాటు అవసరమని ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ సస్టెయినబుల్ కార్బన్(ఐసీఎస్‌సీ) అంతర్జాతీయ ప్రాజెక్టు మేనేజర్ లెస్లీ స్లాస్ చెప్పారు. బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్లలో వీటి ఏర్పాటు ద్వారా ఆయా ప్లాంట్ల నుంచి వెలువడే కాలుష్య తీవ్రతను చాలా వరకు నియంత్రించవచ్చని తెలిపారు. ఎఫ్‌జీడీ యూనిట్ల ఏర్పాటు ఖర్చుతో కూడుకున్నది కావడంతో కొన్ని విద్యుత్ ప్లాంట్ల యాజమాన్యాలు వెనకడుగు వేస్తున్నాయన్నారు. విశాఖలో మూడు రోజుల పాటు కంటిన్యూస్ ఎమిషన్ మానిటర్స్(సెమ్స్)పై జరుగుతున్న శిక్షణ సదస్సులో పాల్గొనడానికి ఆమె లండన్ నుంచి వచ్చారు. ఈ సందర్భంగా బుధవారం 'సాక్షి'తో మాట్లాడారు. అమెరికా, జపాన్ తదితర దేశాలతో పాటు భారతదేశం కూడా ఎఫ్‌జీడీపై దృష్టి సారిస్తోందని, రానున్న రెండు మూడేళ్లలో 20–30 శాతం విద్యుత్ ప్లాంట్లు/పరిశ్రమల్లో ఎఫ్‌జీడీ యూనిట్లు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. భారీ పరిశ్రమలు, విద్యుత్ ప్లాంట్ల నుంచి సల్ఫర్ కాలుష్య సమస్య అధికంగా ఉంటోందన్నారు. కాలుష్య కారక పరిశ్రమల్లో కాలుష్య ఉద్గారాలను తగ్గించేందుకు ప్రపంచ స్థాయి ప్రమాణాలు కలిగిన ఆధునిక సాంకేతికతను వినియోగించాల్సి ఉందని తెలిపారు. కాలుష్య ప్రభావాన్ని తగ్గించే సాంకేతిక పరిజ్ఞానం కలిగిన యంత్ర పరికరాల వినియోగం గతం కంటే పెరిగిందని, మరింతగా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో కాలుష్య కారక పరిశ్రమలు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీకి అనుగుణంగా మార్పులు చేసుకోవలసిందేనని తెలిపారు. సంబంధిత కాలుష్య నియంత్రణ మండళ్లు వీటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. వివిధ పోర్టుల్లో బొగ్గు, ఇతర కాలుష్య కారక సరకుల ఎగుమతి, దిగుమతులు, నిల్వ, రవాణా సందర్భంగా వెలువడుతున్న కాలుష్యం వల్ల సమీప ప్రాంతాల ప్రజలు ప్రభావితులవుతున్నారని, అలాంటి ప్రాంతాల్లో కాలుష్య సమస్య నివారణకు ఎక్కువ దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తాము ప్రభుత్వాలకు సిఫార్సు చేస్తున్నామని లెస్లీ స్లాస్ వివరించారు.

'ఈ-రిసోర్సెస్'లో ఎన్జీరంగా వర్సిటీకి స్కోచ్ అవార్డు

గుంటూరు రూరల్: జాతీయస్థాయిలో ఉత్తమ ఈ-రిసోర్సెస్ వినియోగంలో మొదటిస్థానం లభించినట్లు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ వీసీ విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం తెలిపారు. వ్యవసాయ విద్య, పరిశోధన, విస్తరణ విభాగాలకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్(ఐసీఏఆర్) ఈ అవార్డును 2021 సంవత్సరానికి ప్రకటించిందన్నారు. ఈ అవార్డును పొందిన వర్సిటీని ఐసీఏఆర్ డీడీజీ డాక్టర్ అగర్వాల్ అభినందించినట్లు చెప్పారు.

ఇంధన పెట్టుబడులకు స్వర్గధామం ఏపీ

- దేశంలో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులకు అవకాశం
- విశాఖలో నిర్వహించిన పెట్టుబడుల బజార్‌లో బీఈఈ డీడీజీ అశోక్‌కుమార్
- సదస్సులో ఒకే వేదికపై పరిశ్రమలు, బ్యాంకులు, ఆర్థికసంస్థలు



సాక్షి, విశాఖపట్నం: దేశంలో పారిశ్రామికరంగంలో ఇంధన సామర్థ్య పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ స్వర్గధామంగా ఉందని, ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారం బాగుందని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బీఈఈ) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (డీడీజీ) అశోక్‌కుమార్ చెప్పారు. కేంద్ర విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలోని బీఈఈ సహకారంతో ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) విశాఖలో బుధవారం పెట్టుబడుల బజార్ పేరిట సదస్సు నిర్వహించింది. పరిశ్రమలు, బ్యాంకులు, ఆర్థికసంస్థల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్న ఈ సదస్సుని అశోక్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఇంధన సామర్థ్య ప్రాజెక్టుల ఏర్పాటుపై ఆసక్తి కనబరిచిన పెట్టుబడిదారులకు పూర్తి సహాయ సహకారాలు అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేయడం గొప్ప విషయమన్నారు. ఇంధన సామర్థ్య రంగంలో జాతీయస్థాయిలో 13 లక్షల కోట్ల పెట్టుబడులకు అవకాశం ఉందని తెలిపారు. ఈ విషయంలో ఏపీ ఇంధన పరిరక్షణ మిషన్ మొదటి అడుగు వేసిందని, వరుసగా ఇన్వెస్ట్‌మెంట్ బజార్స్ నిర్వహించడమే ఇందుకు నిదర్శనమని ప్రశంసించారు. పరిశ్రమలు, బ్యాంకులు, ఆర్థికసంస్థల నుంచి పెట్టుబడుల సదస్సులకు విశేష స్పందన లభించటం బీఈఈకి ఎంతో ప్రోత్సాహం అందిస్తోందన్నారు. ఏపీ ఆదర్శంగా ఇతర రాష్ట్రాల్లోనూ ఇన్వెస్ట్‌మెంట్ బజార్లు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. ఇంధన సామర్థ్య పెట్టుబడులను ముందుకు తీసుకెళ్లేందుకు ఏపీఎస్ఈసీఎం ఆధ్వర్యంలో ఆర్థికసంస్థల కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంధన సామర్థ్య సాంకేతికత అమలు చేసే పరిశ్రమలకు 5 శాతం వడ్డీ రాయితీ పథకాన్ని అమలు చేయాలని ఏపీఎస్ఈసీఎం చేసిన ప్రతిపాదన కేంద్ర ఆర్థికశాఖ పరిశీలనలో ఉందని చెప్పారు. ఈ పథకం అమల్లోకి వస్తే రాబోయే ఐదేళ్లలో దాదాపు రూ.15 వేలకోట్ల విలువైన ఇంధన సామర్థ్య ప్రాజెక్టులకు ప్రయోజనం కలిగే అవకాశం ఉందని తెలిపారు. వివిధ రంగాల్లో ఇంధన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు విధానపరమైన ప్రమాణాలు రూపొందించడంలో ఏపీఎస్ఈసీఎం ముఖ్య భూమిక పోషిస్తోందని ఆయన చెప్పారు.

నిరంతర సరఫరాకు విద్యుత్ వ్యవస్థ బలోపేతం

రాష్ట్ర ఇంధనశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ తరఫున ఏపీఎస్ఈసీఎం సీఈవో చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఇది ఒక అద్భుత అవకాశమని చెప్పారు. ఇంధన సామర్థ్యంలో పెట్టుబడులకు ముందుకొచ్చే సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల పూర్తిస్థాయి సహాయ, సహకారాలందిస్తుందన్నారు. ఇంధన సామర్థ్యం అభివృద్ధితో ఇంధన భద్రత లభిస్తుందని, ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని చెప్పారు. ఈ రంగంలో ప్రభుత్వం వ్యయం తగ్గడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు దోహదకారిగా మారుతుందన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా వ్యవస్థని మరింత బలోపేతం చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇంధనశాఖ మంత్రి పెద్దిరెడ్డి శ్రమిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ సదస్సులో ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్లు డి.చంద్రం, సూర్యప్రతాప్, పీఎఫ్‌సీ జనరల్ మేనేజర్ మదన్‌మోహన్, బ్యాంకర్లు, వివిధ ప్రభుత్వరంగ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్ల రక్షణకు సెల్ ప్రారంభం

- సీఐడీ విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు
- నోడల్ అధికారిగా ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ జి.వి.సరితకు బాధ్యతలు
- త్వరలో ఇదే తరహాలో ప్రతి జిల్లా కేంద్రంలోనూ ఏర్పాటుకు చర్యలు

సాక్షి, అమరావతి: పోలీస్ శాఖ రాష్ట్రంలో ట్రాన్స్‌జెండర్ల రక్షణ సెల్‌ను ఏర్పాటు చేసింది. సీఐడీ విభాగం ఆధ్వర్యంలో మంగళగిరిలోని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఈ సెల్‌ను అదనపు డీజీ(సీఐడీ) పి.వి.సునీల్ కుమార్ బుధవారం ప్రారంభించారు. ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ జి.వి.సరిత ఈ ట్రాన్స్‌జెండర్ల రక్షణ సెల్‌కు నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. ఇదే తరహాలో ప్రతి జిల్లా కేంద్రంలోనూ ట్రాన్స్‌జెండర్ల రక్షణ సెల్‌లను త్వరలో ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా అదనపు డీజీ సునీల్ కుమార్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. ట్రాన్స్‌జెండర్ల హక్కుల పరిరక్షణ కోసం జిల్లా స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎస్పీ సరిత మాట్లాడుతూ తమ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వచ్చే ట్రాన్స్‌జెండర్లతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని చెప్పారు. ప్రత్యేకప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ శాఖ డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఓటు హక్కు కలిగిన ట్రాన్స్‌జెండర్లు 3,800 మంది ఉన్నారన్నారు. కానీ జనాభా లెక్కల ప్రకారం దాదాపు 28 వేల మంది ఉన్నారని చెప్పారు. ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని తెలిపారు. వారికి నెలకు రూ.3వేలు పింఛన్ ఇస్తుండటంతో పాటు ఇళ్ల పట్టాలు కూడా ఇవ్వనుందన్నారు.

అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి

తొలగిన అడ్డంకులు

స్టే ఎత్తేసి, పిటిషన్లు కొట్టేసిన హైకోర్టు

సాక్షి, అమరావతి: మహిళా, శిశుసంక్షేమశాఖలో అంగన్‌వాడీ వర్కర్లను గ్రేడ్–2 సూపర్‌వైజర్లుగా నియమించేందుకు ఉద్దేశించిన ప్రక్రియకు అడ్డంకులు తొలగిపోయాయి. సూపర్‌వైజర్ల నియామక ప్రక్రియ కొనసాగించేందుకు హైకోర్టు పచ్చజెండా ఊపింది. ఈ విషయంలో గతంలో ఉన్న స్టేను హైకోర్టు ఎత్తేసింది. అంగన్‌వాడీ వర్కర్లను సూపర్‌వైజర్లుగా నియమించేందుకు వీలుగా జారీచేసిన నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. అంగన్‌వాడీ వర్కర్లను గ్రేడ్–2 సూపర్‌వైజర్లుగా నియమించేందుకు వీలుగా 560 పోస్టుల భర్తీకోసం ప్రభుత్వం ఈ ఏడాది సెప్టెంబర్‌లో నోటిఫికేషన్ విడుదల చేసి రాతపరీక్ష నిర్వహించింది. రాత పరీక్షకు 45 మార్కులు, ఇంగ్లిషులో ప్రావీణ్యానికి 5 మార్కులు నిర్ణయించింది. కొందరు అభ్యర్థులు తమకు రాతపరీక్ష మాత్రమే నిర్వహించి, ఇంగ్లిషు ప్రావీణ్యపరీక్షను నిర్వహించకపోవడాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఇంగ్లిష్ ప్రావీణ్యపరీక్ష నిర్వహించకుండానే తుది మెరిట్ లిస్ట్ ప్రకటించేందుకు అధికారులు రంగం సిద్ధంచేస్తున్నారని, ఇందులో జోక్యం చేసుకోవాలని వారు కోరారు. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన హైకోర్టు.. నియామక ప్రక్రియపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. తాజాగా బుధవారం ఈ వ్యాజ్యాలు మరోసారి విచారణకు వచ్చాయి. ప్రభుత్వ న్యాయవాది శశిభూషణ్‌రావు వాదనలు వినిపిస్తూ.. నోటిఫికేషన్‌కు అనుగుణంగానే పోస్టుల భర్తీప్రక్రియ చేపట్టామన్నారు. రాతపరీక్షలో అర్హత సాధించిన వారికే ఇంగ్లిష్ ప్రావీణ్యపరీక్ష నిర్వహిస్తామని, ఈ విషయాన్ని నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొన్నామని తెలిపారు. మెమో ద్వారా కూడా స్పష్టతనిచ్చామన్నారు. స్టే వల్ల భర్తీప్రక్రియ మొత్తం నిలిచిపోయిందని, దీనివల్ల పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. ఈ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణప్రసాద్ గతంలో విధించిన స్టే ఎత్తేశారు. పిటిషన్లను కొట్టేశారు.

రాజధాని భూములను ఇతర అవసరాలకు వాడకూడదు



- హైకోర్టులో అమరావతి రైతుల తరఫు న్యాయవాదులు
- ప్రభుత్వ, సీఆర్‌డీఏ వాదనల నిమిత్తం విచారణ 29కి వాయిదా

సాక్షి, అమరావతి: రాజధాని కోసం ఇచ్చిన భూములను ఆ ప్రయోజనం కోసం కాకుండా, ఇతర అవసరాలకు ఉపయోగించడం చట్ట విరుద్ధమని అమరావతి రైతుల తరఫు సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు బుధవారం హైకోర్టుకు నివేదించారు. రాజధాని నిర్మాణం కోసం ఉపయోగించాల్సిన భూములను ఇతరులకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించడం మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధమని అన్నారు. సీఆర్‌డీఏ చట్ట సవరణ ద్వారా రాజధానిలో రాజధానేతరులకు ఇళ్ల స్థలాలు కేటాయించకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని హైకోర్టును కోరారు. మధ్యంతర ఉత్తర్వుల జారీ వ్యవహారంలో రైతుల తరఫు న్యాయవాదుల వాదనలు ముగియడంతో ప్రభుత్వం, సీఆర్‌డీఏ వాదనల నిమిత్తం హైకోర్టు తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజధాని ప్రాంతంలో ఇతర ప్రాంతాల వారికి కూడా ఇళ్ల స్థలాలు మంజూరుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలను సవాలు చేస్తూ అమరావతి రైతు సంఘాలు వేర్వేరుగా వేసిన పిటిషన్లు, ఇళ్ల స్థలాలు కేటాయించకుండా యథాతథస్థితి కొనసాగించేలా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ వేసిన అనుబంధ పిటిషన్లపై జస్టిస్ దుర్గాప్రసాదరావు ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫున బి.ఆదినారాయణరావు, కారుమంచి ఇంద్రనీల్ వాదనలు వినిపించారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలనుకుంటే తగిన పరిహారం చెల్లించి భూ సేకరణ ద్వారా కేటాయించాలే తప్ప, రాజధాని కోసం తామిచ్చిన భూముల్లో స్థలాలు ఇవ్వడానికి వీల్లేదని అన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం ద్వారా రాజధాని నగరాన్ని మురికివాడగా మార్చకూడదన్నదే తమ వాదనని తెలిపారు.



ఆనందం బాహ్య పరిస్థితులపై ఆధారపడి ఉండదు. జీవితంలోని సరళమైన విషయాలలో, లోతైన ధ్యానంలో అది దొరుకుతుంది.

– పరమహంస యోగానంద

సాక్షి

గురువారం, నవంబర్, 24

నచ్చినవాడికి ఇచ్చేద్దామా?

నిష్పక్షపాతంగా వ్యవహరించడమే కాదు, వ్యవహరించినట్టు కనిపించడం కూడా అంతే ముఖ్యం. కానీ, ప్రజాస్వామ్యానికి పునాది లాంటి ఎన్నికలు, వాటిని నిర్వహిస్తున్న మన ఎన్నికల వ్యవస్థ అలానే ఉన్నాయా? ఎన్నికల సంఘానికి పెద్ద అయిన భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్ల (ఈసీల) నియామక ప్రక్రియ నిష్పాక్షికంగా, న్యాయబద్ధంగా జరుగుతోందా? దేశ సర్వోన్నత న్యాయస్థానం మంగళ, బుధవారాల్లో అన్న మాటలు, అడిగిన ప్రశ్నలు చూశాక సహజంగానే ఈ ప్రశ్నలు అడగాల్సినవే అనిపిస్తాయి. సీఈసీ, ఈసీల వ్యవస్థ రాజకీయ, ప్రభుత్వ జోక్యాలకు అతీతంగా ఉండేలా చూడాలంటూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ జోసెఫ్ నేతృత్వంలోని అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం వ్యాఖ్యలు ఆలోచన రేపుతున్నాయి. పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్ లాంటి చోట్ల కూడా ఎన్నికల సంఘ నియామకాలు, చట్టాలు పారదర్శకంగా ఉంటే 72 ఏళ్ళ తర్వాతా మన వద్ద ఆ పరిస్థితి లేకపోవడం విషాదమే.

ఈ నెల 18న స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన ఐఏఎస్ అధికారి అరుణ్ గోయెల్‌ను ఆ వెంటనే 19వ తేదీన ఎన్నికల కమిషనర్‌గా ప్రభుత్వ పెద్దలు నియమించడం సైతం ఇప్పుడు చర్చనీయాంశమైంది. మామూలుగా అయితే, ఈ ఏడాది ఆఖరుకు రిటైరవ్వాల్సిన వ్యక్తికి హఠాత్తుగా స్వచ్ఛంద పదవీ విరమణ ఇచ్చి, ఇలా ఎన్నికల సంఘంలో నియుక్తం చేయడంలో అంతా సవ్యంగానే జరిగిందా అన్నది ప్రశ్న. అది తెలుసుకొనేందుకే సుప్రీమ్ కోర్ట్ ఇప్పుడు అరుణ్ గోయెల్ నియామకం సహా నిర్ణీత ఫైళ్ళను పంపాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరడం గమనార్హం. అధికార పార్టీలు తమకు నచ్చిన ప్రభుత్వ ఉన్నతాధికారులను సీనియారిటీ ప్రాతిపదికన ఎన్నికల కమిషనర్లుగా నియమిస్తున్న విధానం తప్పనేది ప్రాథమికంగా పిటిషనర్ల వాదన. సీఈసీల నియామకంలోనూ కొలీజియమ్ తరహా విధానాన్ని పాటించాలని అభ్యర్థన.

ఎన్నికల కమిషనర్ల నియామకం పూర్తిగా పాలకుల ఇష్టారాజ్యమైందన్నది చేదు నిజం. సుప్రీమ్ అన్నట్టు – క్యాబినెట్ నియమించిన సీఈసీ, ఈసీలు ఏ ప్రధానమంత్రి స్థాయి వ్యక్తికో వ్యతిరేకంగా నోరు విప్పగలరా అన్నది అనుమానమే. గణాంకాలు చూస్తే రాజ్యాంగం అమలులోకి వచ్చాక తొలి 46 ఏళ్ళలో (1950 –1996) సీఈసీగా వ్యవహరించింది పట్టుమని పది మందే! ఆ తర్వాత గత 26 ఏళ్ళలో ఇప్పటికి 15 మంది వచ్చారు, పోయారని కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. 2004 తర్వాత ఏ ఒక్కరూ పూర్తి ఆరేళ్ళ పదవీకాలం లేరు. కేంద్రంలో ఉన్నది కాంగ్రెస్ సారథ్య యూపీఏ అయినా, బీజేపీ నేతృత్వ ఎన్డీఏ అయినా ఇదే దుఃస్థితి. స్వల్పకాలమే ఉంటున్న ఈ ఎన్నికల పెద్దలు అనుకున్నది చేయగలరా? ఏ మేరకు స్వతంత్రంగా వ్యవహరించగలరు? సుప్రీమ్ ప్రశ్న కూడా ఇదే!

దేశంలో తొలిసారిగా ఎన్నికల సంఘం గురించి సామాన్యులకు తెలిసింది – ఎన్నికల కమిషనర్‌గా శేషన్ సంస్కరణలు సాగించిన కాలంలోనే. ఇవాళ్టి ఓటర్ గుర్తింపుకార్డులు, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రవేశపెట్టిందీ ఆయనే. శేషన్ తర్వాత లింగ్డో లాంటి కొందరు నిర్భయంగా ఎన్నికల సంఘం అధికారాలను వినియోగించినా, గత దశాబ్దిన్నరలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఎక్కడా ఎన్నికల వ్యయంపై నియంత్రణ లేకుండా పోయింది. ఇటీవలి మునుగోడు ఉప ఎన్నిక సహా అనేకచోట్ల మద్యం ఏరులై పారుతూ, కోట్లకొద్దీ నోట్ల కట్టలు తెగుతూ, ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతున్నా, ఎన్నికల సంఘం చేష్టలుడిగి చూస్తోంది. శేషన్ నాటికీ, నేటికీ అధికారాల్లో మార్పు లేకపోయినా అంకితభావంలో మార్పు వచ్చింది. పదవీప్రసాద ప్రభుభక్తి పెరిగింది.

రాజ్యాంగంలోని 324వ అధికరణం ఈసీల నియామక ప్రక్రియను వివరించలేదు. దానిపై పార్లమెంట్ చట్టం చేస్తుందని భావించింది. ఇన్నేళ్ళుగా అది జరగలేదు. తాజా కేసులోనూ సర్కారు 1991 నాటి చట్టాన్నీ, అలాగే రాష్ట్రపతికి ప్రధాని సారథ్యంలోని మంత్రివర్గ సిఫార్సుల పైనే నియామకాలు జరుగుతున్న పూర్వోదాహరణల్నీ అడ్డుపెట్టుకుంటోంది. లా కమిషన్ సైతం కొలీజియమ్, లేదా ప్రధాని, ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తితో కూడిన సెలక్షన్ కమిటీయే ఈసీలందర్నీ నియమించాలని 2015 నివేదికలో పేర్కొంది. కొలీజియమా, కమిటీయా అన్నది పక్కన పెడితే ఈసీల నియామక ప్రక్రియలో తక్షణ సంస్కరణలు అవసరం. అయితే, దీనికి పార్లమెంట్ ఆమోదంతో రాజ్యాంగ సవరణ చేయాలి. అందుకు మన పాలకులెంత సిద్ధం ఉంటారో చెప్పలేం.

అసలైనా అధికారంలోని వారి అభీష్టమైన ఈసీల నియామకంపై జడ్జీలు జోక్యం చేసుకోవడమేమిటనేది ప్రభుత్వ అనుకూల వర్గాల వాదన. ధర్మాన్ని నిలబెట్టాల్సిన న్యాయవ్యవస్థ సైతం దృష్టి సారించరాదంటే తప్పొప్పులు దిద్దేదెవరు? రాష్ట్ర విభజన జరిగాక ఏపీకి తొలి ఈసీగా నియుక్తులైన నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ లాంటి వారు బాధ్యత మరిచి, పార్టీ కార్యకర్తల్లా వ్యవహరించడం తాజా ఉదాహరణే. ఇక, ఈసీల నియామకంపై వ్యాఖ్యానించిన సుప్రీమ్ తన సొంత జడ్జీల నియామక ప్రక్రియపై విమర్శలకు స్పందించదేమన్నది కొందరి విమర్శ. కొలీజియమ్ వ్యవస్థ ఆసరాగా ప్రధాన న్యాయమూర్తులు మెచ్చినవారినే జడ్జీలుగా నియమిస్తున్నారనీ, ఈ నియామకాల్లో పారదర్శకత లేదనీ ఆరోపణ. న్యాయశాఖ మంత్రీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నిజం చెప్పాలంటే, ఎన్నికల సంఘంలోనైనా, న్యాయవ్యవస్థలోనైనా నియామకాలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరపాలి. తటస్థ వ్యవస్థలుంటేనే విశ్వాసం బలపడుతుంది. ప్రజాస్వామ్య పరిపుష్టి సాధ్యమవుతుంది.

కార్యాచరణకు దిగాల్సిన సమయమిదే

విశ్లేషణ



భరత్ హెచ్. దేశాయి

ఈజిప్టులో జరిగిన 'కాప్ 27' సమావేశాలు వాడిగా వేడిగా జరిగాయి. అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలు రెండుగా విడిపోయాయి. 'పేమెంట్ ఓవర్‌డ్యూ' ఈసారి హాట్ టాపిక్! వాతావరణ కాలుష్యానికి కారణమైన ధనిక దేశాలు అందుకు తగ్గ పరిహారం చెల్లించడం ఇప్పటికే ఆలస్యమైందన్న భావన ఈ పేమెంట్ ఓవర్‌డ్యూ. అయితే ఈ దేశాలు తాము అంగీకరించిన విషయాల్లోనూ వెనకడుగు వేస్తుండటంతో వాతావరణ మార్పులపై జరుగుతున్న చర్చల్లో పురోగతి ఉండటం లేదు. అభివృద్ధి చెందిన దేశాలు తమ కాలుష్య తప్పిదాలకు బాధ్యత వహించి పరిష్కార మార్గాలకు నేతృత్వం వహించే విధానాలు రావాలి. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి స్పష్టం చేసినట్టు, కార్యాచరణకు దిగాల్సిన సమయమిదే!

ఈజిప్టులోని షర్మ్ అల్–షేఖ్‌లో నవంబరు ఆరున మొదలైన కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ (కాప్) 27వ సమావేశాలు ముగిశాయి. ఐక్యరాజ్య సమితి సంస్థ ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లైమేట్ ఛేంజెస్ (యూఎన్ఎఫ్‌సీసీసీ) ఆధ్వర్యంలో నడిచిన ఈ సమావేశాల్లో తీవ్ర చర్చోపచర్చలు, వాదోపవాదాలు జరిగి, ఒక్కరోజు పొడిగింపు తరువాత నవంబరు 20వ తేదీ తెల్లవారుజామున ముగిశాయి. వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కొనేదెలా అన్న అంశంపై ఏటా జరిగే 'కాప్' సమావేశాల్లో ఈసారి 'పేమెంట్ ఓవర్‌డ్యూ' అంశంపై తీవ్రస్థాయి ప్రతిష్టంభన ఏర్పడింది. వాతావరణ కాలుష్యానికి కారణమైన ధనిక దేశాలు అందుకు తగ్గ పరిహారం చెల్లించడం ఇప్పటికే ఆలస్యమైందన్న భావనను సంక్షిప్తంగా పేమెంట్ ఓవర్‌డ్యూ అని పిలుస్తున్నారు. ఈ అంశంపై అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలు రెండుగా విడిపోయాయి. నవంబరు 18నే ముగియాల్సిన చర్చలు ఇరు వర్గాల విమర్శలు, ప్రతి విమర్శలతో రోజంతా కొనసాగాయి. ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ కలుగచేసుకుని, కార్యాచరణకు దిగాల్సిన సమయమిదేనని స్పష్టం చేయాల్సి వచ్చింది. ''కాప్27 సమావేశాలు నవంబరు 18నే ముగియాల్సి ఉండింది. అయితే చర్చలు ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉందని ఒక రోజుపాటు పొడిగించారు'' అని భారత పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ తెలిపారు.



వాతావరణ మార్పులపై ఏళ్లుగా జరుగుతున్న చర్చలు తరచూ ఆయా దేశాలు, వర్గాల మధ్య కలహాలు, జగడాలతో అర్ధంతరంగా ముగుస్తున్నాయి. ఈ దేశాలు, వర్గాలు సంకుచితమైన భావాలతో... ఇతరులపై పైచేయి సాధించేందుకు ఈ సమావేశాలు వేదికలుగా మారిపోయాయి. ''వాతావరణంలోని గ్రీన్‌హౌస్ వాయువుల మోతాదు పెరిగిపోకుండా స్థిరీకరించాల్సి ఉంది'' అన్న యూఎన్ఎఫ్‌సీసీసీ ఆర్టికల్ 2 లక్ష్యాన్ని 30 ఏళ్లయినా అందుకోలేకపోవడం ఇందుకు ప్రత్యక్ష తార్కాణమని చెప్పాలి. ఈ ఏడాది జూన్ రెండున స్టాక్‌హోమ్+ 50 సమావేశాల్లోనూ ఐరాస ప్రధాన కార్యదర్శి ప్రపంచ వాతావరణ అత్యయిక పరిస్థితిపై మరోసారి హెచ్చరికలు జారీ చేశారు. ''ముప్పేట ముప్పు ఎదుర్కొంటూ ఉన్నాం. ఏటికేడాదీ ప్రజలను చంపేయడమే కాకుండా... నిరాశ్రయులను చేస్తున్న వాతావరణ అత్యవసర పరిస్థితి ఉంది. ఇప్పటికిప్పుడు మనం మన తీరుతెన్నులు మార్చుకోవాలి. ప్రకృతిపై చేస్తున్న మతిలేని ఆత్మహత్యా సదృశమైన పోరును ఆపాలి'' అని ఆంటోనియో గుటెరస్ విస్పష్టంగా పేర్కొన్నారు. ఈ హెచ్చరికలు 1992లో యూఎన్ఎఫ్‌సీసీసీ... రియో సదస్సులో ఆమోదించిన తీర్మానాన్ని ధ్రువీకరించాయని చెప్పాలి. ''ప్రపంచంలో ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధి... ఎక్కువ కాలం కొనసాగేది కాదు. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాల ద్వారా ప్రకృతిని జయించాలన్న మానవ కాంక్ష మన మనగడనే ప్రశ్నార్థకం చేసే స్థితికి తీసుకొచ్చింది'' అన్నది ఆ రియో సదస్సు తీర్మానం. 'ఎన్విజనింగ్ అవర్ ఎన్విరాన్‌మెంటల్ ఫ్యూచర్' పేరుతో 2002లో వెలువడ్డ ఓ పుస్తకంలోనూ ''పర్యావరణ విధ్వంసానికి సంబంధించిన హెచ్చరికలు వెలువడుతున్న ఈ తరుణంలో మన భవిష్యత్తును కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలకు తగినంత సమయం లేదన్నది గుర్తించాలి'' అని చెప్పడం ఇక్కడ ప్రస్తావనార్హం.

యూఎన్ఎఫ్‌సీసీసీలో దాదాపు 198 దేశాలు భాగస్వాములుగా ఉన్నాయి. వాతావరణ మార్పులన్నవి మానవాళికి అత్యంత ఆందోళనకారి అని అంగీకరిస్తూ అందరితోనూ తొలినాళ్లలోనే ఒక ఒప్పందం చేసింది ఈ సంస్థ. 1997 నాటి క్యోటో ప్రోటోకాల్, 2015 నాటి ప్యారిస్ ఒప్పందాల ద్వారా యూఎన్ఎఫ్‌సీసీసీ వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు మూడు చట్టపరమైన ఆయుధాలు కలిగి ఉంది. రియో సదస్సు జరిగి ముప్ఫై ఏళ్లయిన సందర్భం ఇది. 2050 నాటికి భూమి సగటు ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీ సెల్సియస్ కంటే ఎక్కువ పెరగకుండా చూసుకోవాలన్న శాస్త్రీయ లక్ష్యాన్ని సాధించేందుకు ఇదే అవకాశం. ఎందుకంటే... ఈ ఏడాది ఏప్రిల్‌లో 'ద ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ ఛేంజ్' విడుదల చేసిన ఆరవ అంచనా నివేదిక కూడా... గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు పెరిగిపోతున్నాయని హెచ్చరించింది. గత నెలలోనే యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంటల్ ప్రోగ్రామ్‌కు చెందిన ఎమిషన్ గ్యాప్ రిపోర్ట్ కూడా ప్యారిస్ ఒప్పందం అమలులో వెనుకబడుతున్నామనీ, లక్ష్యాన్ని అందుకు నేందుకు నమ్మదగ్గ మార్గమేదీ లేని నేపథ్యంలో వాతావరణ పెను విపత్తును నివారించేందుకు అత్యవసరంగా ఓ విస్తృతమైన మార్పు అనివార్యం అవుతుందనీ స్పష్టం చేసింది.

వాతావరణ మార్పుల సమస్య అనేది ఇప్పుడు కేవలం ఒక ఆందోళనకరమైన అంశం మాత్రం కాదు. ప్రపంచం మొత్తాన్ని పీడించగలదని అందరూ గుర్తించాలి. అయితే అభివృద్ధి చెందిన దేశాలు ఇప్పటివరకూ చేసిన కాలుష్య తప్పిదాలకు బాధ్యత వహించి పరిష్కార మార్గాలకు నేతృత్వం వహించేలా విధానాలు లేకుండా పోయాయి. భూమ్మీద అత్యధిక కర్బన ఉద్గారాలకు కారణమైన అమెరికా వాతావరణ మార్పులపై పోరు విషయంలో కప్పదాట్లు వేయడం, 2019లో ప్యారిస్ ఒప్పందం నుంచి వైదొలగడం, ఆ తరువాత 2021లో మళ్లీ చేరుతున్నట్లు ప్రకటించడం అభివృద్ధి చెందిన దేశాల తీరుకు తార్కాణంగా నిలుస్తోంది. అంతేకాకుండా... వాతావరణ మార్పులపై జరిగిన ఒప్పందాల్లోని డొల్లతనాన్ని ఎత్తి చూపుతుంది కూడా. అంతర్జాతీయ రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్ ఒడిదుడుకులకు గురయ్యేందుకు యూఎన్ఎఫ్‌సీసీసీ తన ప్రధాన సిద్ధాంతం నుంచి కొంత పక్కదారి పట్టడమే కారణమని అనిపిస్తుంది. వాతావరణ మార్పుల సమస్య అందరిదైనా... బాధ్యతలు ఒక్కొక్కరికి ఒక్కోలా ఉంటాయని చెప్పే సిద్ధాంతం మాత్రమే కాకుండా... క్యోటో ప్రోటోకాల్‌లోని కొన్ని కీలకాంశాల్లో సడలింపులు, ప్యారిస్ ఒప్పందంలోనూ బాధ్యతల విషయంలో ఆయా దేశాలు తమకు తగ్గ నిర్ణయం తీసుకుంటాయని చెప్పడం... వెరసి వాతావరణ మార్పులపై మనిషి పోరు నిర్వీర్యం అని చెప్పక తప్పదు. అభివృద్ధి చెందిన దేశాలు తాము అంగీకరించిన ప్రతి విషయంలోనూ వెనకడుగు వేయడం వాతావరణ మార్పులపై జరుగుతున్న చర్చల్లో పెద్దగా పురోగతి లేకపోయేందుకు కారణమని చెప్పాలి. అభివృద్ధి చెందిన దేశాలు తాము అంగీకరించిన అంశాల నుంచి వెనక్కు వెళ్లడం... వాతావరణ మార్పులు, దాని దుష్ప్రభావాలను ఎదుర్కొనే విషయంలో ధనిక దేశాలు నేతృత్వం వహించాలని యూఎన్ఎఫ్‌సీసీసీ చేసిన ప్రకటనను వెక్కిరించేదిగా ఉంది. అభివృద్ధి చెందిన దేశాల తీరు యూఎన్ఎఫ్‌సీసీసీ లక్ష్యాలకు పూర్తిగా భిన్నమన్నది ఇక్కడ మనం గుర్తుంచుకోవాలి.

యూఎన్ ఎఫ్‌సీసీసీ నిబంధనల ప్రకారం... అభివృద్ధి చెందిన దేశాలు నేతృత్వం వహించేందుకూ; అవసరమైన అంశాల్లో తామిచ్చిన హామీల అమలు జరుగుతున్నదా లేదా అన్నది సమీక్షించేందుకూ తగిన ఏర్పాట్లు చేయాలి. అయితే ఇవేవీ జరగడం లేదు. ఈజిప్టులో ఇటీవల ముగిసిన కాప్ 27 సమావేశాల సారాంశమూ ఇందుకు భిన్నంగా ఏమీ లేదని చెప్పాలి. అభివృద్ధి చెందిన దేశాలు తగిన చర్యలు తీసుకోకపోతే ప్యారిస్ ఒప్పందం ప్రకారం జాతీయంగా నిర్దేశించుకున్న కంట్రిబ్యూషన్స్ వల్ల తమకేమీ ప్రయోజనం ఉండబోదని అభివృద్ధి చెందుతున్న దేశాలూ త్వరలో గుర్తిస్తాయి. ఈ విషయాలన్నింటినీ ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ ఇప్పటికైనా గుర్తించాలి. ఇప్పటివరకూ వాతావరణ మార్పులపై చర్చలను నిర్వహించడానికి మాత్రమే పరిమితమైన జనరల్ అసెంబ్లీ సమస్య మరింత తీవ్రమైనది అన్న విషయాన్ని అర్థం చేసుకునేలా చేయాలి. యూన్ఎఫ్‌సీసీసీతో పాటు ప్యారిస్ ఒప్పందం అమలుకు, భవిష్యత్తు కార్యాచరణకు తగిన తీర్మానాలు చేయాలి.

వ్యాసకర్త ప్రొఫెసర్ ఆఫ్ ఇంటర్నేషనల్ లా, జేఎన్‌యూ
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

దేన్లో అద్భుతం?



'ఫిఫా' ప్రపంచ కప్ నేపథ్యంలో మధ్య ప్రాచ్యం గురించి అందరూ అబ్బుర పడుతున్నారు. మానవ హక్కుల ఉల్లంఘనలను మన్నించే ఏ సంస్కృతి లేదా మతమైనా గౌరవానికి అర్హమైనది కాదు. షరియా చట్టాలతో కూడిన సమాజాన్ని ఒక అద్భుతమైనదిగా చూస్తూ, 'దైవిక న్యాయం' కింద మానవ హక్కుల ఉల్లంఘనలను అటకెక్కించడం సిగ్గుపడాల్సిన విషయం.

– ఖదీజా ఖాన్, కామెంటేటర్

శభాష్ ఖతార్



దురదృష్టవశాత్తూ ఫిఫా ప్రపంచ కప్ ఆతిథ్య దేశంగా ఖతార్ వరుసగా దుష్ప్రచార దాడికి గురవుతోంది. నిజానికి ఇంత మెగా ఈవెంటు కోసం అద్భుతమైన ఏర్పాట్లు చేసినందుకూ, ప్రపంచ శాంతిని ఎత్తిపడుతున్నందుకూ ఖతార్‌ను ప్రశంసించాలి. 'హిజ్ హైనెస్' ఎమిర్, ఖతార్ ప్రజలకు పాకిస్తాన్ సంఘీభావం ప్రకటిస్తోంది.

– షెహబాజ్ షరీఫ్, పాకిస్తాన్ ప్రధానమంత్రి

ఎందుకు చంపుతున్నారు?



ఒక మాస్ షూటింగ్ విషాదం నుంచి కనీసం తేరుకునే సమయం లేకుండానే అమెరికా రాష్ట్రాల్లో మరొక విషాదం చోటు చేసుకుంటోంది. నాకు అవి ఎప్పుడు జరుగుతున్నాయో, ఎందుకు జరుగుతున్నాయో కూడా గుర్తుండటం లేదు. ఇది మహావిషాదం.

– షానన్ వాట్స్, అమెరికా రచయిత్రి

పరస్పర సహకారం



ఈ వారం గోవాలో: భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం 1) 'ఫౌదా' తీసిన ఇజ్రాయిల్ మాజీ తీవ్రవాద నిరోధక బలగాలకు ఆతిథ్యం ఇవ్వనుంది. 2) 'ఫౌదా' లేటెస్ట్ సీజన్‌ను ప్రదర్శిస్తుంది. 3) ద్వేషపూరిత 'కశ్మీర్ ఫైల్స్'ను ప్రధాన ఫీచర్ ఫిల్మ్ విభాగంలో ప్రదర్శిస్తుంది. ఇలా జియోనిజం(యూదు ఉద్యమం), హిందూత్వ సహకరించుకుంటాయి.

– ఆజాద్ ఎస్సా, జర్నలిస్ట్

ఇచ్చిన హామీలు నెరవేర్చారు!

'నేను విన్నాను – నేను ఉన్నాను' అంటూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో 3,648 కి.మీ. దూరం 'ప్రజా సంకల్ప యాత్ర' చేసి రికార్డ్ నెలకొలిపారు. ఆ పాదయాత్రలో ప్రజల హృదయాలలో స్థానం సంపాదించారు. యాత్ర ఇడుపుల పాయలో 2017 నవంబర్ 6న ప్రారంభించి 2019 జనవరి 9న శ్రీకాకుళం జిల్లాలో ముగించారు. 13 జిల్లాలోని 134 అసెంబ్లీ నియోజక వర్గాలు, 231 మండలాలు, మరో 2,516 గ్రామ పంచాయతీల ద్వారా సాగిన యాత్రలో లక్షలాది పేదలు, వృద్ధులు, కులాలకు, ప్రాంతా లకు అతీతంగా ప్రతి ఒక్కరినీ పలకరించి 'నేను విన్నాను – నేను ఉన్నాను' అని హామీ ఇచ్చారు. 341 రోజులపాటు తన యాత్ర సాగిస్తూ కుల, మత రహితంగా ప్రజల్లో తిరుగులేని ప్రజాదరణ సంపాదించారు.

ఫలితంగా 2019 లో జరిగిన ఎన్నికల్లో 151 శాసనసభ స్థానాలు సాధించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి ఒంటి చేత్తో తెచ్చారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల అమలులో కూడా వెనుకడుగు వేయని నేతగా ప్రజా హృదయాలను దోచుకున్నారు జగన్‌మోహన్ రెడ్డి.

వైసీపీ అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు అయిన సందర్భంగా విడుదల చేసిన ఒక పత్రంలో... మొత్తం 129 హామీలు ఆనాటి మేనిఫెస్టోలో ఇవ్వగా



మూడేళ్లలోనే 95 శాతం హామీలు అమలు చేశామని ప్రకటించారు. ఇటువంటి పాలకులు గతంలో ఎవరూ లేరనే చెప్పాలి.

ఈ 129 హామీల్లో 111 అమలు చెయ్యగా 12 హామీలకు అడుగులు పడ్డాయి. ఇంకా కేవలం 6 మాత్రమే అమలు కావాల్సి ఉన్నాయి. కాగా ఈ ఇచ్చిన హామీలకు అదనంగా మరో 45 పథకాలు అమలు చెయ్యటం ప్రజా సంక్షేమానికి ఆయన ఇచ్చిన బోనస్ అమలుకు అడుగులు పడ్డ వాటిల్లో ప్రధానంగా రాజధానిని ఫ్రీ జోన్‌గా (అందరికీ ఉద్యోగ అవకాశాలు ఉండేలా) గుర్తించడం, నిజమైన వికేంద్రీకరణ లక్ష్యంగా రాష్ట్రంలోని మూడు ప్రాంతాలనూ సమగ్రంగా అభివృద్ధి చెయ్యటం, అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులను వారి అర్హత, సర్వీస్‌లను పరిగణించి వీలైనంత ఎక్కువ మందిని రెగ్యులర్ ఉద్యోగులుగా చెయ్యటం (న్యాయ పరమైన చిక్కుల మూలంగా ఇప్పటికే వారికి టైం స్కేల్ అమలు అవుతోంది) ప్రభుత్వ ఉద్యోగులకు ఆయా ప్రాంతాల్లో ఇళ్ళ స్థలాలు లేని వారికి ఇళ్ళ స్థలాలు ఇవ్వటం.

కుల, మతతత్వాలు, వర్గాలు లేని సమసమాజ నిర్మాణానికి కావలసిన పాలన అందిస్తామని తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొని... మడమ తిప్పకుండా అన్ని హామీలను నెరవేర్చుతున్న యువనేత జగన్‌మోహన్ రెడ్డి ఆదర్శపాలకుడు. ఆయన ప్రజలకు చేస్తున్న సేవను, సాధించిన విజయాలను గడప గడపకు తీసుకెళ్లే కార్యక్రమం ప్రస్తుతం ముమ్మరంగా జరుగుతోంది.

– చలాది పూర్ణచంద్ర రావు । 94915 45699

రా.రా. ఓ నఖిరేఖా చిత్రం!

సందర్భం



మండలపర్తి కిశోర్

విమర్శకుడిగా, కథకుడిగా, సమీక్షకుడిగా, సంపాదకుడిగా, అనువాదకుడిగా రాచమల్లు రామచంద్రారెడ్డి (రా.రా.) తెలుగు మేధావుల ప్రశంసలకు పాత్రమయ్యారు. తాను స్వయంగా చక్కని కథానికలు రాయడమే కాదు ఒక తరం కథకులను తర్ఫీదు చేశారు. మంచి విమర్శకుడిగా తాను రాణించడమే కాదు ఎందరో విమర్శకులకు పదును పెట్టారాయన. ప్రత్యేకించి విమర్శ ఎంత సృజనాత్మకంగా వుండగలదో చేసి, చూపించారు. ప్రాక్పశ్చిమ దేశాల సాహిత్యాన్ని క్షుణ్ణంగా చదివిన కొద్దిమంది విమర్శకుల్లో రా.రా. ఒకరు. మార్క్స్, ఎంగెల్స్, గ్రామ్సీ, గియోర్గీ లూకాస్ లాంటి సిద్ధాంతవేత్తల రచనలు చదివిన రచయితలు చాలా తక్కువ. రా.రా. వారిలో ఒకరు!

తెలుగు సాహితి నిస్తబ్ధంగా పడివుండిన దశలో 1968లో 'సంవేదన' పత్రిక మొదలుపెట్టి చైతన్యం తీసుకొచ్చిన వాడు రా.రా. ఆయన కథా సంపుటి 'అలసిన గుండెలు' కొడవటిగంటి కుటుంబరావుకు బాగా నచ్చింది. రా.రా.ను విమర్శకుడిగానే కాక, కథక శిల్పిగా కూడా... కథాశిల్పం గురించి లోతుగా అధ్యయనం చేసి, పుస్తకం రాసిన వల్లంపాటి గౌరవించేవారు. ఇక, సొదుం జయరాం, కేతు విశ్వనాథరెడ్డి తదితరుల మాట చెప్పనక్కర్లేదు. వాళ్లను రా.రా. అంతేవాసులనవచ్చు. 'అనువాదకుడిగానూ, అనువాద ప్రక్రియ అధ్యయనశీలిగానూ' ఒక్కమాటలో చెప్తే రా.రా. కృషి అనన్యసాధ్యం!

విమర్శకుల్లో రా.రా. మెథడాలజీని, మెథడ్‌ను రెండింటినీ ఒకమేరకు ఒంటపట్టించుకున్నవారు ఆర్వీయార్. 'సంవేదన' సంపాదకుడిగా రా.రా. ఆ పత్రికలో సుదీర్ఘ సమీక్షలు చేసేవారు; చేయించేవారు కూడా! అయితే, రా.రా. విమర్శచేసే తీరుతెన్నులపై పూలే కాదు రాళ్లు కురిపించినవాళ్ళూ కొందరున్నారు! ఆయన విమర్శను కొందరు 'వ్యక్తిగత' విమర్శగా పరిగణించారు! అందులో వ్యక్తమయ్యే ధర్మాగ్రహమే అందుకు కారణం. రా.రా. అభిమాన కవి శ్రీశ్రీయే ఆయన్ను 'క్రూరమయిన విమర్శకుడ'ని అన్న సంగతి మనకందరికీ తెలుసు. ఇలాంటిది ప్రతి రచయిత విషయంలోనూ జరగదు. కాన్సిక్వెన్సియల్ రచయితల విషయంలోనే అలా జరుగుతుంది!

ఈ సందర్భంగా ఒక్క మాట చెప్పవలసివుంది. రా.రా. ఏ రంగంలో కృషి చేసినా దానిపై తన ముద్ర బలంగా వేసిన వారు. వాటిల్లో అనువాదం కూడా ఒకటి! 'అనువాదం అంటే ఏమిటి?' అనే ప్రశ్న ఎంత సరళమైందో దానికి వచ్చిన సమాధానాలు అంతే జటిలంగా ఉన్నాయి! 'మూలభాషలోని పాఠాన్ని, లక్ష్యభాషలోకి మార్చడమే అనువాదం' అనేది అతి సరళమైన నిర్వచనం అనిపించు కుంటుందేమో! అయితే, రాబర్ట్ ఫ్రాస్ట్ అనే ప్రపంచ ప్రసిద్ధ అమెరికన్ కవి అనువాదం విషయంలో అంత 'సరళంగా' ఆలోచించినట్లు కనబడదు. కవిత్వానికి ఓ నిర్వచనం చెప్పవయ్యా మహానుభావా అంటే 'అనువాదంలో లుప్తమైపోయేదే కవిత్వం' అన్నాడు ఫ్రాస్ట్! ఈ విషయంలో ఫ్రాస్ట్‌కు మరెందరో మద్దతుదారులు కూడా వున్నారు; అసలు అనువాదాల 'శీలాన్నే' శంకించారు కొందరు. అలాంటి ఫ్రెంచ్ సామెత ఒకదాన్ని రా.రా. తన పుస్తకం 'అనువాద సమస్యలు' మొదట్లోనే పేర్కొన్నారు. ఆ పాటి హాస్య ప్రియత్వం లేకుండానే ఆయన అన్నేళ్ళు అనువాద రంగంలో గడపగలిగారంటారా?

రా.రా. పెద్దగా మెచ్చని ఓ మాటతోనే ఆయన్ని అభివర్ణించగలం. అది (బాగా అరిగిపోయిన మాటే అనుకోండి) బహుముఖ ప్రజ్ఞావంతుడు! 'సారస్వత వివేచన' అనే విమర్శ వ్యాసాల సంకలనం వెలువరించిన గొప్ప విమర్శకుడు రా.రా. నన్నయ, తిక్కన, పోతన, పెద్దన, ఏనుగు లక్ష్మణకవి, గురజాడ, దువ్వూరి రామిరెడ్డి, చలం, విశ్వనాథ, శ్రీశ్రీ, మహీధర, కాళోజీ, ఆర్.ఎస్. సుదర్శనం, బంగోరె, కేవీఆర్, అద్దేపల్లి రామమోహనరావు లాంటి తెలుగు వాళ్ళ కృషితో పాటు ఉమర్ ఖయామ్, రబీంద్రనాథ్ టాగోర్ తదితరుల రచనలను కూడా విమర్శనాత్మకంగా విశ్లేషించి నిష్కర్ష చేసిన వాడు రా.రా. ఆయన వ్యాసాలన్నింట్లో ముఖ్యంగా 'అనువాద సమస్యలు'లో మెటా ఫర్‌ను (ఆలంకారిక అభివ్యక్తిని) విస్తృతంగా వాడడం కనిపిస్తుంది. ఇది, మనకో మాట చెప్తుంది. 'హృదయవాది' రా.రా. 'మనసులో కవి' (ఎ పొయెట్ ఎట్ హార్ట్) అయివుండాలి!!



రాచమల్లు రామచంద్రారెడ్డి (రా.రా.)

దేవరకొండ బాలగంగాధర తిలక్ గురించి చెప్తూ ''తిలక్‌లోని ప్రముఖమైన గుణం భావు కత్వం. కించిత్ ప్రేరణకు కూడా చలించిపోగల సుకుమార హృదయ స్పందన శక్తి. శ్రీశ్రీ తర్వాత ఇంత భావుకత్వంగల కవి మనకు లేడేమో!' అన్నారు రా.రా. 'అలౌకిక సౌందర్య శోభితమయిన ఐంద్రజాలికుని అంతఃపురం లాగుంది అతని కవితా చందన శాల' అని కూడా అన్నారాయన. ఆ వ్యాసం తిలక్ 'వస్తుతః భావకవి' అని సాదరంగా స్థాపించిందని గుర్తుంచుకోవాలి! అలాంటి వ్యాసానికి అలాంటి భాష ఉపయోగించడానికి అంతో ఇంతో కవి అయివుండాలి! 'మల్లారెడ్డి గేయాలు' పరిచయ వాక్యాల్లో వ్యక్తమయిన 'అనన్యత లాంటి అన్యోన్యత' లాంటి అలంకారాలూ ఆ విషయాన్నే పట్టిస్తాయి. 'రేపటికోసం' సంకలనంలో, బెర్టోల్ట్ బ్రెష్ట్ రాసిన 'మృత సైనికోపాఖ్యానం' అనే పాటకి రా.రా. చేసిన అనువాదం చూస్తే, గేయ రచనలోనూ ఆయన సిద్ధహస్తుడని రుజువవుతుంది. అదృష్టదీపక్ కవితా సంపుటి 'ప్రాణం' పుస్తకానికి రా.రా. ముందుమాట కూడా కవిత్వం పట్ల ఆయన అభిమానానికి నిదర్శనంగా నిలుస్తుంది. ఒక్కమాటలో చెప్తే, విమర్శ ఎంత సృజనాత్మకంగా వుండగలదో చూపించాడాయన. మరీ ముఖ్యంగా ఆయన రాసిన సమీక్ష వ్యాసాలు విమర్శ రంగాన్ని కొత్త మలుపు తిప్పాయి.

'చుక్కలు చీకటి', 'నీతి గానుగ' లాంటి గొప్ప కథలు రాసిన రా.రా., సొదుం జయరాం (వాడిన మల్లెలు), కేతు విశ్వనాథరెడ్డి (జప్తు), కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి (కుట్ర) లాంటి కథకులనూ పదునుపెట్టి, తెలుగు సాహితికి పరిచయం చేశారు. 'సంవేదన' పత్రికలో జయరాం కథానిక 'వాడిన మల్లెలు' పై చేసిన ప్రయోగం, దాన్ని సవిమర్శకంగా విశ్లేషిస్తూ కొడవటిగంటి కుటుంబరావు రాసిన వ్యాసమూ కథానిక రచయితల పాలిట పెద్దబాలశిక్ష లాంటివి! పిల్లల కోసం 'చంద్ర మండలం శశిరేఖ', 'విక్రమార్కుని విడ్డూరం', 'అన్నంపెట్టని చదువు' లాంటి విలువైన ఆసక్తికరమైన రచనలు చేసినవారు రా.రా.

రాచమల్లు రామచంద్రారెడ్డి సాహిత్య జీవితంలో పత్రికలదీ పెద్దపాత్రే! 'సవ్యసాచి', 'సంవేదన' లాంటి పత్రికలకు 'సంపాదకుడిగా' ఉండిన ప్రతిభావంతుడాయన. 'వ్యక్తి స్వాతంత్ర్యం సమాజ శ్రేయస్సు' లాంటి సైద్ధాంతిక విషయాలను ఏనాడో చర్చించిన మేధావి రా.రా. తర్వాతి రోజుల్లో పుస్తక రూపంలో వచ్చిన ఈ దీర్ఘ వ్యాసం 'సందేశం' పత్రికలో మొదటిసారి అచ్చయినట్టుంది. దినపత్రికల్లో స్పష్టంగానూ, స్ఫుటంగానూ, నిర్దుష్టంగానూ ఉండే అనువాదాలు చేసేలా విద్యార్థులకు ఒరవడినిచ్చిన శిక్షకులు రా.రా.

ఇక, రాచమల్లు రామచంద్రారెడ్డి రెండున్నర దశాబ్దాల కాలం కేంద్రీకరించి పనిచేసిన రంగం అనువాదం! అంతేకాదు రచనా ప్రక్రియ గానూ, శాస్త్రంగానూ అనువాదాన్ని సాధన చేశారాయన. పరిశోధకుల పరిభాషలో వాటిని మెథడ్‌గానూ, మెథడాలజీగానూ ఆయన సాధన చేశారని చెప్పొచ్చు! రా.రా. 'అనువాద సమస్యలు' పుస్తకానికి 1988లో కేంద్ర సాహిత్య ఎకాడెమీ పురస్కారం ప్రకటించిన సంగతి తెలిసిందే! భారతీయ భాషల్లో అలాంటి పుస్తకం అంతవరకూ రాలేదని అప్పట్లో ఓ సమీక్షకుడు పేర్కొన్నారు!

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయుడు । 81796 91822
(నేడు కేంద్ర సాహిత్య అకాడమీ, యోగి వేమన విశ్వవిద్యాలయం, బ్రౌన్ గ్రంథాలయం రా.రా. శతజయంతి సదస్సు నిర్వహిస్తున్నాయి)

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి: శు.పాడ్యమి రా.2.57 వరకు, తదుపరి విదియ, నక్షత్రం: అనూరాధ రా.9.18 వరకు, తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం: రా.2.36 నుండి 4.06 వరకు, దుర్ముహూర్తం: ఉ.9.54 నుండి 10.38 వరకు, తదుపరి ప.2.23 నుండి 3.06 వరకు, అమృతఘడియలు: ఉ.11.17 నుండి 12.50 వరకు: రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు, యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు: సూర్యోదయం 6.13 : సూర్యాస్తమయం 5.20.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయం, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

రఫ్. నెం. బి1/314/2022 — ఫారమ్ నెం. VI (ఎ) — తేది : 15-11-2022

(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ (19) సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూల్‌లో చూపబడిన అల్లూరి సీతారామరాజు జిల్లా, దేవీపట్నం మండలం, తొయ్యేరు గ్రామం సంబంధి అసైన్డ్ / జిరాయితీ భూమి ప్రజాహిత కార్యాలకు అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్మాణములో ముంపునకు గురియగు నిమిత్తము భూమి అవసరమైనట్లు ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు భావించినందున భూసేకరణ, నష్టపరిహారం, పునరావాస, పునరపాధి కల్పన చట్టం-2013 నందలి 11వ విభాగపు 1వ ఉప విభాగములోని నిబంధనలననుసరించి ఈ విషయము గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికి తెలియజేయడం కొరకు ఇందుమూలముగా నోటీసు జారీ చేయబడినది.

పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ ప్రభావము మదింపు (ఇఐఎ) క్లియరెన్స్ భారత ప్రభుత్వం వారి అటవీ మరియు పర్యావరణ మంత్రిత్వ శాఖ వారి లేఖ నెం.జె-12011/74/2005-1ఎ1, తేది : 25-10-2005 ప్రకారం జారీ చేయబడినది.

చట్టంలోని విభాగం 43(1) క్రింద ప్రభావిత కుటుంబాలకు పునరావాసం మరియు పునస్థాపన కొరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ ది. 10-06-2020వ తేదీన జారీ చేసిన జి.ఓ.యం.యస్. నెం.42 ప్రకారం ప్రాజెక్టు నిర్వాహకులు నియమించబడినారు.

ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఎడమ ప్రధాన కాలువ యూనిట్-1, రాజమహేంద్రవరం వారికి, వారి సిబ్బందికి ఇందుమూలముగా అధికారము ఇచ్చియున్నారు.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేదీ నుండి ప్రత్యేక కలెక్టర్, (భూసేకరణ) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం / స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఎడమ ప్రధాన కాలువ, యూనిట్-1, రాజమహేంద్రవరం వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ఈ ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం/కొనుగోలు (క్రయ, విక్రయాలు) లేదా ఏ విధమైన లావాదేవీలు జరపరాదని తెలియచేయడమైనది.

పై చట్టంలోని సెక్షన్-15 ననుసరించి భూసేకరణ పై ఏమైనా అభ్యంతరములు/ఆక్షేపణలు ఉన్న యెడల సంబంధించిన వ్యక్తి / వ్యక్తులు ఈ ప్రకటనను ప్రచురించబడిన తేదీ నుండి 60 (అరువది) దినములలోగా కలెక్టర్ / ప్రత్యేక కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి ఎదుట అభ్యర్ధనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూల్

జిల్లా : అల్లూరి సీతారామరాజు — మండలం : దేవీపట్నం — గ్రామం : తొయ్యేరు

క్రమ సంఖ్య	సర్వే నెం. సబ్ డి.నెం.	వర్గీకరణ	మొత్తం విస్తీర్ణం య.సెంట్లు	భూసేకరణ క్రింద విస్తీర్ణం య.సెంట్లు	సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు/ కట్టడములు వగైరా వివరాలు
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)
1	1/1ఎ	అ.పుంజ	1.31	1.31	మడకం బాపన్నదొర	లంక	1/2	1/1బి	నది	
2	1/1బి	అ.పుంజ	1.38	1.38	మడకం వెంకన్నదొర	లంక	1/2	2	1/2	
3	1/2ఎ	అ.పుంజ	1.76	1.76	కొవ్వాసి మల్లుదొర	1/1	2	2/2బి	1/2	
4	1/2బి	అ.పుంజ	1.82	1.82	కొవ్వాసి చెల్లన్న దొర	కొండ	2	కొండ	1/2	
5	1/2సి	అ.పుంజ	0.45	0.45	కొవ్వాసి బొజ్జి దొర	1/1	2	1/3	నది	
6	2/1	అ.పుంజ	1.58	1.58	దారప్ప పాపారావు	1	2/2	2/3	నది	
7	2/2	అ.పుంజ	1.19	1.19	దారప్ప సుబ్బారావు	1	2/4	2/3	2/1	
8	3/1	అ.పుంజ	4.01	4.01	దారప్ప బాలరాజు	2	4	కొండ	నది	
9	3/2	అ.పుంజ	0.30	0.30	తురస రాంబాబు దొర	3/3	3/4	3/3	3/1	
10	3/2ఎ	అ.పుంజ	0.39	0.39	తురస రామయ్యమ్మ	కొండ	3/3	11	3/1	
11	3/2బి	అ.పుంజ	0.96	0.96	తురస రామయ్యమ్మ	కొండ	3/3	11	3/1	
12	3/3	అ.పుంజ	0.82	0.82	తురస చెంచన్న దొర	3/2	3/4	11	3/1	
13	3/4	అ.పుంజ	0.64	0.64	తురస రామయ్యమ్మ	3/3	3/5	5	3/1	
14	3/5	అ.పుంజ	0.64	0.64	తురస రాంబాబు	3/4	4, 5	5	3/1	
15	4/1ఎ	అ.పుంజ	1.05	1.05	దారప్ప వెంకటేశ్వరరావుదొర	5	4/1బి	5	3	
16	4/2ఎ	అ.పుంజ	0.04	0.04	దారప్ప సుబ్బారావు	4/1ఎ	4/2బి	4/3	4/1ఎ	
17	4/3	అ.పుంజ	0.71	0.71	తురస చెంచన్నదొర	5	నది	4/4	4/2ఎ, 2బి	
18	4/4	అ.పుంజ	0.72	0.72	కొవ్వాసి పోతురాజు	5	నది	5	4/3	
19	6/1	అ.పుంజ	1.31	1.31	దారప్ప వెంకటేశ్వరరావుదొర	10	నది	6/2	5	
20	6/2	అ.పుంజ	1.33	1.33	దారప్ప సుబ్బారావు	10	నది	3	6/1	
21	6/3	అ.పుంజ	0.89	0.89	మడి పాపయ్య దొర	10	నది, 7	7	6/2	
22	7/2	అ.పుంజ	3.86	3.86	దారప్ప బాలరాజు	9	నది	8	6	
23	8/1	అ.పుంజ	3.41	3.41	దారప్ప లచ్చన్న దొర	9	8/3	8/2	7	
24	9/3	అ.పుంజ	1.83	1.83	తురస గంగా భవాని	15, 16	7,8	9/4	9/2	
25	9/4	రైతుపుంజ	2.25	2.25	మడి పాపయ్య దొర	16, 18	8	18	9/3	
26	10/2	రైతుపుంజ	0.35	0.35	మడి పాపయ్య దొర	13	10/5	10/3	11	
27	10/3	రైతుపుంజ	0.22	0.22	మడి అబ్బాయి దొర	13	10/5	10/4	10/2	
28	10/4	రైతుపుంజ	0.07	0.07	మడకం రామయ్యమ్మ	13	10/5	10/5	10/3	
29	10/7	రైతుపుంజ	2.17	2.17	కొవ్వాసి మల్లు దొర	10/6	10/9	10/8	10/1	
30	10/8	రైతుపుంజ	1.43	1.43	కొవ్వాసి చెల్లన్న దొర	10/7	10/9,10	15	10/7	
31	11/3	అ.పుంజ	0.44	0.44	మడి అబ్బాయి దొర	11/2	5	18	5	
32	11/4	అ.పుంజ	0.47	0.47	మడి పాపయ్య దొర	12	11/5	11/6	11/2	
33	11/5	అ.పుంజ	0.44	0.44	కొమరం సుబ్బారావు	11/4	18	11/7	11/2,3	
34	11/5ఎ	అ.పుంజ	0.44	0.44	కొమరం లచ్చన్న దొర	11/4	18	11/7	11/4	
35	11/5బి	అ.పుంజ	0.59	0.59	తుర్రం చెల్లన్న దొర	11/4	18	11/7	11/4	
36	11/6	అ.పుంజ	0.81	0.81	కొమరం లచ్చన్న దొర	13	11/7	13	11/4	
37			0.30	0.30	కొమరం సుబ్బారావు	13	11/7	13	11/4	
38	11/7	అ.పుంజ	0.79	0.79	మడకం లచ్చన్న దొర	11/6	18	13	11/5	
39	12/1	అ.పుంజ	2.57	2.57	మడకం బాపన్న దొర	కొండ	3	12/2	కొండ	
40	12/3ఎ	అ.పుంజ	1.28	1.28	మాడకం లచ్చన్న దొర	కొండ	11	13	12/2	
41	12/3బి	అ.పుంజ	0.40	0.40	మడి అబ్బాయి దొర	కొండ	11	13	12/2	
42	12/3సి	అ.పుంజ	1.11	1.11	మాడకం లచ్చన్న దొర	కొండ	11	13	12/2	
43	13/2	రైతుపుంజ	0.28	0.28	తురస లచ్చన్న దొర	కొండ	13/3	13/15	13/1	
44	13/3	రైతుపుంజ	0.12	0.12	తురస బాబూరావు దొర	13/2	13/4	13/15	13/1,5	
45	13/4	రైతుపుంజ	0.25	0.25	తురస రామయ్యమ్మ	13/3	13/6	13/14,15	13/5	
46	13/5	రైతుపుంజ	0.89	0.89	కొవ్వాసి లక్ష్మమ్మ	13/1	11,13	13/3,4	12	
47	13/6	రైతుపుంజ	0.35	0.35	మడకం బాపన్న దొర	13/4,5	13/7	13/14	11	
48	13/7	రైతుపుంజ	0.33	0.33	మడకం వెంకన్న దొర	13/6	13/8,9	13/14	11	
49	13/8	రైతుపుంజ	0.15	0.15	మడి పాపయ్య దొర	13/7	13/13	13/14	13/9	
50	13/9	రైతుపుంజ	0.15	0.15	మడి అబ్బాయి దొర	13/7	13/12	13/8	13/10	
51	13/10	రైతుపుంజ	0.27	0.27	మడకం లచ్చన్న దొర	13/7	13/11	13/9	11	
52	13/11	రైతుపుంజ	0.70	0.70	మడకం జయన్న దొర	13/10	10	13/12	11	
53	13/12	రైతుపుంజ	0.16	0.16	మడి బుచ్చన్న దొర	13/9	10	13/13	13/11	
54	13/13	రైతుపుంజ	0.12	0.12	మడి అబ్బాయి దొర	13/8	10	13/14	13/12	
55	13/14	రైతుపుంజ	0.99	0.99	మూలం గాదెమ్మ	13/15,16	10	13/22,23	13/6,7,8	
56	13/15	రైతుపుంజ	0.52	0.52	దారప్ప వెంకటేశ్వరరావుదొర	కొండ	13/14	13/16	13/2, 3, 4	
57	13/16	రైతుపుంజ	0.73	0.73	దారప్ప సుబ్బారావుదొర	కొండ	13/14	13/17,21	13/15	
58	13/17	రైతుపుంజ	0.67	0.67	కొవ్వాసి మల్లు దొర	కొండ 13/15	13/20,21	13/19	13/16	
59	13/18	రైతుపుంజ	0.32	0.32	దారప్ప వెంకటేశులుదొర	కొండ	13/17,19	కొండ	కొండ	
60	13/19	రైతుపుంజ	0.44	0.44	కొవ్వాసి చెల్లన్న దొర	13/18	13/20	కొండ	13/17	
61	13/21	రైతుపుంజ	0.39	0.39	కొవ్వాసి పోతురాజు	13/17	13/22	13/20	13/16	
62	13/22	రైతుపుంజ	0.63	0.63	దారప్ప బాలరాజు	13/21	13/23	1	13/14	
63	13/23	రైతుపుంజ	0.63	0.63	కొమరం లచ్చన్న దొర	13/22	10	1	13/14	
64			0.63	0.63	కొమరం సుబ్బారావు	13/22	10	1	13/14	
65	14/1ఎ	రైతుపుంజ	0.27	0.27	దారప్ప గంగన్న దొర	కొండ	14/2ఎ	14/1బి	13	
66	14/1బి	రైతుపుంజ	0.20	0.20	దారప్ప పాపారావు	కొండ	14/2బి,2సి	14/3,4	14/1ఎ	
67	14/2ఎ	రైతుపుంజ	0.20	0.20	కొమరం లచ్చన్న దొర	14/1ఎ	10	14/2బి	13	
68	14/2బి	రైతుపుంజ	0.19	0.19	కొమరం జగ్గన్న దొర	14/1ఎ,1బి	10	14/2సి	14/2ఎ	
69	14/2సి	రైతుపుంజ	0.35	0.35	కొమరం బుచ్చన్న దొర	14/1బి,3	14/7ఎ	14/3	14/2బి	
70	14/3	రైతుపుంజ	1.09	1.09	దారప్ప సుబ్బారావు	14/4	14/7బి	14/6	14/2సి	
71	14/4	రైతుపుంజ	0.28	0.28	దారప్ప వెంకటేశు దొర	కొండ	14/3	14/5ఎ	14/1బి	
72	14/5ఎ	రైతుపుంజ	0.22	0.22	దారప్ప గంగన్న దొర	కొండ	14/6	14/5బి	14/3,4	
73	14/5బి	రైతుపుంజ	0.32	0.32	దారప్ప పాపారావు	కొండ	14/6	14/5సి	14/5ఎ	
74	14/5సి	రైతుపుంజ	0.36	0.36	దారప్ప గంగన్న దొర	కొండ	14/7బి	14/6డి,6ఇ	14/6డి,6	
75	14/5డి	రైతుపుంజ	0.80	0.80	దారప్ప పాపారావు	కొండ	14/5సి	17	14/5సి	
76	14/5ఇ	రైతుపుంజ	0.80	0.80	దారప్ప పాపారావు	17	14/7బి	16,17	14/5సి	
77	14/6	రైతుపుంజ	0.84	0.84	దారప్ప వెంకటేశు దొర	14/5ఎ	14/7సి	14/5సి	14/3	
78	14/7ఎ	రైతుపుంజ	0.05	0.05	కొమరం జగ్గన్న దొర	14/2సి	14/7బి	14/3	10	
79	14/7బి	త.క.గ	0.37	0.37	కొమరం జగ్గన్న దొర	14/7ఎ,3	14/7సి	14/6	10	
80	14/7సి	రైతుపుంజ	1.11	1.11	మడకం రామయ్యమ్మ	14/7బి	15	15	10	
81	15/1	రైతుపుంజ	1.01	1.01	కొవ్వాసి పోతురాజు	14	10,15/3	15/2సి	10	
82	15/2బి	రైతుపుంజ	1.01	1.01	కొమరం జగ్గన్న దొర	14	15/2సి	16	14	
83	15/2సి	రైతుపుంజ	0.74	0.74	కొమరం లచ్చన్న దొర	15/2బి	15/3	16	15/1,14	
84			0.74	0.74	కొమరం సుబ్బారావు	15/2బి	15/3	16	15/1,14	
85	15/3	రైతుపుంజ	3.68	3.68	దారప్ప సుబ్బారావు	15/1, 2సి,16	9 10	16	9 10	
86	16/2బి	రైతుపుంజ	0.83	0.83	మడకం రామయ్యమ్మ	16/2ఎ	16/6	16/3బి	15	
87	16/3బి	రైతుపుంజ	0.75	0.75	కొవ్వాసి పోతురాజు	16/3ఎ	16/6	16/5ఎ	16/2సి	
88	16/4బి	రైతుపుంజ	0.75	0.75	దారప్ప బాలరాజు	16/4ఎ	16/5ఎ,5బి	18	16/4ఎ	
89	16/5ఎ	రైతుపుంజ	0.42	0.42	కొమరం బుచ్చన్న దొర	16/4బి	16/6,7	16/5బి	16/3	
90	16/5బి	రైతుపుంజ	0.135	0.135	కొమరం లచ్చన్నదొర	16/4బి	16/7	18	16/5ఎ	
91			0.135	0.135	కొమరం సుబ్బారావు	16/4బి	16/7	18	16/5ఎ	
92	16/6	రైతుపుంజ	2.84	2.84	మడి పెంటయ్యదొర	16/2బి, 3బి,5ఎ	9,15	16/7	15	
93	16/7	రైతుపుంజ	1.655	1.655	మడి పెంటయ్యదొర	16/5ఎ,5బి	9	18	16/6	
94	18/1ఎ	రైతుపుంజ	0.57	0.57	కొమరం సీతాయమ్మ	మంటూరు	18/1బి	18/1డి	17	
95	18/1బి	రైతుపుంజ	0.52	0.52	కొమరం బుచ్చన్నదొర	18/1ఎ	18/1సి	18/1డి	17	
96	18/1సి	రైతుపుంజ	0.52	0.52	కొమరం జగ్గన్నదొర	18/1బి	18/2	18/1డి	16	
97	18/1డి	రైతుపుంజ	0.735	0.735	కొమరం లచ్చన్నదొర	మంటూరు	18/2,3	18/1ఇ	18/1ఎ,1బి,1సి	
98			0.735	0.735	కొమరం సుబ్బారావు	మంటూరు	18/2,3	18/1ఇ	18/1ఎ,1బి,1సి	
99	18/2	రైతుపుంజ	0.52	0.52	దారప్ప వెంకటేశ్వరదొర	18/1సి	18/4బి	18/3	16	
100	18/3	రైతుపుంజ	0.49	0.49	దారప్ప సుబ్బారావు	18/1డి	18/4బి	18/4ఎ	18/2	
101	18/4ఎ	రైతుపుంజ	0.49	0.49	మడకం లచ్చన్నదొర	19	18/4బి	21	18/3	
102	18/4బి	రైతుపుంజ	1.11	1.11	మడకం బాపన్నదొర	18/2,3, 4ఎ	18/4సి	21	16	
103	18/4సి	రైతుపుంజ	0.99	0.99	మడకం వెంకన్నదొర	18/4బి	18/4డి	21	16	
104	18/4డి	రైతుపుంజ	0.79	0.79	మడి అబ్బాయిదొర	18/4సి	18/4ఇ	21	16	
105	18/4ఇ	రైతుపుంజ	0.94	0.94	మడి బుచ్చన్నదొర	18/4డి	18/4ఎఫ్	21	16	
106	18/4ఎఫ్	రైతుపుంజ	0.57	0.57	దారప్ప గంగన్నదొర	18/4ఇ	18/4జి-హెచ్	21	18/41	
107	18/4జి-హెచ్	రైతుపుంజ	0.49	0.49	మడకం లచ్చన్నదొర	18/4ఎఫ్	18/4ఐ	21	18/41	
108	18/4ఐ	రైతుపుంజ	0.35	0.35	మడి బుచ్చన్న దొర	18/4జి	18/4జె	18/4ఐ, 4జె	9	
109	18/4జె	రైతుపుంజ	0.89	0.89	మూలం గాదెమ్మ	18/4 హెచ్	18/4కె	21	18/41	
110	20/1	అ.పుంజ	1.98	1.98	సుంకర రాంబాబు	మంటూరు	21	20/2,6	19	
111	20/3	అ.పుంజ	0.44	0.44	సుంకర వెంకటాద్రి	మంటూరు	20/4	34	20/2	
112	20/4	అ.పుంజ	0.32	0.32	సుంకర సూర్యాకాంతం	20/3	20/5	34	20/2	
113	20/5	అ.పుంజ	0.35	0.35	సుంకర అప్పారావు	20/4	20/6	34	20/2	
114	20/6	అ.పుంజ	2.13	2.13	సుంకర అప్పారావు	20/5	21,33	34	20/1,2	
115	21/2	రైతుపుంజ	1.14	1.14	తురస చెంచన్నదొర	21/1	21/6	21/3	18	
116	21/3	రైతుపుంజ	0.63	0.63	తురసం బాబూరావుదొర	21/1	21/6	21/4	21/2	
117	21/3ఎ	రైతుపుంజ	0.53	0.53	మడి పాపయ్య దొర	21/1	21/6	21/4	21/2	
118	21/4	రైతుపుంజ	1.11	1.11	దారప్ప వెంకటేశ్వరరావుదొర	21/1	21/6	21/5	21/3	
119	21/5	రైతుపుంజ	1.01	1.01	దారప్ప బాలరాజు	21/1	21/6	33	21/4	
120	21/6	రైతుపుంజ	0.94	0.94	కొవ్వాసి మల్లు దొర	21/2,3,4,5	21/7	33	18	
121	34/5	రైతుపుంజ	2.00	2.00	తుమ్మల సత్యవతి	మంటూరు	33	34/2	20	
122	38/4	త.క.గ	1.98	1.98	తిరుమలశెట్టి సీతారాములు	38/2,3	38/1	47	38/1	
123	47/3ఎ	గయళ్ళు	1.65	1.65	సిద్దా నారాయణస్వామి	47/1	47/2	46	47/1	
124	47/3బి	గయళ్ళు	1.63	1.63	సిద్దా స్వామి	47/1	47/2	46	47/1	
125	47/3సి	గయళ్ళు	1.65	1.65	సిద్దా వీరభద్రరావు	47/1	47/2	46	47/1	
126	48/4	గయళ్ళు	2.10	2.10	సుంకర రాంబాబు	49	47	51	41/3	
127	67/2	త.క.గ	1.23	1.23	పోసిన సూర్యకాంతం	65	68	67/3	65	
128	95/7	గయళ్ళు	2.10	2.10	రాచం సూర్యారావు	97/3,5,6	95/8	గయళ్ళు	95/2	
129	96/2	గయళ్ళు	0.59	0.59	వంపన పెంటరావు	95	96/5	96/3	96/1	
130	96/3	రైతుపుంజ	1.26	1.26	సిద్దా రామకృష్ణ	95	94/5	కొండ	96/2	
			మొత్తం	117.425						

సం/- సి.వి.ప్రవీణ్ ఆదిత్య, I.A.S., స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) (FAC), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

'సంకల్ప' స్కాం

- బెజవాడలో బోర్డు తిప్పేసిన చెయిన్ లింక్ సంస్థ
- యాప్ ద్వారా రూ.కోట్లలో వసూలు
- తెలుగు రాష్ట్రాల్లో వేల మంది బాధితులు
- కేసు నమోదు.. పోలీసుల అదుపులో నిందితులు!



సీతారాంపురంలోని సంకల్ప సిద్ధి కార్యాలయం

ఒకటికి పది రెట్లిస్తాం.. డబ్బులే డబ్బులు!!
బంగారం.. స్థలాలు.. కట్టిన సొమ్మంతా తిరిగిస్తాం...
ఎర్ర చందనం మొక్కలతో చెట్లకు డబ్బులు కాయిస్తాం!!
తెలిసిన వారిని చేరిస్తే కమీషన్ కూడా ఇస్తాం..
మీరు మునగండి.. మీ పక్కవారినీ ముంచండి!
యాప్‌లో ఒకరి తరువాత ఒకరుగా
మోసపోయిన గొలుసు కట్టు గోల్‌మాల్ బాగోతమిదీ..

- సాక్షి ప్రతినిధి, విజయవాడ

యాప్ ద్వారా..

విజయవాడలో సంకల్ప సిద్ధి మార్ట్ పేరుతో ఏర్పాటైన చెయిన్ లింక్, మల్టీలెవల్ మార్కెటింగ్ సంస్థ మోసాలు బహిర్గతమయ్యాయి. సీతారాంపురంలోని దుర్గా అగ్రహారంలో ఏడాది క్రితం ఓ అద్దె ఇంట్లో కార్యాలయాన్ని ఏర్పాటు చేసిన ఈ సంస్థ యాప్ ద్వారా రూ.కోట్లలో డిపాజిట్లు సేకరించి బోర్డు తిప్పేసింది. పది రోజులుగా యాప్ పని చేయకపోవడంతో అనుమానం వచ్చిన బాధితులు మోసపోయామని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు వేల సంఖ్యలోనే ఉన్నట్లు సమాచారం.

ఐదు రకాల స్కీంలతో చెయిన్ చీటింగ్

- సంకల్పసిద్ధి సంస్థ నిర్వాహకులు సభ్యత్వం కోసం రూ.3 వేలు చొప్పున బాధితుల నుంచి వసూలు చేసి నమ్మకం కలిగించేందుకు సరుకులు ఇచ్చారు. రోజుకు రూ.10 చొప్పున 300 రోజుల్లో కట్టిన డబ్బంతా వెనక్కు వస్తుందని నమ్మించారు.
- రూ.లక్ష డిపాజిట్ చేస్తే రోజుకు రూ.వెయ్యి చొప్పున 300 రోజుల్లో రూ.3 లక్షలు ఇస్తామనేది రెండో స్కీం
- రూ.లక్ష నగదు చెల్లిస్తే లక్ష విలువైన బంగారం ఇవ్వడంతో పాటు రోజుకు రూ.100 చొప్పున 300 రోజుల్లో రూ.30 వేలు ఇస్తామని మూడో స్కీం ద్వారా ఆశ చూపారు.
- రూ.2.5 లక్షలు ఇస్తే 25 ఎర్ర చందనం మొక్కలతో కూడిన స్థలం ఇవ్వడంతోపాటు 15 ఏళ్లకు రూ.1.75 కోట్లు వస్తాయంటూ వసూళ్లకు పాల్పడ్డారు.
- రూ.5 లక్షలు చెల్లిస్తే సెంటు భూమి ఇవ్వడంతోపాటు 300 రోజుల్లో తిరిగి రూ.2.5 లక్షలు చెల్లిస్తామని మరో ఎర వేశారు.

పోలీసుల అదుపులో నిందితులు

దుర్గా అగ్రహారం, బందర్ రోడ్డులోని కార్యాలయం, నిడమానురులోని సంకల్పసిద్ధి మార్ట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. సంస్థకు చెందిన సాఫ్ట్‌వేర్ డేటాను సీజ్ చేసి పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. నాలుగు బ్యాంకు లావాదేవీలను స్తంభింపజేసి రూ.2.5 కోట్ల నగదును సీజ్ చేశారు. సంస్థ చైర్మన్ గుత్తా వేణుగోపాల్, మేనేజింగ్ డైరెక్టర్ కిరణ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

న్యాయం చేస్తాం..



చట్టపరమైన చర్యలు తీసుకొని సంకల్ప సిద్ధి డిపాజిటర్లకు న్యాయం జరిగేలా చూస్తాం. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం. – టి.కె.రాణా, సీపీ

5 జిల్లాలకు దుర్గగుడి ప్రచార రథం



ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): భవానీ దీక్షలను పురస్కరించుకుని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ప్రచార రథం 10 రోజుల పాటు 5 జిల్లాల్లో ప్రచారం నిర్వహించనుంది. ఈ నెల 25 నుంచి డిసెంబర్ 4 వరకు జరిగే ఈ ప్రచార కార్యక్రమంలో ఆయా జిల్లాల్లోని ప్రధాన పట్టణాలు, గ్రామాల్లో ఆది దంపతులకు పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. 25న అల్లూరి సీతారామరాజు జిల్లా, కాకినాడ జిల్లా, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో సాగుతుంది. ఆయా జిల్లాల్లో ప్రచార రథం వెంట దేవస్థాన అర్చకులు, సిబ్బంది ఉంటారు.

నేటి నుంచి పాలీ టెక్ ఫెస్ట్–2022

- రాష్ట్ర స్థాయిలో మూడు రోజుల పాటు విజయవాడలో నిర్వహణ
- మొదటి మూడు స్థానాలకు రూ.లక్ష, రూ.50 వేలు, రూ.25 వేలు బహుమతుల అందజేత
- సాంకేతిక విద్యా శాఖ సంచాలకురాలు చదలవాడ నాగరాణి

సాక్షి, అమరావతి: విద్యార్థుల సృజనాత్మకత, వినూత్న ఆలోచనలను ఉత్తేజపరిచే క్రమంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో రాష్ట్ర స్థాయి పాలీ టెక్‌ఫెస్ట్ – 2022 నిర్వహిస్తున్నట్టు సాంకేతిక విద్యాశాఖ సంచాలకురాలు చదలవాడ నాగరాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేక్ ఇన్ ఇండియా, నైపుణ్యం ఆంధ్రప్రదేశ్ ప్రచారాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ఆవిష్కరణలు, పరిశోధనలను సులభతరం చేస్తూ పాలిటెక్నిక్ విద్యార్థులకు దిక్సూచిగా ఈ కార్యక్రమం చేపడుతున్నామని పేర్కొన్నారు. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని తెలిపారు. డిప్లొమా విద్యార్థులు టెక్నోక్రాట్‌గా రూపాంతరం చెందడానికి ఇది సోపానం వంటిదని, నవంబర్ 14 నుంచి 17 వరకు నోడల్ ప్రిన్సిపాల్స్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 13 ప్రదేశాలలో ప్రాంతీయ పాలీ టెక్ ఫెస్ట్ లు నిర్వహించామని పేర్కొన్నారు. దాదాపు 4,310 మంది విద్యార్థులు టెక్‌ఫెస్ట్‌లో పాల్గొని 1,084 వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించారని, వాటిలో ఎంపిక చేసిన 253 ప్రాజెక్ట్‌లు విజయవాడలో ప్రదర్శితం కానున్నాయని నాగరాణి తెలిపారు. రాష్ట్ర స్థాయి పాలీ టెక్ ఫెస్ట్ ఉత్తమ ప్రాజెక్టులకు మొదటి బహుమతిగా రూ.లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.50 వేలు, తృతీయ బహుమతిగా రూ.25 వేలు అందిస్తామని పేర్కొన్నారు. ప్రతిరోజూ రాష్ట్రంలోని పాలిటెక్నిక్‌లు, పాఠశాల విద్యార్థులు 5,000 మంది సందర్శించగలిగేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

హనుమంతునిపై పట్టాభిరామునిగా అమ్మవారు

చంద్రగిరి/తిరుచానూరు: శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగో రోజు బుధవారం రాత్రి పట్టాభిరాముని అలంకరణలో అమ్మవారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. ఉదయం అమ్మవారు శ్రీరాజమన్నార్ అలంకారంలో చర్నాకోలు, దండం ధరించి కల్పవృక్ష వాహనంపై భక్తులను కటాక్షించారు. మధ్యాహ్నం శ్రీకృష్ణస్వామి మండపంలో అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్‌సేవ వైభవంగా సాగింది. వాహన సేవల్లో పెద్ద జీయ్యంగార్, చిన్న జీయ్యంగార్, ఈవో ఎ.వి.ధర్మా రెడ్డి దంపతులు, చంద్రగిరి ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు, జేఈవో వీరబ్రహ్మం దంపతులు, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు, వీఎస్‌వోలు మనోహర్, బాలిరెడ్డి, ఏఈవో ప్రభాకర్‌రెడ్డి, ఆలయ అర్చకులు బాబు స్వామి పాల్గొన్నారు.

పార్వతీపురం మన్యం జిల్లాలో పులి సంచారం

- నిన్న మేకలు, నేడు ఆవులపై దాడి



చనిపోయిన ఆవు కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీ శాఖాధికారి ప్రసన్న

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా వాసులను పులి భయం వెంటాడుతోంది. పార్వతీపురం పరిధిలోని జంతికొండలో మంగళవారం ప్రవేశించి రెండు మేకలను పులి బలిగొనడం తెలిసిందే. తాజాగా బుధవారం పార్వతీపురం రేంజ్‌లోని నార్త్‌బీట్‌లో ప్రవేశించి కొయ్యమెట్టవలసకు చెందిన రెండు ఆవులపై దాడి చేసింది. ఒక ఆవు మరణించగా, మరో ఆవుకు తీవ్ర గాయాలయ్యాయి. జిల్లా అటవీశాఖాధికారి ప్రసన్న ఘటనా స్థలాన్ని సందర్శించారు. పులి పాదముద్రలు సేకరించారు. పరిసర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

మాజీ ఎంపీపీపై హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

- గురువు అభిరామ్ సూచనతో శిష్యుడు చంద్రశేఖర్ దాడి
- డీఎస్పీ ఎదుట లొంగిపోయిన చంద్రశేఖర్
- వివరాలు వెల్లడించిన అదనపు ఎస్పీ శ్రీనివాస్



అడిషినల్ ఎస్పీ శ్రీనివాస్

తుని: కాకినాడ జిల్లా తుని నియోజకవర్గ టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ పోల్నాటి శేషగిరిరావుపై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడు అగ్రహారపు చంద్రశేఖర్‌ను అరెస్ట్ చేసినట్లు అదనపు ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. తునిలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన మేరకు.. విశాఖపట్నం ఆరిలోవ పెద్దగదుల ప్రాంతానికి చెందిన చంద్రశేఖర్.. అదే ప్రాంతానికి చెందిన అభిరామ్‌కు శిష్యుడు. ఇతర ప్రాంతాలకు వెళ్లి పూజలు చేసే వీరు కొంతకాలంగా అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం నామవరంలో రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. పోల్నాటి శేషగిరిరావు తనను ఇబ్బంది పెట్టాడని, అతడిని గాయపరిస్తే సొమ్ము ఇస్తానని వారికి గురువు అభిరామ్ చెప్పాడు. దీంతో చంద్రశేఖర్ తన స్నేహితులతో కలిసి శేషగిరిరావు కదలికలపై నిఘాపెట్టాడు. ఈ నెల 17న ఉదయం చంద్రశేఖర్ భవానీమాల ధరించి, ముఖానికి మాస్క్ పెట్టుకుని తుని సమితి ఆఫీసు వీధిలో నివాసం ఉంటున్న శేషగిరిరావు ఇంటికి మోటారు సైకిల్ మీద వెళ్లాడు. భిక్షం అడిగాడు. బియ్యం వేస్తుండగా శేషగిరిరావుపై కత్తితో దాడిచేసి పారిపోయాడు. శేషగిరిరావు అక్కడే పడిపోయిన కత్తిని తీసుకుని వెంటపడి చంద్రశేఖర్ వీపుపై దాడిచేయడంతో గాయమైంది. శేషగిరిరావు ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టారు. సోషల్ మీడియాలో వచ్చిన ఊహాచిత్రం ఆధారంగా విస్తృతస్థాయిలో గాలించారు. పోలీసులు గాలిస్తున్నట్లు తెలుసుకున్న చంద్రశేఖర్ బుధవారం తుని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి దర్యాప్తు అధికారి డీఎస్పీ మురళీమోహన్‌కు లొంగిపోయాడు. మిగిలిన నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. చంద్రశేఖర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు అదనపు ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీ మురళీమోహన్, తుని, ప్రత్తిపాడు సీఐలు నాగదుర్గారావు, కిశోర్‌బాబు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

O/o. స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

రఫ్ నెం.బి1/166/2021 — ఫారమ్ నెం.VII — తేది : 16-11-2022

(2013వ, సంవత్సరము 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టంలో సెక్షన్ 19(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్125, సబ్‌రూల్ (1) ననుసరించి)

రూఢీ ప్రకటన

ఈ క్రింది షెడ్యూల్‌లో నిర్దిష్టపరచిన భూములను మరియు వాటి విస్తీర్ణం య.4.09 సెంట్లను ప్రజా ప్రయోజనమునకై అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద దేవీపట్నం మండలం, కొండమొదలు గ్రామంలోని గిరిజన రైతుల నుండి సేకరించిన భూమికి బదులుగా, పునరావాసం, పునస్థాపనల క్రింద, వారికి భూమిని కేటాయించు నిమిత్తము భూములు అవసరమైనవి ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము భావించినందు, 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 15వ విభాగంననుసరించి సంబంధిత వ్యక్తుల నుంచి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట ప్రత్యేకకలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్‌ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారు సంతృప్తిచెంది ఈ దిగువ షెడ్యూలు దాఖలా భూములను ప్రజా ప్రయోజనాల నిమిత్తం భూసేకరణ గావించుటకు నిర్ణయించినారు మరియు భూసేకరణ కోరిన సంస్థ అవసరమగు నిధులను సమకూర్చినందున ఈ క్రింది రూఢీ ప్రకటన 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19 (1) విభాగంననుసరించి చేయబడినది.

రూఢీ ప్రకటన

ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా వారు 2013వ సంవత్సరం 30వ చట్టంలోని 19(1) విభాగంననుసరించి ఈ దిగువనుదహరించిన షెడ్యూలు దాఖలా భూములు మరియు సుమారుగా వాటి విస్తీర్ణం య.4.09 సెంట్లను ప్రజా ప్రయోజనమునకై అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద దేవీపట్నం మండలం, కొండమొదలు గ్రామంలోని గిరిజన రైతుల నుండి సేకరించిన భూమికి బదులుగా, పునరావాస, పునస్థాపనల క్రింద, వారికి భూమిని కేటాయించు నిమిత్తము అవసరమైనని ఇందుమూలముగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూలు

జిల్లా : అల్లూరి సీతారామరాజు — మండలం : దేవీపట్నం — గ్రామం : లొతుపాలెం

క్రమ సంఖ్య	సర్వే నెం/ స.డి.నెం.	వర్గీకరణ	మొత్తం విస్తీర్ణం ఎ.సెంట్లు	భూసేకరణ క్రింద విస్తీర్ణం ఎ.సెంట్లు	సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు / కట్టడములు వగైరా వివరాలు
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)
1	263-2ఎ1	రైతు పుంజ	4.09	4.09	దేవర కన్నారావు	స.నెం. 264, 263/1	స.నెం. 263/2 ఎ2	స.నెం. 289	స.నెం. 263/ 2బి	తాడి-9, వేప- 5 జీడిమామిడి - 5 టేకు - 1
			మొత్తం :	4.09						

ఈ భూముల ప్లాన్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ఎడమ ప్రధాన కాలువ యూనిట్-1, రాజమహేంద్ర వరం వారి కార్యాలయము నందు ఉంచడమైనది. దానిని ఈ కార్యాలయపు పని వేళలలో ఏ సమయం లోనైనా తనిఖీ చేసుకోవచ్చును.

చట్టంలోని అంశములను అనుసరించి శ్రీ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ) వారిచే తయారు చేయబడిన నివేదిక ఆధారంగా ఈ భూసేకరణ వలన ప్రాజెక్ట్ ప్రభావిత కుటుంబములు మరియు ప్రాజెక్ట్ నిర్వాసిత కుటుంబములు ఎవ్వరూ లేరు.

బొగ్గు గనులు, ఇనుపరాయి, పలకరాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరు భూమిలో గాని లేదా ఒక ప్రత్యేక భాగములో వుంటే అటువంటి భూములలో ప్రాజెక్టు నిర్మాణమునకు అవసరమైన భూభాగములను మాత్రమే త్రవ్వుట గానీ తొలగించుట గానీ చేయవలెను.

సం/- సి.వి.ప్రవీణ్ ఆదిత్య, IAS,
స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) (FAC), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

అమెరికా వీసా కావాలంటే 1000 రోజులు

- హైదరాబాద్ వాసులు 994 రోజులు వేచి చూడాలి




న్యూఢిల్లీ: రోజురోజుకీ అమెరికా వీసాల కోసం నిరీక్షణ సమయం పెరిగిపోతోంది. అమెరికా బిజినెస్ (బీ-1), టూరిస్ట్ (బీ-2) వీసాల కోసం ఎదురుచూడాల్సిన సమయం తొలిసారిగా వేయి రోజులకు చేరింది. ఇప్పటికిప్పుడు అమెరికన్ వీసా కోసం భారతీయులు దరఖాస్తు చేసుకుంటే 2025 నాటికి ఇంటర్వ్యూకి పిలుపు వస్తుందని అమెరికా విదేశాంగ శాఖ నివేదించింది. ముంబై వాసులు 999 రోజులు, హైదరాబాద్‌వాసులు 994 రోజులు, ఢిల్లీ 961 రోజులు, చెన్నై 948 రోజులు, కోల్‌కతా వాసులు 904 రోజులు ఇంటర్వ్యూ కోసం నిరీక్షించాల్సి ఉందని ఢిల్లీలోని అమెరికా ఎంబసీ అధికారి చెప్పారు. అత్యవసరంగా ఎవరైనా అమెరికా వెళ్లాలనుకుంటే కారణాలు చూపిస్తే అపాయింట్‌మెంట్ వెంటనే ఇస్తామని అమెరికా విదేశాంగ శాఖ ట్వీట్ చేసింది. ప్రస్తుతం అమెరికా కళాశాలల్లో అడ్మిషన్లు ఉండటంతో విద్యార్థి వీసాలు మంజూరుకు ప్రాధాన్యతనివ్వడంతో ఇతర వీసాల వెయిటింగ్ పీరియడ్ పెరిగిపోయింది.

అతిగా నీళ్లు తాగడం వల్లే...

బ్రూస్ లీ మరణంపై కొత్త వాదన

మాడ్రిడ్: బ్రూస్ లీ. మార్షల్ ఆర్ట్స్‌కు ఐకాన్. ముఖ్యంగా చైనీస్ మార్షల్ ఆర్ట్స్‌కు ప్రపంచవ్యాప్తంగా తిరుగులేని ఆదరణ సాధించి పెట్టిన కుంగ్‌ఫూ వీరుడు. మార్షల్ ఆర్ట్స్ ప్రియులకైతే అక్షరాలా ఆరాధ్య దైవమే. బతికింది కొన్నేళ్లే అయినా మార్షల్ ఆర్ట్స్‌కు మారుపేరుగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాడు. మరణించి తరాలు గడుస్తున్నా ఆయనకు ఆదరణ నానాటికీ పెరుగుతోందే తప్ప తగ్గడం లేదు. ఎంటర్ ద డ్రాగన్‌తో సహా బ్రూస్ లీ తీసిన హాలీవుడ్ సినిమాలన్నీ మాస్టర్‌పీస్‌లుగా నిలిచి ఇప్పటికీ ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తూనే ఉన్నాయి. అలాంటి యాక్షన్ వీరుడు కేవలం 32 ఏళ్ల వయసులో హఠాత్తుగా మరణించి అభిమానులను శోకసంద్రంలో ముంచాడు. అందుకు కారణమేమిటన్నది ఇప్పటికీ పెద్ద మిస్టరీగానే మిగిలిపోయింది. ప్రత్యర్థులు హతమార్చారని, ఎండ దెబ్బ కొట్టిందని, కొకైన్ మితిమీరి వాడాడని... ఇలా రకరకాల పుకార్లే తప్ప నిజమేమిటో ఎవరికీ తెలియదు. అయితే మంచినీళ్లు మితిమీరి తాగడమే బ్రూస్ లీ మరణానికి దారి తీసిందని తాజా అధ్యయనం ఒకటి చెబుతోంది...!

బ్రూస్ లీ 1973 జూలై 20న హాంకాంగ్‌లో మరణించాడు. హైపోనాట్రేమియాయే అందుకు దారి తీసిందని మాడ్రిడ్‌లోని ఐఐఎస్-ఫౌండేషన్ జిమెనెజ్ డియాజ్ యూఏఎస్‌కు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ నెఫ్రాలజీ పరిశోధకులు అంటున్నారు. నీళ్లు అతిగా తాగడం వల్ల ఒంట్లో సోడియం గాఢత తగ్గడాన్ని హైపోనాట్రేమియా అంటారు. గుండె, మూత్రపిండాల వంటివి సజావుగా పనిచేయడంలో సోడియం పాత్ర అతి కీలకం. నీళ్లు మితిమీరి తాగితే సోడియం నీళ్లలో కలిసి



పోయి మూత్రం ద్వారా బయటికి వెళ్లిపోతూ ఉంటుంది. చాలాకాలం ఇలా జరిగితే ఒంట్లో సోడియం లోపం తలెత్తి కణాలు క్రియారహితంగా మారతాయి. కిడ్నీలు ఫెయిలవుతాయి. అదనపు నీరు ఒంట్లోంచి బయటికి వెళ్లదు. బ్రూస్ లీ విషయంలో సరిగ్గా ఇదే జరిగిందని అధ్యయనం చెబుతోంది. ఫలితంగా మెదడు వాచి మరణానికి దారి తీసిందంటోంది. ''బ్రూస్ లీ పోస్ట్‌మార్టం రిపోర్టులోని వివరాల ఆధారంగా ఈ నిర్ణయానికి వచ్చాం. ఆయన మెదడు 1,575 గ్రాములకు పెరిగిందని పోస్టుమార్టం నివేదిక పేర్కొంది. ఇది సాధారణం కంటే 175 గ్రాములు ఎక్కువ'' అని పేర్కొంది. ధారాళంగా నీళ్లు తాగడమే గాక క్యారెట్, ఆపిల్ జ్యూస్‌లనే ప్రధాన ఆహారంగా తీసుకోవడం బ్రూస్ లీకి ఏళ్ల తరబడి అలవాటని గుర్తు చేసింది. ముఖ్యంగా చనిపోయిన రోజంతా బ్రూస్ లీ పదేపదే నీళ్లు తాగుతూ గడిపాడని సన్నిహితులు చెప్పడాన్ని ఉటంకించింది. ఈ అధ్యయన పత్రం క్లినికల్ కిడ్నీ జర్నల్లో పబ్లిషైంది.

ఆ రోజు ఏం జరిగింది...

బ్రూస్ లీ 1940 నవంబర్ 27న జన్మించాడు. 13 ఏళ్ల కల్లా హాంకాంగ్‌లో మార్షల్ ఆర్ట్స్‌లో ప్రావీణ్యం సాధించాడు. 16 ఏళ్ల వయసులో అమెరికా వెళ్లాడు. 26వ ఏట అమెరికా టీవీలో మార్షల్ ఆర్ట్స్ ఫైటర్‌గా కన్పించి అలరించాడు. ముఖ్యంగా జీత్ కునెడో పేరిట ఆయన ప్రవేశపెట్టిన సొంత ఫైటింగ్ టెక్నిక్ జనానికి పిచ్చిగా నచ్చింది. 29వ ఏట బ్రూస్ లీ హాంకాంగ్ తిరిగి వెళ్లాడు. సినీ రచయితగా, డైరెక్టర్‌గా, నటునిగా, ఫైట్‌మాస్టర్‌గా పని చేశాడు. ఎంటర్ ద డ్రాగన్ తదితర చిత్రాలతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి ఆరాధ్యుడయ్యాడు. 1973 జూలై 20న ఒక సినిమాకు సంబంధించిన యాక్షన్ సీన్లలో నటించిన అనంతరం బ్రూస్ లీ ఇంటికి చేరుకున్నాడు. రాత్రి 7.30 ప్రాంతంలో నొప్పితో తల తిరుగుతోందని చెప్పాడు. ఏక్వజెసిక్ ట్యాబ్లెట్ వేసుకుని బెడ్రూంలోకి వెళ్లాడు. 9.30 కల్లా అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అప్పటికే హృదయస్పందన ఆగిపోయింది. ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు ప్రకటించారు. అంతకు రెండు నెలల క్రితమే బ్రూస్‌లీకి మెదడు వాపు సంబంధిత సమస్య తలెత్తింది. కాసేపు అపస్మారక స్థితిలోకి వెళ్లి కోలుకున్నాడు.

సొంత కుటుంబాన్నే కడతేర్చాడు

దారుణానికి ఒడిగట్టిన డ్రగ్స్ బానిస
- రీహాబిలిటేషన్ కేంద్రం నుంచి కొద్దిరోజుల క్రితం ఇంటికి
- వాగ్వాదంతో కుటుంబం మొత్తాన్నీ అంతమొందించిన ఉన్మాది
- దేశ రాజధానిలో మరో హత్యాకాండ

న్యూఢిల్లీ: మాదకద్రవ్యాలకు బానిస అయిన పాతికేళ్ల యువకుడు సొంత కుటుంబాన్నే పొట్టనబెట్టుకున్నాడు. డ్రగ్స్ అలవాటు మాన్పించేందుకు కొన్నాళ్ల రీహాబిలిటేషన్ సెంటర్‌లో గతంలో చేర్పించారు. కొద్ది రోజులకు ఇంటికొచ్చిన ఆ ఉన్మాది తన కుటుంబసభ్యులను అందర్నీ చంపేశాడు. నైరుతి ఢిల్లీలోని పాలమ్ ప్రాంతంలో మంగళవారం రాత్రి ఈ కుటుంబ హత్య చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, పాతికేళ్ల కేశవ్ తన తల్లిదండ్రులు, నానమ్మ, చెల్లితో కలిసి ఉంటున్నాడు. డ్రగ్స్‌కు అలవాటు పడిన కేశవ్ తరచూ వాటిని కొనేందుకు ఇంట్లో డబ్బులు అడిగి గొడవపడేవాడు. కుదురుగా ఏ పనీ చేసేవాడు కాదు. దీంతో అతడిని రీహాబిలిటేషన్ సెంటర్(పునరావాస కేంద్రం)లో చికిత్స అందించి కొద్దిరోజుల క్రితం కేశవ్‌ను అతని తల్లి ఇంటికి తీసుకొచ్చింది. మంగళవారం కుటుంబసభ్యులతో తీవ్ర వాగ్వాదం తర్వాత ఉద్రేకంతో చెల్లి, నానమ్మ, తల్లిదండ్రులను



హత్యలు జరిగిన భవనం ముందు గుమికూడిన జనం

పొడిచి చంపాడు. దీంతో గదులన్నీ రక్తసిక్తమై భీతావహంగా మారాయి. వెంటనే ఇంటికి తాళమేసి పారిపోబోయాడు. బాధితుల అరుపులు విని భవంతి కింది అంతస్తులో ఉండే బంధువుల అబ్బాయి కుల్‌దీప్ సైనీ, ఇరుగుపొరుగు వారు పట్టుకుని పోలీసులకు అప్పజెప్పారు. పోలీసులు తీసుకెళ్తుండగా 'నన్ను పోలీసులకు పట్టిస్తావా? విడుదలయ్యాక చంపేది నిన్నే' అంటూ బంధువు కుల్‌దీప్ సైనీని బెదిరించాడు. నగదు కోసం కేశవ్ దొంగతనాలు చేసేవాడని ఇరుగుపొరుగు వారు చెప్పారు. నవంబర్ రెండో తేదీన బిల్డింగ్‌లోని పెద్ద బ్యాటరీలను దొంగలించి సొమ్ముచేసుకున్నాడు. గతంలో ఏటీఎం చోరీ కేసులో కొంతకాలం జైలుకెళ్లాడని బంధువు కుల్‌దీప్ చెప్పాడు. 'కేశవ్‌ను గతంలో రెండు సార్లు పునరావాస కేంద్రంలో చేర్పించాము. ఇది కోపంతో చేసిన హత్య కాదు. ప్రణాళిక ప్రకారమే చేశాడు. ముందుగా అమ్మమ్మను చంపేశాడు. తర్వాత 8 గంటలకు ఇంటికొచ్చిన తండ్రిని, 8.45కు ఇంటికొచ్చిన తల్లిని, 9.30కి ఇంటికొచ్చిన చెల్లిని విడతల వారీగా చంపాడు' అని కేశవ్ మేనమామ కృష్ణన్ ఆగ్రహంతో చెప్పారు. శ్రద్ధా వాకర్‌ను ముక్కలుగా నరికి పారేసిన అఫ్తాబ్ అమీన్ పూనావాలా ఉదంతం వెలుగుచూసిన దేశ రాజధానిలోనే మరో హత్యోదంతం నమోదైంది.

గిరిజనులంటే కాంగ్రెస్‌కు అలుసు

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధ్వజం
- రాష్ట్రపతి ఎన్నికల్లో గిరిజన మహిళా అభ్యర్థికి మద్దతివ్వలేదు
- పైగా ఆమెను ఓడించేందుకు అభ్యర్థిని పోటీకి దింపారు
- గుజరాత్‌లో మోదీ ఎన్నికల ప్రచారం

దాహోద్/మెహసానా: ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీకి గిరిజనులపై నిజంగా ప్రేమ ఉంటే రాష్ట్రపతి ఎన్నికల్లో గిరిజన మహిళా అభ్యర్థిగా ఎందుకు మద్దతివ్వలేదని ప్రధాని మోదీ నిలదీశారు. ఆయన బుధవారం గుజరాత్‌లోని దాహోద్ పట్టణంలో అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించారు. గిరిజనుల హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను తిప్పికొట్టారు. రాష్ట్రపతి ఎన్నికల్లో గిరిజన మహిళా అభ్యర్థికి మద్దతు ఇవ్వకపోగా, ఆమెను ఓడించేందుకు ప్రతిపక్షం అభ్యర్థిని నిలబెట్టిందని ఆక్షేపించారు. కాంగ్రెస్ ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ గిరిజనుల ఆశీస్సులతో ద్రౌపది ముర్ము రాష్ట్రపతిగా ఎన్నికయ్యారని తెలిపారు. దాహోద్ ప్రాంత అభివృద్ధికి కాంగ్రెస్ చేసిందేమీ లేదని విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే ఇక్కడి అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామని నరేంద్ర మోదీ వెల్లడించారు.

కాంగ్రెస్ మోడల్ అంటే ఇదే..

అవినీతి, కులతత్వం, బంధుప్రీతి, వారసత్వ రాజకీయాలు, మత విద్వేషం, సమాజంలో



మెహసానాలో సభలో జ్ఞాపిక అందుకుంటున్న మోదీ

విభజన, ఓటు బ్యాంకు రాజకీయాలే కాంగ్రెస్ మోడల్ అని ప్రధాని మోదీ మండిపడ్డారు. కాంగ్రెస్ మోడల్ కేవలం గుజరాత్‌నే కాదు, మొత్తం దేశాన్ని నాశనం చేసిందని దుయ్యబట్టారు. ఆయన బుధవారం మెహసానాలో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో మాట్లాడారు. ప్రజలు ఎప్పటికీ పేదలుగా ఉండిపోవాలన్నదే ఆ పార్టీ ఉద్దేశమన్నారు. దురభిమానం, వివక్షను బీజేపీ ఏనాడూ నమ్ముకోలేదని, అందుకే యువత తమ పట్ల విశ్వాసం చూపుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో అస్తవ్యస్తంగా మారిన దేశాన్ని అభివృద్ధి చేసేందుకు తాము ఎంతగానో శ్రమిస్తున్నామని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. వడోదరలోనూ ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

క్లుప్తంగా...

సుప్రీంకోర్టులో మరో 4 ప్రత్యేక ధర్మాసనాలు

- క్రిమినల్, పన్నులు, భూసేకరణ, వాహన ప్రమాద క్లెయిమ్‌లపై విచారణకు విడివిడిగా..
- సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో మరో నాలుగు ప్రత్యేక ధర్మాసనాలు ఏర్పాటు చేస్తున్నట్లు సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ బుధవారం చెప్పారు. క్రిమినల్ కేసులు, ప్రత్యక్ష-పరోక్ష పన్నులు, భూసేకరణ, వాహన ప్రమాదాల క్లెయిమ్‌లకు సంబంధించిన కేసులను విడివిడిగా విచారించేందుకు ఈ నాలుగు సుప్రీం బెంచ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు జస్టిస్ చంద్రచూడ్ పేర్కొన్నారు. ఈ కొత్త బెంచ్‌లు వచ్చే వారం నుంచి తమ పనులు మొదలుపెట్టనున్నాయి. బుధవారం సుప్రీంకోర్టులో ఓ కేసుకు సంబంధించి న్యాయవాది అత్యవసర విచారణ కోరిన సమయంలో సీజేఐ పై విధంగా స్పందించారు. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని బెంచ్ భూసేకరణకు సంబంధించిన కేసులను విచారించనుందని సీజేఐ సూత్రప్రాయంగా తెలిపారు. ప్రత్యక్ష, పరోక్ష పన్నుల అంశాలు పరిష్కరించే బెంచ్ బుధ, గురువారాల్లో ఉంటుందని వెల్లడించారు.

అమెరికాలో మళ్లీ కాల్పులు... ఆరుగురి దుర్మరణం

చెసాపీక్(అమెరికా): అమెరికా మరోసారి తుపాకీ మోతతో దద్దరిల్లింది. మంగళవారం రాత్రి పదింటపుడు వర్జీనియా రాష్ట్రంలోని చెసాపీక్ నగరంలోని వాల్‌మార్ట్ షాపింగ్‌మాల్‌లో ఈ కాల్పుల ఘటన చోటుచేసుకుంది. రెండ్రోజుల్లో వచ్చే థ్యాంక్స్‌గివింగ్ డేను పురస్కరించుకుని స్థానికుల షాపింగ్‌తో వాల్‌మార్ట్ స్టోర్ రద్దీగా ఉంది. మరో గంట అయితే స్టోర్ మూసేస్తారనగా ఈ ఘోరం జరిగింది. అదే స్టోర్‌కు మేనేజర్‌గా భావిస్తున్న ఒక ఆగంతకుడు స్టోర్‌లోని విరామ గదిలో ఉన్న సహోద్యోగుల పైకి పిస్టల్‌తో విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. దీంతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. తర్వాత తనను తానే కాల్చుకుని చనిపోయాడు. గాయపడిన నలుగురిని ఆస్పత్రిలో చేర్పించారు. కాల్పులకు అసలు కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

'సద్దాం హుస్సేన్‌లా రాహుల్'

అహ్మదాబాద్: రోజుల తరబడి పాదయాత్రలో మునిగిపోయిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నెరిసిన గడ్డంతో కనిపించడంతో అస్సాం ముఖ్యమంత్రి, బీజేపీ నేత హిమంత బిశ్వ శర్మ వెటకారంగా మాట్లాడారు. అహ్మదాబాద్‌లో ర్యాలీలో పాల్గొన్న హిమంత ప్రసంగించారు. 'గడ్డంతో రాహుల్ కొత్తగా కనిపిస్తున్నారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌గానో, నెహ్రూలానో కనిపిస్తే బాగుంటుంది. కానీ నీ ముఖం ఇరాక్ నియంత సద్దాం హుస్సేన్‌లాగా ఎందుకు ఉంది ?' అని హిమంత వ్యాఖ్యానించారు. దీనిపై కాంగ్రెస్ సీనియర్ నేత మనీశ్ తివారీ మాట్లాడారు. 'ఆయనదంతా వెకిలి విధానం' అని అన్నారు.

సుప్రీంకోర్టులో ట్రంప్‌కు చుక్కెదురు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా కొనసాగిన కాలంలో రిపబ్లికన్ నేత డొనాల్డ్ ట్రంప్ బహిర్గతం చేయని ఆరేళ్ల ట్యాక్స్ రిటర్న్ వివరాలను పొందే హక్కు అమెరికా పార్లమెంట్ కమిటీకి ఉందంటూ ఆ దేశ సుప్రీంకోర్టు తీర్పుచెప్పింది. దీంతో ఇన్నాళ్లు ట్యాక్స్ రిటర్న్‌లను బయటపెట్టని ట్రంప్‌కు సమస్యలు ఎదురుకానున్నాయి. 2015-2020 కాలానికి సంబంధించి ట్రంప్ రియల్ ఎస్టేట్ వ్యాపారం సహా స్థిరచరాస్తుల ట్యాక్స్ రిటర్న్‌ల వివరాలను బహిర్గతంచేయలేదు. ట్రంప్ పన్ను చెల్లింపుల్లో అవకతవకలు ఉన్నాయంటూ హౌజ్ వేస్ అండ్ మీన్స్ కమిటీ ఆరోపించింది. కమిటీ దూకుడును అడ్డుకునేందుకు ట్రంప్ కింది కోర్టును ఆశ్రయించారు. అక్కడ ట్రంప్‌కు చుక్కెదురైంది.

..'ఎస్ సర్'లే సీఈసీలా?!

▶ మొదటి పేజీ తరువాయి

జరుపుతున్నాం. ఓవైపు అది కొనసాగుతుండగానే కేంద్ర సర్వీసులో కొనసాగుతున్న ఐఏఎస్ అధికారిని ముందస్తుగా రిటైర్ చేయించి మరీ ఈసీగా ఎందుకు నియమించాల్సి వచ్చిందో తెలుసుకోవాలనుకుంటున్నాం. గోయల్ నియామక ఫైలును పరిశీలన నిమిత్తం మాకు సమర్పించండి'' అని కేంద్రాన్ని ఆదేశించింది. కేంద్రం తరఫున హాజరైన అటార్నీ జనరల్ఆర్.వెంకటరమణి ఇందుకు తీవ్రంగా అభ్యంతరాలు వెలిబుచ్చినా వాటిని తోసిపుచ్చింది. ధర్మాసనంలో న్యాయమూర్తులు జస్టిస్ అజయ్ రస్తోగీ, జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ హృషీకేశ్ రాయ్, జస్టిస్ సి.టి.రవికుమార్ సభ్యులుగా ఉన్నారు. ఈసీలు, సీఈసీ నియామకాలకు కొలీజియం తరహా వ్యవస్థ ఉండాలంటూ దాఖలైన పిటిషన్లపై ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ముందు మంగళవారం వాదనలు ప్రారంభమైన విషయం తెలిసిందే. అవి బుధవారం రోజంతా కొనసాగాయి. కేంద్ర ఎన్నికల సంఘం స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడుకోవాలంటే అందులోకి నియామకాలను తొలి దశలోనే పూర్తిస్థాయిలో తనిఖీ చేసే వ్యవస్థ ఉండాలని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ అంశంపై ధర్మాసనానికి, కేంద్రం తరఫున వాదించిన ఏజీ వెంకటరమణికి మధ్య సుదీర్ఘ వాదోపవాదాలు జరిగాయి. ఈసీ స్వతంత్ర ప్రతిపత్తికి 1991 నాటి చట్టం పూర్తి రక్షణ కల్పిస్తోందని ఏజీ వాదించారు. 'దినేశ్ గోస్వామి కమిటీ నివేదిక ఆధారంగా పార్లమెంటు ఆమోదించిన చట్టమిది. కాబట్టి దాని రూపకల్పన వెనక సరైన ఆలోచన చేయలేదని చెప్పలేం. సీఈసీ, ఈసీల జీతభత్యాలు, పదవీకాలం తదితరాలన్నింటికీ రాజ్యాంగపరమైన రక్షణ ఉంది. కనుక ఈ విషయంలో కోర్టు జోక్యం చేసుకోవాల్సిన అవసరమేదీ లేదు'' అని స్పష్టం చేశారు. ''కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శి స్థాయిల్లో ఉన్న అధికారులను ఎలక్షన్ కమిషనర్లుగా నియమించడం ఆనవాయితీగా వస్తోంది. అమల్లో ఉన్న విధానం ప్రకారం వారిలో సీనియర్ అధికారి సీఈసీగా నియమితులవుతారు'' అని వివరించారు. ''మేం ఆనవాయితీని పాటిస్తున్నాం. అలాగాకుండా సీఈసీ నియామకానికి జాతీయ స్థాయిలో ఎన్నికలు పెట్టం సాధ్యం కాదు'' అన్నారు. ఈ వ్యవస్థ సరిగా పని చేయడం లేదని చెప్పడం తమ ఉద్దేశం కాదని ధర్మాసనం పేర్కొంది. అందుకు పారదర్శక వ్యవస్థ ఉండాలన్నది మాత్రమే తమ ఉద్దేశమని స్పష్టం చేసింది. ''కేంద్రం ఒకవేళ తమ భావజాలమే ఉన్న, తాము చెప్పిన దానికల్లా తలూపే వ్యక్తిని సీఈసీగా



నియమిస్తే? అందుకే సీఈసీ నియామక ప్రక్రియపై మేం మరింతగా దృష్టి సారించాలనుకుంటున్నాం. అందులో సీజేఐని చేరిస్తే బాగుంటుంది'' అని పేర్కొంది.

గోయల్‌పై వాదోపవాదాలు

ఈసీగా గోయల్ నియామకంపై వాడివేడి వాదనలు సాగాయి. ఓవైపు ఈ కేసులో విచారణ జరుగుతుండగానే కేంద్రం హడావుడిగా ఆయనను నియమించిందని పిటిషనర్ అనూప్ బరన్వాల్ తరఫున వాదించిన సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ''గోయల్ గురువారం దాకా కేంద్రంలో కార్యదర్శి స్థాయి అధికారిగా కొనసాగారు. ఉన్నట్టుండి ఆయనకు వీఆర్ఎస్ ఇచ్చి శుక్రవారానికల్లా ఈసీగా నియమించారు'' అని గుర్తు చేశారు. తనకు తెలిసినంత వరకూ వీఆర్ఎస్ ఆమోదానికి మూడు నెలలు పడుతుందని జస్టిస్ జోసెఫ్ అన్నారు. గోయల్ ఆయన నియామక ఫైలును సమర్పించాలన్న ఆదేశించారు. దీనిపై ఏజీ తీవ్ర అభ్యంతరం వెలిబుచ్చారు. ''విచారణ జరుగుతున్నది ఈసీలు, సీఈసీ నియామకాలకు సంబంధించిన విస్తృతమైన అంశం మీద. అలాంటప్పుడు ప్రశాంత్ భూషణ్ తెరపైకి తెచ్చిన ఈ వ్యక్తిగత నియామకాన్ని ఎలా పరిశీలనకు తీసుకుంటారు? దీనికి నేను తీవ్రంగా అభ్యంతరం తెలుపుతున్నా. విచారణ మధ్యలో ఇలా నియామక ఫైలును కోర్టు చూడటంపై చాలా అభ్యంతరాలున్నాయి'' అన్నారు. వాటిని ధర్మాసనం తోసిపుచ్చింది. ''మేం విచారణ మొదలు పెట్టిన తర్వాత నవంబర్ 19న గోయల్ నియామకం జరిగింది. దానికి కారణమేమిటో తెలుసుకోవడానికే ఫైలు చూడాలనుకుంటున్నాం. నియామకం పూర్తిగా నిబంధనలకు లోబడే జరిగిందని మీరంటున్నారు. దాన్నే మేం పరిశీలించదలచాం. నియామకంలో అక్రమాలేవీ జరగని పక్షంలో మీరు భయపడాల్సిందేముంది? రేపట్లోగా సంబంధిత ఫైలును మా ముందుంచాల్సిందే'' అని స్పష్టం చేసింది. ''ఫైలును సమర్పిస్తారా, లేదా? దాన్ని బయట పెట్టొద్దనుకుంటుంటే అదే విషయం చెప్పండి. మీరు (ఏజీ) గనక బిజీగా ఉంటే ఫైలును మాకు సమర్పించాల్సిందిగా ఇంకెవరికైనా పురమాయించండి'' అని జస్టిస్ జోసెఫ్ అన్నారు. ఈసీగా మంగళవారం బాధ్యతలు చేపట్టిన గోయల్ 2025లో రాజీవ్‌కుమార్ రిటైర్మెంట్ అనంతరం సీఈసీ కానున్నారు. ఆయన కేంద్ర భారీ పరిశ్రమల శాఖ కార్యదర్శిగా డిసెంబర్ 31 దాకా పదవిలో కొనసాగాల్సి ఉండగా ముందస్తు రిటైర్మెంట్ తీసుకున్నారు.

మనకిప్పడో శేషన్ కావాలి!

సీఈసీ, ఈసీల నియామకం విషయంలో రాజ్యాంగం మౌనాన్ని ప్రభుత్వాలు తమకు అనుకూలంగా దుర్వినియోగం చేసుకుంటూ వస్తున్నాయంటూ మంగళవారం విచారణ సందర్భంగా ధర్మాసనం అసహనం వెలిబుచ్చడం తెలిసిందే. ఇదో అవాంఛిత పోకడ అంటూ ఆక్షేపించింది. వారి నియామకానికి ఎలాంటి ప్రక్రియనూ ఆర్టికల్ 324 నిర్దేశించని విషయాన్ని గుర్తు చేసింది. ఇందుకోసం చట్టం చేయాలని రాజ్యాంగం నిర్దేశించినా 72 ఏళ్లుగా ఆ పని చేయలేదంటూ తప్పుబట్టింది. ''2004 నుంచి ఒక్క సీఈసీ కూడా ఆరేళ్ల పదవీకాలం పూర్తి చేసుకోలేదు. ఇక పదేళ్ల యూపీఏ పాలనలో ఏకంగా ఆరుగురు సీఈసీలు మారారు. ప్రస్తుత ఎన్డీఏ ఎనిమిదేళ్ల పాలనలో ఏకంగా 8 మంది మారారు'' అంటూ ఆక్షేపించింది. గట్టి వ్యక్తిత్వమున్న టి.ఎన్.శేషన్ వంటివారు సీఈసీగా రావాలని తాము కోరుకుంటున్నట్టు స్పష్టం చేసింది.

ప్రధానిపై ఆరోపణలొస్తే సీఈసీ చర్యలు తీసుకోగలరా?

- తీసుకోకుంటే వ్యవస్థ కుప్పకూలదా: సుప్రీంకోర్టు
- సీఈసీకి స్వతంత్ర ప్రతిపత్తి, విలువలు, వ్యక్తిత్వం ముఖ్యం
- నియామకానికి స్వతంత్ర ప్యానల్ ఉండాలన్న ధర్మాసనం
- కొలీజియం తరహా వ్యవస్థ తేవడం కుదరదన్న కేంద్రం

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)కు స్వతంత్ర ప్రతిపత్తితో పాటు వ్యక్తిత్వం, విలువలుండటం చాలా ముఖ్యమని సుప్రీంకోర్టు ధర్మాసనం నొక్కివక్కాణించింది. సీనియారిటీ ఆధారంగా సీఈసీని నియమించే ప్రస్తుత వ్యవస్థ చక్కగానే పని చేస్తోందన్న అటార్నీ జనరల్ వాదనను తోసిపుచ్చుతూ న్యాయమూర్తి జస్టిస్ కె.ఎం.జోసెఫ్ కొన్ని కీలక ప్రశ్నలు సంధించారు. ''మాటవరుసకు ఒక ఉదాహరణ తీసుకుందాం. ప్రధాని స్థాయి వ్యక్తితో సీఈసీ తలపడాల్సిన పరిస్థితి తలెత్తితే? అందుకాయన సిద్ధపడతారా, ససేమిరా అంటారా? మీకేమనిపిస్తోంది? ప్రధానిపై సీఈసీ చర్యలు తీసుకోవాల్సిన తరహా ఆరోపణలు వచ్చాయనుకుందాం. కానీ ఆయన ఏ చర్యలూ తీసుకోలేదనుకుందాం. అప్పుడది వ్యవస్థ పూర్తిగా కుప్ప కూలినట్టు కాదా? అందుకే సీఈసీకి రాజకీయ ప్రభావం నుంచి సంపూర్ణ రక్షణ తప్పనిసరి. మీరు లోతుగా ఆలోచించాల్సిన అంశాలు ఇవీ! సీఈసీ, ఈసీల పేర్లను సిఫార్సు చేయాల్సింది కేంద్రం మంత్రివర్గం కాదు. అందుకోసం ప్రత్యేకంగా ఏర్పాటైన ఓ స్వతంత్ర ప్రతిపత్తితో కూడిన విస్తృత ప్యానల్ ఆవశ్యకత చాలా ఉంది. కేంద్రం ఎన్నికల సంఘంలో ఎన్నికల సంస్కరణల అత్యవసరమని లా కమిషన్‌తో పాటు పలు కమిటీల నివేదికలు చెప్పాయి కూడా. నాకు వివరంగా గుర్తు లేదు కానీ ఇందుకు సంబంధించిన అంశాలపై గతంలో కొందరు ఎలక్షన్ కమిషనర్లు రాజీనామా కూడా చేశారు'' అన్నారు. కేంద్రం తరఫున ఏజీతో పాటు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అదనపు సొలిసిటర్ జనరల్ దల్బీర్ సింగ్ కూడా వాదనలు విన్పించారు! ప్రస్తుత నియామక వ్యవస్థలో ఎలాంటి మార్పులు చేసినా అది రాజ్యాంగాన్ని సవరించడమే అవుతుందని ఈసీ వాదించింది. పార్లమెంటు నిర్దిష్టమైన చట్టం తెచ్చేదాకా ఈసీలు, సీఈసీ నియామకానికి సుప్రీంకోర్టే పూనుకొని ప్యానల్‌ను ఏర్పాటు చేయాలని అడ్వకేట్ ప్రశాంత్ భూషణ్ కోరారు. అందులో సీజేఐ కూడా ఉండాలని సూచించగా జస్టిస్ జోసెఫ్ పలు ప్రశ్నలు సంధించారు. ''ఎవరినైనా నియమించే అధికారం అంతిమంగా రాష్ట్రపతిది. కేంద్ర మంత్రివర్గ సలహాల మేరకు రాష్ట్రపతి నిర్ణయాలు తీసుకోవాలన్నది రాజ్యాంగ నిర్దేశం. మంత్రివర్గ పాత్రను మనం తగ్గించలేం కదా! అంతేగాక సీజేఐ చేసిన సిఫార్సులను మంత్రివర్గం పక్కన పెడితే? ఆయనకు అలాంటి ఇబ్బందికర పరిస్థితి కల్పించలేం! ప్యానల్లో సీజేఐ పాత్ర ఎలా ఉండాలని మీరు భావిస్తున్నారో చెప్పండి'' అన్నారు. ప్యానల్లో ఓ న్యాయమూర్తి ఉన్నంత మాత్రాన పారదర్శకత, స్వతంత్ర ప్రతిపత్తి ఉంటాయనుకోవడం తప్పుడు అభిప్రాయమని మెహతా వాదించారు. ఇది రాజ్యాంగానికి తప్పుడు భాష్యం చెప్పడమవుతుందన్నారు. సీఈసీ, ఈసీల నియామకానికి సీజేఐతో కూడిన కొలీజియం తరహా వ్యవస్థను తేవడం కుదరదని తేల్చిచెప్పారు. ''సీబీఐ డైరెక్టర్ నియామక ప్రక్రియలో సీజేఐ పాలుపంచుకుంటారు. దానివల్ల ప్రజాస్వామ్యానికి ఏమైనా ముప్పు ఏర్పడిందా?'' అని జస్టిస్ జోసెఫ్ ప్రశ్నించారు. ఈ విషయమై మెహతాకు, న్యాయమూర్తులకు మధ్య వాడివేడి వాదనలు జరిగాయి.

అఫ్తాబ్ నన్ను ముక్కలుగా నరికేస్తాడు

రెండేళ్ల క్రితమే పోలీసులకు శ్రద్ధా ఫిర్యాదు

ముంబై: ఆమె భయపడ్డట్లే జరిగింది. తనను ముక్కలుగా నరికేసి, దూరంగా విసిరేస్తాడని రెండేళ్ల క్రితమే అనుమానించింది. ఆ మేరకు పోలీసులు ఫిర్యాదు కూడా చేసింది. చివరకు ఆదే జరిగింది. ముంబైలో కాల్ సెంటర్ ఉద్యోగి శ్రద్ధా వాకర్‌ను ఆమె ప్రియుడు అఫ్తాబ్ పూనావాలా దారుణంగా హతమార్చిన సంగతి తెలిసిందే. ఈ హత్యాకాండ దేశమంతటా తీవ్ర సంచలనం సృష్టించింది. చాలా ఏళ్లుగా అఫ్తాబ్‌తో సహజీవనం చేస్తున్న శ్రద్ధా వాకర్ సరిగ్గా రెండేళ్ల క్రితం.. అంటే 2020 నవంబర్ 23న పాల్ఘార్ జిల్లాలోని తులింజ్ పోలీసులకు అతడిపై ఫిర్యాదు చేసింది. తనను హింసిస్తున్నాడని, మానసికంగా వేధిస్తున్నాడని, తనను ముక్కలు ముక్కలుగా నరికి చంపేస్తాడని భయపడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. ''ఈరోజు నన్ను ఊపిరాడకుండా చేసి చంపేందుకు ప్రయత్నించాడు. భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. ముక్కలుగా నరికి చంపి దూరంగా పారేస్తానంటూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు. గత ఆరు నెలలుగా నన్ను కొడుతున్నాడు. కానీ, ఇన్నాళ్లు పోలీసులకు ఫిర్యాదు చేయలేకపోయా. ఎందుకంటే పోలీసుల వద్దకు వెళ్తే చంపుతానని బెదిరించాడు. ఇప్పుడు ధైర్యం చేసి ముందుకొచ్చా. అఫ్తాబ్‌తో నేను కలిసి ఉంటున్న సంగతి అతడి తల్లిదండ్రులకు తెలుసు. వారు అప్పుడప్పుడు మా వద్దకు వస్తుంటారు'' అని శ్రద్ధా తన ఫిర్యాదులో వివరించింది. తనను వేధిస్తున్న విషయం అతడి తల్లిదండ్రులకు కూడా తెలుసని తెలిపింది. శ్రద్ధా ఫిర్యాదు విషయాన్ని పోలీసు అధికారి ఒకరు బుధవారం వెల్లడించారు. అయితే, కొద్ది రోజులకే ఫిర్యాదును ఉపసంహరించుకుందని పేర్కొన్నారు.

జైలులో జైన్ విలాసాలు

- తెరపైకి మరో రెండు వీడియోలు
- పచ్చి కూరగాయలు, పండ్లు తింటున్న జైన్

న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు, ఢిల్లీ మంత్రి సత్యేందర్ జైన్ తిహార్ జైలులో విలాసవంతమైన జీవితం గడుపుతున్నట్లు బుధవారం మరో రెండు వీడియోలు బయటకు వచ్చాయి. ఆయన తన సెల్‌లో పండ్లు, ఉడికించని కూరగాయలు తింటూ ఈ వీడియోల్లో కనిపిస్తున్నారు. సెప్టెంబర్ 13, అక్టోబర్ 1న వీటిని చిత్రీకరించినట్లు తెలుస్తోంది. సత్యేందర్ జైన్‌కు తిహార్ జైలు ఒక హాలిడే రిసార్ట్‌లా మారిపోయిందని కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి విమర్శించారు. రిసార్ట్‌లో ఉండే సదుపాయాలన్నీ ఆయనకు జైలులో అందుతున్నాయని ఆరోపించారు. మతపరమైన నమ్మకాల ప్రకారం.. ఉపవాసం ఉంటున్నానని, ఉడికించని ఆహారం కావాలంటే ఇవ్వడం లేదని జైన్ తాజాగా ఢిల్లీ సిటీ కోర్టును ఆశ్రయించారు. పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై స్పందించాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)ని న్యాయస్థానం ఆదేశించింది. జైలులో సత్యేందర్ మసాజ్ చేయించుకుంటున్న వీడియో సంచలనం సృష్టించిన విషయం విదితమే. ఆయన వ్యవహారం అధికార ఆమ్ ఆద్మీ పార్టీకి ఇబ్బందికరంగా పరిణమిస్తోంది.

మీడియాను అడ్డుకోండి

తిహార్ జైలులో తన సెల్(గది) లోపలి సీసీ టీవీ దృశ్యాలను ప్రసారం చేయకుండా మీడియాను అడ్డుకోవాలని ఢిల్లీ మంత్రి సత్యేందర్ జైన్ న్యాయస్థానాన్ని కోరాడు. బుధవారం ఢిల్లీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై ప్రత్యేక జడ్జి వికాస్ ధూల్ స్పందించారు. తిహార్ జైలు అధికారులకు నోటీసు జారీ చేశారు. గురువారం వివరణ ఇవ్వాలని ఆదేశించారు.



సాక్షి విజయనగరం

గురువారం । 24 । నవంబర్ । 2022

ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడిగా అప్పారావు



బొబ్బిలి రూరల్: ఏపీ పీఆర్ ఇంజనీర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా సీహెచ్‌వీ అప్పారావు రెండో సారి ఎన్నిక య్యారు. ఇక్కడి పీఆర్ డీఈఈగా విధులు నిర్వహిస్తున్న అప్పారావును జిల్లా కేంద్రంలో జరిగిన ఎన్నికల్లో మరోసారి ఎన్నుకున్నట్లు స్థానిక విలేకర్లకు తెలిపారు. ఆయనకు డివిజన్‌లోని పీఆర్ ఇంజనీర్లు, సిబ్బంది అభినందనలు తెలిపారు.



తిండి కలిగితే కండ కలుగును..!

మహాకవి గురజాడ అప్పారావు కలం నుంచి జాలువారిన ముత్యాల సరాలను జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం తు.చ తప్పకుండా పాటిస్తోంది. అంగన్‌వాడీ పిల్లలకు పౌష్టికాహారం అందిస్తుండడంతో ఆరోగ్యంగా ఎదుగుతున్నారు. - 8లో

27న జిల్లా స్థాయి ఓపెన్ చెస్ పోటీలు

విజయనగరం: విజయనగరం చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న జిల్లా స్థాయి ఓపెన్ చెస్ పోటీలు జరగనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీ జ్వాలాముఖి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఎస్.కోట సిరికి డిగ్రీ కళాశాలలో జరిగే ఎంపిక పోటీల్లో అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్: 99494 01711 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

న్యూస్‌రీల్

కొత్త బాధ్యతలు



వై.వి.సుబ్బారెడ్డి



మజ్జి శ్రీనివాసరావు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: వైఎస్సార్ సీపీ విజయనగరం జిల్లా రీజనల్ కో– ఆర్డినేటర్‌గా పార్టీ సీనియర్ నాయకులు వై.వి.సుబ్బారెడ్డి నియమితులయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షునిగా మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) యథావిధిగా కొనసాగుతారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం బుధవారం ప్రకటన జారీ చేసింది.

నేర పరిశోధనకు త్వరలో త్రీడీ టెక్నాలజీ



ఒప్పంద పత్రాలు చూపిస్తున్న ఇరు సంస్థల ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: దేశంలో నేర పరిశోధన రంగంలోకి త్రీడీ టెక్నాలజీ అందుబాటులోకి రాబోతుందని బెంగుళూరుకు చెందిన ఎడ్జి త్రీడీ టెక్నాలజీ ప్రాజెక్టు ప్రతినిధి రవి అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో ఫోరెన్సిక్ విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. కంటికి కనిపించని సాక్ష్యాలను సేకరించడంలో త్రీడీ టెక్నాలజీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, త్రీడీ టెక్నాలజీ ప్రతినిధులు ఎంఓయూ కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమణారావు, డీన్ లక్ష్మీనరసింహాచార్యులు పాల్గొన్నారు.

తలసీమియా రోగులకు రక్తదానం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ

విజయనగరం ఫోర్ట్: తలసీమియా, సికిల్‌సెల్ ఎనీమియా, హిమోఫిలియా రోగులకు ప్రభుత్వం ఉచితంగా రక్తం అందిస్తోందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో సికిల్‌సెల్ ఎనీమియా, తలసీమియా రోగులకు స్వచ్ఛంద రక్తదానంపై రూపొందించిన వాల్ పోస్టర్లను బుధవారం రాత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ రామేశ్వరి ప్రభు, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఉప్పు అప్పలరాజు, డీపీఎం బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

10లోగా పదోతరగతి పరీక్ష ఫీజు చెల్లించాలి

విజయనగరం పూల్‌బాగ్: పదోతరగతి (2022–23లో) పబ్లిక్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 25 నుంచి డిసెంబర్ 10వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఎటువంటి అపరాధ రుసుము చెల్లించకుండా డిసెంబర్ 10వ తేదీలోగా విద్యార్థులు తమ స్కూళ్లలోని ప్రధానోపాధ్యాయుకి ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రూ.50 అపరాధ రుసుంతో డిసెంబర్ 20 వరకు, రూ.200 అపరాధరుసుంతో డిసెంబర్ 30 వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. విద్యార్థుల పరీక్ష ఫీజు, దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని కోరారు. రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.125, మూడు లేదా మూడు కంటే తక్కువ సబ్జెక్టులకు రూ.110, మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులకు రూ.125, ఒకేషనల్ అభ్యర్థులు రెగ్యులర్ పరీక్ష ఫీజు రుసుమునకు అదనంగా రూ.60 చెల్లించాలన్నారు. ఏజ్ కాండినిషన్ ఫీజు రూ.300, మైగ్రేషన్ సర్టిఫికెట్ ఫీజు రూ.80 చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు www.bseap.org వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

ఎస్ఈబీ అదనపు ఎస్పీకి పదోన్నతి

విజయనగరం క్రైమ్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఎన్.శ్రీదేవీరావును ఇంటిలిజెన్స్ ఎస్పీగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్ కుమార్ గుప్త బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 20 మంది అదనపు ఎస్పీలకు పదోన్నతి కల్పించారు. శ్రీదేవీరావుకు పలువురు పోలీస్ అధికారులు అభినందనలు తెలిపారు.

గురువులకు ఊరట

ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు శుభవార్త. విద్యార్థులకు ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ పథకాల పర్యవేక్షణ బాధ్యతల నుంచి మినహాయింపు ఇచ్చింది. పాఠ్యాంశాల బోధనకు ఆటంకం లేకుండా ఆ బాధ్యతలను ఏపీఎంలకు అప్పగించింది. ఉపాధ్యాయులపై పని ఒత్తిడి తగ్గించింది. అర్హులైన విద్యార్థులందరికీ ప్రభుత్వ ప్రోత్సాహకాలు, పథకాలు అందించేందుకు చర్యలు చేపట్టింది.



- సర్కారు బడుల్లో అమలయ్యే ప్రభుత్వ పథకాల పర్యవేక్షణ బాధ్యతల నుంచి మినహాయింపు
- కొత్తగా సెర్ప్ సిబ్బందికి అప్పగింత
- మండలానికి ఒకరు చొప్పున నియామకం
- విద్యార్థులకు అన్ని పథకాలు పూర్తి స్థాయిలో అందేలా ఏర్పాట్లు
- ఉపాధ్యాయులపై తగ్గనున్న అదనపు పనిఒత్తిడి

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

పేద, బడుగు వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం వివిధ రూపాలలో ప్రోత్సాహకాలు అందిస్తోంది. పథకాలు అమలుచేస్తోంది. వీటిని పారదర్శకంగా అమలయ్యేలా అధికారులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగిస్తోంది. ఇదే క్రమంలో విద్యారంగంలో అనేక సంస్కరణలు చేపట్టింది. విద్యార్థులకు ప్రయోజనం కల్పించేలా పథకాలు ఆచరణలోకి తెచ్చింది. లబ్ధిదారులందరికీ అందేలా సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షిస్తోంది. అయితే అర్హత ఉన్నప్పటికీ కొన్నిసార్లు సాంకేతిక కారణాలవల్ల పథకాలు వర్తించని పరిస్థితి. ఇలాంటి సమస్యలను సరిచేయడానికి క్షేత్ర స్థాయిలో సరైన వ్యవస్థలేకపోవడంతో ఆ పని సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చేయాల్సి వస్తోంది. ఆ ప్రభావం బోధనపై పడుతోంది. ఉపాధ్యాయులపై పని ఒత్తిడి పెరిగడంతో పాటు, కొన్నిచోట్ల అర్హులైన విద్యార్థులకు పథకాలు అందని పరిస్థితి. ఈ సమస్యను గుర్తించిన ప్రభుత్వం పథకాల పర్యవేక్షణకు ప్రత్యేక వ్యవస్థను మండల స్థాయిలో అందుబాటులోకి తెచ్చింది. డీఆర్‌డీఏలో సెర్ప్ విభాగం అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ల (ఏపీఎం)లకు ఈ వ్యవస్థలోని పర్యవేక్షణ బాధ్యత ఇస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. మండలానికి ఒకరుగా ఉన్న ఏపీఎంలకు వారి విధి విధానాలపై శిక్షణ ఇస్తూ కొత్త బాధ్యతలు అప్పగించింది. మండల విద్యాశాఖాధికారి సమన్వయంతో విద్యాశాఖలో వారి విధులను నిర్దేశించింది.

నాడు–నేడు, జగనన్న అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, మరుగుదొడ్ల నిర్వహణ నిధి తదితర పథకాలను అమలు చేయడంలో డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ లేదా మండల విద్యా అధికారికి ఏపీఎంలు సహాయం చేస్తారు. నోట్‌బుక్‌లు, పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫాంలు సక్రమంగా పంపిణీ, విద్యార్థి సంక్షేమానికి సంబంధించిన ప్రభుత్వం పంపిణీ చేసిన ఇతర వస్తువులను మండలంలో అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వం అందించే అన్ని ప్రయోజనాలతోపాటు వివిధ స్కాలర్‌షిప్‌లు, ధ్రువీకరణ పత్రాల జారీలో సహకరిస్తారు. దీనివల్ల ప్రస్తుతం అమలులో ఉన్న మండల విద్యాశాఖ, డిప్యూటీ విద్యాశాఖ అధికారులకు, ఉపాధ్యాయులకు పని ఒత్తిడి తగ్గుతుంది. ఇక నుంచి వారు అకడమిక్, ఇతర నిర్వాహక వ్యవహారాలను మాత్రమే పర్యవేక్షిస్తారు. ప్రభుత్వ, పథకాలు అందుతున్న ప్రతి పాఠశాలను ఏపీఎంలు పర్యవేక్షించాల్సి ఉంది.

జిల్లాలోని 27 మండలాల పరిధిలో 2,484 ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు ఉన్నాయి. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు ప్రమాణాలతో కూడిన బోధన అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

డివిజన్ వారీగా పాఠశాలలు :

స్కూళ్లు	విజయనగరం	చీపురుపల్లి	బొబ్బిలి
ప్రాథమిక పాఠశాలలు	603	448	401
ప్రాథమికోన్నత పాఠశాలలు	143	108	74
ఉన్నత పాఠశాలలు	210	135	112
మొత్తం	956	691	587

ఏపీఎంల జాబ్ చార్టు ఇలా...

- గ్రామ/వార్డు సచివాలయం స్థాయిలో బడి బయట ఉన్న విద్యార్థులను పాఠశాలలకు పంపించాలి. జగనన్న అమ్మ ఒడి పథకం కోసం అర్హులైన తల్లులను గుర్తించాలి, పాఠశాలలకు అవసరమైన విద్య, వైద్య, రక్షణకు సంబంధించిన అంశాలను రోజువారీ పర్యవేక్షించాలి.
- ఉపాధ్యాయుల జీతాలు, సెలవులు మంజూరు, ట్రెజరీ పనులు, మండల, నియోజక వర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహించే రివ్యూ మీటింగ్‌లకు హాజరు వంటి ఎన్నో ప్రాధాన్య బాధ్యతలను సకాలంలో పూర్తిచేయాలి.
- జగనన్న గోరుముద్ద పథకం అమలులో బియ్యం, గుడ్లు, చిక్కి సరఫరా, ఆహారం నిల్వలో శుభ్రత, భోజన ప్రాంతం, తాగు నీరు తదితర అంశాలపై పర్యవేక్షణలో డిప్యూటీ ఈఓ, మండల విద్యా అధికారికి సహాయం అందించాలి.
- మరుగుదొడ్ల నిర్వహణ నిధి కార్యకలాపాల పథకాన్ని పర్యవేక్షించాలి. ఐఎంఎంఎస్ యాప్, మరుగుదొడ్ల నిర్వహణ, ఆయా రిజిస్ట్రేషన్, ఆయా హాజరు, ఆయాలకు తక్షణమే చెల్లింపులు తదితర విషయాల్లో అప్‌డేషన్‌ను నిర్ధారించాలి.
- స్కూల్ పరిధిలోని డిజిట్ పరికరాల నిర్వహణ, ఇంటర్నెట్ నిర్వహణ, భద్రతా నిర్వహణ వాటిని పర్యవేక్షించాలి.
- ఉపాధ్యాయ దినోత్సవం, విద్యావారం, బాలల దినోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం, జాతీయ పండుగల రోజులను జరుపుకోవడంలో ఉపాధ్యాయుల పని తగ్గిస్తూ విద్యాశాఖ అధికారులతో సమన్వయంగా పనిచేయాలి.

పర్యవేక్షించాల్సిన పాఠశాల స్థాయి పథకాలు...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాల విద్య బలోపేతం కోసం ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టాయి. మనబడి నాడు–నేడు, జగనన్న అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, రోజువారీ మరుగుదొడ్లు శుభ్రత, పాఠశాల సక్రమ నిర్వహణ కోసం బడ్జెట్ కేటాయించడం, నీతి ఆయోగ్, సీఎస్ఆర్ ద్వారా మౌలిక వనరుల కల్పన, విద్యా ప్రమాణాల పెంపుకోసం నూతన జాతీయ విద్యావిధానం ద్వారా పాఠశాల మార్పు, ఉపాధ్యాయులకు శిక్షణ, విద్యార్థులకు ఆన్‌లైన్ పాఠాలు, డిజిటల్ పాఠాలు అందించడం, తరల్, సాల్ట్, లిప్, సిప్, దీక్షా, జోలీ ఫోనిక్స్ వంటి పలు రకాల కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది.

పర్యవేక్షణలో ఏపీఎంల సహకారం

కేంద్ర, రాష్ట్ర పథకాల, ప్రోత్సాహకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సెర్ప్ నుంచి ఏపీఎంలకు పర్యవేక్షణ బాధ్యత అదనంగా అప్పగించింది. దీనివల్ల ఉపాధ్యాయులు, ఎంఈఓలు, డిప్యూటీ ఈఓలకు పని భారం తగ్గుతుంది. మరోవైపు పథకాలు మరింత పారదర్శకంగా అందనున్నాయి.

– లింగేశ్వరరెడ్డి, డీఈఓ, విజయనగరం

పారదర్శకంగా ధాన్యం కొనుగోలు

కంట్రోల్ రూమ్: 8978975284



- జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: జిల్లాలో అత్యంత పారదర్శకంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను చేపట్టామని ఇప్పటికే పలుచోట్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని జేసీ మయూర్ అశోక్ తెలిపారు. ధాన్యం రవాణా బాధ్యత కూడా ప్రభుత్వానిదేనని, రైతుల కళ్లాలవద్దే ధాన్యం కొనుగోలు చేయిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో రైతుల సమస్యలు పరిష్కరించేందుకు ఫిర్యాదులను స్వీకరించేందుకు జిల్లా పౌర సరఫరాల సంస్థ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్టు ప్రకటించారు. ధాన్యం విక్రయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేసే ఈ కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 8978975284ను సంప్రదించాలని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. రైతుకు మద్దతు ధర చెల్లించడానికి జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యలను జేసీ వివరించారు. వరి సాధారణ రకం క్వింటాకు రూ.2,040, గ్రేడ్–ఎ రకం రూ.2,060గా ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రస్తుత పంట అంచనాలు ప్రకారం, సుమారు 4.46 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని చెప్పారు. ధాన్యం కొనుగోలులో పాల్గొనే సిబ్బందికి డివిజన్ స్థాయి, మండల స్థాయిలో ఇప్పటికే మూడుసార్లు శిక్షణ ఇచ్చి సిద్ధం చేశామని తెలిపారు.

దళారులను ఆశ్రయించవద్దు

ధాన్యం కొనుగోలుకు కావలసిన పరికరాలను ఇప్పటికే అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటు చేశామని వివరించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించాలని సూచించారు. గోనెసంచులు, హమాలీలు, ధాన్యం రవాణా కోసం వాహనాలను కూడా ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఒకవేళ రైతులే వాటిని భరిస్తే గోనెసంచికి రూ.3.39, రవాణాకు 8 కిలోమీటర్ల వరకు టన్నుకు రూ.295, హమాలీ చార్జీలకు క్వింటాకు రూ.25 చొప్పున లెక్కకట్టి మద్దతు ధరతోపాటు నేరుగా రైతుల ఖాతాలకే జమచేస్తామని తెలిపారు. రైతులకు మద్దతు ధర చెల్లించడానికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలను చేపట్టిందని, దళారుల, మిల్లర్లను ఆశ్రయించకుండా రైతులు పండించిన ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తరలించి మద్దతు ధర పొందాలని జేసీ అశోక్ కోరారు.

19 నుంచి జగనన్న సాంస్కృతిక స్వర్ణోత్సవాలు

- 7, 8, 9 తేదీల్లో విశాఖలో జోనల్ స్థాయి పోటీలు
- పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ సూర్యకుమారి



పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్:

వచ్చే నెల 19 నుంచి 21వ తేదీ వరకు తిరుపతిలో స్వర్ణోత్సవ సాంస్కృతిక సంబరాలు జరగనున్నాయని కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్లను తన చాంబర్‌లో బుధవారం ఆవిష్కరించారు. ఈ సంబరాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ముందుగా జోనల్ స్థాయి సాంస్కృతిక పోటీలు జరగనున్నాయని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించి విశాఖపట్నం ఉడా చిల్డ్రన్ థియేటర్‌లో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో పోటీలు జరగనున్నాయని చెప్పారు. సంప్రదాయ నృత్యరీతులలైన కూచిపూడి, ఆంధ్రనాట్యం, భరతనాట్యం, గాత్రం, జానపద కళారూపాలైన డప్పులు, తప్పెటగుళ్లు, గరగలు, చెక్కభజన, పులివేషాలు, బుట్టబొమ్మలు, కాళికా వేషాలు, ఉరుములు, గిరిజన కళారూపాలైన థింసా, కొమ్ముకోయ, సవర, లంబాడీ విభాగాల్లో జోనల్, రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయని చెప్పారు. జిల్లా కళాకారులు ఈ పోటీల్లో పాల్గొని విజయబావుటా ఎగురవేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ ఆర్‌వీ ప్రసన్నకుమారి, ఇతర అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కరాటేలో రాణించిన విద్యార్థులు

లక్కవరపుకోట :

ఎల్.కోటకు చెందిన పలువురు విద్యార్థులు జాతీయస్థాయి కరాటే పోటీలకు అర్హత సాధించినట్టు విక్టరీ షటోకాన్ కరాటే అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రాజు బుధవారం తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఉప్పల్ సమీపంలోని బండి ఆంజనేయులు గార్డెన్‌లో ఈ నెల 27వ తేదీన జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆదర్శపాఠశాలకు చెందిన జి.భరద్వాజ్, పి.వరుణ్ సందీప్, జె.జస్వంత్, బి.రిషేంద్రకుమార్, జె.మనోహర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జశ్వంత్‌చరణ్, బి.ప్రతాప్ కుమార్, శ్రీచైతన్య పాఠశాలకు చెందిన షేక్ రాషీద్ వివిధ కేటగిరీలలో ఎంపికైన వారిలో ఉన్నారు.



జాతీస్థాయి కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థులతో రాజుమాస్టారు

25 నుంచి రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు



జిల్లా బాక్సింగ్ క్రీడాకారులను అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, అసోసియేషన్ ప్రతినిధులు

- సీనియర్స్‌కు పోటీల నిర్వహణ
- పాల్గొననున్న 13 జిల్లాల క్రీడాకారులు
- పోస్టర్లను ఆవిష్కరించిన బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం: విజయనగరం వేదికగా ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు సీనియర్స్ విభాగంలో స్త్రీ, పురుషుల రాష్ట్రస్థాయి బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. నగరంలోని రాజీవ్ క్రీడామైదానంలో జరిగే పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి డోల మన్మథకుమార్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు, ఇండియన్ బాక్సింగ్ చీఫ్‌కోచ్ కె.నూకరాజు అదే ప్రాంగణంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మన్మథకుమార్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే పోటీల్లో 13 జిల్లాల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో పోటీ పడతారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను త్వరలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని చెప్పారు.

క్రీడలకు ప్రాధాన్యం..

ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తోందని, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు డిప్యూటీ స్పీకర్ కోలగట్లను తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన జిల్లా బాక్సింగ్ క్రీడాకారులను అభినందించారు. పోటీల్లో రాణించి విజయనగరం జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలని సూ చించారు. కార్యక్రమంలో బాక్సింగ్‌కోచ్ ఈశ్వర్, ఎస్ఈ రాజు, పూడి సంతోష్‌కుమార్, ఎ.సంతోష్, ఎం.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితా

విజయనగరం ఫోర్ట్: ఎస్ఎన్‌సీయూ, ఎన్ఆర్‌సీ, ఆర్‌కేఎస్‌కే, డీఈఐసీ, ఎస్ఎంహెచ్‌పీ విభాగాల్లో ఖాళీగా ఉన్న స్టాఫ్‌నర్సు, కుక్ కమ్ కేర్‌టేకర్, సైక్రియాట్రిక్ సోషల్ వర్కర్, ఆర్‌కేఎస్‌కు కన్సల్టెంట్, కౌన్సిలర్, సెక్యూరిటీ గార్డు, వార్డు క్లీనర్, సపోర్టింగ్ స్టాఫ్, కేస్ రిజిస్ట్రీ అసిస్టెంట్ పోస్టులకు సంబంధించిన ప్రావిజినల్ మెరిట్ జాబితా విజయనగరం.ఏపీ. జీఓవి. ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 24వ తేదీ సాయంత్రం 5 గంటలులోగా తెలపాలని పేర్కొన్నారు.

మనసు పెట్టి పని చేయండి

- నిజమైన గ్రామ స్వరాజ్యం మీతోనే..
- సచివాలయ కార్యదర్శుల శిక్షణలో కలెక్టర్ సూర్యకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.సూర్యకుమారి



శిక్షణ తరగతులకు హాజరైన సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది

విజయనగరం అర్బన్: సచివాలయ వ్యవస్థ మన రాష్ట్రానికే తలమానికం.. ప్రతి సచివాలయ ఉద్యోగి మనసు పెట్టి పనిచేయండి.. అభివృద్ధి పనులతో పాటు ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించి గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేయండి అంటూ కలెక్టర్ ఎ.సూర్యకుమారి పిలుపునిచ్చారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం విజయనగరం డివిజన్‌కు సంబంధించిన సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు ఏపీ సేవ–సిటిజెన్ సర్వీసెస్ పోర్టల్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ చట్టాన్ని పక్కాగా అమలుచేయాలన్నారు. గ్రామస్థాయిలో వాస్తవ అధికారాలన్నీ సచివాలయ సిబ్బందికి ఉంటాయని స్పష్టం చేశారు. వీటితో గ్రామాల అభివృద్ధి, ప్రజాప్రయోజనకర పనులు చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను పక్కాగా అమలుచేయాలన్నారు. అర్హులందరూ పథకాల ప్రయోజనం పొందేలా చూడాలన్నారు. గ్రామీణ ప్రజల ఆదాయాన్ని పెంచే మార్గాలను పరిశీలించాలన్నారు. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలు, న్యూట్రిగార్డెన్స్, సంతలు, దుకాణాల నిర్వహణపై దృష్టిసారించాలని ఆదేశించారు. పల్లెల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. స్పందన వినతుల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వమిత్వ కార్యక్రమంలో గ్రామకంఠాలకు టైటిల్ ఇచ్చే ప్రక్రియను జాగ్రత్తగా జరపాలని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ డాక్టర్ అశోక్‌కుమార్, డీపీఓ నిర్మలా దేవి, జిల్లా కో ఆర్డినేటర్ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫోర్జరీ చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

భోగాపురం: మండలంలోని రావాడ గ్రామానికి చెందిన కొండపు రాధాకృష్ణరెడ్డి సర్వే నంబర్ 148 గ్రామకంఠంలో ఉన్న సుమారు 205.55 చదరపు గజాల భూమికి సంబంధించి తన సంతకాన్ని ఫోర్జరీ చేసి తప్పుడు ధ్రువీకరణ పత్రాన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి సమర్పించి భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడంటూ వీఆర్వో బి.అనూరాధ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకున్న భూమి విలువ బహిరంగ మార్కెట్లో సుమారు రూ.25లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఉంటుందని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఎస్సై కృష్ణమూర్తిని వివరణ కోరగా సంతకం ఫోర్జరీ కేసుకు సంబంధించి పూర్తి వివరాలు సేకరించి, విచారణ చేపట్టి బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

క్రషర్ దగ్ధం


కాలి బూడిదయిన క్రషర్

బొబ్బిలి రూరల్: మండలంలోని పెంట గ్రామంలో చెరకు క్రషర్ దగ్ధమైంది. బుధవారం మధ్యాహ్నం గ్రామంలోని గంట యయాతికి చెందిన క్రషర్‌ను క్రషింగ్‌కు సిద్ధం చేస్తున్నారు. అనుకోకుండా జరిగిన ఈ ప్రమాదంలో క్రషర్ రేకులు, మోటార్, పైపులు, వైర్లు కాలి బూడిదయ్యాయి. దీంతో యజమానికి రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు స్థానికులు చెబుతున్నారు.

12 అడుగుల కొండ చిలువ హతం


గ్రామంలోకి చొరబడిన కొండచిలువ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఉంబేసు పంచాయతీ మూల జమ్ము గ్రామంలో చొరబడిన 12 అడుగుల కొండ చిలువను గ్రామస్తులు హతమార్చారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ మంగళవారం రాత్రి కాలనీ చివరి ఇంట్లో కోళ్ల అరుపుల శబ్దం విని వెళ్లి చూసేసరికి పాము కనిపించిందని, దీంతో కర్రలతో కొట్టి చంపినట్లు చెప్పారు. కొండను ఆనుకుని గ్రామం ఉండడం వల్ల ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతూనే ఉంటాయని గ్రామస్తులు చెబుతున్నారు.

మద్యం తరలింపు కేసులో వ్యక్తికి జైలు శిక్ష

భోగాపురం: బైక్‌పై అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన కొల్లి సూరిబాబుకు రూ.2 లక్షల జరిమానాతో పాటు ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ బి.వి. విజయలక్ష్మి తీర్పు చెప్పినట్లు ఎస్‌ఈబీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎంవీవీ అప్పారావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక ఎస్‌ఈబీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2021 ఫిబ్రవరి 6న మండల కేంద్రంలోని ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి కొల్లి సూరిబాబు 82 మద్యం సీసాలను తీసుకుని బైక్‌పై తరలిస్తూ పట్టుబడ్డాడన్నారు. అప్పట్లో నిందితుడిపై కేసు నమోదు రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ కేసుపై బుధవారం కోర్టులో ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ సుబ్రహ్మణ్యం వాదనలను వినిపించగా జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ విజయలక్ష్మి ముద్దాయికి రూ.2 లక్షలు జరిమానాతో పాటు ఆరు నెలలు శిక్ష విధించినట్లు తెలిపారు.

తిండి కలిగితే కండ కలుగును..!

- పిల్లలకు బలవర్ధకమైన పౌష్టికాహారం అందిస్తున్న ప్రభుత్వం
- తగ్గిన పౌష్టికాహార లోపం
- జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు 2,499
- ఐదేళ్ల లోపు పిల్లలు 79,419 మంది


విజయనగరం పట్టణంలోని బొబ్బాది పేట అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు


చిన్నారి ఎత్తు తూస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: మహాకవి గురజాడ అప్పారావు కలం నుంచి జాలువారిన ముత్యాల సరాలను జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం తు.చ తప్పకుండా పాటిస్తూ చేపట్టిన చర్యల వల్ల అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న పిల్లలు ఆరోగ్యవంతులవుతున్నారు. పిల్లల్లో రక్తహీనత, పౌష్టికాహారం లోపం నివారణకు ప్రభుత్వం బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందిస్తోంది. దీంతో పిల్లల్లో పౌష్టికాహార లోపం తగ్గింది. అలాగే రక్తహీనత కూడా దూరమైంది. గతంలో సరైన ఆహారం అందజేయక, పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించకపోవడం వల్ల పిల్లలు పౌష్టికాహార లోపం బారిన పడేవారు. అటువంటి సమస్యను జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గణనీయంగా తగ్గించింది.

ఆరోగ్యవంతులవుతున్న పిల్లలు

అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న పిల్లల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. దీని వల్ల వారు ఆరోగ్యవంతులవుతున్నారు. పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించడంతో పాటు తరచూ ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే పిల్లలకు అవసరమైన చికిత్స అందజేస్తున్నారు. సోమవారం అన్నం, దోసకాయ పప్పు, ఉడికించిన గుడ్డు, పాలు 100 మి.లీ, మంగళవారం పులిహోర, టమామో పప్పు, ఉడికించిన కోడిగుడ్డు, పాలు 100 మి.లీ, బుధవారం అన్నం, ఆకుకూరపప్పు, ఉడికించిన కోడిగుడ్డు, 100 మి.లీ పాలు, గురువారం అన్నం, ఆకుకూర, ఉడికించిన కోడిగుడ్డు, 100 మి.లీ పాలు, శుక్రవారం అన్నం, సొరకాయ పప్పు, మునగాకు లేదా పాలకూర, ఉడికించిన కోడిగుడ్డు, 100 మి.లీ పాలు, శనివారం వెజిటబుల్‌రైస్, ఆకుకూర, కూరగాయలతో సాంబారు, ఉడికించిన కోడిగుడ్డు, 100 మి.లీ పాలు పిల్లలకు ప్రతిరోజూ ప్రభుత్వం అందిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో నెలలో నాలుగుసార్లు మాత్రమే గుడ్డు పెడితే ప్రస్తుతం ప్రభుత్వం హయాంలో నెలకు 25 గుడ్లు పెడుతున్నారు.

తగ్గిన పౌష్టికాహార లోపం

జిల్లాలో 2,499 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో ఐదేళ్లలోపు పిల్లలు 79,419 మంది ఉన్నారు. ప్రతి పిల్లవాడి పట్ల ప్రభుత్వంఒ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ వారిలో పౌష్టికాహార లోపం తగ్గించేందుకు కృషి చేస్తోంది. పిల్లలకు ఎత్తు, బరువు తీయడానికి పరికరాలను కూడా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసింది. ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త తన పరిధిలో ఉన్న ఐదేళ్ల లోపు పిల్లలకు ప్రతి నెల ఎత్తు, బరువు తూయాలి. ఆ వివరాలను ఐసీడీఎస్ యాప్‌లో నమోదు చేసి ఉన్నతాధికారులకు తెలియజేయాలి. వయసుకు తగ్గ ఎత్తు, బరువు లేకపోతే అదనంగా పౌష్టికాహారం అందిస్తారు. ఈ నేపథ్యంలో గత ఏడాది 3,386 మంది పౌష్టికాహార లోపంతో బాధపడే పిల్లలు ఉండేవారు. ప్రస్తుతం వారి సంఖ్య 722 వరకు తగ్గింది. వయసుకు తగిన ఎత్తు లేని వారు గత ఏడాది 19,893 మంది ఉంటే ప్రస్తుతం 10,276 కి తగ్గింది. గత ఏడాది ఎత్తుకు తగ్గ బరువు లేని వారు 2,999 మంది ఉంటే ప్రస్తుతం 695కి తగ్గారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నాం. బలహీనంగా ఉన్న పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రంలో ఇస్తున్న పౌష్టికాహారంతో పాటు ఇంటి వద్ద ఇవ్వాల్సిన పౌష్టికాహారం గురించి తల్లిదండ్రులకు చెబుతున్నాం. పౌష్టికాహార లోపం ఎక్కువగా ఉన్న పిల్లలను పౌష్టికాహార పునరావాస కేంద్రానికి రిఫర్ చేస్తున్నాం. నిరంతరం పర్యవేక్షించడం వల్ల పిల్లల్లో పౌష్టికాహార లోపం చాలా వరకు తగ్గించగలిగాం.

బి.శాంతకుమారి,
జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి

104 ద్వారా 1.34కోట్లమందికి ఓపీ సేవలు

- ఫ్యామిలీ డాక్టర్ ట్రయల్ రన్ విజయవంతం
- 108,104 హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ గంగాధర్


సమావేశంలో మాట్లాడుతున్న గంగాధర్

విజయనగరం ఫోర్ట్: 104 వాహనాల ద్వారా రాష్ట్రంలో 2020జూలై నుంచి ఇప్పటి వరకు 1.34 కోట్ల మందికి ఓపీ సేవలు అందించామని 108, 104 (అరబిందో ఈఎంఎస్) సంస్థ హెడ్‌ఆఫ్ ఆపరేషన్స్ గంగాధర్. కె.పేర్కొన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన బుధవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 108, 104, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 108 అంబులెన్సుల ద్వారా నెలకు లక్ష మంది వరకు సేవలు అందిస్తున్నామని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో 15 నిమిషాలకు, గ్రామీణ ప్రాంతాల్లో 20 నిమిషాలకు, గిరిజన ప్రాంతాల్లో 25 నిమిషాలకు 108 అంబులెన్సు చేరుకుంటుందని తెలిపారు. రిఫరల్ కేసులు ఎక్కువగా వస్తున్నాయని, రోడ్డు ప్రమాదాలు, గర్భిణులు, గుండె సంబంధిత రోగులు ఎక్కువగా 108 అంబులెన్సు సేవలను వినియోగించుకుంటున్నారని తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ప్రసవించిన మహిళలకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను అందించడానికి వీలుగా ప్రభుత్వనికి ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు చెప్పారు.

సిబ్బందికి ప్రశంసలు

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం విజయవంతమైందని తెలిపారు. 108, 104, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను మరింత బలోపేతం చేయనున్నట్లు చెప్పారు. ఉద్యోగుల సమస్యలు తెలుసుకోవడానికి జిల్లాకు వచ్చినట్లు చెప్పారు. కోవిడ్ మహమ్మారి తీవ్రస్థాయిలో విజృంభించిన కాలంలో కూడా ఎంతో ధైర్యంగా 108 సిబ్బంది పనిచేశారని ప్రశంసించారు. 108, 104 జిల్లా అధికారులు కూడా బాగా పనిచేస్తున్నారని కితాబిచ్చారు. వృత్తి పట్ల ఉద్యోగులు అంకిత భావంతో పనిచేయాలని కోరారు. 108 ఉద్యోగులు మద్యం మత్తులో వాహనాలు నడిపినా, ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాలని రోగులను బలవంతం పెట్టినా తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం ఉద్యోగులతో ప్రత్యేకంగా సమావేశమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో 108 జిల్లా మేనేజర్ వెంకటరమణ, 104 జిల్లా మేనేజర్ వినోద్, ఫ్లీట్ మేనేజర్ జగ్గరాజు, డాక్టర్ వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఉప్పు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సీఐడీ ఎస్సైకి గాయాలు


ప్రమాదంలో గాయపడిన సీఐడీ ఎస్సై అర్జున్

కొత్తవలస రూరల్: కొత్తవలస మండలం మిందివలస జంక్షన్ వద్ద బుధవారం రెండు బైక్‌లు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో సీఐడీ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న గొల్లు అర్జున్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తవలస మండలం వీరభద్రపురం గ్రామానికి చెందిన గొల్లు అర్జున్ విశాఖపట్నంలోని పైనాపిల్ కాలనీ వద్ద గల కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా బుధవారం ఆయన రాజమండ్రి వెళ్లాల్సి ఉండడంతో కొత్తవలస నుంచి సబ్బవరం మీదుగా అనకాపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకుని రైల్లో వెళ్లేందుకు బైక్‌పై ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో మిందివలస వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొని ప్రమాదం జరగడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను విశాఖ సెవెన్‌హిల్స్‌కు చికిత్స నిమిత్తం తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు.

ముఖ్యమంత్రిని కలిసిన ఎంపీ,ఎమ్మెల్సీ


సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఎంపీ బెల్లాన చంద్రశేఖర్


సీఎం జగన్‌మోహన్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

చీపురుపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ బుధవారం కలిశారు. శ్రీకాకుళం జిల్లాలోని నరసన్నపేటలో జరిగిన భూముల రీసర్వే పట్టాల పంపిణీ కార్యక్రమానికి వచ్చిన ముఖ్యమంత్రిని హెలిప్యాడ్ వద్ద ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కలిశారు.

ఎమ్మెల్సీ సురేష్‌బాబు సాదర స్వాగతం

నెల్లిమర్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు(సురేష్‌బాబు) సాదర స్వాగతం పలికారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటకు విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేశారు.

గుంప గదబవలస సమీపంలో 'ఘీంకారం'

కొమరాడ: మండలంలోని కల్లికోట, గుంపగదబవలస మధ్యలో గజరాజులు సంచరిస్తున్నాయని అటవీశాఖ సిబ్బంది బుధవారం తెలిపారు. ఈ మేరకు కల్లికోట, గంగిరేగువలస, దుగ్గి తదితర ప్రాంత ప్రజలు అప్రమంతా ఉండాలని సూచించారు. రైతులు రాత్రిపూట పొలాల్లోకి వెళ్లవద్దని కోరారు. గజరాజులు కనబడితే ఎలాంటి కవ్వింపు చర్యలకు పాలుపడవద్దని హెచ్చరించారు. గజరాజులు సంచరిస్తున్న గ్రామల్లో రాత్రి పూట ప్రయాణం చేసిన వారు టేకర్స్‌ను సమాచారం అడిగి తెలుసుకోవాలని స్పష్టం చేశారు.


గుంపగదబవలస పరిసరాల్లో సంచరిస్తున్న గజరాజులు

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

- ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు నాగరాజు


మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు

చీపురుపల్లి: ఎస్సీ కులంలో ఏబీసీడీ వర్గీకరణకు వచ్చే పార్లమెంటు సమావేశాల్లో చట్టబద్ధత కల్పించాలని ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు కోరారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం చీపురుపల్లి వచ్చిన ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో కోరుకొండ దాలయ్య మాదిగ నేతృత్వంలో విజయనగరం జిల్లా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ కోసం మాదిగ జాతి మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం రాబోయే శీతాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఎస్సీ వర్గీకరణ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మాదిగలను బీజేపీ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. బీజేపీ ప్రతిపక్షంలో ఉండగా అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వర్గీకరణ చేస్తామని చెప్పి ఎనిమిది సంవత్సరాలు గడిచినా ఎలాంటి పురోగతి లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. 2023 జనవరి 6న బెంగళూరులో జరగనున్న ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యవర్గ సమావేశానికి జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ భోగి శ్రీను మాదిగ, రాష్ట్ర జాయింట్ కార్యదర్శి యందవ వరప్రసాద్, సీనియర్ నాయకులు యందవ నారాయణరావు మాదిగ, కోరుకొండ దాలయ్య తదితరులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

- బూడిదైన రూ.2లక్షల గృహోపకరణ సామగ్రి


బాధితురాలిని ఓదారుస్తున్న సర్పంచ్ విరోతి కొండలరావు

కొత్తవలస/కొత్తవలస రూరల్: మండల కేంద్రంలోని ఆర్‌టీసీ కాంప్లెక్స్ సమీప వినాయకనగర్‌కు చెందిన గొల్లవిల్ల సీతమ్మకు చెందిన పూరిల్లు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా బుధవారం ఉదయం దగ్ధమైంది. సీతమ్మ గత 20 సంవత్సరాలుగా పూరిగుడిసెలో ఉంటూ టీ కొట్టు నడుపుతూ జీవనోపాధి పొందుతోంది. బుధవారం తెల్లవారు జామున ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా మంటలు ఎగసిపడి క్షణాల్లో అలుముకున్నాయి. చెంతనే గల ఫైర్ సిబ్బందికి సమాచారం అందించినా మరమ్మతుల కారణంగా శకటం అందుబాటులోకి రాలేదు. దీంతో శారద కర్మాగారానికి చెందిన ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలను అదుపుచేసింది. ఇంతలోనే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.2లక్షల విలువైన గృహోపకరణాలు కాలిబూడిదయ్యాయి. సమాచారం మేరకు రెవెన్యూ,పోలీస్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణాలు తెలుసుకుని ఆస్తినష్టంపై అంచనా వేశారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి


సంఘటనా స్థలంలో వాసుదేవ్ మృతదేహం (ఇన్‌సెట్లో) వాసుదేవ్(ఫైల్)

రామభద్రపురం: మండలకేంద్రంలోని చొక్కాపు వాని చెరువు వద్ద బుధవారం లారీ ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నం జిల్లా మధురవాడలోని బాబూజీ నగర్ కాలనీకి చెందిన మండల వాసుదేవ్(39) భవనాల నిర్మాణంలో సెంటరింగ్ చేసేందుకు వారం రోజుల క్రితం ఒడిశాలోని రాయగడలో వెళ్లాడు. భార్యా పిల్లలను చూసేందుకు బొబ్బిలి మీదుగా బైక్‌పై ఇంటికి వెళ్తుండగా స్థానిక చొక్కాపువాని చెరువు వద్దకు వచ్చేసరికి ఆదే రూట్‌లో వస్తున్న మరో ద్విచక్రవాహనం వెనుక నుంచి ఢీకొనడంతో ముందు వెళ్తున్న వాసుదేవ్ కిందపడి తుళ్లిపోయాడు. అదే సమయంలో బొబ్బిలి నుంచి వస్తున్న లారీ కింద పడిన వాసుదేవ్‌ను సుమారు 50 మీటర్లు ఈడ్చుకెళ్లింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఏఎస్సైలు అప్పారావు, చిన్నయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. ఏఎస్‌ఐ అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. మృతునికి భార్య శ్రీదేవి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 520.00
విజయనగరం	రూ. 524.00
శ్రీకాకుళం	రూ. 524.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	53,180–00
బంగారం(22సి. 10గ్రా.)	48,750–00
వెండి (కిలో)	67,000–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹ 210

ఇద్దరికి తీవ్ర గాయాలు

- కారును ఢీకొట్టిన బొలెరో


కారును ఢీకొన్న బొలెరో

పార్వతీపురం: గరుగుబిల్లి మండలం పరిధిలోని కేఆర్‌ఎస్ వలస ప్రధాన రహదారిలో బుధవారం మితిమీరిన వేగంతో వెళ్తున్న బొలెరో వాహనం ఎదురుగా వస్తున్న కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయాల పాలయ్యారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం నుంచి ఖడ్గవలస వెళ్తున్న బొలెరో వాహనం బస్సును ఓవర్‌టేక్ చేస్తున్న క్రమంలో కురుపాంనుంచి పార్వతీపురం వస్తున్న కారును బలంగా ఢీ కొట్టింది. విజయనగరం డీపీఈ ఈఈ (ఎలక్ట్రికల్ విజిలెన్స్) డి.లోవరాజు కురుపాం తనిఖీ నిమిత్తం వెళ్లి తిరిగి వస్తున్న తరుణంలో ఈ ఘటన సంభవించింది. ఈ ప్రమాదంలో కారు ముందు బాగం నుజ్జునుజ్జయింది. ప్రమాదంలో ఈఈ లోవరాజు, డ్రైవర్ మదీనాలకు బలంగా గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అత్యవసర చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం రిఫర్ చేశారు.

200 సారా ప్యాకెట్లతో వ్యక్తి అరెస్టు


స్వాధీనం చేసుకున్న సారాతో ఎస్‌ఈబీ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

పార్వతీపురంటౌన్: మండలంలోని సందివలస గ్రామంలో ఎస్‌ఈబీ టాస్క్‌ఫోర్స్ సీఐ ఎంవీ గోపాలకృష్ణ బుధవారం దాడులు నిర్వహించి 200 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అదే గ్రామానికి చెందిన ఆరిక రాము ఒడిశా రాష్ట్రంలోని అలమండ నుంచి అక్రమంగా సారా ప్యాకెట్లు తరలిస్తున్నసమయంలో అదుపులోకి తీసుకుని సారాను సీజ్‌చేసినట్లు చెప్పారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం పార్వతీపురం ఎస్‌ఈబీ స్టేషన్‌కు అప్పగించామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

సక్రమంగా ధాన్యం కొనుగోళ్లు

- తహసీల్దార్ ఆదిలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆదిలక్ష్మి

డెంకాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతుల నుంచి పక్కాగా ధాన్యం కొనుగోలు చేపట్టాలని తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి అన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లపై సిబ్బందికి బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ ఏడాది ధాన్యం కొనుగోలులో మిల్లర్ల పాత్ర ఏమాత్రం ఉండదన్నారు. ప్రభుత్వ విధి,విధానాల మేరకు కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ పూడి నిర్మల, సీఎస్‌డీటీ మురళి, ఈఓపీఆర్‌డీ అప్పలనాయుడు, గ్రామ వ్యవసాయ సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు, రైతు సహాయకులు, రూట్ ఆఫీసర్లు, కస్టోడియన్ అధికారులు పాల్గొన్నారు.

దుకాణాల్లో తనిఖీలు



దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న కార్పొరేషన్ అధికారులు

విజయనగరం: నగరంలో నిషేధిత ప్లాస్టిక్ అమ్మకాలపై కార్పొరేషన్ అధికారులు ఉక్కుపాదం మోపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను విక్రయించే దుకాణదారులపై కొరడా ఝుళిపించారు. ఎనిమిది బృందాలుగా ఏర్పడి నగరంలోని పలు దుకాణాల్లో బుధవారం దాడులు చేపట్టి, నిబంధనలు ఉల్లంఘిన వ్యాపారులకు జరిమాన విధించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ కమిషనర్ శ్రీరాములనాయుడు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దాడులు ఉద్ధృతం చేస్తున్నామని చెప్పారు. పళ్లు, పూలు, కూరగాయల విక్రయదారులు ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు వినియోగించినట్లయితే రూ.5000 తక్కువ కాకుండా అపరాధ రుసుం... హోల్‌సేల్ దుకాణదారులు పట్టుబడితే 25 వేల రూపాయల వరకు అపరాధ రుసుం విధిస్తామన్నారు. నగరాన్ని ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు దాడులు నిరంతం చేస్తామని స్పష్టం చేశారు.

పసపాంలో పంటకోత ప్రయోగం



పసపాంలో పంటకోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయ అధికారి నీలిమ, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని పసపాం గ్రామంలో బుధవారం పంటకోత ప్రయోగం నిర్వహించారు. వ్యవసాయాధికారి కె.నీలిమ ఆధ్వర్యంలో రైతు కంది రమణకు చెందిన పొలంలో 5/5 విస్తీర్ణంలో నిర్వహించిన ప్రయోగంలో 14.950 కిలోల దిగుబడి వచ్చింది. అలాగే కుమిలి, వెంపడాం, గుంపాం, పతివాడ గ్రామాల్లో కూడా ప్రయోగాలు చేపట్టారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు, రైతులు పాల్గొన్నారు

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న విద్యార్థులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థం ఉన్నత పాఠశాలలో విద్యార్థులు బుధవారం నిర్వహించిన సైన్స్ ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. ఉపాధ్యాయుల సూచనల మేరకు విద్యార్థులు వివిధ రకాల ప్రాజెక్టులను సిద్ధం చేసి ప్రదర్శించారు. ఉపాధ్యాయులు ప్రదర్శనను తిలకించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శాస్త్రి పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు ఆచరించాలి



దైవసందేశం వినిపిస్తున్న రివైవలిస్ట్ మధుమనోహర్, తదితరులు

విజయనగరం టౌన్: క్రీస్తు బోధనలు సర్వమానవాళికి అనుసరణీయమని, ప్రతి ఒక్కరూ పాటించాలని లంకవీధి రివైవల్ చర్చ్ పాస్టర్ రివైవలిస్ట్ మధు మనోహర్ అన్నారు. హార్ట్ ఫర్ నేషన్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో స్థానిక గురజాడ కళాభారతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్న క్రైస్తవ ఉజ్జీవ పండుగలలో రెండోరోజు బుధవారం దైవ సందేశాన్ని భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్‌లు యబ్బోజు చౌదరి, సునీల్, ఎస్.పాల్, జయప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

బాబా బోధనలు అనుసరణీయం

- డాక్టర్ అక్కెన శ్రీరామ్మూర్తి
- ఘనంగా సత్యసాయి జయంతి



విజయనగరం టౌన్: పురవీధుల్లో సాగుతున్న రథోత్సవం



డెంకాడ: పినతాడివాడలో సత్యసాయిబాబా చిత్రపటం, పాదుకులతో ఊరేగింపు

విజయనగరం ఫోర్ట్: సత్య సాయిబాబా బోధనలు సర్వమానవాళికి అనుసరణీయమని డాక్టర్ అక్కెన శ్రీరామ్మూర్తి అన్నారు. బుధవారం స్థానిక సాయి ఆస్పత్రిలో బాబా జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 300 మంది పేదలకు బియ్యం, దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బాబా తన జీవితం ద్వారా నిస్వార్థ సేవాతత్వాన్ని ప్రబోధించారని చెప్పారు. సేవాభావంలోనే దైవత్వం ఉందని చాటి చెప్పిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో సాయి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఎ. లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ..

డెంకాడ: మండలంలోని పలు గ్రామాల్లో సత్య సాయిబాబా 97వ జయంతి ఘనంగా నిర్వహించారు. పినతాడవాడ గ్రామంలో సత్యసాయి చిత్రపటం, పాదుకలతో గ్రామంలో భారీ ఊరేగింపు చేపట్టారు. అలాగే డెంకాడ సత్యసాయి మందిరంలో



విజయనగరం ఫోర్ట్: పేదలకు బియ్యం , దుప్పట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ శ్రీరామ్మూర్తి

ప్రత్యేక పూజలు నిర్వహించారు. డెంకాడ సొసైటీ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం, మాజీ అధ్యక్షుడు ప్రదీప్‌రాజు చేతుల మీదుగా 125 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి సభ్యులు వాళ్లె సూర్యనారాయణ, ఎస్.సూరినాయుడు, భక్తులు పాల్గొన్నారు.

వేడుకగా రథోత్సవం..

విజయనగరం టౌన్: సత్యసాయి జయంతి వేడుకల్లో భాగంగా స్థానిక రింగ్‌రోడ్డు ఓం మందిరంలో స్వామివారి మూల విరాట్‌కు 108 కళశాలతో జలాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి జ్యోతిప్రజ్వలన, పుష్పామాలంకరణ చేశారు. సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు సునీల్ కుమార్ రథో ఆధ్వర్యంలో పురవీధుల్లో స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. 97 రకాల ప్రసాదాలతో స్వామివారికి మహా నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తంగుడుబిల్లిలో..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని తంగుడుబిల్లిలో సత్యసాయిబాబా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా భక్తులు సాయి నాథడికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అన్నసమరాధన నిర్వహించారు.

పార్టీ పటిష్టతే ముఖ్యం...



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం:

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పటికీ పార్టీ పటిష్టతే ముఖ్యమని స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. కొత్తపేట యాదవ కల్యాణ మంటపంలో 1,2,3,4,12,13,14 డివిజన్‌లకు సంబంధించి నిర్వహించిన వైఎస్సార్‌సీపీ జోనల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పార్టీ పటిష్టానికి కార్యకర్తలే వెన్నెముకన్నారు. జెండా పట్టుకున్న కార్యకర్తలకు అండగా నిలబడాలని సూచించారు. ప్రజా సంకల్ప యాత్ర ద్వారా ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఒక క్యాలెండర్ ప్రకారం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి లభిస్తోన్న ఆదరణతో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. విజయనగరం నియోజకవర్గ టీడీపీ నేతలు తమ ఉనికి చాటుకోవడానికి ప్రతి సోమవారం గ్రీవెన్స్‌సెల్‌లో వినతిపత్రాలు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. కరోనా కష్టకాలంలో అశోక్ బంగ్లాకు తాళాలు వేసుకుంటే, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజల మధ్య ఉంటూ భరోసా కల్పించిన విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. అందుకు ప్రతిఫలంగానే కార్పొరేషన్ ఎన్నికల్లో 50కి 48 స్థానాలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించారని చెప్పారు. ఫ్లోర్ లీడర్, జోనల్ ఇన్‌చార్జ్ ఎస్‌వీవీ రాజేష్ మాట్లాడుతూ, అందరి సమష్టి కృషి ఫలితంగానే పార్టీ పటిష్టమవుతుందన్నారు.

ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన బొంగ భానుమూర్తిని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అభినందించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ ఇసరపు రేవతీదేవి, జోనల్ ఇన్‌చార్జ్ ముద్దాడ మధు, నాయకులు ముచ్చు శ్రీనివాసరావు, ఇసరపు రామకృష్ణ, కార్పొరేటర్లు బండారు ఆనంద్, వజ్రపు సత్యగౌరి, మారోజు శ్రీనివాసరావు, బుంగ రూపదేవి, కో ఆప్షన్ సభ్యురాలు ముద్దాడ రమణి, పైడితల్లి అమ్మవారి పాలకమండలి సభ్యుడు వెత్స శ్రీనివాసరావు, పార్టీ డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

విజయనగరం ఫోర్ట్: ప్రధానమంత్రి క్షయ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయవ్యాధికి చికిత్స తీసుకుంటున్న ముగ్గురు చిన్నారులను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ ఉప్పు అప్పలరాజు దత్తత తీసుకున్నారు. వారికి పౌష్టికాహారం అందించేందుకు 12, 600 ఆర్థికసాయాన్ని డీఎంహెచ్‌ఓ ఎస్‌వీ రమణకుమారి చేతుల మీదుగా జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ రామేశ్వరి ప్రభుకు అందజేశారు .

ఆరోగ్యశ్రీ నిధుల వినియోగంపై ఆడిట్

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి ఐదేళ్ల కాలంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా విడుదలైన నిధుల వినియోగంపై ఆడిట్ అధికారులు బుధవారం ఆడిట్ నిర్వహించారు. ఎంత నిధులు విడుదల అయ్యాయి. ఏఏ అవసరాలకు వినియోగించారు, వాటికి సంబంధించి బిల్లులపై విచారణ చేపట్టారు.

ముద్ర రుణాలతో మేలు



ముద్ర రుణాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బ్యాంక్ అధికారులు

విజయనగరం టౌన్: ముద్ర రుణాలతో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరగనుందని బ్యాంక్ ఆఫ్ బరోడా కొత్త అగ్రహారం శాఖ మేనేజర్ కె. శశిభూషణరావు అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయం ఆవరణలో వినియోగదారుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరుద్యోగ యువత ఆటోలు, కార్లు కొనుగోలుకు ప్రైవేట్ ఫైనాన్సియర్ల వద్ద మోసపోతున్నారన్నారు. ముద్ర రుణాలతో స్వయం సమృద్ధి చెందవచ్చన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు ఐదుకోట్ల రూపాయల రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం రుణాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చిన్నవీధి బ్రాంచ్ మేనేజర్ బంకపల్లి సురేష్, రింగురోడ్ బ్రాంచ్ మేనేజర్ ఉదయ్‌కుమార్, జిల్లా మార్కెటింగ్ మేనేజర్ ఎస్.సుధాకర్, సౌమ్య, పలువురు బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రులు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సంధ్య

డెంకాడ: విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని, అదే సమయంలో తల్లిదండ్రులు కూడా సహకరించాలని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య అన్నారు. మండలంలోని అక్కివరం పంచాయతీ గొల్లపేట ఏపీ మోడల్‌స్కూల్‌లో 9, 10 తరగతుల విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాణాత్మక మూల్యాంకనం-2లో విద్యార్థులు సాధించిన ఫలితాలపై చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, పదో తరగతిలో శతశాతం ఫలితాలు సాధించేందుకు కార్యచరణ రూపొందించామని తెలిపారు. దీనికి తల్లిదండ్రుల సహకారం అవసరమన్నారు. సమావేశంలో స్కూల్ తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ముద్దాడ రాము, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా సహస్ర దీపారాధన



విజయనగరం టౌన్: శివలింగాకృతిలో దీపారాధన



నెల్లిమర్ల రూరల్: శివలింగాకారంలో దీపారాధన

విజయనగరం టౌన్: కార్తీకమాసం పర్వదినాలను పురస్కరించుకొని స్థానిక అయ్యకోనేరు దక్షిణగట్టులో గల ఉమామహేశ్వరాలయంలో బుధవారం రాత్రి సహస్ర దీపార్చన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆలయ అధ్యక్షుడు అయ్యగారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో శివలింగాకృతిలో మహిళలు దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసాశర్మ, సందీప్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

పెద బూరాడపేటలో..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పెద బూరాడపేటలో ఉన్న అతి పురాతన బాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో దీపారాధన అత్యంత వైభవంగా నిర్వహించారు. మాస శివరాత్రిని పురస్కరించుకొని మంగళవారం అర్ధరాత్రి వరకు దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో సర్పంచ్ మక్కువ తవుడమ్మ, భక్తులు పాల్గొన్నారు.

పక్కాగా ప్లాస్టిక్ ఉత్పత్తుల నిషేధం...

- నగర పంచాయతీ కమిషనర బాలాజీ ప్రసాద్



పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న కమిషనర్ బాలాజీప్రసాద్

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో వ్యాపారులంతా ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా పాటించాల్సిందేనని కమిషనర్ పి. బాలాజీప్రసాద్ స్పష్టం చేశారు. ఆ ప్రాంతంలోని షాపులను బుధవారం ఆయన తనిఖీచేశారు. ఆయా షాపుల నుంచి సుమారు 5 కిలోల నిషేధిత పాలిథిన్ కవర్లు, కప్పులు, గ్లాసులను స్వాధీనం చేసుకున్నారు. సదరు షాపుల యజమానులకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాల మేరకు పాలిథిన్, ప్లాస్టిక్ ఉత్పత్తుల క్రయ,విక్రయాలు నిలిపివేయాలని ఆదేశించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి. శ్రీనివాసరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

విజయనగరం: వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలను బుధవారం పంపిణీ చేశారు. నగరంలోని కణపాక చైతన్య యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ పీవీఎల్ సుబ్బారావు, ప్రముఖ వైద్యుడు వెంకటేశ్వరరావు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు మజ్జి కాంతారావు, రామకృష్ణ, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీసీసీబీ అక్షరాస్యత కౌన్సిలర్ ప్రభాకరరావు

విజయనగరం రూరల్: ప్రతి ఒక్కరికీ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరమని విజయనగరం డీసీసీబీ అక్షరాస్యత కౌన్సిలర్ పి. ప్రభాకరరావు అన్నారు. వీటీ అగ్రహారం డీసీసీబీ కార్యాలయంలో ఆర్థిక అక్షరాస్యతపై ఖాతాదారులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అపరిచితుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌కు స్పందించరాదన్నారు. అలాగే గుర్తింప కార్డులు, ఆధార్ వివరాలు, పిన్ నంబర్లు చెప్పకూడదని తెలిపారు. ఆదాయానికి మించి ఖర్చుపెడితే ఆర్థిక సమస్యలు తలెత్తుతాయని, ప్రతి ఒక్కరూ పొదుపుమంత్రం పాటించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ చందక శ్రీను, జొన్నాడ, జొన్నవలస, గొట్లాం పీఏసీఎస్ అధ్యక్షులు పి. సత్యారావు, కెల్ల త్రినాథ్, మహంతి రమణ, ఏపీసీఓబీ అధికారి సత్యనారాయణ రాజు, బ్రాంచ్ మేనేజర్ సతీష్ రాజు, బ్యాంకుల అధికారులు, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ కార్యక్రమాలపై ఆరా..



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

- 16వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం

విజయనగరం: నగరంలోని 16 డివిజన్ చిక్కాలవీధి రామ మందిరం నుంచి బుధవారం ప్రారంభించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు కోలగట్లకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కోలగట్ల, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అమలుపై ప్రజాభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, ఆసరా, చేయూత వంటి అనేక సంక్షేమ పథకాలు అందుతుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సూచనల మేరకు గడప గడపకు.. కార్యక్రమంలో ప్రతి ఇంటికీ వెళ్తూ లబ్ధిదారులకు అందుతున్న పథకాలపై ప్రజాస్పందన అడిగి తెలుసుకుంటున్నామన్నారు. ప్రజలు తెలియజేసిన స్థానిక సమస్యలను ఎమ్మెల్యే కోలగట్ల వెంటవెంటనే పరిష్కరిస్తున్నారని చెప్పారు. కార్పొరేటర్ గుజ్జల నారాయణరావు మాట్లాడుతూ, తమ డివిజన్ ప్రజలకు అన్ని రకాల పథకాలు అందాయని, అందుకే ఎమ్మెల్యే, తదితరులు ఘన స్వాగతం పలికారని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతీదేవి, సహాయ కమిషనర్ ప్రసాదరావు, కార్పొరేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణలో సమస్యలు రాకూడదు



కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ బంగార్రాజు

విజయనగరం రూరల్: ధాన్యం సేకరణలో ఎటువంటి సమస్యలు రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజు అన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లకు ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధాన్యం సేకరణకు గోనెలు సిద్ధం చేయాలని తెలిపారు. రవాణా విషయంలో ఎటువంటి ఇబ్బందులుండకూడదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంటా వెంకటరావు, మండల వ్యవసాయ అధికారి ఎం ఉమామహేశ్వరనాయుడు, ఈఓపీఆర్‌డీ డి.తిరుపతినాయుడు, సీఎస్‌డీటీ జగన్, తదితరులు పాల్గొన్నారు.

సంస్కృత కళాశాల విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన సంస్కృత కళాశాల విద్యార్థినులు

విజయనగరం టౌన్: వరల్డ్ ఫోరం ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్, ఆర్ట్ ఆఫ్ లివింగ్, భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో 'ఝంకృతి ' పేరుతో ఆన్‌లైన్ ద్వారా ఇటీవల నిర్వహించిన పోటీల్లో మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాలకు చెందిన విద్యార్థులు మూడో బహుమతి కైవసం చేసుకున్నారని కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పి.గౌరీశ్వరరావు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ కళాశాలకు చెందిన ఎస్.గాయత్రి, కె.భారతి, సీహెచ్. శ్రావణి, ఎస్.వసంత, వి.మల్లేశ్వరి, ఎస్.శైలు జానపద విభాగంలో థింసా నృత్యం చేశారని చెప్పారు. 2023 జనవరి 26, 27, 28 తేదీల్లో బెంగళూరులో నిర్వహించనున్న కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ గురు రవిశంకర్, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు డాక్టర్ వి.కన్నంనాయుడు, రమా గీతాదేవి, సీహెచ్ గంగాభవానీ, బి.సులోచన, టి.రమణ, ఉమామహేశ్వరరావు, తదితరులు విద్యార్థులను అభినందించారు.

25న ఒంగోలులో రొయ్యల రైతుల సదస్సు

సాక్షి, అమరావతి: రొయ్యల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు ఈ నెల 25న ఒంగోలులో సదస్సును నిర్వహిస్తున్నారు. రొయ్యల ధరలు, మేతల ధరలు, విద్యుత్ ఇబ్బందులు, ఆక్వా జోన్ తదితర సమస్యలపై చర్చించనున్నట్లు రొయ్యల రైతుల సంఘం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఒంగోలు బృందావనం కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం ఈ సదస్సు జరుగుతుంది.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం లేదు

- ఇప్పటికే 2.49 లక్షల టన్నుల సేకరణ: పౌరసరఫరాల సంస్థ ఎండీ వీరపాండియన్

సాక్షి, అమరావతి: ఖరీఫ్ ధాన్యం సేకరణలో ఎలాంటి జాప్యం లేదని పౌరసరఫరాల సంస్థ ఎండీ వీరపాండియన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 3,366 ఆర్బీకేల్లో సుమారు 14వేల మంది సిబ్బందితో ధాన్యం కొనుగోళ్లకు శ్రీకారం చుట్టామన్నారు. ఇప్పటివరకు శ్రీకాకుళం, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కాకినాడ, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో 43,955 మంది రైతుల నుంచి 2.49 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ఇందులో 21 రోజుల నిర్ణీత వ్యవధి కంటే ముందుగానే రైతులకు మద్దతు ధర సొమ్ము జమ అయ్యిందన్నారు. కోతలు ఆలస్యమైన జిల్లాల్లో వారంలోగా కొనుగోలు కేంద్రాలను తెరవనున్నట్టు పేర్కొన్నారు. గోనె సంచులు, హమాలీలు, రవాణా సదుపాయాలను రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచినట్టు చెప్పారు. రైతులు కమీషన్ ఏజెంట్లు, దళారులను సంప్రదించాల్సిన అవసరం లేదన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో 1902, 155251 నంబర్లతో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్టు వివరించారు. ప్రభుత్వానికి కాకుండా బహిరంగ మార్కెట్‌లో ధాన్యం విక్రయించాలనుకునే రైతులు తమ వివరాలను ఆర్బీకేల్లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు.

మిల్లర్లు, దళారుల ప్రమేయానికి అడ్డుకట్ట

ధాన్యం కొనుగోళ్ల ఆన్‌లైన్ విధానం ద్వారా మిల్లర్లు, దళారుల ప్రమేయానికి అడ్డుకట్ట వేసినట్టు పౌర సరఫరాల శాఖ కమిషనర్ అరుణ్ కుమార్ తెలిపారు. బుధవారం 'సాక్షి'తో ఆయన మాట్లాడుతూ..ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యంలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచే 80 శాతం సేకరించామన్నారు. తేమ 17 శాతం కంటే ఎక్కువ ఉన్నా కొన్ని సడలింపులతో సేకరిస్తున్నామన్నారు. ఆర్బీకేల్లోనే ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ (ఎఫ్‌టీవో) ఇస్తున్నట్టు చెప్పారు. ఎఫ్‌టీవో వచ్చిన తర్వాత రైతుకు అందులోని చూపించిన మొత్తం నిర్ణీత సమయంలో జమ అవుతుందన్నారు.

టూటౌన్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



టూటౌన్ సీఐ సీహెచ్.లక్ష్మణరావును వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: స్థానిక కొత్తపేట నీళ్ల ట్యాంక్ వద్దనున్న టూటౌన్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఎం.దీపిక బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, సీడీ ఫైల్స్, స్టేషన్ పరిసరాలు, లాకప్ గదులను పరిశీలించారు. 102 సీఆర్‌పీసీ ప్రకారం సీజ్ చేసిన వాహనాలను నిబంధనల ప్రకారం వేలం వేయాలని సూచించారు. దర్యాప్తులో ఉన్న కేసుల సంఖ్యను గణనీయంగా తగ్గించేందుకు కృషిచేస్తున్న అధికారులు, సిబ్బందిని అభినందించారు. టూటౌన్ సీఐ సీహెచ్.లక్ష్మణరావు వివిధ కేసుల్లో పురోగతిని ఎస్పీకి వివరించారు. కార్యక్రమంలో టూటౌన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వారణాశి వెళ్లే రైలుకు హాల్ట్ కల్పించండి

చీపురుపల్లి: ఉత్తరాంధ్ర ప్రజల కోరిక మేరకు విశాఖపట్నం నుంచి వారణాశి వరకు ఏర్పాటైన రైలుకు చీపురుపల్లి రైల్వేస్టేషన్‌లో హాల్ట్ సౌకర్యం కల్పించాలని వాల్తేరు డివిజన్ స్థాయిలో సమావేశంలో చర్చించినట్లు జెడ్ఆర్‌యూసీసీ మెంబర్ తాడేల ఉమ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో మంగళవారం డివిజినల్ రైల్ యూజర్స్ కమిటీ సమావేశం జరిగిందన్నారు. ఈ సందర్భంగా చీపురుపల్లి రైల్వే స్టేషన్‌లో సదుపాయాలు, రైళ్ల హాల్టు సౌకర్యాలపై చర్చించి, డీఆర్ఎం దృష్టికి తీసుకెళ్లానన్నారు. విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కృషితో విశాఖపట్టణం నుంచి వారణాశికి రైలు సౌకర్యం కలిగిందన్నారు. కోణార్క్, ఫలక్‌నూమా సూపర్ ఫాస్ట్ రైళ్లకు హాల్ట్ సదుపాయంపూ చర్చించామన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని పునఃప్రతిష్టించాలి

భామిని: మండల కేంద్రంలో ఇటీవల భారీ వాహనం ఢీకొట్టడంతో నేలకొరిగిన అంబేడ్కర్ విగ్రహాన్ని యథావిధిగా ఏర్పాటు చేయాలని దళిత సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం సబ్‌కలెక్టర్ నూరల్ కమర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రోడ్డు ఆక్రమణలు తొలగించిన తర్వాత విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేస్తామని కలెక్టర్ వారికి చెప్పారు. అలాగే ప్రభుత్వ కార్యాలయం సమీపంలో దళితవాసుల కాలనీకి ఉన్న రోడ్డుకు అడ్డంగా వేసిన కంచెను తొలగించాలని కోరారు. దీనిపై స్పందించిన సబ్‌కలెక్టర్ రోడ్డును పరిశీలించి పూర్తి వివరాలు అందించాలని తహసీల్దార్ అప్పారావుకు ఆదేశించారు.



పార్వతీపురం మన్యం జిల్లా ఉదయపురంలో మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



పశ్చిమగోదావరి జిల్లా మల్లిపూడి గ్రామంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

గడప గడపకు మన ప్రభుత్వం



కర్నూలు జిల్లా విరుపాపురంలో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం



వైఎస్సార్ జిల్లా నాగలగట్టుపల్లెలో వృద్ధురాలికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ఎమ్మెల్సీ ఎన్నికల ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

మార్చిలో ఖాళీ అవనున్న 5 ఎమ్మెల్సీ స్థానాలు

- ఆ స్థానాలకు తుది ఓటర్ల జాబితాలు డిసెంబరు 30న విడుదల
- డిసెంబరు 9 వరకు అభ్యంతరాల స్వీకరణ
- కొత్త వారు ఓటర్లుగా నమోదు చేసుకొనేందుకు అవకాశం
- బూత్ స్థాయి ఏజెంట్లకు మార్గదర్శకాలు

ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం ఓటర్లు, పోలింగ్ స్టేషన్ల సంఖ్య

నియోజకవర్గం	ఓటర్లు	పోలింగ్ స్టేషన్లు
ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు గ్రాడ్యుయేట్స్	3,64,288	320
కడప, అనంతపురం, కర్నూలు గ్రాడ్యుయేట్స్	2,91,089	358
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం గ్రాడ్యుయేట్స్	2,43,903	297
ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు టీచర్స్	20,914	175
కడప, అనంతపురం, కర్నూలు టీచర్స్	22,256	173



సాక్షి, అమరావతి: రాష్ట్ర శాసన మండలిలో పట్టభద్రులు, ఉపాధ్యాయుల నియోజకవర్గాల నుండి ఎన్నికైన ఐదుగురు సిట్టింగ్ సభ్యులు వచ్చే ఏడాది మార్చి 29న పదవీ విరమణ చేయనున్నారు. వారి నియోజకవర్గాలకు ముసాయిదా ఓటర్ల జాబితా (డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్స్)ను రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం విడుదల చేసింది. ఈ మేరకు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ జాబితాలపై డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని, వాటిని పరిష్కరించి తుది జాబితాలను డిసెంబర్ 30న విడుదల చేస్తామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డ్రాఫ్ట్ రోల్‌లో నమోదు చేసుకోలేకపోయిన అర్హులందరూ గ్రాడ్యుయేట్ల నియోజకవర్గం కోసం ఫారం-18, ఉపాధ్యాయుల నియోజకవర్గం కోసం ఫారం-19లో నమోదుకు దరఖాస్తులను దాఖలు చేయవచ్చని, ఏవైనా అభ్యంతరాలుంటే ఓటర్లు ఫారం-7, సవరణల కోసం ఫారం-8లో దాఖలు చేయవచ్చని తెలిపారు.

బూత్ స్థాయి ఏజెంట్ల సాయం

ముసాయిదా జాబితాలో సవరణల కోసం బూత్ స్థాయి ఏజెంట్ల సాయం తీసుకోవాలని ఎన్నికల సంఘం సూచించింది. అలాగే ఏజెంట్ల బాధ్యతలను కూడా వివరించింది. చనిపోయిన, మారిన ఓటర్లను ఇంటింటి సర్వే ద్వారా, ఇతర మార్గాల ద్వారా గుర్తించి ఒక జాబితా తయారు చేసి, నిర్ణీత ఫార్మాట్‌లో అధికారులకు అందించవచ్చని తెలిపింది. ఇలా ఏజెంట్లు ఒక రోజులో 10కి మించకుండా దరఖాస్తులను ఫైల్ చేయవచ్చని చెప్పింది. రాజకీయ పార్టీలు ప్రతి పోలింగ్ స్టేషన్‌కు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించాలని ఆదేశించింది.

తెలంగాణ

రామోజీపై దండయాత్ర!



ఫిల్మ్ సిటీలోకి ప్రవేశించిన సీపీఎం నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్ : తమకు కేటాయించిన ఇళ్ల స్థలాలను అప్పగించాలని లబ్ధిదారులు బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో నాగన్‌పల్లి నుంచి పాదయాత్ర నిర్వహించారు. భూములు ఉన్న రామోజీ ఫిల్మ్ సిటీ లోపలి వరకు పాదయాత్ర సాగింది. ఎర్ర జెండాలు పట్టుకొని నినాదాలు చేసుకుంటూ వందలాది మంది భూముల వద్దకు చేరుకున్నారు. పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలపై రామోజీరావు కన్ను పడిందని మండిపడ్డారు. ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి గ్రామం సర్వే నంబర్ 189, 203లో 2007లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చొరవతో రాయపోల్, పోల్కంపల్లి, నాగన్‌పల్లి, ముకునూర్ గ్రామాలకు చెందిన 576 మందికి రామోజీ ఫిల్మ్ సిటీ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చారు. అయితే నేటికీ లబ్ధిదారులు స్థలాల్లోకి వెళ్లకుండా, నిర్మాణాలు చేపట్టకుండా రామోజీ అడ్డుకుంటున్నారని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను రద్దు చేసి, ఆ భూములను టూరిజం పేరుతో రామోజీ సంస్థ దక్కించుకోవాలని చూస్తోందని ధ్వజమెత్తారు. ఇప్పటికే రెవెన్యూ అధికారులకు రామోజీరావు దరఖాస్తు చేసుకోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఫిల్మ్ సిటీ పరిధిలో ఇంకా 162 ఎకరాల ప్రభుత్వ మిగులు భూమి ఉందనీ, ఇళ్ల పట్టాలు పంపిణీ చేయని వారికి ఇక్కడే స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేయాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం స్పందించి రామోజీపై చర్యలు తీసుకోవాలని, లేదంటే ఈ నెల 28వ తేదీన రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అప్పటికీ స్పందించకుంటే ఇళ్ల స్థలాల్లో గుడిసెలు వేయిస్తామన్నారు. రోడ్లు, చెరువులు ఆక్రమించిన రామోజీపై కేసు నమోదు చేయాలని రంగారెడ్డి జిల్లా సీపీఎం నేతలు డిమాండ్ చేశారు.

చంద్రబాబు, చెంగల్రాయుడుపై న్యాయవాదుల ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న న్యాయవాదులు

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు న్యాయవాదుల సంఘం సభ్యుడు, న్యాయవాది రాజేష్‌పై జరిగిన దాడి ఘటనపై త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో న్యాయవాదులు బుధవారం ఫిర్యాదు చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఇటీవల కర్నూలులో పర్యటించినపుడు ఆయన సమక్షంలో న్యాయవాది రాజేష్‌పై టీడీపీ కార్యకర్తలు దాడి చేయడమే కాకుండా ఎమ్మెల్సీ చెంగల్రాయుడు అనుచిత వ్యాఖ్యలు చేశారు. వారిపై తక్షణమే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బాధిత న్యాయవాది రాజేష్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎంఆర్ కృష్ణ, మాజీ అధ్యక్షుడు ఓంకార్, ఉపాధ్యక్షుడు పుల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ కన్వీనర్ సువర్ణరెడ్డి, నరసింహులు, న్యాయవాదులు రామ్‌ప్రసాద్, కృష్ణమూర్తి, మద్దిలేటి, అనిల్ ఉన్నారు.

రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం వద్దు



మంగళగిరిలో చౌక దుకాణాలను తనిఖీ చేస్తున్న అరుణ్‌కుమార్

సాక్షి, అమరావతి:రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం వహించొద్దని పౌర సరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్ హెచ్చరించారు. బుధవారం ఆయన మంగళగిరిలో చౌక దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీఎంజీకేఏవై కింద ఉచిత బియ్యం పంపిణీని పరిశీలించారు. ప్రతి దుకాణం వద్ద తప్పనిసరిగా ఉచిత బియ్యం లబ్ధిదారుల జాబితా ప్రదర్శించాలని ఆదేశించారు. సమీపంలోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎండీయూ వాహన సేవలు, బియ్యం నాణ్యతపై అభిప్రాయాలను సేకరించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. నాణ్యమైన (సార్టెక్స్) బియ్యాన్ని వాహనాల్లో ఇంటి వద్దకే అందించడం ప్రారంభించిన తర్వాత రాష్ట్రంలో రేషన్ తీసుకునే వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పారు. చాలా మంది పేదలు ప్రభుత్వం ఇస్తున్న రూపాయికే కిలో బియ్యంతో కడుపు నింపుకుంటున్నట్టు చెప్పారన్నారు.

ఎఫ్‌ఆర్‌ఓ హత్యకేసు నిందితుల అరెస్ట్

కొత్తగూడెంటౌన్/సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఎఫ్ఆర్ఓ శ్రీనివాసరావు హత్యకేసులో నిందితులను అరెస్టు చేసినట్టు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ జి.వినీత్ బుధవారం తెలిపారు. శ్రీనివాసరావుపై దాడి తర్వాత నిందితులు మడకం తులా, పొడియం నంగా ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లాకు పారిపోయేందుకు ప్రయత్నించారని.. ఈ క్రమంలో జూలూరుపాడు సీఐ ఆధ్వర్యంలోని బృందం చంద్రుగొండ మండలం ఎర్రబోడు గ్రామంలో వారిని అరెస్టు చేశారని వివరించారు. వారు హత్యా నేరాన్ని అంగీకరించారన్నారు. నిందితుల నుంచి వేట కొడవళ్లను స్వాధీనం చేసుకున్నామని,వారిని కోర్టులో హాజరుపర్చామని తెలిపారు.

రెండోరోజూ ఐటీ దాడులు

సాక్షి, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి, ఆయన బంధువులు, భాగస్వాముల ఇళ్లల్లో, విద్యా సంస్థల్లో ఐటీ అధికారుల దాడులు బుధవారం రెండోరోజు కూడా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ దాడుల్లో భారీగా నగదుతో పాటు, కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారు. పన్ను ఎగవేతకు సంబంధించిన కీలక సమాచారం లభించింది. వైద్య కళాశాలల్లో సీట్లకు నిర్దేశిత ఫీజుకంటే ఎక్కువ నగదు రూపంలో తీసుకుని రియల్ ఎస్టేట్‌కు, సూరారం ఆసుపత్రికి తరలించినట్లు బయటపడింది. మరోవైపు మల్లారెడ్డి కుమారుడు మహేందర్‌రెడ్డికి ఛాతీలో నొప్పి రావడం, ఆసుపత్రి వద్ద మంత్రి ధర్నాకు దిగడం తదితర పరిణామాలతో రోజంతా హైడ్రామా నడిచింది.

సౌకర్యాలు లేవని చెబితే బిర్యానీ ఇస్తాం

- టీడీపీ నాయకుల దిగజారుడు రాజకీయాలు
- విద్యార్థులకు ప్రలోభాలు
- ఛీ కొడుతున్న జనం



టీడీపీ నాయకుల తీరును జెడ్పీటీసీకి తెలియజేస్తున్న వసతిగృహ విద్యార్థులు

చీపురుపల్లి:

వసతి గృహాల్లో సౌకర్యాలు లేవని చెబితే బిర్యానీ ఇస్తామంటూ భావిభారత పౌరులను మభ్య పెడుతున్న టీడీపీ నేతల తీరును జనం ఛీ కొడుతున్నారు. ఇదేమి రాజకీయమంటూ మండిపడుతున్నారు. చదువుకోవాల్సిన పిల్లలతో అబద్ధాలు చెప్పిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. చీపురుపల్లి పట్టణంలోని సమీకృత బాలుర వసతిగృహాన్ని టీడీపీ విజయనగరం పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జునతో పాటు పలువురు నాయకులు మంగళవారం రాత్రి సమీకృత వసతిగృహాన్ని సందర్శించారు.

సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులందరూ సదుపాయాలు బాగున్నాయని, మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారని చెప్పారు. చక్కగా చదువుకుంటున్నామని తెలిపారు. దీంతో నివ్వెరపోయిన నాయకులు అబద్ధం చెబితే బిర్యానీ ఇస్తామని, సౌకర్యాలు లేవని చెప్పాలంటూ విద్యార్థులను ప్రలోబపెట్టారు. ఈ విషయాన్ని వసతిగృహాన్ని బుధవారం సందర్శించిన జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, నాయకులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దనరావులకు విద్యార్థులు చెప్పారు. మెనూ బాగులేదని ఖాళీ పళ్లాలతో బయటకు వచ్చిన వారికి బిర్యానీ ఇస్తామని చెప్పారని, మరికొందరు నాయకులు బయటకు రావాలంటూ భయపెట్టారన్నారు. దీనిపై జెడ్పీటీసీ శిరీష మాట్లాడుతూ టీడీపీ నాయకుల చౌకబారు రాజకీయాలు మానుకోవాలన్నారు. వసతిగృహాల్లో ఇబ్బందులు ఉంటే టీడీపీ నాయకులే అవసరం లేదని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఒప్పుకోరని స్పష్టం చేశారు. విద్యార్థులను అడ్డం పెట్టుకుని ప్రభుత్వంపై బురదజల్లే యత్నాన్ని తప్పుబట్టారు. వసతి గృహం మరమ్మతుల కోసం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు రూ.41 లక్షలు నిధులు మంజూరు చేశారన్నారు. అనంతరం విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్ఆర్‌యూసీసీ మెంబర్ తాడేల ఉమ, ఆ పార్టీ నాయకులు ఇప్పిలి గోవింద, గిరడ రాందాసు, కరణం ఆది, ప్రభాత్, ఇప్పిలి కృష్ణ, మార్బల్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యసనా స్థాయి మేరకు బోధన

- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సూర్యకుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న విద్యాశాఖ రాష్ట్ర అధికారులు

విజయనగరం అర్బన్:

తరగతుల్లో పిల్లల అభ్యసనా స్థాయిని బట్టి బోధనా ప్రణాళికను రూపొందిస్తున్నట్లు కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. బడిఈడు పిల్లలందరూ పాఠశాలల్లో ఉండేటట్లుగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పిల్లల అభ్యసనాభివృద్ధి కార్యక్రమాలపై విద్యాశాఖ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్, కమిషనర్ సురేష్‌కుమార్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఎ.సూర్యకుమారి జిల్లాలో చేపట్టిన అభ్యసనాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. పాఠశాలల్లో 6,7, 8 తరగతుల పిల్లలందరూ భాష, గణితం సబ్జెక్టుల్లో కనీస సామర్థ్యాలను సాధించడానికి కృషి చేయడం జరుగుతోందని చెప్పారు. అన్ని సబ్జెక్టుల్లో కనీస పరిజ్ఞానాన్ని సాధించడానికి అవసరమైన ప్రణాళికను రూపొందించామన్నారు. పిల్లల స్వభావానికి అనుగుణంగా వ్యక్తిగత బోధన, అభ్యసన ప్రక్రియలను రూపొందిస్తామని చెప్పారు. సరైన అభ్యసన స్థాయి లేక బడులకు దూరమవుతున్న పిల్లలను గుర్తించి వారిని తిరిగి రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరిచారు. బేస్‌లైన్ పరీక్ష ద్వారా పిల్లల స్థాయి గుర్తించి, అందుకు అనుగుణంగా ప్రత్యేక అభ్యసనా పద్ధతులను రూపొందించి వారి సామర్థ్యాలను పెంచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు పాఠాలను బోధించడమే కాకుండా పిల్లలతో వ్యక్తిగతంగా చర్చించి, వారికి సంపూర్ణ అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిగా ఐటీడీఏ పీఓ



సందేహాలను నివృత్తి చేస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

కురుపాం: ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని పార్వతీపురం ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ సూచించారు. కురుపాం మండల కేంద్రంలోని శివ్వన్నపేట సమీపంలో ఉన్న గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాసేపు ఉపాధ్యాయుడిగా మారిపోయి పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినిలకు పాఠాలు బోధించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం వసతి గృహాన్ని, పరిసరాలను పరిశీలించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థులు, ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం కురుపాం-1 సచివాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు, సచివాలయంలో అందిస్తున్న పౌరసేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం



సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

గోపాలపట్నం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో ఘన స్వాగతం పలికారు. శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఉదయం ప్రత్యేక విమానంలో విజయవాడ నుంచి విశాఖ విమానాశ్రయానికి గం.09.45 నిమిషాలకు చేరుకున్నారు. రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, బీశెట్టి సత్యవతి, గొడ్డేటి మాధవి, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మలలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రత్యేక హెలికాప్టర్లో 9.50 గంటలకు శ్రీకాకుళం జిల్లాకు బయలుదేరి వెళ్లారు. ముఖ్యమంత్రితో పాటు ఎమ్మెల్సీ తలశిల రఘురాం, పొలిటికల్ సెక్రటరీ ముత్యాలరాజు వచ్చారు.

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఓటర్లు 2,43,903

- 1,55,803 మంది పురుషులు, 88,062 మంది మహిళా ఓటర్లు
- 38 మంది ఇతరులు ఓటర్లగా నమోదు
- 297 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రణాళిక
- ఎలక్టోరల్ డ్రాఫ్ట్ విడుదల చేసిన ఎన్నికల కమిషన్

సాక్షి, విశాఖపట్నం:

ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల ముసాయిదాను రాష్ట్ర ఎన్నికల కమిషన్ బుధవారం విడుదల చేసింది. ఉత్తరాంధ్ర పరిధిలో మొత్తం 2,43,903 మంది గ్రాడ్యుయేట్లు ఓటర్లుగా నమోదు చేసుకున్నట్లు ముసాయిదాలో ప్రకటించింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలో మొత్తం 297 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు డ్రాఫ్ట్‌లో పేర్కొన్నారు. ఇందులో అత్యధికంగా విశాఖపట్నం జిల్లాలో 80,105 మంది ఓటర్లుండగా, అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 10,200 ఓటర్లు నమోదయ్యారు. ఓటర్ల ముసాయిదాపై ఏవైనా అభ్యంతరాలుంటే డిసెంబర్ 9లోగా ఫారం-18 ద్వారా తెలపాలని కలెక్టర్ డా.మల్లికార్జున, డీఆర్‌ఓ శ్రీనివాసమూర్తి తెలిపారు. సంబంధిత ఈఆర్‌వోలు, ఏఈఆర్వోలు, డిసిగ్నేటెడ్ అధికారుల ద్వారా అభ్యంతరాలు, సలహాలు, సూచనలు అందించవచ్చని సూచించారు.

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ఇతరులు	మొత్తం ఓటర్లు
శ్రీకాకుళం	57	32,351	13,764	04	46,119
విజయనగరం	64	35,787	18,670	09	54,466
పార్వతీపురం మన్యం	24	11,544	5,507	01	17,052
అల్లూరి జిల్లా	14	7,085	3,112	03	10,200
విశాఖపట్నం	94	44,805	35,287	13	80,105
అనకాపల్లి	44	24,231	11,722	08	35,961
మొత్తం	297	1,55,803	88,062	38	2,43,903

స్వావలంబన

ఆల్ ఉమెన్ టీమ్

ఆకాశమే హద్దు

ఆటో మొబైల్ రంగంలో మహిళలు పని చేయడం గురించి ఎన్నో అపోహలు ఉన్నాయి. వాటిని కాలదన్ని ఈ రంగంలో అద్భుత విజయాలు సాధించిన మహిళలు ఎందరో ఉన్నారు. హర్షించదగిన, ఆహ్వానించదగిన పరిణామం ఏమిటంటే ఆటో మొబైల్ రంగంలోని దిగ్గజ సంస్థలు స్త్రీ సాధికారత, స్వావలంబనకు పెద్ద పీట వేస్తున్నాయి. తాజాగా టాటా మోటార్స్ అమృత్‌సర్‌లో 'ఆల్–ఉమెన్ కార్ షోరూమ్'ను ప్రారంభించింది...



● మహిళా శక్తి...

మహిళా స్వావలంబన లక్ష్యంగా టాటా మోటార్స్ పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో 'ఆల్–ఉమెన్ కార్ షోరూమ్' ప్రారంభించింది. సెక్యూరిటీ గార్డ్ నుంచి జనరల్ మేనేజర్ వరకు అందరూ మహిళలే. సేల్స్, మార్కెటింగ్, కారు ఫిట్టింగ్, వాషింగ్, మేనేజింగ్... ఇలా రక రకాల విభాగాల్లో ఇరవైమంది మహిళలు ఉన్నారు.

'ఇరవైమందితో ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకోవడం అనేది తేలిగ్గా జరగలేదు. కష్టపడాల్సి వచ్చింది. మహిళలు ఒక బృందంగా ఒకేచోట పనిచేయడం వల్ల అభిప్రాయాలు పంచుకోవచ్చు. ఒకరికొకరు సలహాలు ఇచ్చుకోవచ్చు. స్వావలంబనను బలోపేతం చేయవచ్చు. నేటి తరం మహిళలు ఇతరులపై ఆధారపడడం కంటే స్వతంత్రంగా ఎదగడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. వృత్తిపరమైన బాధ్యతల్లో మంచి విజయాలు సాధిస్తున్నారు' అంటోంది షోరూమ్ జనరల్ మేనేజర్ లవ్లీసింగ్. ఆటోమొబైల్ రంగంలో లవ్లీసింగ్‌కు రెండు దశాబ్దాల అనుభవం ఉంది. సేల్స్ బృందంలో సభ్యురాలిగా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించింది లవ్లీసింగ్. ఆ రోజుల్లో నగరం మొత్తంలో ఆటో మొబైల్ రంగానికి సంబంధించి సేల్స్ విభాగంలో పనిచేసిన ఏకైక మహిళ లవ్లీ. 'సేల్స్ విభాగంలో పని చేస్తున్నాను' అంటే ఆశ్చర్యంగా చూసేవారు.కొందరైతే ఒక అడుగు ముందుకు వేసి 'టీచర్ జాబ్ చేసుకోవచ్చు కదా' అని సలహా ఇచ్చేవారు. అయితే అవేమీ తనను ముందుకెళ్లకుండా అడ్డుకోలేకపోయాయి. 'సేల్స్ విభాగంలో పనిచేస్తే పదిమంది పలురకాలుగా అనుకుంటారు' అనే భయం ఉంది. ఎన్నో అపోహలు ఉన్నాయి. 'ఈ రంగాన్ని ఎందుకు ఎంచుకున్నావు? అంతమంది మగవాళ్ల మధ్య ఎలా పనిచేస్తున్నావు...' ఇలాంటి ఎన్నో ప్రశ్నలు ముందుకు వచ్చేవి. వాటిని పట్టించుకొని ఉంటే సేల్స్ విభాగంలో పనిచేసిన వారం రోజుల్లోనే ఉద్యోగాన్ని వదిలి ఇంట్లో కూర్చునేదాన్ని అంటుంది లవ్లీసింగ్.

'ఆటోమొబైల్ రంగంలో పనిచేయాలనే ఆసక్తి నాలో మొదట ఉండేది కాదు. దీనికి కారణం... పురుషులు మాత్రమే ఆ రంగంలో ఉంటారు అనుకోవడం. అయితే ఆటోమొబైల్ రంగంలో కూడా పురుషులతో సమానంగా మహిళలు తమను తాము నిరూపించుకుంటున్నారు. ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారు. వారే నాకు స్ఫూర్తి. ఇరవైమంది సభ్యులు ఉన్న బృందంలో చేరడంతో అప్పటివరకు ఉన్న కాస్తో కూస్తో భయాలు పోయాయి. ఎంతో ధైర్యం వచ్చింది. ఉద్యోగంలో చేరినట్లుగా లేదు చిన్న విశ్వవిద్యాలయంలో చేరినట్లుగా ఉంది. ఇక్కడి అనుభవాలే మాకు గొప్ప పాఠాలు' అంటుంది మార్కెటింగ్ విభాగంలో పనిచేస్తున్న సీమ.



● అమృత్‌సర్ షోరూమ్‌లో...

27 సంవత్సరాల గుర్మీత్ ఆటో మొబైల్ రంగంలోకి రావాలనుకోవడానికి ముందు–

'అంత తేలికైన విషయం కాదు. కార్లు–హెవీ డ్యూటీ ట్రక్స్ అసెంబ్లింగ్‌లో మగవాళ్లతో పోటీపడడం కష్టం. ఇండస్ట్రీలో మొదలైన కొత్త డిజిటల్ ట్రెండ్‌ను త్వరగా అందుకోవడం ఇంకా కష్టం'లాంటి మాటలు ఎన్నో వినిపించాయి.

అయితే అలాంటి మాటలేవీ తనను ఇండస్ట్రీకి రాకుండా అడ్డుకోలేకపోయాయి. ఎంజీ మోటర్స్ గత సంవత్సరం గుజరాత్‌లోని వడోదర ప్లాంట్‌లో 'ఆల్–ఉమెన్ టీమ్'ను మొదలుపెట్టింది. 'ప్రయోగాలకు, వైవిధ్యానికి ప్రాధాన్యత ఇచ్చే బ్రాండ్ ఎంజీ. ఆల్–ఉమెన్ టీమ్ అనేది మహిళలు కష్టపడే తత్వానికి, అంకితభావానికి మేము ఇచ్చే గౌరవం' అంటున్నాడు ఎంజీ మోటర్ ఇండియా ఎండీ రాజీవ్ చాబ. 'ఉందిలే మంచి కాలం ముందు ముందునా' అని పాడుకోనక్కర్లేకుండానే ఆటోమొబైల్ రంగంలో మహిళలకు మేలు చేసే మంచికాలం వచ్చింది. దిగ్గజ సంస్థలు 'ఆల్–ఉమెన్ టీమ్'లకు ప్రాధాన్యత ఇస్తున్నాయి.

న్యూస్‌మేకర్

తొలి ముస్లిం మహిళా న్యూరోసర్జన్



భారతదేశంలో ముస్లిం సముదాయం నుంచి తొలి మహిళా న్యూరోసర్జన్ అయిన ఘనత డాక్టర్ మరియమ్ హఫిఫా అన్సారీకి దక్కింది. ఆమె హైదరాబాదీ కావడంతో తెలంగాణకు కూడా ఈ ఖ్యాతి దక్కినట్లే. పదవ తరగతి వరకూ ఉర్దూ మీడియంలో చదివిన హఫిఫా ఆ తర్వాత నుంచి ఇంగ్లిష్ మీడియంలో చదువు కొనసాగించి అనేక రికార్డులు సాధించింది. 'ఆడపిల్లలు తాము అనుకున్నది సాధించేవరకు ఓటమి అంగీకరించవద్దు' అంటున్న హఫిఫా గురించి...

కొన్ని అద్భుతాలు మన పక్కనే జరుగుతుంటాయి. అయితే అవి వినమ్రంగా ఉండటం వల్ల కూడా మనకు తెలియవు. చిన్న గెలుపుకు ఆకాశమంత ఆర్భాటం చేస్తారు కొందరు. పర్వతాన్ని పిండి కింద కొట్టినా మెదలకుండా ఉంటారు మరి కొందరు.

28 ఏళ్ల మరియమ్ హఫిఫా అన్సారీకి తను సాధించిన విజయం పట్ల చాలా వినమ్రత ఉంది. ఎందుకంటే ఆమె అది తన గెలుపుగా భావించక 'అల్లా మియా ఇచ్చిన కానుక' అంటుంది కనుక.



● సర్జరీలో పాల్గొన్న హఫిఫా

డాక్టర్ మరియమ్ హఫిఫా అన్సారీ మన హైదరాబాద్‌లోనే ఉంటుంది. ఉస్మానియా మెడికల్ కాలేజీలో న్యూరోసర్జరీ రెసిడెంట్‌గా ఉంది. న్యూరో సర్జరీ విభాగంలో చురుగ్గా పని చేస్తూ ఉంది. త్వరలో ఆమె పూర్తిస్థాయి న్యూరో సర్జన్‌గా విధులు నిర్వహించనుంది. అయితే ఏమిటి ఘనత అంటారా? భారతదేశంలో ముస్లింలలో న్యూరోసర్జన్ అయిన తొలి మహిళ మరియమ్ హఫిఫా.

సాధారణంగా మహిళా డాక్టర్లు పిడియాట్రిషియన్లుగా, గైనకాలజిస్టులుగా పోస్ట్ గ్రాడ్యుయేషన్‌ను ఎంచుకుంటారు. ఇతర ముఖ్య విభాగాలను ఎంచుకున్నా న్యూరోసర్జరీలోకి ప్రవేశించేవారు తక్కువ. ముస్లింలలో అసలు లేరు. ఆ అడ్డంకిని దాటి న్యూరోసర్జన్ అయ్యింది మరియమ్ హఫిఫా.

ఉర్దూ మీడియమ్‌లో చదివి

హఫిఫా మరియంది మహారాష్ట్రలోని మాలేగావ్. అక్కడే ఏడవ తరగతి వరకూ ఉర్దూ మీడియంలో చదువుకుంది. తల్లి ఉర్దూ టీచర్. ఆమె సింగిల్ పేరెంట్‌గా తన కుమార్తెను పెంచడానికి సిద్ధపడి హైదరాబాద్ వలస వచ్చింది. ఇక్కడే పదోతరగతి వరకూ మళ్లీ ఉర్దూ మీడియంలోనే చదివి టాపర్‌గా నిలిచి గోల్డ్ మెడల్ సాధించింది హఫిఫా. చిన్నప్పటి నుంచి డాక్టర్ కానీ, సైంటిస్ట్ కాని కావాలని ఆమె కల. నెమ్మదిగా సైంటిస్ట్‌ను పక్కన పెట్టి డాక్టర్ కలను గట్టిగా పట్టుకుంది. 'నా ఒంటి మీద తెల్లకోటు, మెడలో స్టెతస్కోపు ఉండాలి. నన్ను అందరూ డాక్టర్ హఫిఫా అని పిలవాలి అనుకున్నాను' అంటుందామె. కాని మెడిసిన్ చదివించే స్తోమత లేదు. బాగా చదువుకుంటే తప్ప ఉచిత సీటు రాదు. దాంతోపాటు ఉర్దూ మీడియంలో చదవడం వల్ల ఇప్పుడు ఇంగ్లిష్ మీడియమ్‌కు అలవాటు పడాలి. అందుకే రేయింబవళ్లు చదివేది హఫిఫా. టెన్త్ అయ్యాక హైదరాబాద్‌లో ఇంటర్ విద్యార్థుల ఎంట్రన్స్ కోసం టాలెంట్ టెస్ట్ పెడితే టాపర్‌గా వచ్చింది హఫిఫా. దాంతో ఒక కాలేజీ వాళ్లు ఇంటర్‌లో ఫ్రీ సీట్ ఇచ్చారు. ఆ తర్వాత మెడికల్ ఎంట్రన్స్‌లో ఏకంగా 99వ ర్యాంకు సాధించింది. ఉస్మానియాలో ఎం.బి.బి.ఎస్. చదివింది. ఎం.బి.బి.ఎస్.లో ఆమెకు ఐదు గోల్డ్ మెడల్స్ వచ్చాయి. ఆ తర్వాత 'పోస్ట్ జనరల్ సర్జరీ'లో గ్రాడ్యుయేషన్ చేసింది. ఆ తర్వాత ఎఫ్.ఆర్.సి.ఎస్. (లండన్) పూర్తి చేసింది. 2020లో మళ్లీ పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఎంట్రన్స్ రాసి 137వ ర్యాంకు సాధించి 'న్యూరోసర్జరీ' విభాగాన్ని తీసుకుంది.

తప్పు అని నిరూపించండి

'ఆడపిల్లలు అది చేయలేరు.. ఇది చేయలేరు అని కొందరు విమర్శిస్తుంటారు. ఆడపిల్లలు వెనక్కి తగ్గకూడదు. అలా అనే వారి మాటలు తప్పు అని నిరూపించేలా విజయాలు సాధించాలి' అంటుంది హఫిఫా. పెయింటింగ్‌లో హఫిఫాకు అభిరుచి ఉంది. కాలిగ్రఫీని కూడా సాధన చేస్తోంది. సర్జరీ చేస్తున్న హఫిఫా ఫొటోను షేర్ చేసి 'భారతదేశపు తొలి ముస్లిం మహిళా న్యూరోసర్జన్' అని గర్వపడింది ఆమె సొంత రాష్ట్రమైన మహారాష్ట్రలోని ముస్లిం స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఎం.ఎస్.ఓ). కాని ఆమె ఆ ఘనత సాధించిందంతా ఇక్కడే కనుక నిజంగా గర్వపడాల్సింది తెలంగాణనే.

రంగస్థలం

మన భూమి... మన నాటకం

బెంగళూరు నగరంలో ఇంగ్లీష్ 'ప్లే'లు వేదికను ఏలుతున్న దశలో 'మనదైన నాటకం... అచ్చంగా మన నాటకం కావాలి' అని తపించిన వారిలో శరణ్య రామ్‌ప్రకాష్ ఒకరు. సాంస్కృతిక మూలాల నుంచి సామాజిక సమస్యల వరకు... ఎన్నో అంశాలను తన నాటకాల ద్వారా స్పృశిస్తున్న శరణ్య రామ్‌ప్రకాష్ ఇటీవల ప్రతిష్ఠాత్మకమైన శంకర్ నాగ్ అవార్డ్ స్వీకరించింది...



● శరణ్య రామ్‌ప్రకాష్



● 'అక్షయాంభర' లో ఆదిశక్తిగా...

బెంగళూరుకు చెందిన శరణ్య రామ్‌ప్రకాష్‌లో రైటర్, థియేటర్ ఆర్టిస్ట్, డైరెక్టర్‌లు ఉన్నారు. రచయిత్రిగా ఒక సీన్ రాస్తున్నప్పుడు తనలోని డైరెక్టర్ వచ్చి పక్కనే కూర్చుంటుంది. 'ఈ సీన్ ఇలా డైరెక్ట్ చేస్తే బాగుంటుంది' అనుకుంటుంది. నటి వచ్చి 'ఇలా నటిస్తే బాగుంటుంది' అనుకుంటుంది. తనలోని భిన్నమైన సృజనశక్తులు పరస్పరం సహకరించుకుంటాయి. అదే తన బలం.

కర్ణాటకలో ఒకప్పుడు నాటకం అంటే 'పట్టణాల్లో మాత్రమే' 'ఇంగ్లిష్ నాటకాలు మాత్రమే' అన్నట్లుగా ఉండేది. 'నగరం మనదే, వేదిక మనదే... కానీ నాటకం మనది కాదు. భాష, యాస మనది కాదు' అని నిట్టూర్చే పరిస్థితుల్లో మార్పు తీసుకొచ్చిన వారిలో శరణ్య లాంటి వారు ఉన్నారు. మూలాలలోకి వెళ్లారు. సంస్కృతి సాహిత్యంలోని అట్టడుగుపొరల్లోకి వెళ్లారు. 'ఇదిగో ఇది మన నాటకం' అని సగర్వంగా చాటి చెప్పారు.

ఎంతో పరిశోధించి తెలుసుకున్న అనుభవాలతో పాటు, తన వ్యక్తిగత అనుభవాల ఆధారంగా రూపొందించిన 'అక్షయాంభర' నాటకం శరణ్యకు ఎంతో పేరు తెచ్చింది. 'నవ' నాటకం కోసం తొమ్మిదిమంది ట్రాన్స్ జెండర్ కళాకారులతో పనిచేసింది. వారితో వర్క్‌షాప్ నిర్వహించింది. శ్రామిక వర్గం నుంచి పుట్టిన యక్షగాన కళారూపం గురించి లోతుగా తెలుసుకోవడానికి ఎన్నో ఊళ్లు తిరిగింది.

నాటకరంగంలోకి తాను అడుగుపెట్టినప్పుడు ఆ రంగంలో స్త్రీల ప్రాతినిధ్యం అంతంత మాత్రమే.

'నాటకరంగం అంటే పురుషులు మాత్రమే అన్నట్లుగా ఉండేది. దర్శకత్వం నుంచి నటన వరకు అందరూ పురుషులే ఉండేవారు. నేను నాటకరంగంలోకి అడుగుపెట్టిప్పుడు ఈ రంగంలో కొద్దిమంది మహిళలు మాత్రమే ఉండేవారు. ఒక్కో అడుగు వేసుకుంటూ మా ప్రయాణాన్ని మొదలుపెట్టాం' అని గతాన్ని గుర్తు చేసుకుంటుంది శరణ్య.

తన నాటకాలతో సంబంధం లేకుండా శరణ్య గురించి ప్రత్యేకంగా, ప్రశంసపూర్వకంగా చెప్పుకోవాల్సింది... కంపెనీస్ ఆఫ్ నాయకీస్. అలనాటి ప్రసిద్ధ నాటక కంపెనీలలో హీరోయిన్, వ్యాంప్, హాస్య పాత్రలు పోషించిన నటీమణుల గురించి పరిచయం చేసే ప్రాజెక్ట్... కంపెనీ ఆఫ్ నాయకీస్. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా ఎన్నో ప్రాంతాలు తిరిగింది. అలనాటి రచయితలు, పాత్రికేయులతో మాట్లాడి విలువైన అనుభవాలను మూటగట్టుకుంది.

ఆ కాలంలో పెద్ద నుంచి చిన్న వరకు రకరకాల పాత్రలు పోషించిన ఎంతోమంది నటీమణుల అంతరంగాన్ని రికార్డ్ చేసింది. ఆడియో–విజువల్ డాక్యుమెంటరీ, ఫొటో ఆర్టికల్స్, ప్లే స్క్రీన్ రూపంలో అలనాటి నాటకరంగ నటీమణుల ఆర్కైవ్స్‌ను రూపొందించే ప్రయత్నంలో ఉంది శరణ్య. ఆ రోజుల్లో గుబ్బి కంపెనీ, సుబ్బయ్య నాయుడు నాటక కంపెనీలలో పనిచేస్తూ నెలకు పది రూపాయలు అర్జించే 72 సంవత్సరాల సత్యవతిని ఇంటర్వ్యూ చేసింది శరణ్య. దీనికి సంబంధించిన వీడియో క్లిప్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే అనూహ్యమైన స్పందన లభించింది.

85 సంవత్సరాల శ్రేసమ్మ ఎన్నో నాటకాల కంపెనీలలో పనిచేసింది. నటిగా ఆమెకు ఎంత పేరు వచ్చిందో తెలియదుగానీ మూడు పూటలా కడుపు నిండడానికి మాత్రం లోటు ఉండేది కాదు.

'స్టేజ్‌పై మహిళలను ఉత్తమ ఇల్లాలు, ఉత్తమ కోడలు, చైతన్యం మూర్తీభవించిన నాయకురాలి పాత్రలలో చూడడానికి ప్రేక్షకులు ఇష్టపడేవారు. అయితే రంగస్థలానికి అవతల జీవితం అనే నాటక రంగంలో వారి పరిస్థితి దయనీయంగా ఉండేది. ఎన్నో రకాల హింసకు వారు బాధితులుగా ఉండేవారు. పెళ్లి పేరుతో మోసపోయిన వారి జీవితాలు విషాదకరంగా ఉండేవి. నటనలో పేరు తెచ్చుకోవాలనే ఆశయంతో వచ్చిన వారి కంటే ఆర్థిక ఇబ్బందుల వల్ల నాటకరంగంలోకి వచ్చిన వారే ఎక్కువ. వారి గురించి ఈ తరానికి తెలియదు. కానీ తప్పనిసరిగా తెలుసుకోవాల్సిన అవసరం ఉంది' అంటున్న శరణ్య రామ్‌ప్రకాష్ 'ఆర్కైవ్' రూపంలో అందుకు అవసరమైన బలమైన వేదిక రూపొందిస్తోంది.

ఇంటిప్

మిక్సీ కొత్తదానిలా మెరవాలంటే.. నిమ్మరసం, లేదా వెనిగర్ తీసుకుని దానిలో డిష్ వాష్ లిక్విడ్, వేడినీళ్లు పోసి బాగా కలపాలి. దానిని స్ప్రే బాటిల్‌లో పోయాలి. తర్వాత మిక్సీ నాబ్, రంధ్రాలు ఉన్న ప్రదేశాలను ప్లాస్టర్‌తో మూసివేయాలి. ఈ మిశ్రమాన్ని మిక్సీ అంతా స్ప్రే చేసి పది నిమిషాల తరువాత వస్త్రంతో గట్టిగా తుడిస్తే మరకలన్నీ పోతాయి. మిక్సీజార్ పెట్టే ప్రాంతంలో కూడా మిశ్రమాన్ని కొద్దిగా స్ప్రే చేసి, టూత్ బ్రష్‌తో రుద్దాలి. రంధ్రాలు, ఆన్ ఆఫ్ బటన్ దగ్గర ఇయర్ బడ్స్‌తో రుద్దాలి.

సైబర్ టాక్

ఇంట్లో నుంచే లక్షలు సంపాదించండి

ప్రకటనల బుట్టలో పడవద్దు

యాప్స్ ఆధారంగా పార్ట్ టైమ్ జాబ్ ఆఫర్లతో స్కామర్లు కొత్త మోసాలకు పాల్పడుతున్నారు. అదనపు ఆదాయం కోసం చూస్తున్న వారికి, నిరుద్యోగులు, గృహిణులు, విద్యార్థులను ట్రాప్ చేయడానికి యాప్ స్కామర్లు ఉపయోగిస్తున్న ఆఫర్ మోసాలు పలు విధాలుగా ఉంటున్నాయి.

'ఆన్‌లైన్‌లో సంపాదించండి', 'పార్ట్ టైమ్ జాబ్' వంటి ఆశావహమైన పదాలను మోసగాళ్లు, నేరస్థులు తమ ప్రకటనల ద్వారా ఉపయోగిస్తారు. ఈ సైట్‌లలో చాలా వరకు మెసేజింగ్ ప్లాట్‌ఫారమ్‌కు లేదా మెసేజింగ్ ప్లాట్‌ఫారమ్ లింక్‌ను పొందుపరిచిన వెబ్‌సైట్‌కి మనల్ని దారి మళ్లిస్తాయి. అలాగే, కొందరు తాము మోసపోయామని తెలిసి కూడా కావాలని మరో పదిమంది మోసపోవాలనుకుంటారు. దీంతో ఫలానా యాప్‌లలో పెట్టుబడులు పెట్టమని ప్రోత్సహిస్తుంటారు. వీటివల్ల మోసపోయే అవకాశాలూ అధికంగా ఉన్నాయి కాబట్టి, ఎవరికి వారు జాగ్రత్తపడటం అవసరం.

మోసగాళ్లు అనుసరించే విధానాలు

1) బాధితులు పార్ట్ టైమ్ జాబ్ ఆఫర్‌లు, ఇంటర్నెట్/మెసేజింగ్ ప్లాట్‌ఫారమ్‌లు మొదలైన ఇతర ప్రకటనలకు ఆకర్షితుల వుతుంటారు. వీరి ఆశను అవకాశంగా తీసుకొని తక్కువ సమయంలో డబ్బు రెట్టింపు అవుతుందని, అధిక కమీషన్‌లు లేదా అధిక రాబడి వస్తుందని స్కామర్లు వాగ్దానం చేస్తారు. ప్రకటనలు /ఎసెమ్మెస్‌ల ద్వారా సాధారణంగా ఒక లింక్ ఉంటుంది, ఇది నేరుగా టెలిగ్రామ్ లేదా వాట్సప్ చాట్‌లో చేరమని వారిని అడుగుతుంది.

2) APK (Android), DMZ (IOS) పై క్లిక్ చేయడం ద్వారా యాప్స్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచిస్తారు. ఈ అప్లికేషన్స్ ప్లే స్టోర్ లేదా యాప్‌స్టోర్‌లలో లేవని గమనించాలి. గ్రూప్స్‌లో చాలా మంది సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు (యూట్యూబ్ వీడియోలు) వీటిని చూస్తారు. వారు ఈ యాప్‌లను ఉపయోగించి చాలా ఎక్కువగా ప్రయోజనం పొందామని తమ 'మల్టీలెవల్ మార్కెటింగ్' వ్యూహంలో భాగంగా సూచిస్తుంటారు. ఈ యాప్‌ల ద్వారా లబ్ధి పొందామనో, ఈ మొత్తంతో వస్తువులను కొనుగోలు చేయడంలో, పనులను చేయడం ద్వారా ఆఫర్లతో పాటు 200 శాతం ప్రయోజనం పొందుతారని చెబుతుంటారు.

3) ఒక పని చేయడానికి తప్పనిసరి షరతు ఏమిటంటే, మనదేశంలో పనిచేయడానికి అధికారం లేని చెల్లింపు గేట్‌వేల ద్వారా ఆ డబ్బు ఇస్తామని ఉంటుంది.

4) పని పూర్తయిన తర్వాత, బాధితుడు డబ్బును విత్‌డ్రా చేసే అవకాశాన్ని ఇవ్వమని అడుగుతాడు. అయితే, వివిధ చెల్లింపు అగ్రిగేటర్ల ద్వారా డబ్బు తీసుకోవడానికి వీలు పడదు.

5) మొదటిసారి డబ్బు పొందాక, బాధితుడు ఎక్కువ డబ్బు పెట్టుబడిగా పెట్టడానికి, మరిన్ని పనులు చేయడానికి ఆకర్షితుడవుతాడు. ఫలితంగా ఈ ప్రక్రియ మళ్లీ కొనసాగుతుంది. అయితే, బాధితుడు పెద్ద మొత్తాన్ని పెట్టుబడి పెట్టిన తర్వాత, స్కామర్ చాట్‌లో కనిపించడు.

ఇవీ సూచనలు...

పార్ట్ టైమ్ జాబ్ స్కామ్ సూచికలు..
- ఇంటి నుండి ఉచిత పని
- త్వరితంగా డబ్బు సంపాదించడం
- అపరిమిత సంపాదన సామర్థ్యం
- బహుళ స్థాయి మార్కెటింగ్
- పెట్టుబడి అవకాశాలను పెంచడం
- ఫుల్ టైమ్ వేతనంతో కూడిన పార్ట్ టైమ్ ఉద్యోగాల ఎర



మరింత అప్రమత్తత అవసరం

● యాప్ ఆదాయంలో సరైన నియంత్రణ/అనుకూల ఆమోదం కోసం అడగండి. ● ముందస్తుగా చెక్కులు ఇవ్వవద్దు. ● ఖాతా స్టేట్‌మెంట్లను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి. ● 'ప్రామిస్డ్ వర్సెస్ యాక్చువల్' సందేశాలను నమ్మొద్దు. ● యాప్ స్టోర్ / ప్లే స్టోర్ నుండి కాకుండా డౌన్‌లోడ్ చేసిన యాప్‌లపై ఆర్థిక లావాదేవీలు చేయవద్దు. ● ఫోన్ సంభాషణల సమయంలో లేదా స్క్రీన్ షేరింగ్, ఆర్థిక లావాదేవీలు చేయవద్దు.

రక్షించుకోవడానికి జాగ్రత్తలు

● అధిక హామీతో కూడిన రాబడిని వాగ్దానం చేస్తాయి, నమ్మొద్దు. ● అధిక ప్రారంభ పెట్టుబడిని అభ్యర్థిస్తాయి. ● సంక్లిష్టమైన, నిలకడలేని వ్యాపార నమూనా ఉంటుంది. ● నష్టాలను తిరిగి చెల్లిస్తానని వాగ్దానం చేస్తారు. ● యాప్ స్టోర్ లేదా ప్లే స్టోర్‌లో జాబితా చేయని యాప్‌లలో పెట్టుబడుల జోలికి వెళ్లొద్దు.



ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల,
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్



రొనాల్డోపై రెండు క్లబ్ మ్యాచ్‌ల నిషేధం

అభిమానితో గొడవ పడి అతని ఫోన్‌ను విసిరేసినందుకు మాంచెస్టర్ యునైటెడ్ క్లబ్ మాజీ ప్లేయర్ క్రిస్టియానో రొనాల్డోపై ఇంగ్లండ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ రెండు క్లబ్ మ్యాచ్‌ల నిషేధంతోపాటు 50 వేల పౌండ్ల జరిమానా విధించింది. గత ఏడాది ఏప్రిల్ 9న ఎవర్టన్‌తో జరిగిన ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లో మాంచెస్టర్ 0-1తో ఓడిపోయిన తర్వాత ఈ ఘటన చోటు చేసుకుంది. మాంచెస్టర్ యునైటెడ్ క్లబ్‌తో రొనాల్డో తెగదెంపులు చేసుకోవడంతో తదుపరి సీజన్‌లో అతను ఆడే కొత్త క్లబ్ జట్టుకు ఈ నిషేధం వర్తిస్తుంది.

సూర్య 'టాప్' ర్యాంక్ పటిష్టం

భారత స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ నంబర్‌వన్ ర్యాంక్ మరింత పటిష్టమైంది. అంతర్జాతీయ క్రికెట్ మండలి తాజా టి20 ర్యాంకింగ్స్‌లో సూర్య తన టాప్ ర్యాంక్‌ను పదిలపర్చుకున్నాడు. న్యూజిలాండ్‌తో జరిగిన టి20 సిరీస్ రెండో మ్యాచ్‌లో సూర్య వీరోచిత మెరుపు సెంచరీతో అదరగొట్టాడు. దీంతో 31 రేటింగ్ పాయింట్లు పెరగడంతో 890 పాయింట్లతో నంబర్‌వన్ బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. రెండో స్థానంలో పాక్ ఓపెనర్ రిజ్వాన్ (836) ఉన్నాడు.



జర్మనీకి జపాన్ షాక్

ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో మరో అనూహ్య ఫలితం వచ్చింది. మంగళవారం రెండుసార్లు విశ్వవిజేత అర్జెంటీనాను సౌదీ అరేబియా బోల్తా కొట్టిస్తే... బుధవారం ఏకంగా నాలుగు సార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన జర్మనీ జట్టును జపాన్ ఓడించి పెను సంచలనం సృష్టించింది. ఆసియా గడ్డపై రెండు దశాబ్దాల తర్వాత జరుగుతున్న ప్రపంచకప్‌లో రెండు రోజుల వ్యవధిలో రెండు ఆసియా జట్లు అద్భుతం చేశాయి.

దోహా: ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీలో మేటి జట్లు, మాజీ చాంపియన్లకు ఆసియా జట్లు ఎవరూ ఊహించని విధంగా షాక్ ఇస్తున్నాయి. బుధవారం గ్రూప్ 'ఇ'లో భాగంగా నాలుగుసార్లు చాంపియన్ జర్మనీని జపాన్ కంగుతినిపించింది. ఇద్దరు సబ్‌స్టిట్యూట్ ప్లేయర్లు రిత్సు డాన్, టకుమా అసానో చివరి 15 నిమిషాల్లో చేసిన రెండు గోల్స్‌తో జపాన్ 2–1 స్కోరుతో జర్మనీని గట్టిదెబ్బే తీసింది. తరచూ జర్మన్ క్లబ్‌లలో ఆడే రిత్సు (75వ ని.), అసానో (83వ ని.) ఈ ప్రపంచకప్‌లో ఆ జాతీయ జట్టును ఓడించడంలో కీలకపాత్ర పోషించారు. జర్మనీ తరఫున ఇల్కే గుయెండగన్ (33వ ని.) గోల్ సాధించాడు. ఈ గ్రూప్‌లో టైటిల్ ఫేవరెట్ జట్టయిన జర్మనీ ఆరంభం నుంచే గోల్స్ ప్రయత్నాలకు పదును పెట్టింది. ఈ క్రమంలో 24 సార్లు ప్రత్యర్థి గోల్‌పోస్ట్ లక్ష్యంగా షాట్లు ఆడింది. ప్రథమార్ధంలోనే గుయెండగన్ గోల్‌తో 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. తీవ్రమైన ఒత్తిడిలో రెండో అర్ధభాగాన్ని మొదలుపెట్టిన జపాన్‌కు సబ్‌స్టిట్యూట్ ఆటగాళ్లు అసాధారణ ఫలితాలను సాధించి పెట్టారు. జపాన్

2–1తో ఆసియా జట్టు గెలుపు

2–1 ఆధిక్యంతో గెలుపు దారిలో పడగా... జర్మనీ మాత్రం ఎక్కడా పట్టు సడలించలేదు. ఆఖరి నిమిషం దాకా కష్టపడింది. నిర్ణీత సమయంలోని 90వ నిమిషం నుంచి ఇంజ్యూరీ టైమ్ 9 నిమిషాల పాటు స్కోరు సమం చేసేందుకు కడదాకా చెమటోడ్చింది. ఫుల్‌క్రగ్, రుడిగెర్, గోరెట్జా, సులే అదే పనిగా ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌పై షాట్లు ఆడారు. అయితే జపాన్ డిఫెండర్లు, గోల్ కీపర్ సమన్వయంతో అడ్డుకోవడంతో జర్మనీ ప్రయత్నాలన్నీ నీరుగారాయి. జపాన్ గోల్ కీపర్ షుయిచి గొండా పెట్టని కోటలా నిలుచున్నాడు. ప్రపంచకప్ చరిత్రలో ఆసియా జట్టు చేతిలో ఓడిపోవడం జర్మనీకిది రెండోసారి. 2018 ప్రపంచకప్‌లో దక్షిణ కొరియా చేతిలో జర్మనీ 0–2తో ఓడిపోయింది.


రిత్సు డాన్ టకుమా అసానో



నోరు మూసుకొని...

'వన్ లవ్' ఆర్మ్‌బ్యాండ్‌పై అంతర్జాతీయ ఫుట్‌బాల్ సంఘాల సమాఖ్య (ఫిఫా) తీసుకున్న నిర్ణయానికి జర్మనీ ఆటగాళ్లు వినూత్న నిరసన తెలిపారు. ఆటగాళ్లెవరైనా 'వన్ లవ్' బ్యాండ్‌తో బరిలోకి దిగితే వేటు (ఎల్లో కార్డ్) తప్పదని 'ఫిఫా' జర్మనీ సహా ఏడు యూరోపియన్ ఫుట్‌బాల్ సమాఖ్యలను హెచ్చరించింది. దీనికి నిరసనగా జర్మనీ ఆటగాళ్లు కుడిచేతితో తమ 'నోరు మూసుకొని' నిరసన తెలిపారు. 'ఫిఫా' నిర్ణయంపై యూరోపియన్ దేశాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఖతర్‌లో వివిధ వర్గాలపై కొనసాగుతున్న వివక్షను నిరసిస్తూ ప్రపంచకప్ మ్యాచ్‌ల సందర్భంగా 'వన్ లవ్' ఆర్మ్‌బ్యాండ్ ధరించి సంఘీభావం తెలపాలని ఏడు యూరోపియన్ జట్లు నిర్ణయం తీసుకున్నాయి.

ఫ్రాన్స్ సూపర్ షో

- డిఫెండింగ్ చాంపియన్ శుభారంభం
- ఆస్ట్రేలియాపై 4–1తో ఘనవిజయం
- రెండు గోల్స్‌తో మెరిసిన జిరూడ్

అల్ వాక్రా (ఖతర్): వరుసగా రెండు ప్రపంచకప్‌లలో ఒకే జట్టు విజేతగా నిలిచి 60 ఏళ్లయింది. బ్రెజిల్ పేరిట ఉన్న ఈ ఘనతను తాము కూడా సాధించాలనే లక్ష్యంతో ఖతర్‌కు వచ్చిన డిఫెండింగ్ చాంపియన్ ఫ్రాన్స్ తొలి పరీక్షలో పాస్ అయింది. భారత కాలమానం ప్రకారం మంగళవారం అర్ధరాత్రి దాటాక జరిగిన గ్రూప్ 'డి' లీగ్ మ్యాచ్‌లో ఫ్రాన్స్ జట్టు 4–1 గోల్స్ తేడాతో ఆస్ట్రేలియా జట్టును ఓడించి శుభారంభం చేసింది. ఫ్రాన్స్ తరఫున ఒలివియర్ జిరూడ్ (32వ, 71వ ని.లో) రెండు గోల్స్ సాధించగా... అడ్రియన్ రాబియోట్ (27వ ని.లో), ఎంబాపె (68వ ని.లో) ఒక్కో గోల్ అందించారు. ఆస్ట్రేలియా తరఫున ఏకైక గోల్‌ను క్రెయిగ్ గుడ్‌విన్ (9వ ని.లో) సాధించాడు.

షాక్ నుంచి తేరుకొని...

వరుసగా ఐదోసారి ప్రపంచకప్‌లో ఆడుతున్న ఆస్ట్రేలియా మైదానంలో అభిమానులందరూ పూర్తిగా సర్దుకొని కూర్చునేలోపే ఖాతా తెరిచింది. ఆట


జిరూడ్

తొమ్మిదో నిమిషంలో కుడి వైపు నుంచి లెకీ అందించిన పాస్‌ను క్రెయిగ్ గుడ్‌విన్ లక్ష్యానికి చేర్చడంతో ఆస్ట్రేలియా 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. దాంతో అభిమానులకు మరో సంచలన ఫలితం తప్పదా అనే అనుమానం కలిగింది. అయితే ఫ్రాన్స్ జట్టు వెంటనే తేరుకుంది. సమన్వయంతో ఆడింది. ఆస్ట్రేలియా జట్టుకు పగ్గాలు వేసింది. ఐదు నిమిషాల వ్యవధిలో రెండు గోల్స్ సాధించి 2–1తో ఆధిక్యాన్ని అందుకుంది. 27వ నిమిషంలో ఎడమ వైపు నుంచి థియో హెర్నాండెజ్ కొట్టిన షాట్‌ను 'డి' ఏరియాలో ఉన్న అడ్రియన్ రాబియోట్ హెడర్ షాట్‌తో ఆస్ట్రేలియా గోల్‌కీపర్‌ను బోల్తా కొట్టించాడు. 32వ నిమిషంలో ఎడమ వైపు నుంచి రాబియోట్ అందించిన పాస్‌ను ఒలివియర్ జిరూడ్ గోల్‌పోస్ట్‌లోనికి పంపించాడు. తొలి అర్ధభాగం ముగిసేసరికి ఫ్రాన్స్ 2–1తో ముందంజలో ఉంది. రెండో అర్ధభాగంలోనూ ఫ్రాన్స్ ఆధిపత్యం కనబరిచింది. ఈసారి మూడు నిమిషాల వ్యవధిలో రెండు గోల్స్ సాధించి ఆస్ట్రేలియాకు కోలుకునే అవకాశం ఇవ్వలేదు. ఈ గెలుపుతో ఫ్రాన్స్ జట్టుకు మూడు పాయింట్లు లభించాయి.

51 ఆస్ట్రేలియాపై రెండు గోల్స్ చేసిన క్రమంలో ఒలివియర్ జిరూడ్ ఫ్రాన్స్ తరఫున అత్యధిక గోల్స్ చేసిన ప్లేయర్‌గా థియరీ హెన్రీ (51 గోల్స్) పేరిట ఉన్న రికార్డును సమం చేశాడు.

స్పెయిన్ 'సెవెన్' స్టార్ ప్రదర్శన

కోస్టారికాపై 7–0తో ఘనవిజయం సాధించిన మాజీ చాంపియన్

దోహా: ఫుట్‌బాల్ ప్రపంచకప్ టైటిల్ ఫేవరెట్స్‌లో ఒక జట్టయిన స్పెయిన్ భారీ విజయంతో బోణీ కొట్టింది. గ్రూప్ 'ఇ'లో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో 2010 విశ్వవిజేత స్పెయిన్ 7–0 గోల్స్ తేడాతో కోస్టారికా జట్టును చిత్తుగా ఓడించింది. స్పెయిన్ తరఫున ఫెరాన్ టోరెస్ (31వ, 54వ ని.లో) రెండు గోల్స్ సాధించగా... డానీ ఓల్మో (11వ ని.లో), మార్కో అసెన్సియో (21వ ని.లో), గావి (74వ ని.లో), కార్లోస్ సోలెర్ (90వ ని.లో), అల్వారో మొరాటా (90+2వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. తమ ప్రపంచకప్ చరిత్రలో స్పెయిన్‌కిదే అతిపెద్ద విజయం. ఆ జట్టు ప్రపంచకప్ మ్యాచ్‌లో ఏడు గోల్స్ చేయడం ఇదే తొలిసారి.

కోస్టారికాతో మ్యాచ్‌లో స్పెయిన్ సంపూర్ణ ఆధిపత్యం చలాయించింది. 82 శాతం బంతి స్పెయిన్ ఆధీనంలో ఉండటం వారి ఆధిపత్యానికి నిదర్శనం. స్పెయిన్ ప్రత్యర్థి గోల్‌పోస్ట్ లక్ష్యంగా ఎనిమిది షాట్‌లు కొట్టగా... కోస్టారికా ఒక్కసారి కూడా స్పెయిన్ గోల్‌పోస్ట్ లక్ష్యంగా షాట్ కొట్టలేకపోయింది. స్పెయిన్ ఆటగాళ్లు ఏకంగా 1,043 పాస్‌లు పూర్తి చేశారు. ప్రపంచకప్ చరిత్రలో ఏ జట్టు కూడా ఒక మ్యాచ్‌లో ఇన్ని పాస్‌లు పూర్తి చేయలేదు. కోస్టారికా ఆటగాళ్లు 231 పాస్‌లతో సరిపెట్టుకున్నారు. ప్రపంచకప్ మ్యాచ్‌లో తొలి అర్ధభాగంలో స్పెయిన్ మూడు గోల్స్ చేయడం 1934 తర్వాత ఇదే తొలిసారి. 1934లో బ్రెజిల్‌పై తొలి అర్ధభాగంలో స్పెయిన్ మూడు గోల్స్ సాధించింది.


గావి
ఫెరాన్ టోరెస్

క్రొయేషియా 0 మొరాకో 0

గత ఫుట్‌బాల్ ప్రపంచకప్ టోర్నీ రన్నరప్ క్రొయేషియాను మొరాకో నిలువరించింది. బుధవారం గ్రూప్ 'ఎఫ్'లో జరిగిన లీగ్ మ్యాచ్ 0–0తో డ్రాగా ముగిసింది. సీనియర్ స్ట్రయికర్, క్రొయేషియా కెప్టెన్ మోడ్రిచ్ ఖాతా తెరిచేందుకు గట్టి ప్రయత్నాలే చేసిన మొరాకో ఆటగాళ్లు అడ్డుగోడ కట్టేయంతో గోల్ నమోదు కాలేదు.

ప్రపంచకప్‌లో నేడు

స్విట్జర్లాండ్ X కామెరూన్
మధ్యాహ్నం గం. 3:30 నుంచి

ఉరుగ్వే X దక్షిణ కొరియా
సాయంత్రం గం. 6:30 నుంచి

పోర్చుగల్ X ఘనా
రాత్రి గం. 9:30 నుంచి

బ్రెజిల్ X సెర్బియా
అర్ధరాత్రి గం. 12:30 నుంచి

స్పోర్ట్స్ 18, జియో సినిమా చానెల్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

భారత బాక్సర్లకు మరో నాలుగు పతకాలు ఖాయం

న్యూఢిల్లీ: ప్రపంచ యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు పతకాలపైనే పంచ్ విసురుతున్నారు. స్పెయిన్‌లో జరుగుతున్న ఈ ఈవెంట్‌లో నలుగురు మహిళా బాక్సర్లు ముస్కాన్ (75 కేజీలు), తమన్నా (50 కేజీలు), కీర్తి (ప్లస్ 81 కేజీలు), దేవిక (52 కేజీలు) పతకాలు ఖాయం చేసుకున్నారు. క్వార్టర్ ఫైనల్స్‌లో తమన్నా 5–0తో జుని తొనెగవా (జపాన్)పై, దేవిక 5–0తో అస్యా (జర్మనీ)పై... అజింబై (మంగోలియా)పై ముస్కాన్, బొటికా (రొమేనియా)పై కీర్తి గెలిచారు.

సినిమా


చిరంజీవి, ఊర్వశీ రౌతేలా

ఎయ్ బాసొస్తుండు...

'**నువ్వు** లుంగీ ఎత్తుకో.. ఎయ్ నువ్వు షర్ట్ ముడేసుకో.. ఎయ్.. నువ్వు కర్చీఫ్ కట్టుకో.. ఎయ్ బాసొస్తుండు.. బాసొస్తుండు.. నీవు లైట్లు వేసుకో.. ఎయ్ నువ్వు కలర్ మార్చుకో.. ఎయ్ నువ్వు సౌండ్ పెంచుకో.. ఎయ్ బాసొస్తుండు.. బాసొస్తుండు' అంటూ ఊర మాస్ స్టెప్పులేశారు చిరంజీవి, ఊర్వశీ రౌతేలా. చిరంజీవి హీరోగా కొల్లి (కె.ఎస్. రవీంద్ర) బాబీ దర్శకత్వంలో రూపొందుతోన్న 'వాల్తేర్ వీరయ్య' చిత్రంలోని పాట ఇది. ఈ స్పెషల్ సాంగ్ లిరికల్ వీడియో బుధవారం విడుదలైంది. దేవిశ్రీ ప్రసాద్ కంపోజ్ చేసి, రాసిన ఈ పాటను నకాష్ అజీజ్, హరిప్రియ పాడారు. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. హీరో రవితేజ కీలక పాత్ర చేస్తున్న ఈ చిత్రంలో చిరంజీవి సరసన శ్రుతీహాసన్ కథానాయికగా నటిస్తున్నారు. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం సంక్రాంతికి విడుదల కానుంది.

మాస్టర్‌ని కలిసిన వేళ

కమల్‌హాసన్ తన గురువుగా భావించేవారిలో ప్రముఖ దర్శకుడు కె. విశ్వనాథ్ ఒకరు. కమల్ హీరోగా విశ్వనాథ్ దర్శకత్వంలో 'సాగర సంగమం, స్వాతిముత్యం, శుభ సంకల్పం' వంటి క్లాసిక్ చిత్రాలు వచ్చిన విషయం తెలిసిందే. గురు-శిష్యులిద్దరి మధ్య మంచి అనుబంధం ఉంది. కాగా వ్యక్తిగత పని మీద హైదరాబాద్‌లో ఉన్న కమల్‌హాసన్ బుధవారం విశ్వనాథ్ నివాసంలో ఆయన్ను కలిశారు. ''మాస్టర్‌ని కలిశాను. ఆయనంటే నాకెంతో గౌరవం. మాకు ఎన్నో మంచి జ్ఞాపకాలున్నాయి'' అని సోషల్ మీడియా వేదికగా కమల్ పేర్కొన్నారు.


కమల్‌హాసన్, కె. విశ్వనాథ్

యాక్షన్ ఎంటర్‌టైనర్

బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'వీరసింహా రెడ్డి'. ఇందులో శ్రుతీహాసన్ హీరోయిన్. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. తమన్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'జై బాలయ్య..' అంటూ సాగే పాటని రేపు (శుక్రవారం) విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సందర్భంగా 'రాజసం నీ ఇంటి పేరు' అని పేర్కొంటూ బాలకృష్ణ లుక్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. 'మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'వీరసింహా రెడ్డి. ఈ చిత్రాన్ని 2023 సంక్రాంతికి విడుదల చేయనున్నాం'' అని యూనిట్ పేర్కొంది. దునియా విజయ్, వరలక్ష్మీ శరత్‌కుమార్ నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రిషి పంజాబీ.


బాలకృష్ణ

మార్పు కోసం కస్టడీలో


నాగచైతన్య

నాగచైతన్య హీరోగా వెంకట్ ప్రభు దర్శకత్వంలో తెలుగు-తమిళ భాషల్లో ఓ సినిమా తెరకెక్కుతోంది. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్స్‌పై శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'కస్టడీ' అనే టైటిల్ ఖరారు చేశారు. 'ఎ వెంకట్ ప్రభు హంట్' అన్నది ట్యాగ్‌లైన్. బుధవారం (నవంబర్ 23) నాగచైతన్య బర్త్ డేని పురస్కరించుకుని 'కస్టడీ' టైటిల్, నాగచైతన్య ఫస్ట్ లుక్ పోస్టర్‌ని చిత్రయూనిట్ విడుదల చేసింది. 'మీరు ప్రపంచంలో చూడాలనుకునే మార్పు మీరే అయ్యుండాలి' అని పోస్టర్‌పై రాసి ఉంది. 'నిజాయితీ, దృఢ నిశ్చయంతో ఉన్న పోలీసాఫీసర్ ఎ. శివ పాత్రలో నాగచైతన్య నటిస్తున్నారు. ప్రపంచంలో తను చూడాలనుకునే మార్పు కోసం అన్ని అసమానతలకు వ్యతిరేకంగా నిలబడి పోరాడే పాత్ర తనది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. నాగచైతన్య 22వ చిత్రంగా రూపొందుతున్న 'కస్టడీ'లో కృతీశెట్టి హీరోయిన్. అరవింద్ స్వామి విలన్‌గా, ప్రియమణి పవర్‌ఫుల్ పాత్ర చేస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఇళయరాజా, యువన్ శంకర్ రాజా, కెమెరా: ఎస్ఆర్ కదిర్, సమర్పణ: పవన్ కుమార్.


కృష్ణ

కృష్ణ పేరుతో అవార్డు

''**సినీ** రంగంలో విశిష్ట సేవలందించిన వ్యక్తికి ప్రతి ఏడాది 'సూపర్ స్టార్ కృష్ణ స్మారక అవార్డు' ప్రదానం చేస్తాం'' అని 'మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ (మా ఏపీ)' అధ్యక్షుడు, డైరెక్టర్ దిలీప్ రాజా అన్నారు. తెనాలిలోని 'మా ఏపీ' కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ– ''ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రజలు తమకు ఇష్టమైన ముగ్గురు నటుల పేర్లను 'మా – ఏపీ' కార్యాలయానికి పంపాలి. పంపిన వారి వివరాలు, ఫోన్ నంబర్ తప్పనిసరిగా ఉండాలి. ప్రజా బ్యాలెట్‌లో ఎక్కువ ఓట్లు వచ్చిన ఒకరిని 'సూపర్ స్టార్ కృష్ణ స్మారక అవార్డు'కు జ్యూరీ ఎంపిక చేస్తుంది. తెనాలిలో జరిగే ఈ అవార్డు వేడుక తేదీని మహేశ్ బాబుతో చర్చించిన అనంతరం తెలియజేస్తాం'' అన్నారు.


శైలేష్, మీనాక్షి, అడివి శేష్

పాన్ ఇండియా అనేది కథలో ఉండాలి
- అడివి శేష్

''పాన్ ఇండియా సినిమా అనేది కథలో ఉండాలి. ఇమేజ్ ఉంది కదా అని పాన్ ఇండియా మూవీ చేయకూడదు. నేను ఇక్కడే (తెలుగు) ఉండి ఇండియన్ సినిమా చేస్తాను'' అని హీరో అడివి శేష్ అన్నారు. శైలేష్ కొలను దర్శకత్వం వహించిన 'హిట్'కి సీక్వెల్‌గా తెరకెక్కిన చిత్రం 'హిట్ 2'. అడివి శేష్, మీనాక్షి చౌదరి జంటగా నటించారు. హీరో నాని సమర్పణలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ సినిమా డిసెంబర్ 2న విడుదలకానుంది. ఈ సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమంలో అడివి శేష్ మాట్లాడుతూ– ''హిట్' సిరీస్‌లో రెండో పార్ట్ చాలా కీలకం. 'హిట్ 3'లోనూ నేను ఉన్నాను. 'హిట్ 2'ని పాన్ ఇండియా వైడ్‌గా రిలీజ్ చేయాలని ఉత్తరాది ప్రేక్షకులు అడుగుతున్నారు.. నానీ గారితో మాట్లాడి పాన్ ఇండియన్ రేంజ్‌లో విడుదల చేయాలని ఫిక్స్ అయ్యాం. అన్నపూర్ణ బ్యానర్‌లో నేను చేయబోతున్న రెండు సినిమాలు పాన్ ఇండియా స్థాయిలో ఉంటాయి. 'హిట్ 2' హిందీ వెర్షన్ కాస్త ఆలస్యంగా రిలీజవుతుంది'' అన్నారు. ''చెడు మీద మంచి ఎలా గెలుస్తుందనేది ఈ సినిమాలో చూపించాం. 'హిట్ 3'ని భారీగా ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు డైరెక్టర్ శైలేష్ కొలను. నటీనటులు మీనాక్షి చౌదరి, పావని, శ్రీనాథ్ మాగంటి తదితరులు మాట్లాడారు.


అవార్డు అందుకుంటున్న రవికిశోర్, వెంకట్

కిడకి అభినందనలు

ప్రముఖ నిర్మాత 'స్రవంతి' రవికిశోర్ నిర్మించిన తొలి తమిళ సినిమా 'కిడ'. పూ రామన్, కాళీ వెంకట్ ప్రధాన పాత్రల్లో ఆర్ఏ వెంకట్ దర్శకత్వంలో తెరకెక్కింది. త్వరలో విడుదల కానున్న ఈ చిత్రాన్ని గోవాలో జరుగుతున్న 'ఇఫీ' ('భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలు')లో ఇండియన్ పనోరమా విభాగంలో ప్రదర్శించగా, వీక్షకులు 'స్టాండింగ్ ఒవేషన్'తో అభినందించారు. 'స్రవంతి' రవికిశోర్ మాట్లాడుతూ– ''ఏఆర్ వెంకట్‌కి 'కిడ' తొలి సినిమా అయినా బాగా తీశాడు. సినిమాకు భాషాపరమైన ఎల్లలు, హద్దులు లేవు. మంచి సినిమా వస్తే చూస్తారనే నమ్మకంతో తమిళంలో తీశాను'' అన్నారు. ఆర్ఏ వెంకట్ మాట్లాడుతూ– ''తాత, మనవడు, మేక చుట్టూ ఈ చిత్ర కథ తిరుగుతుంది. పనోరమాలో ప్రదర్శించిన సినిమాని చాలామంది స్టూడెంట్స్ చూశారు.. వారికి బాగా నచ్చింది. నా తొలి సినిమాకు రవికిశోర్‌లాంటి నిర్మాత లభించడం నా అదృష్టం'' అన్నారు.

పెళ్లి కళ వచ్చేసిందే...

హీరోయిన్ హన్సిక వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్న విషయం తెలిసిందే. తన బిజినెస్ పార్టనర్ సోహెల్ కతూరియాని పెళ్లాడనున్నారీ బ్యూటీ. వార్తల్లో ఉన్న ప్రకారం డిసెంబర్ 4న జైపూర్‌లోని ముండోటా ఫోర్ట్ అండ్ ప్యాలెస్‌లో వివాహ వేడుక జరగనుంది. కాగా 'మాతా కీ చౌకీ' (దుర్గా దేవి పూజ)తో పెళ్లి పనులు ఆరంభించారు. ముంబైలో హన్సిక స్వగృహంలో ఈ కార్యక్రమం జరిగింది. కాబోయే వధూవరులతో ఇరువైపు కుటుంబ సభ్యులు పూజ చేయించారు. ఈ పూజ కోసం హన్సిక ఎరుపు రంగు చీర కట్టుకోగా, సోహెల్ ఎరుపు రంగు కుర్తా, పైజామా ధరించారు. ఇద్దరిలో పెళ్లి కళ స్పష్టంగా ఉట్టిపడింది.


హన్సిక, సోహెల్

డిసెంబర్‌లో సంతోషం

'**సంతోషం**' సినీ వారపత్రిక ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే 'సౌత్ ఇండియన్ ఫిలిం అవార్డ్స్'కి తేదీ ఖరారు అయింది. డిసెంబర్ 26న హైదరాబాద్‌లో '21వ సంతోషం సౌత్ ఇండియన్ ఫిలిం అవార్డ్స్ 2022' వేడుకలు జరగనున్నాయి. ''తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ భాషలకు అవార్డులు అందించనున్నాం. ఈ వేడుకలో భాగంగా 12 గంటలపాటు నాన్‌స్టాప్ వినోదం ఉంటుంది'' అని సంతోషం పత్రికాధినేత, నిర్మాత సురేష్ కొండేటి అన్నారు.

నంది సౌత్ అవార్డులకు శ్రీకారం

'**తెలంగాణ** ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్' (టీఎఫ్‌సీసీ) ఆధ్వర్యంలో 'టీఎఫ్‌సీసీ–నంది సౌత్ ఇండియా ఫిలిం అవార్డ్స్ 2020–22' వేడుకను వచ్చే ఏడాది ఉగాది పండగకి నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా టీఎఫ్‌సీసీ చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ– ''సినిమా నటీనటులతో పాటు వివిధ శాఖల్లో పని చేస్తున్న ప్రతిభావంతులకు ఈ అవార్డులు ప్రదానం చేస్తాం. విశేషాదరణ పొందిన తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ చిత్రాలకు అవార్డులు అందిస్తాం. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వం సహకారం కావాలని మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను కలిసి విన్నవించడంతో పాటు ముఖ్య అతిథిగా రావాలని కోరాం'' అన్నారు.


శ్రీనివాస్ గౌడ్, రామకృష్ణ గౌడ్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	92	61,511
నిఫ్టీ ▲	23	18,267


మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	11,235	▲	61
డోజోన్స్	34,085	▼	13
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,465	▲	12
డాక్స్	14,429	▲	5
షాంఘై	3,097	▲	8
నికాయ్ (మంగళవారం ముగింపు)	28,115	▲	171

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	52,418 ▼	95
బంగారం (99.5 స్వచ్ఛత)	52,208 ▼	95
వెండి (కేజీ)	61,700 ▼	149

బజాజ్ ఆటో కొత్త బైక్



పుణే: ద్విచక్ర వాహన తయారీ సంస్థ బజాజ్ ఆటో పల్సర్ 'పీ150' పేరుతో కొత్త బైక్‌ని భారత మార్కెట్లోకి విడుదల చేసింది. ఇది రెండు వేరియంట్‌లలో లభిస్తుంది. సింగిల్ డిస్క్ (సింగిల్ సీట్) వేరియంట్ ధర రూ.1.17 లక్షలు, ట్విన్ డిస్క్ (స్ప్లిట్ సీట్) వేరియంట్ ధర రూ.1.19 లక్షలుగా ఉంది. ఇందులో 149 సీసీ సింగిల్ సిలిండర్ ఎయిర్–కూల్డ్ ఇంజిన్ ఉంటుంది. ఇది 8,500 ఆర్‌పీఎమ్ వద్ద 14.5 హెచ్‌పీ పవర్‌ను, 6,000 ఆర్‌పీఎమ్ వద్ద 13.5 ఎన్‌ఎమ్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఫ్యూయెల్ ట్యాంక్ కెపాసిటీ 14 లీటర్లుగా ఉండే ఈ బైక్ ఇంజిన్ 5 స్పీడ్ గేర్‌బాక్స్‌ను కలిగి ఉంది. ఇందులో బై ఫంక్షనల్ ఎల్‌ఈడీ ప్రొజెక్టర్ హెడ్‌ల్యాంప్, మోనో షాక్ సస్పెన్షన్ యూఎస్‌బీ సాకెట్, ఏబీఎస్ వంటి ప్రత్యేకతలు ఉన్నాయి.

ఇవైవ్ బయోటెక్‌తో అరబిందో సంస్థ జట్టు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అమెరికా మార్కెట్లో రైజ్‌న్యూటా ఔషధ విక్రయాలకు సంబంధించి ఇవైవ్ సంస్థతో యాక్రోటెక్ బయోఫార్మా లైసెన్సింగ్ ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం రైజ్‌న్యూటా ఔషధ అభివృద్ధి, తయారీ, రిజిస్ట్రేషన్, సరఫరా బాధ్యతలను ఇవైవ్ చూసుకోనుండగా.. యాక్రోటెక్ తన నెట్‌వర్క్ ద్వారా దాని మార్కెటింగ్, విక్రయాలను చేపడుతుంది. దేశీ ఔషధ రంగ దిగ్గజం అరబిందో ఫార్మాకు యాక్రోటెక్ అనుబంధ సంస్థ. కీమోథెరపీ సైడ్ ఎఫెక్ట్ అయిన న్యూట్రోపేనియా అనారోగ్య సమస్యల చికిత్సలో రైజ్‌న్యూటాను వాడతారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
24-11-2022	
విశాఖ	535-00
చిత్తూరు	568-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	534-00
విజయవాడ	534-00
రిటైల్ ధర (డజను)	78.00
23-11-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	530-00
వరంగల్	532-00
రిటైల్ ధర	5.85

చార్టర్డ్ అకౌంటెంట్ల వైఫల్యమే సత్యం స్కామ్

- ఖాతాల్లో లోపాలను చూపలేకపోయారు
- హెచ్‌డీఎఫ్‌సీ చైర్మన్ దీపక్ పరేఖ్



న్యూఢిల్లీ: సత్యం స్కామ్ చార్టర్డ్ అకౌంటెంట్ల వైఫల్యమేనని హెచ్‌డీఎఫ్‌సీ చైర్మన్ దీపక్ పరేఖ్ కీలక వ్యాఖ్యలు చేశారు. కంపెనీ అకౌంట్ పుస్తకాలను ఆడిట్ చేసిన చార్టర్డ్ అకౌంటెంట్లు వ్యత్యాసాలను గుర్తించడంలో విఫలమైనట్లు చెప్పారు. బుధవారం ఢిల్లీలో సీబీఐ నిర్వహించిన పుస్తకావిష్కరణ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా పరేఖ్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. సత్యం కంప్యూటర్ సర్వీసెస్ బోర్డులోని స్వతంత్ర డైరెక్టర్లు అందరూ అప్పటి చైర్మన్ బి.రామలింగరాజుకు రబ్బర్ స్టాంప్ మాదిరిగా పనిచేసినట్లు విమర్శించారు. 2009 జనవరిలో రూ.7,800 కోట్ల రూపాయల సత్యం స్కామ్ వెలుగులోకి రావడం తెలిసిందే. అనంతరం జరిగిన పరిణామాల్లో సత్యంను టెక్ మహీంద్రా సొంతం చేసుకుని, తనలో విలీనం చేసుకుంది. చాలా ఏళ్లపాటు లేని లాభాలను చూపిస్తూ వచ్చినట్లు రామలింగరాజు స్వయంగా అంగీకరించారు. ఏ కంపెనీ సీఈవో అయినా వాటాదారుల కోసం పనిచేస్తున్నట్లు అర్థం చేసుకోవాలని పరేఖ్ సూచించారు. విఫలమవుతున్న కంపెనీల సంఖ్య పెరుగుతోందంటూ, కొందరి అత్యాశ కారణంగా ప్రజలు డబ్బును, విశ్వాసాన్ని కోల్పోతున్నట్లు చెప్పారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న ప్రణాళికా సంఘం మాజీ డిప్యూటీ చైర్మన్ మాంటెక్‌సింగ్ అహ్లువాలియా స్పందిస్తూ.. నాటి సత్యం కంప్యూటర్ స్కామ్ సమయంలో బోర్డును ప్రభుత్వం రద్దు చేసి, ప్రైవేటు రంగంలో నిపుణులతో భర్తీ చేసినట్లు చెప్పారు. నాడు నిపుణులతో ఏర్పాటు చేసిన సత్యం బోర్డులో పరేఖ్‌కు సైతం స్థానం కల్పించడం గమనార్హం.

ఫెడ్ మినిట్స్ వెల్లడికి ముందు అప్రమత్తత

సూచీలకు స్వల్ప లాభాలు



ముంబై: ఆరంభ లాభాల్ని కోల్పోయి స్టాక్ సూచీలు బుధవారం స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ సమావేశపు వివరాల వెల్లడికి(బుధవారం రాత్రి)కి ముందు ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. అలాగే నవంబర్ సిరీస్ డెరివేటివ్స్ కాంట్రాక్టుల ముగింపు(నేడు) నేపథ్యంలో మార్కెట్లో అప్రమత్తత చోటు చేసుకుంది. ఉదయం సెన్సెక్స్ 361 పాయింట్లు లాభంతో 61,780 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 61,443 – 61,781 శ్రేణిలో కదలాడింది. చివరికి 92 పాయింట్ల స్వల్ప లాభంతో 61,511 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 81 పాయింట్లు పెరిగి 18,244 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ఇంట్రాడేలో 79 పాయింట్ల పరిధిలో 18,246 వద్ద కనిష్టాన్ని, 18,325 పాయింట్ల గరిష్టాన్ని నమోదు చేసింది. మార్కెట్ ముగిసే సరికి 23 పాయింట్ల లాభంతో 18,267 వద్ద నిలిచింది. బ్యాంకింగ్ షేర్లు భారీ కొనుగోళ్ల మద్దతు లభించింది. ఐటీ, మెటల్, వినిమయ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ. 790 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్ల రూ.414 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 26 పైసలు బలపడి 81.93 స్థాయి వద్ద స్థిరపడింది.

''అంతర్జాతీయంగా డాలర్ దిగిరావడం, బాండ్లపై రాబడులు తగ్గడం స్వల్పకాలానికి కలిసొచ్చే అంశాలుగా ఉన్నాయి. అయితే విదేశీ ఇన్వెస్టర్లు దేశీయ మార్కెట్లలో పెట్టుబడుల ఉపసంహరణ ఆందోళన రేకెత్తిస్తోంది. నవంబర్ ఎఫ్అండ్ఓ సిరీస్ ఎక్స్‌పైరీ సందర్భంగా నేడు సూచీలు తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యే అవకాశం ఉంది'' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- ఐనాక్స్ గ్రీన్ ఎనర్జీ సర్వీసెస్ ఐపీఓ లిస్టింగ్ నిరాశ పరిచింది. బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.65)తో పోలిస్తే షేరు 7 శాతం డిస్కౌంట్‌తో రూ.60.50 వద్ద లిస్టయ్యింది. మార్కెట్‌లో నెలకొన్న అస్థిరత పరిస్థితుల దృష్ట్యా మరింత అమ్మకాల ఒత్తిడికి లోనైంది. ట్రేడింగ్‌లో పదిశాతం క్షీణించి రూ.58.50 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని నమోదు చేసింది. చివరికి తొమ్మిది శాతం నష్టంతో రూ.59 వద్ద ముగిసింది.
- ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంక్స్ షేర్లు ర్యాలీతో ఎన్ఎస్ఈలో కీలకమైన బ్యాంక్ నిఫ్టీ సూచీ ర్యాలీ కొనసాగింది. ఇంట్రాడేలో ఒక శాతం పెరిగి 42,860 స్థాయి వద్ద కొత్త జీవికాల గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి అరశాతం లాభంతో రికార్డు గరిష్టం 42,729 వద్ద స్థిరపడింది.

కొనసాగుతున్న కొలువుల కోత..

- గూగుల్‌లో 10 వేల మందికి ఉద్వాసన
- అదే బాటలో హెచ్‌పీ కూడా



న్యూఢిల్లీ: టెక్ ప్రపంచంలో ఉద్యోగాల కోతలు కొనసాగుతున్నాయి. మైక్రోసాఫ్ట్, మెటా బాటలోనే గూగుల్, హెచ్‌పీ తదితర సంస్థలు కూడా సిబ్బందిని తగ్గించుకోవడమో లేక హైరింగ్‌ను నిలిపివేయడమో చేస్తున్నాయి. తాజాగా గూగుల్ 10 వేల మంది ఉద్యోగులను తొలగించే యోచనలో ఉన్నట్లు సమాచారం. ఈ ఏడాది తొలినాళ్లలో ప్రకటించినట్లుగా పనితీరును మెరుగుపర్చుకునే ప్రయత్నాల్లో భాగంగా కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. సరైన పనితీరు లేని ఉద్యోగులను వర్గీకరించాల్సిందిగా మేనేజర్లకు ఆదేశాలు వచ్చినట్లు వివరించాయి. దీని ప్రకారం సుమారు 6 శాతం మంది ఉద్యోగులను (దాదాపు 10,000 మంది) ఈ కేటగిరీ కింద వర్గీకరించవచ్చని పేర్కొన్నాయి. గూగుల్ వ్యయాలు చాలా ఎక్కువగా ఉంటున్నాయంటూ సంస్థలో ఇన్వెస్టరయిన టీసీఐ ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. ఉద్యోగుల సంఖ్య.. వారిపై వ్యయాలు చాలా భారీగా ఉంటున్నాయని, ఈ విషయంలో మేనేజ్‌మెంట్ వెంటనే తగు చర్యలు తీసుకోవాలని గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ యాజమాన్యానికి రాసిన లేఖలో టీసీఐ ఎండీ క్రిస్టోఫర్ హాన్ సూచించారు. ఆల్ఫాబెట్‌లో టీసీఐకి 6 బిలియన్ డాలర్ల విలువ చేసే షేర్లు ఉన్నాయి. కోతల ప్రభావం భారత్‌లోని ఉద్యోగులపై ఎలా ఉండవచ్చునేది తెలియరాలేదు. భారత్‌లో టెక్నాలజీ వినియోగాన్ని పెంచేందుకు భారీగా ఇన్వెస్ట్ చేస్తున్న గూగుల్‌కు దేశీయంగా సుమారు 5,000–6,000 మంది ఉద్యోగులు ఉన్నారు. ఇక్కడ 10 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు 2020లో కంపెనీ ప్రకటించిన సంగతి తెలిసిందే.

హెచ్‌పీలో 6 వేల ఉద్యోగాలు కట్ ..

మరోవైపు, పర్సనల్ కంప్యూటర్స్, ల్యాప్‌టాప్‌ల అమ్మకాలు తగ్గుతున్న నేపథ్యంలో వాటి తయారీ దిగ్గజం హెచ్‌పీ కూడా సిబ్బందిని తగ్గించుకునే యోచనలో ఉంది. 2025 ఆర్థిక సంవత్సరం ఆఖరు నాటికి ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగుల సంఖ్యను 12 శాతం (6,000 వరకూ) తగ్గించుకోవాలని భావిస్తోంది. హెచ్‌పీలో సిబ్బంది సంఖ్య సుమారు 50,000 దాకా ఉండగా.. 4,000–6,000 వరకూ ఉద్యోగాల్లో కోత విధించే అవకాశం ఉంది. ఉద్యోగుల పునర్‌వ్యవస్థీకరణ, ఇతరత్రా వ్యయాల కింద 1 బిలియన్ డాలర్ల వరకూ వెచ్చించాల్సి రావచ్చని కంపెనీ అంచనా వేస్తోంది. మొత్తం మీద ఈ ప్రక్రియతో 2025 ఆర్థిక సంవత్సరం తర్వాత ఏటా 1.4 బిలియన్ డాలర్ల మేర ఆదా చేయొచ్చని భావిస్తోంది. మహమ్మారి కాలంలో ఒక్కసారిగా ఎగిసిన పీసీల (పర్సనల్ కంప్యూటర్స్) అమ్మకాలు ఆ తర్వాత గణనీయంగా తగ్గాయి. ద్రవ్యోల్బణం దశాబ్దాల రికార్డు స్థాయుల్లో తిరుగాడుతుండటంతో వినియోగదారులు .. కొనుగోళ్లపై వెచ్చించడాన్ని తగ్గించుకుంటూ ఉండటమే ఇందుకు కారణం. దీంతో హెచ్‌పీ, డెల్ టెక్నాలజీస్ వంటి తయారీ సంస్థలపై ఒత్తిడి పెరుగుతోంది. మూడో క్వార్టర్‌లో డెల్ ఆదాయం 6 శాతం, నాలుగో త్రైమాసికంలో హెచ్‌పీ ఆదాయం 11 శాతం పడిపోయింది.

మెటా ప్లాట్‌ఫామ్స్ (ఫేస్‌బుక్), అమెజాన్ ఇప్పటికే సుమారు 10,000 మంది చొప్పున ఉద్యోగుల తీసివేత ప్రక్రియ మొదలుపెట్టాయి. మైక్రోబ్లాగింగ్ సైట్ ట్విటర్‌లో 7,500 మంది పైగా సిబ్బంది ఉండగా, కంపెనీ ఈ సంఖ్యను సగానికి పైగా తగ్గించుకుంది. సిస్కో సిస్టమ్స్ కూడా ఈ దిశగా ప్రణాళికలు ప్రకటించింది. అటు హార్డ్ డ్రైవ్‌ల తయారీ సంస్థ సీగేట్ టెక్నాలజీ హోల్డింగ్స్ సుమారు 3,000 ఉద్యోగాల్లో కోత పెట్టనుంది. మైక్రోసాఫ్ట్, సేల్స్‌ఫోర్స్, స్ట్రైప్ వంటివి కూడా సిబ్బందిని తగ్గించుకుంటున్నాయి. ఉద్వాసనలతో ఉద్యోగ వర్గాల్లో ఆందోళన నెలకొన్నప్పటికీ కంపెనీల షేర్లు మాత్రం పెరుగుతున్నాయి. అక్టోబర్ ఆఖరులో ఉద్యోగాల కోతల వార్త ప్రకటించినప్పటి నుండి మెటా షేరు సుమారు 18 శాతం పెరిగింది.

బీఓబీ గృహ రుణ రేటు తగ్గింపు

ఈ ఏడాది చివరి వరకూ అమలు



ముంబై: గృహ రుణ రేటును పరిమిత కాలానికి పావుశాతం తగ్గిస్తున్నట్లు ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) ప్రకటించింది. దీనితో ఈ రేటు 8.25 శాతానికి తగ్గింది. తాజా రేటు ఈ నెల 14వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని, 2022 డిసెంబర్ 31 వరకూ అమల్లో ఉంటుందని కూడా పేర్కొంది. అయితే ఈ ప్రత్యేక రేటు రుణ గ్రహీతల క్రెడిట్ ప్రొఫైల్‌కు అనుసంధానం చేయడం జరుగుతుందని ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రాసెసింగ్ చార్జీలను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు పేర్కొంది. తగ్గించిన రుణ రేటు బ్యాంకింగ్ రంగంలో అతి తక్కువ గృహ రుణ రేటులో ఒకటని, అత్యంత పోటీ పూర్వకమైనదని బ్యాంక్ పేర్కొంది. తాజా రేటు తగ్గింపు తాజా గృహ రుణాలతో పాటు, బ్యాలెన్స్ బదలాయింపులకూ వర్తిస్తుందని తెలిపింది. ''ఈ ఏడాది మేము గృహ రుణ విభాగంలో మంచి వృద్ధి రేటును చూశాం. అన్ని పట్టణాల్లో పటిష్ట డిమాండ్ ఉంది. మా తాజా నిర్ణయం రుణ వృద్ధి మరింత పెరగడానికి దోహదపడుతుంది'' అని బ్యాంక్ జనరల్ మేనేజర్ (తనఖాలు, ఇతర రిటైల్ రుణాలు) హెచ్‌టీ సోలంకీ తెలిపారు.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ, బెంగళూరులో డిగ్రీ ప్రవేశాలు

అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి నాలుగేళ్ల డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సుల వివరాలు

» బీఏ ఆనర్స్(ఎకానమీ/హిస్టరీ/ఇంగ్లిష్/ఫిలాసఫీ/సోషియాలజీ).
» బీఎస్సీ ఆనర్స్(బయోకెమిస్ట్రీ/ఫిజిక్స్/మ్యాథ్స్/ఇన్విరాన్‌మెంట్ సైన్స్)
» బీఎస్సీ బీఈడీ(జీవశాస్త్రం/రసాయనశాస్త్రం/గణితం/ఫిజిక్స్/మ్యాథ్స్).
» **అర్హత:** సంబంధిత గ్రూప్‌లో కనీసం 50శాతం మార్కులతో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 21 ఏళ్లు ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఎంపిక విధానం:** అభ్యర్థులను రెండు దశలలో ఎంపికచేస్తారు. ముందుగా రాతపరీక్ష నిర్వహిస్తారు. ఇందులో ఎంపికైన అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.
» **దరఖాస్తులకు చివరితేది:** 24.11.2022
» **జాతీయ ప్రవేశ పరీక్ష:** 24.12.2022
» **వెబ్‌సైట్:** www.azimpremjiuniversity.edu.in

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఎంబీఏ

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్.. 2023–25 విద్యా సంవత్సరానికి ఎంబీఏ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 75
» **విభాగాలు:** మార్కెటింగ్, ఫైనాన్స్, ఆపరేషన్స్, హ్యూమన్ రిసోర్సెస్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, బిజినెస్ అనలిటిక్స్, బ్యాంకింగ్.
» **అర్హత:** ఏదైనా విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, క్యాట్–2022 ఉత్తీర్ణులై ఉండాలి.
» **ప్రవేశ విధానం:** క్యాట్–2022 స్కోర్, ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్ ఆధారంగా ప్రవేశాలు ఉంటాయి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.12.2022
» **వెబ్‌సైట్:** www.uohyd.ac.in

ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ములుగులో ప్రవేశాలు

సిద్దిపేట జిల్లా ములుగు(హైదరాబాద్)లోని ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్.. 2022–23 విద్యా సంవత్సరానికి ఎమ్మెస్సీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** బీఎస్సీ(ఆనర్స్) ఫారెస్ట్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **ప్రవేశ విధానం:** ఐసీఏఆర్–ఏఐఈఈఏ పీజీ-2022 ప్రవేశ పరీక్ష, బీఎస్సీ(ఆనర్స్) ఫారెస్ట్రీ అకడమిక్ స్కోరు ఆధారంగా
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి,
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.11.2022.
» **రూ.500 ఆలస్య రుసుముతో ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.11.2022
» **వెబ్‌సైట్:** www.fcrits.in

నిట్, వరంగల్‌లో పీహెచ్‌డీ ప్రవేశాలు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, వరంగల్.. డిసెంబర్ 2022సెషన్‌కు గాను పీహెచ్‌డీ ప్రోగ్రామ్(ఫుల్‌టైం/పార్ట్ టైం)లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాలు:** సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్–ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీతో పాటు క్యాట్ /గేట్ /యూజీసీ /సీఎస్ఐఆర్ /ఇన్‌స్పైర్/నెట్‌లో అర్హత సాధించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తులకు చివరితేది:** 04.12.2022
» **రాతపరీక్ష/ఇంటర్వ్యూ తేదీలు:** 20.12.2022 నుంచి 24.12.2022 వరకు
» **ఎంపికైన అభ్యర్థుల వివరాల వెల్లడి:**28.12.2022
» **వెబ్‌సైట్:** nitw.ac.in

జీఎంసీ, మహబూబాబాద్‌లో 24 పోస్టులు

తెలంగాణ రాష్ట్రం, మహబూబాబాద్‌లోని గవర్నమెంట్ మెడికల్ కాలేజ్.. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 24
» **పోస్టుల వివరాలు:** స్టోర్ కీపర్–10, హాల్ అటెండెంట్లు–04, ల్యాబ్ అటెండెంట్లు–04, రికార్డ్ అసిస్టెంట్లు–02, థియేటర్ అసిస్టెంట్లు–04.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి /గ్రాడ్యుయేషన్ /బీఎస్సీ/బీకాం /ఎంఎల్‌టీ/ డీఎంఎల్‌టీ/డిప్లొమా/పీజీడీసీఏ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 18 నుంచి 44 ఏళ్లు ఉండాలి.
» **జీతం:** నెలకు రూ.15,600 నుంచి రూ.19,500 చెల్లిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.11.2022
» **వెబ్‌సైట్:** mahabubabad.telangana.gov.in

కాన్సెప్ట్స్‌తోనే సక్సెస్..!

జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్- మెయిన్ సంక్షిప్తంగా..జేఈఈ-మెయిన్! ఎన్ఐటీలు, ఐఐటీల్లో ప్రవేశానికి జేఈఈ-మెయిన్ మార్కులు, ర్యాంకులే కీలకం. 2023కు సంబంధించి జేఈఈ-మెయిన్‌ను రెండు సెషన్లలో.. తొలి సెషన్ జనవరిలో, మలి సెషన్‌లో ఏప్రిల్‌లో నిర్వహిస్తారనే వార్తలు! త్వరలోనే ఎన్‌టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) ఈ పరీక్ష తేదీలు ప్రకటించే అవకాశం ఉంది. మరోవైపు.. ఫిబ్రవరిలో ఇంటర్ ప్రాక్టికల్స్.. మార్చిలో ఫైనల్ పరీక్షలు!! దీంతో జేఈఈ-మెయిన్ లక్ష్యంగా చేసుకున్న విద్యార్థుల్లో ఆందోళన! ఈ నేపథ్యంలో.. జేఈఈ-మెయిన్ పరీక్ష తీరుతెన్నులు, ప్రిపరేషన్ వ్యూహాలు, రాణించేందుకు సబ్జెక్ట్ వారీగా దృష్టి పెట్టాల్సిన అంశాలపై ప్రత్యేక కథనం..

» 2023 మెయిన్ కూడా రెండు సెషన్లలోనే..
» తొలి సెషన్ జనవరిలో, రెండో సెషన్ ఏప్రిల్‌లో జరిగే అవకాశం
» త్వరలోనే పరీక్ష తేదీలు ప్రకటించనున్న ఎన్‌టీఏ
» కాన్సెప్ట్ ఆధారిత అధ్యయనమే కీలకం

దేశంలోని టాప్ ఇన్‌స్టిట్యూట్‌లలో బీటెక్‌లో చేరాలనుకునే విద్యార్థులకు జేఈఈ-మెయిన్ ఎంతో కీలకం. నిట్‌లో అడ్మిషన్‌తోపాటు, ప్రతిష్టాత్మక ఐఐటీల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించాలన్నా.. జేఈఈ మెయిన్‌లో ప్రతిభ చూపాల్సిందే! దేశవ్యాప్తంగా ఏటా దాదాపు 13 లక్షల మంది ఈ పరీక్షకు పోటీ పడుతుంటారు. ఇంటర్మీడియెట్(మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ) సబ్జెక్ట్‌లలో పొందిన నైపుణ్యం ఆధారంగా జేఈఈ-మెయిన్‌లో ర్యాంకు సొంతం చేసుకునేందుకు ఆస్కారం లభిస్తుంది.

ఏకకాలంలో సన్నద్ధత.. ఇలా

ఇంటర్మీడియెట్ ఫైనల్ విద్యార్థులు ఒకే సమయంలో ఇటు ఇంటర్, అటు జేఈఈ-మెయిన్ పరీక్షలకు సన్నద్ధత పొందడం సాధ్యమేనా? అని సందేహిస్తుంటారు. వాస్తవానికి డిసెంబర్ రెండో వారం నాటికి విద్యార్థులు ఇంటర్మీడియెట్ సిలబస్‌ను పూర్తి చేసుకుని ఉంటారు. జనవరి సెషన్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు.. డిసెంబర్ నుంచి ఇంటర్మీడియెట్, జేఈఈ-మెయిన్‌లో రెండింటిలో ఉన్న ఉమ్మడి అంశాల పునశ్చరణపై దృష్టిపెట్టాలి. తద్వారా జనవరి సెషన్‌లో మంచి ప్రతిభ చూపేందుకు అవకాశం ఉంటుంది. ఏప్రిల్ సెషన్‌పైనే దృష్టి పెట్టిన విద్యార్థులు.. డిసెంబర్‌లో ఇంటర్ సిలబస్ పూర్తి చేసుకొని.. ఆ తర్వాత సమయంలో జేఈఈ-మెయిన్ పరీక్ష సిలబస్‌ను పరిశీలించి దానికి అనుగుణంగా ఫిబ్రవరి చివరి వారం వరకు ప్రిపరేషన్ సాగించాలి. ఇంటర్ పరీక్షలు పూర్తయిన తర్వాత.. జేఈఈ-మెయిన్ ఏప్రిల్ సెషన్ తేదీకి మధ్య ఉన్న వ్యవధిలో.. పూర్తిగా రివిజన్, మాక్ టెస్ట్‌ల ప్రాక్టీస్‌కు సమయం కేటాయించాలి.

అప్లికేషన్ ఆధారిత ప్రిపరేషన్

ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఆయా సబ్జెక్ట్‌లను అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో ప్రిపరేషన్ సాగించాలి. ఫలితంగా ఇంటర్ సబ్జెక్ట్‌లపై పూర్తి స్థాయి అవగాహనతోపాటు జేఈఈ-మెయిన్‌లోనూ ర్యాంకు సాధించేందుకు అవకాశం ఉంటుంది. ముఖ్యంగా ఆయా సబ్జెక్ట్‌ల బేసిక్ కాన్సెప్ట్స్‌పై పట్టు సాధించాలి. వాటిని పూర్తిగా అవగాహన చేసుకుంటూ.. వాస్తవ పరిస్థితులతో అన్వయం చేసుకుంటూ చదవాలి. ముఖ్యమైన ఫార్ములాలు, కీ పాయింట్స్‌ను షార్ట్ నోట్స్‌గా రాసుకోవాలి. ఇది ఇంటర్, జేఈఈ-మెయిన్ రెండు పరీక్షల రివిజన్‌కు ఉపకరిస్తుంది. జనవరి సెషన్‌కు హాజరై..ఆశించిన స్థాయిలో మార్కులు సాధించని విద్యార్థులు.. తమ ప్రదర్శనను పరిశీలించుకోవడం ద్వారా.. తాము ఇంకా పట్టు సాధించాల్సిన అంశాలను గుర్తించి వాటిపై దృష్టి పెట్టాలి.

ప్రాక్టీస్ ప్రధానం

ఇంటర్, జేఈఈ-మెయిన్ రెండు పరీక్షలకూ ప్రాక్టీస్ కీలకమని గుర్తించాలి. ప్రతిరోజు తాము చదివిన సబ్జెక్ట్‌కు సంబంధించి.. అందులోంచి ప్రశ్నలు అడిగే ఆస్కారమున్న అంశాలను బాగా ప్రాక్టీస్ చేయాలి. వాస్తవానికి జేఈఈ-మెయిన్ సిలబస్‌లో అధిక శాతం అంశాలు ఇంటర్మీడియెట్ మొదటి, ద్వితీయ సంవత్సరం సిలబస్ నుంచే ఉన్నాయి. కాబట్టి ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఆయా చాప్టర్లకు సంబంధించి మొదటి సంవత్సరం అంశాలను కూడా అవలోకనం చేసుకునే విధంగా ప్రణాళిక రూపొందించుకోవాలి. మొదటి సంవత్సరం టాపిక్స్‌ను, రెండో సంవత్సరం అంశాలతో అనుసంధానం చేసుకుంటూ.. ప్రిపరేషన్ సాగిస్తే సంబంధిత అంశంపై పూర్తి స్థాయిలో అవగాహన వస్తుంది. ఫలితంగా ప్రశ్న ఎలా అడిగినా సమాధానం ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది.

న్యూమరికల్ ప్రశ్నలకు

జేఈఈ-మెయిన్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్.. ఈ మూడు సబ్జెక్ట్‌ల నుంచీ అయిదు ప్రశ్నలు చొప్పున న్యూమరికల్ ఆధారిత ప్రశ్నలు అడగనున్నారు. వీటికోసం విద్యార్థులు అప్లికేషన్ ఓరియెంటేషన్‌తోపాటు ఆయా సబ్జెక్ట్‌లలో న్యూమరిక్స్ ఆధారంగా సమాధానం సాధించాల్సిన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.



జేఈఈ-మెయిన్-2023

మాక్ టెస్ట్‌లు, ప్రీ-ఫైనల్ టెస్ట్‌లు

ఇంటర్, జేఈఈ-మెయిన్ ఉమ్మడి ప్రిపరేషన్‌లో.. విద్యార్థులు మాక్ టెస్ట్‌లకు హాజరవడం; ఇంటర్ ప్రీ-ఫైనల్ టెస్ట్‌లు రాసి, వాటి ఫలితాలను విశ్లేషించుకోవడం వంటివి చేయాలి. ముఖ్యంగా ఏప్రిల్ సెషన్‌కు హాజరయ్యే అభ్యర్థులు ఈ వ్యూహాన్ని తప్పనిసరిగా అమలు చేయాలి. జనవరి సెషన్‌కు హాజరయ్యే అభ్యర్థులకు దాదాపు నెలరోజుల సమయం అందుబాటులో ఉంది. ఈ సమయంలో వీరు అధిక సమయాన్ని పునశ్చరణతో పాటు వీక్లీ టెస్ట్‌లకు, మాక్ టెస్ట్‌లకు కేటాయించాలి.

టైమ్ మేనేజ్‌మెంట్

జేఈఈ మెయిన్ విద్యార్థులు టైమ్ మేనేజ్‌మెంట్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతిరోజు ప్రతి సబ్జెక్ట్ చదివే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. ఆయా సబ్జెక్ట్‌కు కనీసం రెండు గంటల సమయం కేటాయించేలా చూసుకోవాలి. తమకు బాగా సులభమైన సబ్జెక్ట్‌కు కొంత తక్కువ సమయం కేటాయించి.. క్లిష్టంగా భావించే వాటికి కొంత ఎక్కువ సమయం కేటాయించడం మేలు. ప్రతిరోజు అంతకుముందు రోజు చదివిన అంశాన్ని ఒకసారి పునశ్చరణ చేసుకోవాలి. ఈ విధంగా నిర్దిష్ట ప్రణాళికతో అడుగులు వేస్తే ఏకకాలంలో రెండు పరీక్షలకు సన్నద్ధత లభిస్తుంది.

జేఈఈ-మెయిన్ పేపర్లు.. పరీక్ష స్వరూపం

- జేఈఈ-మెయిన్‌లో బీఈ/బీటెక్ అభ్యర్థులకు పేపర్-1, బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అభ్యర్థులకు పేపర్-2ఎ, బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ కోర్సుల అభ్యర్థులకు పేపర్-2బి నిర్వహిస్తారు.
- **పేపర్-1(బీటెక్/బీఈ) ఇలా:** మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి 30 ప్రశ్నల చొప్పున మొత్తం 90 ప్రశ్నలు-300 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఈ పేపర్‌ను మొత్తం మూడు సబ్జెక్ట్‌లలో రెండు సెక్షన్లుగా నిర్వహిస్తారు.
- సెక్షన్-ఎ పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతో(ఎంసీక్యూలతో) ఉంటుంది. సెక్షన్-బిలో న్యూమరికల్ వాల్యూ ఆధారిత ప్రశ్నలుంటాయి.
- ఛాయిస్ విధానం నేపథ్యంలో సెక్షన్-బిలో 10 ప్రశ్నల్లో అయిదు ప్రశ్నలకు సమాధానం ఇస్తే సరిపోతుంది. సెక్షన్-ఎలో 0.25 శాతం నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది.

బీఆర్క్ పరీక్ష స్వరూపం

- నిట్‌లు,ట్రిపుల్ ఐటీలు,ఇతర ఇన్‌స్టిట్యూట్‌లలో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ కోర్సులో చేరాలనుకునే విద్యార్థులు హాజరవ్వాల్సిన పరీక్ష ఇది. పేపర్-2ఎగా పిలిచే ఈ పరీక్షను కూడా మూడు విభాగాలుగా నిర్వహిస్తారు. ఇందులో మ్యాథమెటిక్స్, అప్టిట్యూడ్ టెస్ట్, డ్రాయింగ్ టెస్ట్‌లు 82 ప్రశ్నలు-400 మార్కులకు ఉంటాయి.
- మ్యాథమెటిక్స్‌లో 20 ఎంసీక్యూలు, 10 న్యూమరికల్ వాల్యూ ప్రశ్నలు అడుగుతారు. ఎంసీక్యూలకు ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు; న్యూమరికల్ ప్రశ్నలలో పది ప్రశ్నలకుగాను అయిదు ప్రశ్నలు ఛాయిస్‌గా ఉంటాయి.
- డ్రాయింగ్ టెస్ట్‌లో మాత్రం రెండు అంశాలను ఇచ్చి డ్రాయింగ్ వేయమంటారు. ఒక్కో టాపిక్‌కు 50 మార్కులు. అప్టిట్యూడ్ టెస్ట్ 50 ప్రశ్నలు-200 మార్కులకు ఉంటుంది.

మెయిన్.. సబ్జెక్ట్‌ల వారీగా కీలకాంశాలు

మ్యాథమెటిక్స్

ఈ సబ్జెక్ట్‌లో రెండేళ్ల సిలబస్‌కు సంబంధించి ప్రతి చాప్టర్‌ను చదవడం మేలు. ప్రాధాన్యం ఇవ్వాల్సిన అంశాలు.. 3–డి జామెట్రీ; కో ఆర్డినేట్ జామెట్రీ; వెక్టార్ అల్జీబ్రా; ఇంటిగ్రేషన్; కాంప్లెక్స్ నెంబర్స్; పారాబోలా; ట్రిగ్నోమెట్రిక్ రేషియోస్. వీటితోపాటు క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, థియరీ ఆఫ్ ఈక్వేషన్స్; పెర్ముటేషన్ అండ్ కాంబినేషన్, బైనామియల్ థీరమ్, లోకస్ అంశాలను కనీసం ఒక్కసారైనా పూర్తిచేయాలి.

–**ఆర్. కేదారేశ్వర్**, మ్యాథమెటిక్స్ సబ్జెక్ట్ నిపుణులు

ఫిజిక్స్

న్యూమరికల్ అప్లికేషన్ అప్రోచ్ ప్రధానంగా ఉండే ఫిజిక్స్‌లో ఎలక్ట్రో డైనమిక్స్, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, మెకానిక్స్, మోడ్రన్ ఫిజిక్స్, ఆప్టిక్స్, ఎస్‌హెచ్‌ఎం అండ్ వేవ్స్‌కు ప్రాధాన్యమివ్వాలి. సెంటర్ ఆఫ్ మాస్, మొమెంటమ్ అండ్ కొలిజన్; సింపుల్ హార్మోనిక్ మోషన్, వేవ్ మోషన్ అండ్ స్ట్రింగ్ వేవ్స్‌పై అవగాహన ఏర్పరచుకుంటే మంచి మార్కులు సొంతం చేసుకోవచ్చు. ప్రిపరేషన్ సమయంలోనే ఆయా అంశాల ప్రాథమిక భావనలను వాస్తవ పరిస్థితులతో అన్వయించుకుంటూ ప్రాక్టీస్ చేయాలి.

– **ఎం.రవీంద్ర**, ఫిజిక్స్ సబ్జెక్ట్ నిపుణులు

కెమిస్ట్రీ

మిగతా రెండు సబ్జెక్ట్‌లతో పోలిస్తే.. విద్యార్థులు కొంత సులభంగా భావించే సబ్జెక్ట్ కెమిస్ట్రీ. కెమికల్ బాండింగ్, పిరియాడిక్ టేబుల్, బ్రేకింగ్‌ల మూలాలపై విద్యార్థి అవగాహనను తెలుసుకునే విధంగా ప్రశ్నలు ఉంటాయి. కాబట్టి మోల్ కాన్సెప్ట్, కోఆర్డినేషన్ కెమిస్ట్రీ, ఆల్కహాల్, ఫినాల్స్, ఈథర్స్, పి-బ్లాక్ ఎలిమెంట్స్, అటామిక్ స్ట్రక్చర్, గ్యాసియస్ స్టేట్, ఆల్డిహైడ్స్ అండ్ కీటోన్స్, జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, డి అండ్ ఎఫ్ బ్లాక్ ఎలిమెంట్స్‌పై పట్టు సాధించాలి.

–**డి.కె.ఝా**, కెమిస్ట్రీ సబ్జెక్ట్ నిపుణులు

• కాలీఫ్లవర్..కొంగొత్తగా!



అల్లూరి సీతారామ రాజు జిల్లా రాజవొమ్మంగి మండలంలోని వట్టిగెడ్డ గ్రామంలో రైతు గవిరెడ్డి వీరబాబు వ్యవసాయ క్షేత్రంలో పలవలుతో కాలీఫ్లవర్ కనువిందు చేస్తోంది. సాధారణంగా కాలీఫ్లవర్ గుండ్రంగా ఉంటుంది. ఇక్కడ మాత్రం శాఖలు మాదిరిగా ఏర్పడి పువ్వు ఆకట్టుకుంటోంది. – రాజవొమ్మంగి

• కాంతులీనిన అనంతుని గిరి

అత్యంత వైభవంగా అనంతుని దీపోత్సవం

విశాఖ జిల్లా పద్మనాభం మండలం పద్మనాభం గ్రామంలో అనంత పద్మనాభ స్వామి దీపోత్సవం బుధవారం సాయంత్రం అత్యంత వైభవోపేతంగా జరిగింది. సాయంత్రం 5.30 గంటలకు గిరిపైన జేగంట మోగగానే భక్తులు ఒక్కసారిగా 1,285 మెట్లుకి ఇరువైపులా దీపాలు వెలిగించారు. తైల దీపాలు వెద జల్లిన సిందూర వర్ణ కాంతులతో అనంత పద్మనాభుని గిరిపై సుందర దృశ్యం ఆవిష్కృతమైంది. దీప కాంతులతో అనంత పద్మనాభుని గిరి దేదీప్యమానంగా వెలుగొందింది. రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాదిగా తరలి వచ్చిన భక్తులు పద్మనాభుని పాద సన్నిధిలో పూజలు చేశారు. బాణసంచా వెలుగులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తదితరులు అనంత పద్మనాభ స్వామిని దర్శించుకున్నారు. – పద్మనాభం (భీమిలి)



ఉప్పుతో ముప్పే


ఉప్పు ఎక్కువగా తీసుకుంటే గుండె పోటు, బ్రెయిన్ స్ట్రోక్

- ఊపిరితిత్తులు, కిడ్నీల క్యాన్సర్‌కూ అవకాశం
- జీవిత కాలం తగ్గిపోతుంది
- యూకే పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అధ్యయనంలో వెల్లడి



జీవిత కాలం తగ్గుతోంది..

యూకే పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ 5,01,379 మందిని పదేళ్ల పాటు పరిశీలించి, ఈ వివరాలు వెల్లడించింది. వీరిలో 18,474 మంది వేర్వేరు కారణాలతో మరణించారు. మూత్రంలో సోడియం శాతం ఆధారంగా నిర్వహించిన అధ్యయనాల్లో ఉప్పు ఎక్కువగా తీసుకుంటున్న వారు హైపర్ టెన్షన్ (బీపీ), గుండె జబ్బులు, బ్రెయిన్‌స్ట్రోక్, గ్యాస్ట్రిక్, లంగ్, కిడ్నీ క్యాన్సర్లకు గురవుతున్నట్టు గుర్తించారు. మహిళల్లో 1.5 సంవత్సరాలు, పురుషుల్లో 2.28 సంవత్సరాల జీవిత కాలం తగ్గినట్టు తేలింది. ఉప్పు ఎక్కువగా తీసుకున్నప్పటికీ, పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకునే వారిలో దాని దుష్ఫలితాలు తక్కువగా ఉన్నట్టు గుర్తించారు.



లబ్బీపేట (విజయవాడ తూర్పు): కూరయినా, పప్పయినా, చారయినా... ఏ వంటకమైనా ఉప్పు వేయనిదే రుచి ఉండదు. ఉప్పు లేని పదార్థం చప్పగా ఉంటుంది. కానీ, రుచినిచ్చే ఈ ఉప్పే ఎక్కువ అయితే ప్రమాదకరమే అంటున్నారు వైద్య నిపుణులు. ఉప్పు ఎక్కువగా తీసుకుంటే ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుందని హెచ్చరిస్తున్నారు. అది వైట్ పాయిజన్‌లా మారి జీవితకాలాన్ని తగ్గిస్తుందని, గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్‌తో పాటు లంగ్, గ్యాస్ట్రిక్, కిడ్నీ క్యాన్సర్లకు దారి తీస్తుందని యూకే పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో చేసిన అధ్యయనంలో వెల్లడైంది. ఈ అధ్యయనం వివరాలను యూరోపియన్ హార్ట్ జర్నల్ ప్రచురించింది. మన దేశంలో యూకే కంటే రెట్టింపు మొత్తంలో ఉప్పు తీసుకోవడంతో దుష్ఫలితాలు మరింత ఎక్కువగా ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

ఎంత తీసుకోవాలంటే..

సోడియం అయితే రోజూ 2.30 గ్రాములు, సాల్ట్ అయితే 5 గ్రాముల వరకు తీసుకోవచ్చు. కానీ మన దేశంలో రెట్టింపు మొత్తంలో తీసుకుంటున్నారు. ప్యాక్డ్, బేకరీ ఫుడ్, నిల్వ పచ్చళ్ల వంటి వాటిలో ఉప్పు ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. 40 ఏళ్లు కూడా నిండకుండానే గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్‌కు గురవుతున్న వారిని ఇక్కడ మనం చూస్తున్నాం. ముప్పై ఏళ్ల వయస్సులోనే రక్తపోటు అదుపులో ఉండటంలేదు. ఆహారంలో ఉప్పు ఎక్కువగా తీసుకోవడమే ఇందుకు ఓ కారణమని వైద్యులు అంటున్నారు.

ఉప్పు ఎక్కువగా తీసుకుంటే ప్రమాదం

ఉప్పు ఎక్కువగా తీసుకోవడం ప్రమాదకరమని యూకే అధ్యయనాల్లో తేలింది. మన ప్రాంతంలో అయితే తీసుకోవాల్సిన దానికంటే రెట్టింపు స్థాయిలో ఉప్పు తీసుకుంటున్నాం. దీంతో హైపర్‌టెన్షన్‌తో పాటు 40 ఏళ్లకే గుండెపోటుకు గురవుతున్నారు. జీవిత కాలాన్ని తగ్గించి, ప్రాణాంతక వ్యాధులకు కారణమవుతున్న ఉప్పును తగిన మోతాదులోనే తీసుకోవాలి. లేదంటే ప్రమాదమే.

– డాక్టర్ జె. శ్రీమన్నారాయణ, కార్డియాలజిస్ట్

క్లుప్తంగా

40 ఈ-మేనేజర్ పోస్టులు మంజూరు

సాక్షి, అమరావతి: పునర్వ్యవస్థీకరణలో కొత్తగా ఏర్పడిన జిల్లాలు, రెవెన్యూ డివిజన్లలో నియమించేందుకు ప్రభుత్వం 40 ఈ-మేనేజర్ పోస్టులను మంజూరు చేసింది. 13 కొత్త జిల్లాలకు 13 ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్లు, 27 కొత్త రెవెన్యూ డివిజన్లకు 27 ఈ-డివిజనల్ మేనేజర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఆయా జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో పనిచేసేలా ఈ పోస్టుల్ని మంజూరు చేస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగా ఏర్పడిన కలెక్టరేట్లు, ఆర్డీవో కార్యాలయాల్లో ఈ-డిస్ట్రిక్ట్ మిషన్ మోడ్ ప్రాజెక్టును అమలు చేయడంతోపాటు సాంకేతిక అంశాలన్నింటినీ ఈ-మేనేజర్లు పర్యవేక్షిస్తారు. ఈ-మేనేజర్లను నెలకు రూ.22,500 జీతానికి కాంట్రాక్టు పద్ధతిలో నియమిస్తారు.

శ్రీశైలానికి స్వల్పంగా పెరిగిన వరద

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం స్వల్పంగా పెరిగింది. కొద్ది రోజులుగా సుంకేసుల జలాశయం నుంచి మాత్రమే వరద నీరు శ్రీశైలానికి వచ్చి చేరుతోంది. బుధవారం జూరాల ప్రాజెక్ట్‌లో విద్యుత్ ఉత్పత్తి చేయడంతో శ్రీశైలానికి స్వల్పంగా వరద ప్రవాహం పెరిగింది. ఎగువ ప్రాజెక్టులైన జూరాల, సుంకేసుల నుంచి 9,946 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. రెండు విద్యుత్ కేంద్రాల్లో ఉత్పాదన కొనసాగుతోంది. మంగళవారం నుంచి బుధవారం వరకు కుడిగట్టు కేంద్రంలో 5.826 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 4.643 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం జలాశయంలో 152.8314 టీఎంసీల నీరు నిల్వగా ఉంది. డ్యామ్ నీటిమట్టం 872.60 అడుగులకు చేరుకుంది.

ఎంఈవోలకు సహాయ కారులుగా ఏపీఎంలు

సాక్షి, అమరావతి: ప్రాథమిక పాఠశాలల పర్యవేక్షణలో మండల విద్యాశాఖ అధికారులకు సహాయకారులుగా గ్రామీణ పేదరిక సంస్థ (సెర్ప్)లో అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు (ఏపీఎం) వ్యవహరించనున్నారు. విద్యా శాఖ సూచన మేరకు పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి నెలా పాఠశాలల వారీగా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించడంతోపాటు ఎంఈవోలకు పూర్తిస్థాయి సహాయకారులుగా ఏపీఎంలు పనిచేస్తారు. నాడు-నేడు కార్యక్రమం కింద పాఠశాలలకు ప్రభుత్వం అందజేస్తున్న ఫర్నిచర్, పరికరాల నిర్వహణ, పర్యవేక్షణలోనూ సహకరిస్తారు. ఏపీఎంలు ఇక నుంచి జిల్లా స్థాయిలో గ్రామీణాభివృద్ధి శాఖ పీడీలతో పాటు డీఈవో, రీజనల్ జాయింట్ డైరెక్టర్లు అప్పగించే ఏదైనా ఇతర పనులకు హాజరు కావాల్సి ఉంటుంది. ఆయా అంశాలపై 662 మంది ఏపీఎంలకు ఇప్పటికే విశాఖపట్నం, సామర్లకోట, బాపట్ల, శ్రీకాళహస్తి, అనంతపురం కేంద్రాల్లో శిక్షణ ఇచ్చారు.

ఏపీకి రెండు 'స్కోచ్ గోల్డ్' అవార్డులు

4 రజత పతకాలతో కలిపి మొత్తం 6 ప్రతిష్టాత్మక అవార్డులు గెలుచుకున్న రాష్ట్రం

- పొదుపు సంఘాలకు ప్రోత్సాహం అందిస్తున్నందుకు స్వర్ణం
- గ్రామీణాభివృద్ధి శాఖ కార్యక్రమాలకు మరో స్వర్ణం
- అవార్డుల కోసం దేశవ్యాప్తంగా పోటీపడిన వందకు పైగా ప్రాజెక్టులు



సాక్షి, అమరావతి: పొదుపు సంఘాల మహిళలకు బ్యాంకుల నుంచి పెద్ద మొత్తంలో రుణాలు ఇప్పించడమే కాకుండా ఆయా కుటుంబాలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా అలుపెరగని కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వివిధ విభాగాల్లో రెండు స్కోచ్ గోల్డ్, మరో నాలుగు స్కోచ్ సిల్వర్ అవార్డులను గెలుచుకుంది. దేశవ్యాప్తంగా గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి దాదాపు వంద ప్రాజెక్టులు ఈ ఏడాది స్కోచ్ అవార్డుల కోసం పోటీ పడ్డాయి. ఆయా రాష్ట్రాలు దరఖాస్తు చేసుకున్న అన్ని ప్రాజెక్టులపై ఇప్పటికే రెండు విడతల స్క్రూటినీ నిర్వహించగా.. చివరగా బుధవారం ఢిల్లీ నుంచి వర్చువల్ విధానంలో పలు ప్రాజెక్టులను మరో విడత సమీక్షించి.. స్కోచ్ సంస్థ అవార్డులను ప్రకటించింది.

మొత్తంగా 6 అవార్డులు

మహిళా స్వయం సహాయక సంఘాలు బ్యాంకుల ద్వారా రుణాలు పొందటమే కాకుండా వాటిని సద్వినియోగం చేసుకుని కుటుంబ ఆదాయాలను పెంచుకునేలా రాష్ట్ర ప్రభుత్వం వివిధ రూపాల్లో అందజేస్తున్న సహాయ సహకారాలకు గాను ప్రతిష్టాత్మక స్కోచ్ సంస్థ గోల్డ్ అవార్డును ప్రకటించింది. 2019 నుంచి 2022 మార్చి వరకు మూడేళ్ల కాలంలో రాష్ట్రంలోని పొదుపు సంఘాల మహిళలు రూ.77,106.74 కోట్లను రుణాలుగా పొందారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో రూ.35 వేల కోట్లను రుణాలుగా అందజేసే ప్రక్రియ పురోగతిలో ఉంది. మరోవైపు దేశంలోనే అత్యధికంగా రాష్ట్రంలో పొదుపు సంఘాలు సగటున రూ.5.31 లక్షల చొప్పున బ్యాంకు రుణాలు పొందాయి. గత అసెంబ్లీ ఎన్నికల నాటికి పొదుపు సంఘాల పేరిట బ్యాంకుల్లో ఉండే అప్పు మొత్తాన్ని వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగు విడతలుగా ప్రభుత్వం ఆర్థిక సహాయంగా అందిస్తోంది. ఇప్పటికే రూ.12,758 కోట్లను వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రెండు విడతల్లో మహిళలకు ఆర్థిక సహాయం అందజేసింది. సకాలంలో రుణాలు చెల్లించే వారికి వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా ప్రభుత్వం తిరిగి ఆయా పొదుపు సంఘాలకు చెల్లిస్తోంది. ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాలతో మహిళలు బ్యాంకుల నుంచి తీసుకుంటున్న రుణాలను 99.5 శాతం మేర సకాలంలో చెల్లిస్తూ రికార్డు సాధించారు.

'స్త్రీ నిధి'కి మరో గోల్డ్ అవార్డు

- గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థకు అనుబంధంగా పనిచేస్తున్న 'స్త్రీ నిధి' సంస్థ బ్యాంకులిచ్చే రుణాలకు తోడు అత్యంత సులభ విధానంలో అదనంగా రుణాలు అందజేస్తుండటంతో స్కోచ్ సంస్థ స్త్రీ నిధిని గోల్డ్ అవార్డుకు ఎంపిక చేసింది.
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పొదుపు సంఘాల విజయ గాథలను 'మహిళా నవోదయం' పేరిట ప్రతినెలా ప్రత్యేక మాసపత్రిక రూపంలో ప్రచురిస్తూ సభ్యులందరికీ తెలియజేస్తున్న ఆ జిల్లా డీఆర్‌డీఏ విభాగానికి ప్రత్యేక సిల్వర్ అవార్డు దక్కింది.
- ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పొదుపు సంఘాల నుంచి తీసుకున్న రుణాలతో మహిళలు పెద్ద ఎత్తున నాటు కోళ్ల పెంపకం చేపట్టి అధిక ఆదాయం పొందుతున్నందుకు ఆ జిల్లా డీఆర్‌డీఏకు మరో సిల్వర్, పాడి గేదెల పెంపకం ద్వారా అధిక ఆదాయం సాధించేలా చేస్తున్న చిత్తూరు జిల్లా డీఆర్‌డీఏకు మరో సిల్వర్, జిల్లాలో నిరుద్యోగ యువత స్వయం ఉపాధి కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాల నిర్వహిస్తున్నందుకు చిత్తూరు డీఆర్‌డీఏకు మరో సిల్వర్ అవార్డు దక్కాయి.

ప్రభుత్వ ప్రోత్సాహకాల వల్లే..

రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాల ద్వారా పొదుపు సంఘాల మహిళలకు పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందజేస్తోంది. ఈ ప్రోత్సాహకాల కారణంగా మహిళలు కీలకంగా ఆర్థిక కార్యకలాపాలు పెంపొందించుకుంటున్నారు. ప్రభుత్వం అందజేసే ఆర్థిక సహాయానికి తోడు బ్యాంకుల నుంచి అందే రుణ మొత్తాలతో కొత్త వ్యాపారాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. వ్యవసాయం మాత్రమే తెలిసిన వారు పెద్ద సంఖ్యలో పాడి గేదెలు, ఆవులు, గొర్రెల



పెంపకం చేపట్టి కుటుంబ ఆదాయాన్ని భారీగా పెంచుకుంటున్నారు. ఇలా లాభదాయక కార్యకలాపాలు సాగిస్తూ బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తున్నారు. మొత్తంగా ప్రభుత్వం అందజేసే ప్రోత్సాహకాలతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి సైకిల్ చాలా వేగంగా తిరుగుతోంది. ఇలాంటి విజయాలను నమోదు చేయడంతో సెర్ప్ కార్యక్రమాలకు ఈ ఏడాది ఆరు అవార్డులు దక్కాయి.

– ఇంతియాజ్ అహ్మద్, సీఈవో, సెర్ప్

ఏపీసీసీ అధ్యక్షుడిగా గిడుగు రుద్రరాజు

వర్కింగ్ ప్రెసిడెంట్లుగా మస్తాన్ వలీ, జంగా గౌతమ్, పద్మశ్రీ, రాకేశ్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పార్టీ సీనియర్ నేత గిడుగు రుద్రరాజును కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నియమించింది. వర్కింగ్ ప్రెసిడెంట్లుగా మస్తాన్ వలీ, జంగా గౌతమ్, పద్మశ్రీ సుంకర, పి.రాకేశ్‌రెడ్డి నియామకాల ప్రతిపాదనను పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదించారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరితో పాటు ఏపీసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్‌గా కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పల్లంరాజు, ప్రచార కమిటీ చైర్మన్‌గా జీవీ హర్షకుమార్, మీడియా-సోషల్ మీడియా కమిటీ చైర్మన్‌గా ఎస్.తులసిరెడ్డిలకు అవకాశం కల్పించారు. రాజకీయ వ్యవహారాల కమిటీలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ ఊమెన్ చాందీతో పాటు 18 మంది, కోఆర్డినేషన్ కమిటీలో 33 మంది నేతలతో పాటు పీసీసీ విభాగాల అధ్యక్షులు ఉంటారని ఏఐసీసీ వెల్లడించింది. కాగా, పీసీసీ తాజా మాజీ అధ్యక్షుడు శైలజానాథ్‌కు రాజకీయ వ్యవహారాలు, కో-ఆర్డినేషన్ కమిటీల్లో చోటు కల్పించారు.

వివాదాస్పదంగా కొందరు ఐపీఎస్‌ల చర్యలు

టీడీపీ నేతలు అయ్యన్న,బండారు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): రాష్ట్రంలో కొంత మంది ఐపీఎస్ అధికారుల చర్యలు వివాదాస్పదంగా ఉంటున్నాయని టీడీపీ నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. ఒకప్పుడు నిజాయితీతో ఉండే అధికారులు ఇప్పుడు ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారని చెప్పారు. విశాఖ టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ నర్సీపట్నం ఏఎస్పీగా పనిచేసిన సమయంలో రిశాంత్ రెడ్డి.. టీడీపీ కార్యకర్తలపై వేధింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. స్పందనలో వచ్చే దరఖాస్తులకు మోక్షం కనబడటం లేదని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. దరఖాస్తులు తిరస్కరిస్తున్నారన్నారు. ముదపాక ల్యాండ్ పూలింగ్‌లో తన తప్పు ఉంటే తల నరుక్కుంటానని చెప్పారు.


చంద్రబాబుపై కేఈ ధిక్కార స్వరం

- డోన్ టీడీపీ అభ్యర్థిగా సుబ్బారెడ్డిని గతంలోనే ప్రకటించిన చంద్రబాబు
- అసంతృప్తితో ఉన్న మాజీ మంత్రి కేఈ ప్రభాకర్
- కేఈ కుటుంబం పోటీలో ఉంటుందని ప్రకటన
- జనామోదం లేనివారిని ఇన్‌చార్జిగా నియమించారని విమర్శ
- టీడీపీలో దుమారం రేపుతున్న కేఈ ప్రభాకర్ వ్యాఖ్యలు

డోన్: తెలుగుదేశం పార్టీ అధిష్టానంపై ఆ పార్టీ నేత, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ ధిక్కార స్వరం వినిపించారు. డోన్ టీడీపీ అభ్యర్థిగా టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన అభ్యర్థిని ప్రభాకర్ తిరస్కరించారు. డోన్ నియోజకవర్గంలో కేఈ కుటుంబం కచ్చితంగా పోటీ చేస్తుందని బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సంచలన వ్యాఖ్యలు టీడీపీలో దుమారం రేపుతున్నాయి. డోన్ టీడీపీ అభ్యర్థిగా ధర్మవరం సుబ్బారెడ్డిని చంద్రబాబు గతంలోనే ప్రకటించారు. ఈ నిర్ణయంపై కేఈ ప్రభాకర్ అసంతృప్తితో ఉన్నారు. తన జన్మదిన వేడుక సందర్భంగా బుధవారం డోన్‌లో ఓ ఫంక్షన్ హాలులో సభ నిర్వహించి, తన నిర్ణయాన్ని ప్రకటించారు. '40 ఏళ్లుగా కేఈ కుటుంబానికి డోన్ కంచుకోట. నేను జెడ్పీటీసీ నుంచి అంచెలంచెలుగా జనామోదంతో రాష్ట్ర మంత్రి వరకు ఎదిగాను. ఇప్పుడు ఎలాంటి అనుభవం, జనామోదం లేని వ్యక్తికి నియోజకవర్గ ఇన్‌చార్జి ఇవ్వడం వల్ల ప్రయోజనం ఉండదు' అని చెప్పారు. తమకు జన బలం, ధన బలం కూడా ఉందనే సంగతి ఎవ్వరూ మర్చిపోవద్దని అన్నారు. ఒంట్లో శక్తి కూడా తగ్గలేదని అన్నారు. కచ్చితంగా 2024 ఎన్నికల్లో పోటీ చేస్తామని, ఈ విషయంలో కార్యకర్తలు సందేహించాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. ఈ వ్యాఖ్యలు తెలుగుదేశం పార్టీలో ప్రకంపనలు రేపుతున్నాయి. టిక్కెట్ ఇవ్వకపోయినా స్వతంత్ర అభ్యర్థిగానైనా బరిలోకి దిగుతామని నేరుగా చంద్రబాబుకే స్పష్టం చేసినట్లు కేఈ వ్యాఖ్యలు ఉన్నాయి. ఇదిలా ఉండగా కేఈ జన్మదిన వేడుకకు హాజరుకాకుండా ఉండేందుకు సుబ్బారెడ్డి బుధవారమే నంద్యాలలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు.

ముస్లిం మైనార్టీలపై బాబు మొసలి కన్నీరు

డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ధ్వజం



కడప రూరల్: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, ఎల్లో మీడియా ముస్లిం మైనార్టీలపై కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారని డిప్యూటీ సీఎం అంజద్ బాషా ధ్వజమెత్తారు. బుధవారం కడపలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కపట రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ లాంటి చంద్రబాబు అభద్రతా భావంతో లాస్ట్‌ఛాన్స్ ప్లీజ్ అంటూ వేడుకుంటున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు హయాంలో మైనార్టీలు ఒక్కరికి కూడా మంత్రివర్గంలో అవకాశం కల్పించలేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఒక్క చంద్రబాబు పాలనలోనే మైనార్టీలకు మంత్రి పదవి దక్కలేదని, మరి ఆనాడు రామోజీ ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. చంద్రన్న తోఫాలంటూ హెరిటేజ్‌లో బూజుపట్టిన బెల్లం అంటగట్టి గొప్పలు చెప్పుకున్నారన్నారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో మైనార్టీల కోసం కేవలం రూ.2,665 కోట్లు ఇవ్వగా మూడున్నరేళ్లలో సీఎం జగన్ రూ.20 వేల కోట్లకు పైగా వెచ్చించారని తెలిపారు. డీబీటీ ద్వారా రూ.10,309 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.10,020 కోట్లు మైనార్టీలకు అందించారన్నారు. కోవిడ్ సమయంలో రూ. 81 కోట్లు మైనార్టీల ఖాతాల్లోకి పంపిన ప్రభుత్వం తమదేనన్నారు. ఇమామ్, మౌజన్ల విషయంలో సీఎం జగన్ గొప్ప నిర్ణయం తీసుకుని ప్రతినెల గౌరవ వేతనం అందిస్తున్నారన్నారు. నలుగురు మైనార్టీలకు ఎమ్మెల్యేలుగా, మండలిలో మరో నలుగురికి అవకాశం కల్పించారన్నారు. ఉర్దూను రెండో అధికారిక భాషగా ప్రకటించడంతోపాటు చట్టం చేసి పూర్వ వైభవాన్ని కల్పించారన్నారు. ఒక్కసారి మేలు చేస్తే జీవితాంతం గుర్తుంచుకునే వర్గాలు ముస్లిం మైనార్టీలని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జహీర్, షఫీ, అజ్మతుల్లా, సుబ్బారెడ్డి, సుభాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

20 మంది అదనపు ఎస్పీలకు ఎస్పీలుగా పదోన్నతి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 20 మంది అదనపు ఎస్పీలకు ఎస్పీలుగా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఇటీవల ప్రభుత్వం 20 మంది పోలీసు అధికారులకు నాన్ క్యాడర్ ఐపీఎస్‌లుగా పదోన్నతి కల్పిస్తూ ప్యానల్‌ను ఆమోదించింది. వారికి నాన్ క్యాడర్ ఎస్పీలుగా పోస్టింగులు ఇవ్వడంతోపాటు మరో ఎస్పీని బదిలీ చేస్తూ హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్ కుమార్‌గుప్తా బుధవారం ఉత్తర్వులిచ్చారు.

బదిలీ అయిన 21 మంది నాన్ క్యాడర్ ఎస్పీల జాబితా ఇదీ..

(1) బి.లక్ష్మీనారాయణ.. ఎస్పీ(ఇంటెలిజెన్స్), (2) కేఎం మహేశ్వరరాజు.. ఎస్పీ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో), పల్నాడు జిల్లా, (3)ఎ.సురేశ్‌బాబు.. ఎస్పీ (విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్), (4)కె.శ్రీనివాసరావు.. డీసీపీ(ట్రాఫిక్), విజయవాడ (5) కె.శ్రీధర్.. ఎస్పీ(ఎస్‌ఐబీ), (6) కె.తిరుమలేశ్వరరెడ్డి.. ఎస్పీ(విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్), (7) ఎం.సత్తిబాబు.. డీసీపీ, విజయవాడ, (8) ఎంవీ మాధవరెడ్డి.. ఎస్పీ(విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్), (9) జె.రామమోహన్‌రావు.. జాయింట్ డైరెక్టర్, ఏసీబీ, (10) ఎన్.శ్రీదేవిరావు.. ఎస్పీ(ఇంటెలిజెన్స్), (11) ఇ.అశోక్‌కుమార్.. ఎస్పీ(ఇంటెలిజెన్స్), (12) ఎ.రమాదేవి.. జాయింట్ డైరెక్టర్, ఏసీబీ (13) కేజీవీ సరిత.. ఎస్పీ, సీఐడీ (14) కె.ఆనందరెడ్డి.. డీసీపీ, విశాఖపట్నం (15) కె.చక్రవర్తి.. ఎస్పీ, ఆర్‌ఎస్‌ఏఎస్‌టీఎఫ్, తిరుపతి (16) కె.ఈశ్వరరావు.. ఏడీసీ, గవర్నర్ (17) కె.చౌడేశ్వరి.. ఎస్‌ఆర్‌పీ, గుంతకల్(18) ఇ.సుప్రజ.. జాయింట్ డైరెక్టర్, ఏసీబీ(19) కేవీ శ్రీనివాసరావు.. ఎస్పీ, ఇంటెలిజెన్స్, (20) కె.లావణ్యలక్ష్మి.. ఎస్పీ, ట్రాన్స్‌కో (21) ఎం.సుందరరావు.. ఎస్పీ, ఇంటెలిజెన్స్

జీవితకాల హాబీగా పోస్టల్ స్టాంపుల సేకరణ

- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- రాష్ట్ర స్థాయి ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్ ప్రారంభం



హెచ్‌పీసీఎల్ ప్రత్యేక కవర్‌ను విడుదల చేస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): పోస్టల్ స్టాంపులు, నాణేల సేకరణ (ఫిలాటెలీ) జీవితకాలం కొనసాగించగల హాబీ అని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. రైల్వే న్యూకాలనీలోని సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో బుధవారం రాష్ట్ర స్థాయి 13వ ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్ (అపెక్స్-2022)ను ముఖ్య అతిథిగా హాజరై ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఇటువంటి ఎగ్జిబిషన్ ద్వారా నేటి విద్యార్థులు ప్రేరణ, జీవితకాల హాబీ, సృజనాత్మకత విషయాలు తెలుసుకుంటారన్నారు. 2023 నాటికి ఆంధ్రా యూనివర్సిటీని స్థాపించి 98 ఏళ్లు పూర్తవుతుందని తెలిపారు. 2023, ఏప్రిల్ 26 నుంచి మూడేళ్ల పాటు శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, ఈ సందర్భంగా ఏయూపై ప్రత్యేక స్టాంప్‌ను రిలీజ్ చేయాలని పోస్టల్ అధికారులను కోరారు. జ్యూరీ చైర్‌పర్సన్ అపెక్స్-2022, పోస్ట్‌మాస్టర్ జనరల్ విజయవాడ, విశాఖపట్నం రీజియన్ డి.ఎస్.వి.ఆర్.మూర్తి మాట్లాడుతూ ఎనిమిదేళ్ల తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఎగ్జిబిషన్ నిర్వహించేందుకు అవకాశం వచ్చిందన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో సుమారు 109 మంది ఫిలాటెలిస్టులు, ఫిలాటెలీ క్లబ్‌లు పాల్గొన్నాయని, వివిధ సందర్భాలకు సంబంధించిన స్టాంపులతో కూడిన సుమారు 5,500 షీట్స్ (ఐటమ్స్) ప్రదర్శనలో ఉంచినట్లు చెప్పారు. అనంతరం హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్) స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణపై ప్రత్యేక పోస్టల్ కవర్‌ను ముఖ్యఅతిథి వీసీ ప్రసాదరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆదిత్యకుమార్ నాయక్ (డైరెక్టర్ పోస్టల్ సర్వీసెస్, ఏపీ సర్కిల్), ఎం.జగదీష్ పాయ్(డైరెక్టర్ పోస్టల్ సర్వీసెస్, కర్నూలు), కె.రాజాకిరణ్‌కుమార్ (సీనియర్ మేనేజర్, హెచ్‌పీసీఎల్), వి.రోజ్‌మేరీ (డైరెక్టర్ పోస్టల్ సర్వీసెస్, అకౌంట్స్) పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరిస్తే ఊరుకోం..

- ఢిల్లీలో కదంతొక్కిన విద్యుత్ ఉద్యోగులు
- బిజ్లీ క్రాంతి యాత్రతో హస్తినలో భారీ నిరసన
- ప్రైవేటీకరించాల్సిన అవసరం ఏమొచ్చింది? : వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని 29 రాష్ట్రాల్లో విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని విద్యుత్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల నుంచి బిజ్లీ క్రాంతి యాత్ర పేరుతో ఢిల్లీ చేరుకున్న వేలాది మంది విద్యుత్ ఉద్యోగులు బుధవారం జంతర్‌మంతర్ వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. విద్యుత్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం తప్పనిసరిగా ఉపసంహరించుకోవాలని విద్యుత్ ఉద్యోగులు నినదించారు. ఈ భారీ ధర్నాకు వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య, సీపీఎం ఎంపీ ఎలమరం కరీం, సీపీఐ నేత డి.రాజా, సహా వివిధ పార్టీల నాయకులు, ట్రేడ్ యూనియన్, ప్రజా సంఘాల నేతలు హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రసంగిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యుత్ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకుంటే 28 లక్షల మంది ఉద్యోగులు దేశవ్యాప్తంగా ఉద్యమిస్తారని హెచ్చరించారు. విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించాల్సిన అవసరం కేంద్ర ప్రభుత్వానికి ఏమొచ్చిందని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ చేస్తే భవిష్యత్తులో రైతులకు ఉచిత కరెంట్ లభించదని, ఒక్కో రైతు ప్రతి వ్యవసాయ పంపు సెట్టుకు రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు చార్జీలు కట్టాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ప్రైవేటీకరణతో ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు అమలు చేసే అవకాశం ఉండదని, దీంతో 25 లక్షల మంది ఉద్యోగావకాశాలు కోల్పోయే ప్రమాదం పొంచిఉందని ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, పశ్చిమ బెంగాల్, ఒడిశా, పంజాబ్ సహా అనేక రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించొద్దని తీర్మానాలు చేశాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అనేక సంస్థలను ప్రైవేట్‌పరం చేసిందని.. ఇంకా చేయాలని చూస్తే ప్రజలు ఎదురు తిరుగుతారని ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. పార్లమెంటులో విద్యుత్ ఉద్యోగుల సమస్యపై కేంద్రంతో పోరాడతామని స్పష్టం చేశారు.

బీసీల అభివృద్ధికి కేంద్ర బడ్జెట్‌ను పెంచాలి

బీసీల సంక్షేమానికి రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించి ఆర్థిక, విద్య, ఉద్యోగ, శిక్షణ, అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఉదయం ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు గుజ్జ కృష్ణ, చంద్రశేఖర్, మోక్షిత్ తదితరులు కేంద్ర సామాజిక న్యాయ సాధికారత శాఖ మంత్రి వీరేంద్ర కుమార్‌ను కలిసి పలు అంశాలపై చర్చలు జరిపారు. దేశమంతా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకాలు అమలు చేయాలని ఆర్.కృష్ణయ్య కేంద్రమంత్రి వీరేంద్ర కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. కాగా దేశంలోని 75 కోట్ల మంది బీసీలకు కేంద్ర బడ్జెట్‌లో కేవలం రూ.1,400 కోట్లు కేటాయించి 56 శాతం జనాభాను అవమానించారని కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు.



కేంద్ర మంత్రి వీరేంద్ర కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్ కృష్ణయ్య

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.